సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 160

శుక్రవారం 30-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ.. చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



అంబానీని దాటేసిన అదానీ

అత్యంత సంపన్న భారతీయుడిగా అగ్రస్థానంలోకి..

-15లో



రిలయన్స్ బొనాంజా

కంపెనీ 47వ ఏజీఎంలో ముకేశ్ అంబానీ కీలక నిర్ణయాలు

-15లో



స్త్రీ ధనంపై వారికే హక్కు

స్త్రీ ధనంపై భర్తకు గాని, తండ్రికి గాని ఎలాంటి హక్కులు ఉండవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



త్వరలో భారత్ దోజో యాత్ర!

మార్షల్ ఆర్ట్స్‌లో తనకున్న ప్రావీణ్యాన్ని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ వీడియో రూపంలో మరోసారి గుర్తుచేశారు.

- వివరాలు 6లో



సమస్యల నడుమ సారథ్య పోరు

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక.. సెప్టెంబర్ 21న అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతోంది.

- వివరాలు 6లో



అమ్ముల పొదిలో 'అరిఘాత్'

భారత్ అమ్ముల పొదిలో అణు జలాంతర్గామి 'అరిఘాత్' చేరింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీన్ని నేవీలోకి ప్రవేశపెట్టారు.

- వివరాలు 6లో

అధికారులపైనా కేసులు

చెరువుల ఆక్రమణలకు అక్రమ అనుమతులపై 'హైడ్రా' ఫోకస్

రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల పాత్రపై దర్యాప్తు

నిజాంపేట, చందానగర్ ఉదంతాల్లో పలు ఆధారాలు లభ్యం

అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై చర్యలకు నిర్ణయం

కేసుల్లో వారిని నిందితులుగా చేర్చాలంటూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు హైడ్రా లేఖ

అక్రమంగా అనుమతులిచ్చే క్రమంలో భారీగా సొమ్ము చేతులు మారిందనే అంచనా

సదరు అధికారుల వివరాలను ఏసీబీకి అందించాలనే యోచన

పలు అక్రమాలపై విజిలెన్స్ విచారణకూ చాన్స్ ఉందంటున్న ప్రభుత్వ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: చెరువులను చెరబట్టిన ఆక్రమణలను కూల్చివేయడంతోపాటు రికార్డులను తారుమారు చేస్తూ, వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులపైనా 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)' ఫోకస్ చేసింది. కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల్లో నిర్మాణాలకు కారణమైన వారిపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రగతినగర్‌లోని ఎర్రకుంట, చందానగర్ ఈర్ల చెరువుల ఆక్రమణలకు సంబంధించి ఐదుగురు ప్రభుత్వ అధికారుల పాత్రను గుర్తించింది. సదరు ఆక్రమణలపై నమోదైన కేసుల్లో ఈ అధికారులను కూడా నిందితులుగా చేర్చాలని కోరుతూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతికి హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్ గురువారం లేఖ రాశారు.

ఎర్రకుంట వ్యవహారంలో నలుగురిపై..

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట బఫర్ జోన్‌లో 0.29 ఎకరాలను బిల్డర్లు ఆక్రమించి మూడు భవనాలను నిర్మించారు. అవన్నీ గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల్లో నిర్మితమయ్యాయి. వాటిపై ఫిర్యాదు అందుకున్న హైడ్రా అధికారులు.. ఈ నెల 14న కూల్చేశారు. ఆ నిర్మాణాలకు కారణాలపై దర్యాప్తు చేయగా.. ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెవెన్యూ విభాగానికి చెందిన 'సర్వేయర్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్' కె.శ్రీనివాస్ ఈ స్థలానికి సంబంధించి రెండు రికార్డులు రూపొందించినట్లు హైడ్రా విచారణలో

మిగతా 2వ పేజీలో ▶



ఎర్రకుంటలో కూల్చివేతల దృశ్యం (ఫైల్)

'దుర్గం చెరువు' దోషులు అధికారులే!

- నాడు అనుమతులు.. నేడు కూల్చివేతలు.. అప్పట్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కాదంటూ ఇరిగేషన్ ఎన్‌వోసీ
- దాని ఆధారంగా అనుమతులు ఇచ్చిన నాటి 'హుడా'.. ఇప్పుడేమో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ కూల్చివేతలకు నోటీసులు
- గృహాల యజమానుల ఆందోళన

2లో

హైడ్రా పేరుతో బెదిరించి వసూళ్లు

అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీఎంఆదేశం

2లో



హైడ్రా పరిధి విస్తృతం

- ఆక్రమణలపై నోటీసులిచ్చే అధికారం ఇక 'హైడ్రా'కే..
- ఆక్రమణల తొలగింపులన్నీ ఒకే గొడుగు కిందకు..: సీఎస్

2లో

పారిశ్రామికవేత్తలే టార్గెట్



మాయలేడి కాదంబరిని అడ్డుపెట్టుకుని ఏపీ సర్కారు సరికొత్త దందా

బాధితుల్లో పారిశ్రామికవేత్తలు, నేతలు, బ్యూరోక్రాట్లు

- పారిశ్రామికవేత్తలను బెదిరించేందుకు ప్రభుత్వ యత్నం
- కాదంబరి బాధితుల్లో ఏసియన్ పెయింట్స్ ప్రమోటర్ మాలవ్ దానీ, సజ్జన్ జిందాల్
- ఇలాంటి వారికి అండగా నిలవాల్సిందిపోయి దోషులుగా చూస్తున్న వైనం
- ప్రస్తుతం ఆ కేసును వక్రీకరిస్తూ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం

16లో

అప్పీళ్లు ఉపసంహరించుకున్న సీఐడీ

ఈనాడుకు బాబు గిఫ్ట్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు, నిధుల మళ్లింపుపై గతంలో పక్కాగా సాక్ష్యాలు సేకరించిన సీఐడీ
- ఇప్పుడు ప్రభుత్వం మారడంతో పరిస్థితులు తారుమారు

12లో

సీఎం హోదాలో ఉండి సుప్రీం తీర్పుపై వ్యాఖ్యలా!

కవిత బెయిల్‌విషయంలో రేవంత్‌రెడ్డి స్పందనపై జడ్జీల తీవ్ర అసంతృప్తి

ముఖ్యమంత్రిగా ఉండి అలా ఎలా మాట్లాడగలరు?

రాజకీయ పార్టీలతో సంప్రదించి ఆదేశాలు ఇవ్వాలా?


న్యాయమూర్తులను అవమానించేలా ప్రకటనలు చేయకూడదు

అలాంటి వ్యాఖ్యలతో ప్రజల్లో భయాందోళనలు కలగొచ్చు



- ధైర్యం ఉంటే, మా తీర్పులపై గౌరవం లేకుంటే విచారణ మరెక్కడైనా జరగనివ్వండి
- జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ వ్యాఖ్యలు
- ఓటుకు కోట్లు కేసును విచారించిన త్రిసభ్య ధర్మాసనం
- కొత్తగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తామని స్పష్టీకరణ
- తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

12లో



తిరిగి ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్!

రైతాంగ సమస్యలపై పోరాటానికి కార్యాచరణ

సభలు, సమావేశాలు నిర్వహించే యోచన

ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం 12లో

ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కవిత
- ఆప్యాయంగా హత్తుకున్న కేసీఆర్

12లో

◀ ఎర్రవల్లిలోని నివాసంలో కేసీఆర్, కవిత ఆత్మీయ ఆలింగనం

'గోల్కొండ' దాహార్తి తీర్చిన దుర్గం చెరువు



గ్రేటర్ హైదరాబాద్‌లో కీలక ప్రాంతాలైన రాయదుర్గం, మాదాపూర్, జూబ్లీహిల్స్ మధ్య దుర్గం చెరువు ఉంది. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువు కుతుబ్‌షాహీల నాటినుంచి గోల్కొండ కోటతోపాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారి దాహార్తి తీర్చింది. ఈ చెరువు నుంచి నీరు గ్రావిటీ ద్వారానే కతోరా హౌస్ ప్రాంతం మీదుగా గోల్కొండ కోటలోని పెద్ద బావిలోకి చేరేది. తర్వాత హుస్సేన్‌సాగర్ వరకు ప్రవహించేది. అలాంటి చెరువు అన్యాక్రాంతమై కుచించుకుపోయింది. దాదాపు 25 ఎకరాల్లో గార్డెన్స్ వెలియగా, మరికొన్ని ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీలు వచ్చాయి. ప్రస్తుతం ఈ చెరువు 84 ఎకరాలే ఉన్నట్టు అంచనా.

హైడ్రాకు రూ.25 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు



రంగనాథ్‌కు నిధుల మంజూరు పత్రాన్ని అందజేసిన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

బన్సీలాల్‌పేట్: భాగ్యనగరంలోని చెరువులు, కుంటలను పరిరక్షించడంతోపాటు భావి తరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. తన ఎంపీ కోటా నిధుల నుంచి రూ. 25 లక్షలను హైడ్రాకు కేటాయిస్తూ అందుకు సంబంధించిన పత్రాలను డైరెక్టర్ రంగనాథ్‌కు గురువారం బుద్ధ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పదేళ్లలో హైదరాబాద్‌లోని అనేక చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వం సహజ వనరులను కాపాడటానికి హైడ్రాను ఏర్పాటు చేసిందని... ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు.

ఇదండీ జాతర



..బావున్నారా సీఎంగారూ.. సారీ డిప్యూటీ సీఎం గారూ!!

'దుర్గం చెరువు' దోషులు అధికారులే!

నాడు అనుమతులు.. నేడు కూల్చివేతలు

- అప్పట్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కాదంటూ ఇరిగేషన్ ఎన్‌వోసీ
- దాని ఆధారంగా అనుమతులు ఇచ్చిన నాటి 'హుడా'
- ఇప్పుడేమో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ కూల్చివేతలకు నోటీసులు
- తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న గృహాల యజమానులు



దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే కావేరీహిల్స్‌లోని నిర్మాణాలు



అమర్‌సొసైటీలో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇళ్లపై ఎఫ్ అని రాసిన దృశ్యం

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: ''హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హుడా) అనుమతులు ఇచ్చిందంటే ప్రభుత్వం ఇచ్చినట్టే కదా! నీటి పారుదల శాఖ ఇచ్చిన నిరభ్యంతర పత్రాల(ఎన్‌వోసీ) మేరకే ఇళ్లు, భవనాలు నిర్మించాం. 30 ఏళ్లు దాటింది. ఇప్పుడు ఏకంగా 204 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయంటూ నోటీసులు ఇచ్చారు. ఇక్కడ దోషులెవరు? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఈ లేఅవుట్లు ఉన్నట్టు అప్పుడే నిర్ధారిస్తే.. ఇప్పుడు కూల్చివేతలు ఉండేవి కాదు కదా''..

.. దుర్గం చెరువు సమీపంలోని నెక్టార్ గార్డెన్‌కు చెందిన ఓ ఇంటి యజమాని ఆందోళన ఇది. ఆయనే కాదు.. గత 30 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న చాలా మంది తమ ఇళ్లు, భవనాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నాయంటూ నోటీసులు ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క దుర్గం చెరువు ప్రాంతంలోనే కాదు.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, నాలాలను ఆనుకొని నిర్మించిన విల్లాలు, అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలకు ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, తదితర ప్రభుత్వ విభాగాలు అనుమతులు ఇచ్చాయి. ఇప్పుడేమో అధికారులు ఆ ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్‌జోన్‌లో ఉన్నట్టు నోటీసులు ఇవ్వడం కలకలం రేపుతోంది.

నోటీసులు ఇచ్చిన తహసీల్దార్

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇళ్లు నిర్మించారంటూ.. శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి ఈ నెల 5న వాల్టా చట్టం కింద అమర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, కావూరిహిల్స్, నెక్టార్ గార్డెన్లలో ఉన్న 204 నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. 30 రోజుల్లో నిర్మాణాలను తొలగించుకోవాలని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే నిర్మాణాలకు 'ఎఫ్'అని.. కొంతభాగం ఎఫ్‌టీఎల్‌లోకి వస్తే 'ఎఫ్/బీ' అని.. బఫర్‌జోన్‌లోకి వచ్చే నిర్మాణాలపై 'బీ'అని గోడలపైన రాశారు. రాజకీయ, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు కూడా ఈ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ఓ పర్యావరణవేత్తకు చెందిన ఇల్లు కూడా ఉన్నట్టు సమాచారం. అమర్ సొసైటీలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు కూడా ఉంది.

ఎకరా రూ.వంద కోట్లపైనే..!

దుర్గం చెరువు ప్రాంతంలో ఆక్రమణకు గురైన భూముల ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరానికి రూ.వంద కోట్లపైనే ఉంటుందని అంచనా. చదరపు గజం విలువే రూ.2 లక్షలపైన ఉంటుంది. హైటెక్‌సిటీని ఆనుకొని ఉన్న దుర్గం చెరువు ప్రాంతం రియల్టర్లకు, బిల్డర్లకు హాట్‌కేక్‌లా మారింది. దాంతో రెండు, మూడు దశాబ్దాల క్రితం నుంచే కబ్జాల పర్వం మొదలైంది. ఈ అక్రమ నిర్మాణాలకు అందరూ బాధ్యులే. అప్పటి ప్రభుత్వ పెద్దలు, రాజకీయ ప్రముఖుల నుంచి అక్రమ లేఅవుట్లకు అడ్డగోలుగా అనుమతులిచ్చిన హుడా అధికారులు.. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురవుతున్నట్టు తెలిసినా ఎన్‌వోసీలు ఇచ్చిన నీటిపారుదల, రెవెన్యూ అధికారులు కూడా బాధ్యులే. నిజాం కాలంలో నిర్మించిన దుర్గం చెరువు రెండు గుట్టల మధ్య సుమారు 160.7 ఎకరాలకుపైగా విస్తరించి ఉండేది. రాయదుర్గం పాయెగాలో 62ఎకరాలు, మాదాపూర్ సర్వే నం.63, 64లలో 28 ఎకరాలు, గుట్టల బేగంపేట్ సర్వే నంబర్లు 42 నుంచి 61 వరకు 70.7 ఎకరాల విస్తీర్ణంలో దుర్గంచెరువు ఉండేది.

హుడా ఆమోదంతో నిర్మాణాలు..

ఈ ప్రాంతంలో 1991లో మొదట అమర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 15 ఎకరాల విస్తీర్ణంలో 150 ప్లాట్లతో లేఅవుట్ చేసింది. అయితే చెరువు చుట్టూ 30 అడుగుల పరిధిలో స్థలాన్ని గ్రీన్‌బెల్ట్ కోసం కేటాయించిన హుడా.. 130 ప్లాట్లకు 1995లో తుది ఆమోదం ఇచ్చింది. ఈ క్రమంలోనే వరుసగా కావూరి హిల్స్, నెక్టార్ గార్డెన్ గేటెడ్ కమ్యూనిటీలకు కూడా హుడా ఆమోదం లభించింది. నెక్టార్ గార్డెన్ పూర్తిగా, కావూరి హిల్స్‌లోని కొంత భాగం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉంది. గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు కావూరి హిల్స్, నెక్టార్ గార్డెన్, అమర్ సొసైటీలలోకి వరద నీరు చేరేది. దీనితో దుర్గంచెరువు పూర్తిగా నిండకుండా, ఎప్పటికప్పుడు నీటిని కిందికి వదిలేస్తూ.. ఎఫ్‌టీఎల్‌పై ఫోకస్ పడకుండా చేశారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే ఒత్తిడి తీసుకొచ్చి వర్షాకాలంలో దుర్గం చెరువు గేట్లు మూసివేయకుండా చూసుకుంటూ వస్తున్నారు. అయితే చెరువు సుందరీకరణ పేరిట చుట్టూ వాకింగ్ ట్రాక్ వేయడంతో.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వారికి అదో రక్షణ గోడగా మారిపోయింది.

అధికారులు ఏమంటున్నారు?

2013లో సుమారు 160.7 ఎకరాల్లో దుర్గం చెరువు విస్తీర్ణాన్ని గుర్తిస్తూ ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించామని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల నుంచి వచ్చిన ఎన్‌వోసీల మేరకు అనుమతులను ఇచ్చినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు అంటున్నారు. ఇక ''ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌ను పరిగణనలోకి తీసుకుంటాం. చాలా చోట్ల కాలువలను పూర్తిగా మూసివేయడం వల్ల బ్యాక్ వాటర్ వచ్చి చేరుతుంది. దీంతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో శాస్త్రీయత లోపిస్తోంది''అని హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం.

అక్రమమైతే కూల్చేయండి..



వాల్టా చట్టం రాకముందే 1995లో లేఅవుట్‌కు ఆమోదం లభించింది. హుడా అనుమతితోనే ఇళ్లు నిర్మించారు. 2016లో 600 చదరపు గజాల స్థలంలో ఇల్లు కొనుగోలు చేశాం. ఈ ప్రాంతం చెరువు పరిధిలోకి వస్తుందన్న సమాచారమేదీ లేదు. ఇప్పుడు బఫర్ జోన్‌లోకి వస్తుందంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అక్రమమైతే కూల్చేయండి, ముఖ్యమంత్రి నా ఒక్కడి కోసం పనిచేయడం లేదు కదా! బీఆర్‌ఎస్ నాయకులు నా ఇంటి విషయంలో రాజకీయం చేస్తున్నారు.

- సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి

భయభ్రాంతులకు గురిచేయొద్దు



1995లో హుడా అనుమతి ఇవ్వడంతోనే ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఇప్పటికీ ఈఎంఐలు కట్టేవారు ఉన్నారు. 2023లో జీహెచ్‌ఎంసీ హైపవర్ కమిటీ ఈ ప్రాంతం ఎఫ్‌టీఎల్‌లోకి రాదని తేల్చింది. ప్రభుత్వాలు మారితే ఎఫ్‌టీఎల్ మారుతుందా?

- అమర్ కో–ఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణారెడ్డి

ఇళ్లు కట్టాలంటే ఏ అనుమతులు ఉండాలి



గ్రీన్‌బెల్ట్‌ను వదిలి అమర్ సొసైటీ లేఅవుట్‌కు హుడా అధికారులు ఆమోదం తెలిపారు. అనుమతి ఉన్న లేఅవుట్‌లో ప్లాట్ తీసుకొని, ఇంటి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అనుమతి తీసుకున్నాం. హైదరాబాద్‌లో ఇళ్లు కట్టుకోవాలంటే ఇంకా ఏమేం అనుమతులు తీసుకోవాలో చెప్పండి.

- పోలవరపు శ్రీనివాస్, అమర్ సొసైటీ వాసి

అధికారులపైనా కేసులు

▶ మొదటి పేజీ తరువాయి

తేలింది. ఒకదానిలో అది ప్రభుత్వ స్థలమని, మరో దానిలో అది ప్రైవేట్ స్థలమని పొందుపరిచారు. అవసరాన్ని బట్టి ఒక్కో రిపోర్టును తీసి ఇవ్వడం చేశారు. ఈ అక్రమ నిర్మాణాలకు చెరువు సర్వే నంబర్‌ను కాకుండా దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న మరో భూమికి సంబంధించిన సర్వే నంబర్ కేటాయించారు. ఈ వ్యవహారంలో బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్ పాత్ర కూడా ఉన్నట్టు తేలింది. అంతేకాదు హెచ్‌ఎండీఏలో అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్ ఆ స్థలాలపై క్షేత్రస్థాయి పరిశీలన జరపకుండానే అనుమతి మంజూరు చేశారు. ఇందులో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు పాత్ర కూడా ఉన్నట్టు హైడ్రా నిర్ధారించింది. దీనితో ఈ కేసులో నలుగురు అధికారులనూ నిందితులుగా మార్చాలని పోలీసులను కోరింది.

ఏమీ రాయకుండా 'చుక్క' పెట్టి లైన్ క్లియర్!

చందానగర్ పరిధిలోని ఈర్ల చెరువు ఆక్రమణ వ్యవహారం పైనా హైడ్రా లోతుగా ఆరా తీయగా మరో బాగోతం బయటపడింది. ఇక్కడ 0.16 ఎకరాలను ఆక్రమించిన కొందరు.. గ్రౌండ్ ప్లస్ మూడు అంతస్తులతో ఒక నిర్మాణం, గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తులతో మరో రెండు నిర్మాణాలను చేపట్టారు. వాటిపై ఫిర్యాదు అందుకున్న హైడ్రా అధికారులు.. ఈ నెల 10న ఆ మూడు నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ ఆక్రమణలకు సంబంధించి చందానగర్ ఠాణాలో కేసు నమోదైంది. ఈ నిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు మంజూరైనట్టు గుర్తించిన హైడ్రా అధికారులు.. పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ గత డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎస్.సుధాంశ్‌తోపాటు మాజీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) ఎం.రాజ్‌కుమార్ పాత్ర వెలుగులోకి వచ్చింది. ఇక్కడ భవనాల నిర్మాణానికి అనుమతుల కోసం బిల్డర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి ఈర్ల చెరువు ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా.. దరఖాస్తుతోపాటు ఇరిగేషన్ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకుని జత చేయాలి. బిల్డర్లు అలా చేయలేదని గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) ఆ వివరాలను పొందుపరుస్తూ రాజ్‌కుమార్‌కు ఫార్వర్డ్ చేశారు. ఈ ఆన్‌లైన్ అప్లికేషన్‌పై రాజ్‌కుమార్ తన అభిప్రాయాలను జోడిస్తేనే అది డిప్యూటీ కమిషనర్‌కు వెళుతుంది. కానీ రాజ్‌కుమార్ దానిపై ఎలాంటి కామెంట్లు రాయకుండా.. కేవలం ఓ చుక్క (డాట్) పెట్టి డిప్యూటీ కమిషనర్‌కు ఫార్వర్డ్ చేసేశారు. దీని ఆధారంగా డిప్యూటీ కమిషనర్ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసేశారు. ఇది గుర్తించిన హైడ్రా చందానగర్‌లో నమోదైన కేసులో సుధాంశ్, రాజ్‌కుమార్‌లను నిందితులుగా చేర్చాలని సిఫార్సు చేసింది.



ఈర్ల చెరువు పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా (ఫైల్)

ఏసీబీ అధికారుల దృష్టికి కూడా..

సాధారణంగా అన్నీ సరిగా ఉన్న స్థలాల్లో నిర్మాణాలకు అనుమతి కావాలన్నా.. సంబంధిత అధికారుల చేతులు తడపనిదే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి. అలాంటిది చెరువులు, కుంటలు, వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లతోపాటు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు అంటే.. అధికారుల చేతికి ముడుపులు దండిగా అందినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఎర్రకుంట, ఈర్ల చెరువుల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో రూ.లక్షలు చేతులు మారి ఉంటాయని హైడ్రా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన అధికారుల వివరాలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి అందించాలని యోచిస్తున్నారు. భవిష్యత్తులో కొన్ని కీలక ఉదంతాలపై విజిలెన్స్ విచారణలు కూడా కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇలా అక్రమార్కుల చుట్టూ ఉచ్చు బిగించాలని హైడ్రా భావిస్తున్నట్టు తెలిసింది.

హైడ్రా పరిధి విస్తృతం

- ఆక్రమణలపై నోటీసులిచ్చే అధికారం ఇక ఒక్క 'హైడ్రా'కే..
- పోలీసు, సర్వే, నీటిపారుదల శాఖల నుంచి సిబ్బంది కేటాయింపు
- ఇక ఆక్రమణల తొలగింపులన్నీ ఒకే గొడుగు కిందకు తెస్తామన్న సీఎస్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ (హైడ్రా) పరిధిని మరింత విస్తృతం, బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతను కూడా ఈ సంస్థకే అప్పగించాలని నిర్ణయించింది. దీనికోసం విధివిధానాలు రూపకల్పన చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి వెల్లడించారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాల పరిరక్షణ బాధ్యతను ఇప్పటికే హైడ్రాకు అప్పగించిన విషయం విదితమే. గురువారం చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల రక్షణపై హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని పూర్తి బాధ్యతను హైడ్రాకు అప్పగించడానికి చేపట్టాల్సిన చర్యలపై సీఎస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ, పురపాలక శాఖ, పంచాయతీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయని, దీనివల్ల అయోమయం ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించడానికి, ఓఆర్‌ఆర్ పరిధిలో అన్ని రకాల ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే జారీచేసేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, భూ ఆక్రమణల నిరోధక చట్టం, వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారీ చేసే అన్ని రకాల నోటీసులు, ఆక్రమణల తొలగింపులన్నీ పూర్తిగా ఒకే విభాగం హైడ్రా పరిధిలోకి తేనున్నట్టు స్పష్టంచేశారు.

త్వరలోనే సిబ్బంది కేటాయింపు

హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువుల పరిరక్షణ బాధ్యతను కూడా జల మండలి నుంచి తప్పించి హైడ్రా పరిధిలోకి తేనున్నామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొత్రు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తాం

- వరద ముంపు ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందించాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సచివాలయంలో జరిగిన సమీక్షలో మంత్రి పొంగులేటి. చిత్రంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించేందుకు విపత్తుల నిర్వహణ వ్యవస్థ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్)ను బలోపేతం చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరద కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్ కుమార్, రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) జాయింట్ సెక్రటరీ ఎస్.హరీశ్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తోపాటు రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీరాజ్, ప్లానింగ్, వాతావరణ శాఖ విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. 10 సంవత్సరాల తర్వాత తొలిసారిగా వరదలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. వరదలతో సంబంధం ఉన్న ప్రతి విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పును తగ్గించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తరఫున ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కాలువలు, చిన్న డ్రైనేజీల నుంచి మొదలుకుని, బహుళ అంతస్తుల భవనాల వరకు ఏ పరిస్థితి ఎదురైనా అధిగమించడానికి వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. హైడ్రా పరిధిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండగా దాన్ని 70కి పెంచామని, అలాగే సిబ్బంది సంఖ్యను 1,800 నుంచి 3,500 వరకు పెంచామని వివరించారు. దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి హైడ్రాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, హైడ్రాకు కావలసిన అధునాతన పరికరాలు అందిస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు.

హైడ్రా పేరుతో బెదిరించి వసూళ్లు

అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మారుమోగిపోతున్న హైడ్రా పేరును కొంత మంది దిగువ స్థాయిలోని అధికారులు దుర్వినియోగం చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డం పెట్టుకుని డబ్బు డిమాండ్ చేస్తున్నారంటూ నేరుగా ముఖ్యమంత్రికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా స్పందించారు. అలాంటి వారిపై నిఘా ఉంచాలని, కఠిన చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. 'హైదరాబాద్‌లో హైడ్రా పేరు చెప్పి భయపెట్టి, బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు మూడేళ్ల కిందటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకొని కొన్నిచోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అటువంటి వారిపై చర్యలు తప్పవు' అని సీఎం చెప్పారు.

ఆరు గ్యారంటీలను మరిపించేందుకే 'హైడ్రా'



సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

సిరిసిల్ల: ఆరు గ్యారంటీలను మరిచిపోయేందుకు హైడ్రా తెచ్చారని, ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, సిరిసిల్లలో గురువారం పర్యటించిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం కూల్చివేతలో రేవంత్ రోషం ఏమైందని ప్రశ్నించారు. సల్కం చెరువు ఆక్రమణలపై ఒవైసీ బెదిరిస్తే భయపడతావా? అని ముఖ్యమంత్రిని బండి ప్రశ్నించారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఒవైసీ అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని చెప్పారు. రైతు రుణమాఫీ బోగస్ అని, రైతు భరోసా లేదని, మహిళలను ప్రభుత్వం ఆదుకోలేదని, నోటిఫికేషన్లు ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు యువరాజు అమెరికా వెళ్లాడని, ఆయన్ని కలిసేందుకు కాంగ్రెస్ నేతలు వెళ్తున్నారని, ఆ రెండు పార్టీల విలీనం ఖరారు అయిందన్నారు. ప్రభుత్వ విధానాలతో నేతన్నలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బండి సంజయ్ విమర్శించారు. సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా దాటవేస్తోందన్నారు . రూ.లక్షల విద్యుత్ బకాయిలతో నేతన్నలు ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ సమస్యకు పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని బండి సంజయ్ అన్నారు.

హైడ్రా పేరుతో హైడ్రామా చేయొద్దు

వందల మంది పేదలకు నోటీసులు ఇవ్వడం ఏంటీ ?

హస్మత్‌పేట బోయిన్ చెరువు సందర్శనలో ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్/ఓల్డ్ బోయిన్‌పల్లి: హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తూ వందలాది మంది పేద ప్రజలకు నోటీసులు ఇవ్వడం ఏంటని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావుతో కలసి హస్మత్‌పేట బోయిన్ చెరువును సందర్శించి, నోటీసులు అందుకున్న పేద ప్రజలకు ధైర్యం చెప్పారు. అనంతరం ఈటల మాట్లాడుతూ బోయిన్ చెరువు పక్కన 125 మంది, అల్వాల్ చెరువు పక్కన 120 మంది పేదలు 60, 40 గజాల్లో ఇళ్లు కట్టుకొని 45 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటున్నారన్నారు. చెరువుల గురించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారు పేదల కోణంలో కూడా ఆలోచన చేయాలని కోరారు. 'ఈ నోటీసులు ఇచ్చాక పేదలకు కంటిమీద కునుకు లేదు, వాళ్లు కార్పొరేటర్, ఎంపీ, ఎమ్మెల్యే దగ్గరికి వెళ్తున్నారు. ఇది పార్టీల పంచాయితీ కాదు, పేదవాళ్ల ఇళ్ల పంచాయితీ' అని పేర్కొన్నారు. పేదల ఇళ్ల జోలికి వెళ్లడం లేదంటున్న సీఎం , హైడ్రా కమిషనర్ మరీ వారికి నోటీసులు ఎందుకు పంపించారో చెప్పాలని ఈటల డిమాండ్ చేశారు. పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని చెప్పారు. ఫాక్ సాగర్‌లో 636 మంది పేదలకు పట్టాలు ఇచ్చారు..అప్పట్లో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కనిపించలేదా అని గుర్తు చేశారు.

'హైడ్రా'తో డైవర్షన్ పాలిటిక్స్‌కే పరిమితమా?

విద్య, వైద్యం పక్కనబెట్టి సీఎం రేవంత్ బుల్డోజర్ పాలన తెచ్చారు.. బీఆర్‌ఎస్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పాలనను పక్కన బెట్టారని బీఆర్‌ఎస్ విమర్శించింది. బీఆర్‌ఎస్ నేతలు కె.వాసుదేవరెడ్డి, బాలరాజు యాదవ్, మహేశ్‌రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైడ్రాకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని, రాష్ట్రంలో ప్రజాసమస్యలను కూడా సీఎం పట్టించుకోవాలని హితవు పలికారు. గురుకుల విద్యావ్యవస్థను రేవంత్ సర్కార్ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనాలేదని మండిపడ్డారు. విద్యాశాఖ కూడా సీఎం రేవంత్ చేతుల్లోనే ఉండటంతో ఆ శాఖపై ఆయన సరిగ్గా దృష్టి పెట్టడం లేదని, ఆ శాఖ బాధ్యతలను వేరేవారికి అప్పగించాలని సూచించారు. విద్య, వైద్యం పక్కనబెట్టిన సీఎం రేవంత్ రాష్ట్రంలో బుల్డోజర్ పాలన తెచ్చారని విమర్శించారు. దుర్గం చెరువు పరిధిలో ఉన్న సీఎం సోదరుడి ఇల్లు, వట్టినాగులపల్లిలోని సీఎం అక్రమ ఫామ్ హౌస్‌ను ముందుగా కూల్చేయాలన్నారు.

'హైడ్రా' పని తక్కువ ప్రచారం ఎక్కువ: ఏలేటి

నాపై వ్యాఖ్యలకు రంగనాథ్ క్షమాపణలు చెప్పాలి



సాక్షి, హైదరాబాద్: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహార శైలి పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువ అన్న చందంగా ఉందని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ...బీజేఎల్పీ నేతగా తాను పాత బస్తీలో చెరువులు కబ్జాకు గురయ్యాయని, సల్కం చెరువులో ఒవైసీ నిర్మాణాలను హైడ్రా ఎప్పుడు కూల్చివేస్తుందని ప్రశ్నించానన్నారు. దానిపై రంగనాథ్ కౌంటర్ ఇస్తున్నట్టుగా తాను రాజకీయ ఉద్దేశాలతో మాట్లాడానని వ్యాఖ్యానించడం సరికాదని హితవు పలికారు. తనను విమర్శించాలనుకుంటే రంగనాథ్ ఖాకీ డ్రెస్‌విప్పి ఖద్దరు బట్టలు వేసుకోవచ్చని సూచించారు. రంగనాథ్ గీతదాటి వ్యవహరించారని మండిపడ్డారు. అందుకు ఆయన తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పనిపక్షంలో అసెంబ్లీ స్పీకరును కలసి సభాహక్కుల నోటీసు ఇస్తామని హెచ్చరించారు. హైడ్రా ఒకవర్గం వారినే టార్గెట్ చేసి, మిగతా వారిని కాపాడుతోందని మహేశ్వర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీలో ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించాల్సింది పోయి హైడ్రాను ఆదేశించగలరా అని సవాల్ విసిరారు. పాత బస్తీలో కూల్చివేతలు ముగిసాకే మిగిలిన కట్టడాల జోలికి వెళ్లాలన్నారు.

క్లుప్తంగా...

సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన రేపు

సాక్షి, హైదరాబాద్‌: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని గురుకుల విద్యా జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా ఉద్యోగులు భావిస్తున్నారని పేర్కొంది. ఈమేరకు గురుకుల ఉద్యోగులు ఈనెల 31వ తేదీన నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని, భోజన విరామ సమయంలో నిరసనలు తెలపాలని గురుకుల విద్యా జేఏసీ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సీహెచ్.బాలరాజు, కె.యాదయ్య, వి.ప్రభుదాస్, డి.బాల స్వామి, పి.రుషికేశ్ కుమార్, కేవీ చలపతి, వీఆర్ గోవర్ధన్ రెడ్డి, ఎస్.ఝాన్సీరాణి, టి.సాంబలక్ష్మి, ఆవుల సైదులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ ఒకటో తేదీన సెలవు దినం కావడంతో ముందురోజే నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

బోధన ఫీజులు, ఉపకార వేతనాలు ఇవ్వాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్‌: అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం బోధన ఫీజులు, ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపు ఉందన్నారు. రూ.5,900 కోట్లు బకాయిలు ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదని, దీంతో విద్యార్థులు, విద్యా సంస్థలు కూడా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

'బీవైడీ'పై కేంద్ర వైఖరి మారింది..

ఏడాది క్రితం తెలంగాణలో బిలియన్ డాలర్ల పెట్టుబడితో చైనాకు చెందిన ఆటోమేకర్ సంస్థ 'బీవైడీ' ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనలతో ముందుకు వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించడంతో తెలంగాణలో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యానికి ఆటంకం ఏర్పడిందన్నారు. గతంలో బీవైడీ పెట్టుబడులను అడ్డుకున్న కేంద్రం ఇప్పుడు మళ్లీ స్వాగతం పలుకుతోందని, కేంద్రం వైఖరి మారడానికి గల కారణాలు వివరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాల్సిందే

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



సాక్షి,హైదరాబాద్‌: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే ఈ బాధ్యతను తీసుకోవాలని కోరింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన లక్డీకాపూల్‌లోని సెంట్రల్‌కోర్టులో అన్ని రాజకీయపార్టీలతో గురువారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, బీసీ జనాభా లెక్క తేల్చాలని సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42%కు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలన్నారు. వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ కాలపరిమితిని పెంచాలన్నారు.



సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర పరవళ్లు

- తెరుచుకున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు 26 గేట్లు
- శ్రీశైలంలో 10 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

నాగార్జునసాగర్/దోమలపెంట: కృష్ణా పరీవాహక ప్రాంతానికి భారీగా వరద పోటెత్తుతోంది. దీంతో గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తడంతోపాటు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 3,48,235 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తోంది. సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో ఉండడంతో క్రస్ట్‌గేట్లు ఎత్తి 3,07,382 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,461 క్యూసెక్కులు దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు.

'స్థానికత'పై తీర్పు వాయిదా

వైద్య విద్య అడ్మిషన్ల కేసు

సాక్షి, హైదరాబాద్‌: ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో 'స్థానికత' జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లలో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. 'ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ నిబంధనలు–2017లో రూల్ 3(ఏ)ను చేర్చడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ అభినామ్‌తో పాటు మరికొందరి తరఫున న్యాయవాది కొండపర్తి కిరణ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. 'నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రభుత్వం గత నెల 19న జారీ చేసిన జీవో 33 చట్టవిరుద్ధం. జీవో ప్రకారం విద్యార్థులు 9, 10తోపాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. ఇది రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

చట్టప్రకారం ముందుకెళ్లండి

'కావూరి హిల్స్' పిటిషన్‌లో అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లోని కావూరి హిల్స్‌లోని నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి చట్టప్రకారం ముందుకెళ్లాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల వద్ద ఉన్న సేల్ డీడ్, నిర్మాణ అనుమతి పత్రాలు, విద్యుత్ బిల్లు, ఆస్తి పన్ను రసీదులు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించాలని తహసీల్దార్‌కు స్పష్టం చేసింది. ఆ తర్వాతే చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ.. విచారణ ముగించింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారంటూ వాల్టా చట్టం కింద తహసీల్దార్ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తామంతా ఉద్యోగులు, వ్యాపారులమని, 500 చదరపు గజాల స్థలంలో నిర్మాణం చేపట్టామని చెప్పారు.

రాహుల్‌ను సీఎం సొంతూరుకు తీసుకెళ్తా

రైతు రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదని ఆయనకు చూపిస్తా

- దీనిపై రాహుల్‌ను సీఎం రేవంత్ తప్పుదోవ పట్టిస్తున్నాడు
- అందుకే వరంగల్ సభకు మూడుసార్లు పిలిచినా రాలేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: 'రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తూ మోసం చేస్తున్నాడు. రుణమాఫీ జరగలేదని ఓవైపు మంత్రులు చెబుతుంటే రేవంత్ మాత్రం ఢిల్లీలో రాహుల్ గాంధీని తప్పుదోవ పట్టిస్తున్నాడు. అందుకే వరంగల్ సభకు రావాలని రేవంత్ మూడుసార్లు ఆహ్వానించినా రాహుల్ రావట్లేదు. హైదరాబాద్‌కు రాహుల్ వస్తే విమానాశ్రయంలోనే స్వాగతం పలికి సీఎం సొంతూరుకు తీసుకెళ్లి రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదని ఆయనకు చూపిస్తాం'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో హరీశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సీఎం రేవంత్ చిట్‌చాట్ పేరిట 'చీట్‌చాట్'(మోసగించే ముచ్చట్లు) చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

వాల్మీకి స్కామ్‌లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

కర్ణాటకలో జరిగిన వాల్మీకి స్కామ్‌లో తెలంగాణకు చెందిన తొమ్మిది కంపెనీల ఖాతాలకు డబ్బులు బదిలీ అయ్యాయని.. ఈ స్కామ్‌పై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు వల్లే ఈడీ విచారణ జరగట్లేదని హరీశ్‌రావు ఆరోపించారు. దీనిపై విచారణ కోసం త్వరలో ఈడీని కలుస్తామని చెప్పారు.

హైడ్రా ఆఫీసును రంగనాథ్ కూల్చివేయాలి

'హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కూల్చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎమ్మెల్యేల ఫిరాయింపులతో ప్రజాస్వామ్యాన్ని... దేవుళ్లపై ఒట్లతో ప్రజల విశ్వాసాన్ని కూల్చేసింది. బుద్ధ భవన్ నాలా కింద ఉన్న హైడ్రా ఆఫీసును కమిషనర్ రంగనాథ్ కూలగొట్టి ఇతర భవనాల వైపు చూడాలి. జీహెచ్ఎంసీ ఆఫీసు, నెక్లెస్ రోడ్డు రెస్టారెంట్లు, మీరాలం, ఉప్పల్, రామాంతపూర్ చెరువుల్లోని నిర్మాణాలు కూడా కూలుస్తారో లేదో చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఫోర్త్ సిటీ పేరిట భూములు కొల్లగొట్టే కుట్ర

ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు సర్వే నంబర్ 9లో 385 ఎకరాల ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి సర్వే చేస్తున్నారని... తుక్కుగూడలో సర్వే నంబర్ 895లో 25 ఎకరాలను పేద రైతుల నుంచి బినామీల పేరుతో తీసుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చెలామణి అవుతున్న తమ్ముళ్ల పీఏల పేరిట భూములు కొంటున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి సీఎం శంకుస్థాపన చేస్తే మంత్రులెవరూ రాలేదని హరీశ్ ఎద్దేవా చేశారు.

విద్యార్థులను ఎలుకలు కరవడం దారుణం

మెదక్ జిల్లా రామాయంపేట గురుకుల పాఠశాలలో 12 మంది విద్యార్థులపై, నల్లగొండ జిల్లాలోని కొండభీమనపల్లి గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేయడం దారుణమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 500 మందికిపైగా గురుకుల విద్యార్థులు ఆస్పత్రుల పాలవగా 36 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

కవిత బెయిల్ వ్యాఖ్యలపై 'సుప్రీం'మొట్టికాయలు

'సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరం. వక్రబుద్ధి ఉన్న వారికి అన్నీ వంకరగానే కనిపిస్తాయి. బీజేపీ ఇస్తేనే ఓటుకు రూ. కోట్లు కేసులో రేవంత్‌కు బెయిల్ వచ్చిందా? ఎమ్మెల్సీ కవితకు బెయిల్ విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. కవితకు బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచింది. ఈడీ, సీబీఐ తీరుపైనా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు బెయిల్ వస్తే అది బీజేపీతో పోరాటం.. కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీ అనడం రేవంత్ అపరిపక్వతకు నిదర్శనం'అని హరీశ్ విమర్శించారు.

నెట్ పరిధిలో చేర్చొద్దు

- పీహెచ్‌డీ ప్రవేశాలపై రాష్ట్ర వర్సిటీల నిర్ణయం
- యూజీసీకి లేఖ రాయనున్న ఉస్మానియా యూనివర్సిటీ
- చైర్మన్‌ను కలిసి సమస్య వివరించిన ఉన్నత విద్యామండలి
- విద్యార్థుల వ్యతిరేకత పరిగణనలోకి..

సాక్షి, హైదరాబాద్‌: పీహెచ్‌డీ ప్రవేశాలను యూజీసీ నెట్ పరిధిలో చేర్చేందుకు సిద్ధమైన రాష్ట్ర యూనివర్సిటీలు, తాజాగా ఆ ఆలోచనను విరమించుకున్నాయి. ఎప్పటిలాగే యూనివర్సిటీల అర్హత పరీక్ష ద్వారానే ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించాయి. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కు లేఖ రాయనున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఇప్పటికే లేఖను సిద్ధం చేసింది. మరోవైపు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ కూడా యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్ కుమార్‌ను కలిసి ఈ విషయం స్పష్టం చేసినట్టు తెలిసింది. యూజీసీ ప్రతిపాదన ప్రకారం పీహెచ్‌డీలను జాతీయ అర్హత పరీక్ష (నెట్) ద్వారా భర్తీ చేయాలన్న ప్రతిపాదన వల్ల ఇబ్బందులున్నాయని చెప్పినట్టు సమాచారం.

తీవ్రంగా వ్యతిరేకించిన విద్యార్థులు

రాష్ట్రంలో ముఖ్యంగా ఉస్మానియా వర్సిటీలో అత్యధికంగా పీహెచ్‌డీలు చేస్తుంటారు. ప్రతి ఏటా 200కు పైగా విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఈ ప్రవేశాలు రెండు రకాలుగా ఉంటాయి. నెట్, కేంద్ర ప్రభుత్వం నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైన వారిని ఒక కేటగిరీగా భావిస్తారు. మొత్తం సీట్లల్లో సగం వీరికి కేటాయిస్తారు. మిగిలిన సగం సీట్లను యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. అయితే ఈ ఏడాది మార్చిలో యూజీసీ కొత్త నిబంధనను తీసుకొచ్చింది. జాతీయ విద్యా హక్కు చట్టం అమలులో భాగంగా పీహెచ్‌డీ ప్రవేశాలను జాతీయ స్థాయిలో నిర్వహించే నెట్ పరీక్ష ద్వారానే భర్తీ చేయాలని రాష్ట్రాలకు సూచించింది. దీని అమలుకు రాష్ట్రంలోని వర్సిటీలు కూడా సిద్ధమయ్యాయి. అయితే విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. దీంతో దీనిపై సమీక్షించాలని అధికారులను ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది.

నెట్‌తో అయితే నష్టమేంటి?

జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష వల్ల తమకు నష్టం జరుగుతుందనేది విద్యార్థుల ఆందోళన. పాఠశాల స్థాయి నుంచి పీజీ స్థాయి వరకూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు అరకొర వసతులతో చదువుతున్నారు. చాలా కాలేజీల్లో జాతీయ స్థాయి ప్రమాణాలు లేవు. రాష్ట్ర స్థాయి సిలబస్‌తోనే విద్యాభ్యాసం ముగిస్తారు. నెట్ పేపర్ పూర్తిగా జాతీయ స్థాయిలో ఉండే సిలబస్ నుంచి ఇస్తారు. యూనివర్సిటీ నిర్వహించే అర్హత పరీక్షతో పోలిస్తే ఇది కఠినంగా ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. జాతీయ స్థాయిలో పోటీ పడటం, ఎంపిక కావడం కష్టమని వారు భావిస్తున్నారు. ఇన్ని సమస్యల మధ్య నెట్ ద్వారా అర్హత పొంది పీహెచ్‌డీ చేయడం కష్టమని అంటున్నారు. ఈ వాదనతో ఏకీభవిస్తున్న వర్సిటీలు, అధికారులు విషయం యూజీసీ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి.

కవితపై దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోండి

మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్‌: ఎమ్మెల్సీ కవిత వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన జీహెచ్ఎంసీ మహిళా కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు గురువారం వినతిపత్రం అందజేశారు. మద్యం కుంభకోణంలో బెయిల్‌పై బయటకు వచ్చిన కవితపై బురదచల్లేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కవితను చెడుగా చిత్రీకరిస్తున్న వారు బహిరంగ క్షమాపణ చెప్పేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కార్పొరేటర్లు సామల హేమ, ఆదర్శ్ సింధు, శాంతి, కవిత, కంది శైలజ, దేదీప్య, పద్మ, గీత, సునిత, రోజా, అర్చన, సబీహా బేగమ్ ఉన్నారు.

'నేతన్నకు చేయూత'కు రూ.90 కోట్లు విడుదల

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: చేనేత కార్మికుల్లో పొదుపుతో పాటు భద్రతా భావాన్ని పెంచేందుకు ప్రవేశపెట్టిన 'నేతన్నకు చేయూత' పథకానికి సంబంధించి ఒకేసారి రూ.90 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. 2021 సెప్టెంబర్‌లో మొదలైన ఈ పథకం ఈ నెల 31న ముగుస్తుందన్నారు. నిధుల విడుదలతో 36,133 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతారని తెలిపారు. ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు మూడేళ్లలో వడ్డీతో పాటు రూ.60 వేల నుంచి రూ.1.29 లక్షల వరకు లబ్ధి జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం నేతన్నలను పట్టించుకోకుండా నేతన్నకు చేయూత లబ్ధిదారులకు బకాయిలు పెట్టిందన్నారు. బకాయిలు లేకుండా నేతన్నలకు సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో నిధులు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

83 మంది నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతులు

- తహసీల్దారులుగా ప్రమోట్ చేస్తూ సీసీఎల్‌ఏ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేసిన ట్రెసా, టీజీటీఏ

సాక్షి, హైదరాబాద్‌: రెవెన్యూ శాఖలో కీలక సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. ఈ శాఖ పరిధిలో నాయబ్ తహసీల్దారులుగా పనిచేస్తున్న 83 మందికి పదోన్నతి లభించింది. వీరిని తహసీల్దారులుగా ప్రమోట్ చేస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ పదోన్నతుల పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ (టీజీటీఏ) హర్షం వ్యక్తం చేశాయి. ఈ పదోన్నతులకు సహకరించిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్‌కు వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపాయి.

ఓటేసిన ప్రజలు బీజేపీలో చేరాలి

బీజేపీ నేత రామచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించిన ప్రజలంతా బీజేపీలో చేరాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వానికి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.85 లక్షల మంది సభ్యులున్నారని, దీనిని 50 లక్షలకు పైగా పెంచాలని పార్టీ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పోలింగ్‌బూత్ స్థాయిలో కనీసం 200 సభ్యత్వాలు చేయాలనేది లక్ష్యమని తెలియజేశారు. జాతీయ స్థాయిలో సెప్టెంబర్ 2న సభ్యత్వ నమోదును ప్రధాని మోదీ ప్రారంభిస్తారని, 3న తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. సెప్టెంబర్ 4న జిల్లా కేంద్రాలు, 5న మండల కేంద్రాల్లో దీనిని ప్రారంభించనున్నట్టు రామచందర్‌రావు తెలిపారు.

'ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి కృషి'

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ (విద్యార్థి సంఘం)ను బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. ఎన్ఎస్‌యూఐ నూతన కమిటీ తొలి కార్యవర్గ సమావేశం అనంతరం గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ...తొలి కార్యవర్గ సమావేశంలో మూడు నెలల కార్యాచరణ రూపొందించుకున్నామన్నారు.

అల్లాహ్ ఒక ఆత్మపై అది భరించగలిగే దాని కంటే ఎక్కువ భారం వేయడు.
మనం ఇష్టపడే వాటితోనే ఆయన మనల్ని పరీక్షిస్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 30 ఆగస్టు 2024

శాంతియత్నాలు ఆపొద్దు!


రష్యా–ఉక్రెయిన్ యుద్ధం పరిసమాప్తికి భిన్న మార్గాల్లో జరుగుతున్న ప్రయత్నాలు కాస్తా ఆ రెండు పక్షాల మొండి వైఖరులతో స్తంభించినట్టే కనబడుతోంది. రష్యాపై మరిన్ని దాడులు జరిపితే అది చర్చలకు సిద్ధపడుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భావిస్తుండగా... దాన్ని పూర్తిగా లొంగదీసుకునే వరకూ యుద్ధం ఆపే ప్రసక్తి లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికార ప్రతినిధి తాజాగా తేల్చిచెప్పారు. యుద్ధం మొదలయ్యాక రెండు దేశాలతోనూ ఐక్యరాజ్యసమితితోపాటు భిన్న సంస్థలూ, దేశాలూ చర్చలు సాగిస్తూనే ఉన్నాయి. కానీ ఎవరికి వారు అంతిమ విజయం తమదేనన్న భ్రమల్లో బతుకున్నంత కాలం సమస్య తెగదు. అలాగని ఏదో మేరకు సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నది వాస్తవం. ఉదాహరణకు హోరాహోరీ సమరం సాగుతున్నప్పుడు రెండేళ్ల క్రితం ఉక్రెయిన్ నుంచి ఆహారధాన్యాలు, ఎరువులు, పొద్దుతిరుగుడు నూనె ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోగా ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకుని రష్యా, ఉక్రెయిన్‌లతో మాట్లాడి సమస్యను పరిష్కరించింది. అప్పటికి యుద్ధం మొదలై ఆర్నెల్లు దాటింది. ఫలితంగా నిరుడు జూలై నాటికి దాదాపు మూడున్నర కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఎగుమతయ్యాయి. ప్రపంచానికి ఆహార సంక్షోభం తప్పింది. ఇటీవలే ఈ రెండు దేశాల మధ్యా యుద్ధ ఖైదీల మార్పిడి కూడా జరిగింది. ఇరువైపులా చెరో 115 మంది సైనికులకూ చెర తప్పింది. తెర వెనక తుర్కియే సంక్షోభ నివారణకు ప్రయత్నిస్తుండగా ప్రధాని మోదీ అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ సందర్శించి ఇరు దేశాల అధినేతలతోనూ మాట్లాడారు. వచ్చే నెలలో ఐక్యరాజ్యసమితి సమావేశాలకు వెళ్లినప్పుడు ఆయన మరోసారి జెలెన్స్కీని కలవబోతున్నారు. అలాగే అక్టోబర్‌లో బ్రిక్స్ సమావేశాల కోసం రష్యా వెళ్లబోతున్నారు. మోదీ ఉక్రెయిన్ వెళ్లినందుకు పుతిన్ కినుక వహించినట్టే, అంతక్రితం రష్యా వెళ్లినందుకు జెలెన్స్కీ నిష్ఠూరాలాడారు.

ఇప్పటికైతే ఉక్రెయిన్ ఒకవైపు నువ్వా నేనా అన్నట్టు రష్యాతో తలపడుతున్నా... డ్రోన్‌లతో, బాంబులతో నిత్యం దాడులు చేస్తున్నా చర్చల ప్రస్తావన తరచు తీసుకొస్తోంది. రష్యా చర్చలకు వచ్చి తీరుతుందని జెలెన్స్కీ ఇటీవల అన్నారు. అయితే ఇదంతా ఊహలపై నిర్మించుకున్న అంచనా. నిరంతర దాడులతో రష్యాకు గత్యంతరం లేని స్థితి కల్పిస్తే... ఆ దేశం చర్చలకు మొగ్గుచూపుతుందన్నది ఈ అంచనా సారాంశం. నిజానికి నాటో దేశాలు నిరంతరం సరఫరా చేస్తున్న మారణాయుధాలతో, యుద్ధ విమానాలతో ఉక్రెయిన్ దాదాపు మూడేళ్లుగా తలపడుతూనే ఉంది. పర్యవసానంగా గతంలో కోల్పోయిన కొన్ని నగరాలను అది స్వాధీనం చేసుకుంది కూడా! కానీ రష్యా ప్రతిదాడులతో అవి ఎన్నాళ్లుంటాయో, ఎప్పుడు జారుకుంటాయో తెలియని స్థితి ఉంది. అత్యుత్సాహంతో ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఆయుధాలను, ఎఫ్–16 యుద్ధ విమానాలను తరలించిన అమెరికా నెలలు గడుస్తున్నా వాటి వినియోగానికి ఇంతవరకూ అనుమతినివ్వనే లేదు. ఉదాహరణకు ఉపరితలం నుంచి ప్రయోగించే సైనిక వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థ (ఏటీఏసీఎం) 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని అవలీలగా ఛేదిస్తుంది. బ్రిటన్–ఫ్రాన్స్ సంయుక్తంగా రూపొందించిన స్టార్మ్ షాడో 250 కిలోమీటర్ల దూరంలోని దేన్నయినా ధ్వంసం చేస్తుంది. ఈ రకం క్షిపణుల్ని గగనతలం నుంచి ప్రయోగిస్తారు. మరోపక్క జర్మనీ తయారీ టారస్ క్షిపణి కూడా ఇటువంటిదే. పైగా ఇది అమెరికా తయారీ క్షిపణిని మించి శక్తిమంతమైంది. 500 కిలోమీటర్లకు మించిన దూరంలోని లక్ష్యాన్ని గురిచూసి కొడుతుంది. ఇవన్నీ ఇంచుమించు ఏడాదిగా ఉక్రెయిన్ సైనిక స్థావరాల్లో పడివున్నాయి. ఎందుకైనా మంచిదని కాబోలు అమెరికా తన ఎఫ్–16లను నేరుగా ఉక్రెయిన్‌కు ఇవ్వకుండా నెదర్లాండ్స్, డెన్మార్క్‌లకు పంపి వారి ద్వారా సరఫరా చేసింది. వీటి వినియోగానికి ఉక్రెయిన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని బ్రిటన్, ఫ్రాన్స్ పట్టుబడుతుండగా అమెరికాతోపాటు జర్మనీ కూడా ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అదే జరిగితే యుద్ధ తీవ్రత మరింత పెరిగి, రష్యా ఎంతకైనా తెగించే పరిస్థితి ఏర్పడొచ్చునని అమెరికా, జర్మనీ ఆందోళన పడుతున్నాయి. తన భూభాగంలోకి చొచ్చుకొచ్చి ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేస్తున్నా రష్యా నిర్లిప్తంగా ఉండిపోతుండగా ఈ అనవసర భయాలేమిటన్నది బ్రిటన్, ఫ్రాన్స్‌ల వాదన. కానీ ఒకసారంటూ ఎఫ్16లు వచ్చిపడితే, అత్యాధునిక క్షిపణులు విధ్వంసం సృష్టిస్తే రష్యా ఇలాగే ఉంటుందనుకోవద్దని పెంటగాన్ హెచ్చరిస్తోంది. తప్పనిసరైతే ఉక్రెయిన్ సరిహద్దుల ఆవల ఉన్న రష్యా స్థావరాలను లక్ష్యంగా చేసుకోమంటున్నది. ఈమధ్య క్రిమియాపై దాడికి అనుమతించింది. కానీ కూటమి మధ్య ఏకాభిప్రాయం కుదిరితే తప్ప రష్యా నగరాల జోలికి పోవద్దని చెబుతోంది. అంతగా భయపడితే అసలు ఇలాంటి ఆయుధాలు, యుద్ధ విమానాలు తరలించటం దేనికి? అవేమైనా ఎగ్జిబిషన్‌కు పనికొచ్చే వస్తువులా? వాటిని చూసి రష్యా 'పాహిమాం' అంటూ పాదాక్రాంతమవుతుందని అమెరికా నిజంగానే భావించిందా?

యుద్ధం ఏళ్లతరబడి నిరంతరం కొనసాగుతుంటే ఎప్పుడో ఒకప్పుడు పరిస్థితి చేజారే ప్రమాదం ఉంటుంది. కనుక అమెరికా, పాశ్చాత్య దేశాలు వివేకంతో మెలగాలి. యుద్ధ విరమణకు సకల యత్నాలూ చేయాలి. దాడులతో ఒత్తిడి తెస్తే రష్యా దారికొస్తుందనుకుంటున్న ఉక్రెయిన్‌కు తత్వం బోధపడాలంటే ముందు అమెరికా సక్రమంగా ఆలోచించటం నేర్చుకోవాలి. ఉక్రెయిన్–రష్యా ఘర్షణ, గాజాలో ఇజ్రాయెల్ ఊచకోతలు ఆగనంతవరకూ ప్రపంచం సంక్షోభం అంచున ఉన్నట్టే లెక్క. అందుకే ప్రపంచ దేశాలు అప్రమత్తం కావాలి. శాంతి నెలకొల్పడానికి ప్రయత్నిస్తూనే ఉండాలి.

ఇది కెమిస్ట్రీ లేని కూటమి

విశ్లేషణ



టంకశాల అశోక్

దాదాపు ఏడాది క్రితం 38 పార్టీలతో ఏర్పడిన 'ఇండియా' కూటమికి ఇప్పటికీ ఒక ఉమ్మడి మేనిఫెస్టో లేదు. మేనిఫెస్టోలు పార్టీ కన్నా కూటమికి మరింత అవసరం. ఎందుకంటే, వేర్వేరు ఆలోచనలు, లక్ష్యాలు ఉండే పార్టీలు ఒక కూటమిగా ఏర్పడినప్పుడు, కలిసి ఎట్లా పని చేయగలవనే సందేహాలు ప్రజలకుంటాయి. కూటమి ఏర్పడింది కేవలం లోక్‌సభ ఎన్నికలు, వాటితోపాటు జరిగిన కొన్ని అసెంబ్లీ ఎన్నికల కోసం కాదు. అదొక దీర్ఘకాలిక వేదిక. 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు, ఈలోగా పలు అసెంబ్లీ ఎన్నికలు వారి అజెండాలో ఉండాలి. ఉమ్మడి మేనిఫెస్టో అవసరమనే ఆలోచన సీరియస్‌గా ఉన్నదా, లేక ఎన్నికల ముందు చేసిన ప్రయత్నం కేవలం ఒక తతంగమా?

'ఇండియా' కూటమి 38 పార్టీలతో ఏర్పడి సంవత్సరం కావస్తున్నది. భౌతికంగా చూసినట్లయితే అది బలమైన రాజకీయ వేదికే. కానీ, గత సెప్టెంబర్ 22న ఆ కూటమి ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు వారికి ఒక ఉమ్మడి మేనిఫెస్టో లేకపోవటం గమనించదగ్గది. ఏ విధంగా ఆలోచించినా అది ఒక పెద్ద లోటు. వాస్తవానికి అటువంటి మేనిఫెస్టో ఎన్నికలకు ముందే రావాలి. తమ కూటమి అధికారానికి వచ్చినట్లయితే వివిధ రంగాలకు, సమస్యలకు, ప్రజల కోరికలకు సంబంధించి ఏమి చేయగలరో, అధికార పక్షపు వైఫల్యాలను ఏ విధంగా సరిదిద్దగలరో దేశం ఎదుట ఎన్నికలకు ముందే ఉంచాలి. కానీ, వారు ఆ పని చేయలేదు. ఎన్నికలు మార్చి–మే 2024 కాలంలో జరిగాయి. 'ఇండియా' కూటమి ఏర్పాటు ప్రయత్నాలు అంతకు 10 నెలల క్రితం నుంచి మొదలయ్యాయి. తర్వాత 4 నెలలకు, అనగా ఎన్నికలకన్న 6 నెలల ముందు కూటమి ఏర్పడింది. అయినా ఇంత సుదీర్ఘ కాలంలో ఉమ్మడి మేనిఫెస్టో లేకపోయింది. ఎన్నికలు ముగిసి 3 నెలలు గడిచి 4వ నెల నడుస్తున్నది. అయినప్పటికీ అటువంటి డాక్యుమెంట్‌ను రూపొందించక పోవటం సరికదా, ఆ ప్రయత్నాల మాటైనా వినిపించక పోవటం ఆశ్చర్యం.

ఈ మాటలు ఇంతగా చెప్పుకోవటానికి కొన్ని ముఖ్యమైన కారణాలున్నాయి. యథాతథంగా మేనిఫెస్టోలు ఒక పార్టీకి గానీ, కూటమికిగానీ ఎంత అవసరమో చెప్పనక్కర లేదు. పార్టీ కన్నా కూటమికి మరింత అవసరం. ఎందుకంటే, వేర్వేరు ఆలోచనలు, లక్ష్యాలు ఉండే పార్టీలు ఒక కూటమిగా ఏర్పడినప్పుడు, కలిసి ఎట్లా పని చేయగలవనే సందేహాలు ప్రజలకుంటాయి. అది కిచిడీ కూటమిగా మారి పదవుల కోసం కీచులాడుకుంటారు తప్ప ప్రజల కోసం స్థిరంగా పని చేయరనీ, కొద్ది కాలానికే కుప్పగూలుతారనీ ప్రత్యర్థులు ప్రచారం చేసే అవకాశం కూడా ఉంటుంది. లోగడ ఏర్పడిన ఫ్రంట్‌ల విషయంలో అట్లా జరిగింది కూడా! ఈ పరిస్థితుల దృష్ట్యా 'ఇండియా' కూటమికి ఒక ఉమ్మడి మేనిఫెస్టో అన్నది, కనీసం ప్రజలకు చూపేందుకైనా, ముందస్తుగా అవసరం. అధమ పక్షంలో, ఎన్నికలు ముగిసిన ఈ దశలోనైనా రాగల కాలం కోసం. కానీ వారికి ఇది ఆలోచనలో ఉన్నట్లయినా తోచటం లేదు.

ఉమ్మడి మేనిఫెస్టో అవసరాన్ని వారు ఎన్నికలకు ముందు గుర్తించలేదని కాదు. అందుకోసం కొన్ని సంప్రదింపులు జరిగాయి కూడా! కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదరక పోవటంతో ఆ ప్రయత్నాలు విఫలం అయ్యాయి. మేనిఫెస్టో లేకుండానే సీట్లు మాత్రం సర్దుబాటు చేసుకుని పోటీలు చేశారు. ఎవరి అజెండాలు వారు ప్రచారం చేసుకున్నారు. కొన్ని అంశాలపై ఏకీభావం వ్యక్తం కాగా, కొన్నింటిపై పరస్పర విరుద్ధ ప్రచారాలు సాగాయి. కొన్ని ముఖ్యాంశాలపై ఏమీ మాట్లాడక మౌనం వహించారు. ఆ పరిణామాలన్నింటిని గమనించిన వారికి 'ఇండియా' కూటమిలో భౌతికమైన ఐక్యత కాకుండా రసాయనిక ఐక్యత ఏమైనా ఉందా, ఉండగలదా అనే సందేహాలు కలగటం మొదలైంది. మరొకవైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం తన సొంత మేనిఫెస్టోను విడుదల చేసింది. 'న్యాయ్ పత్ర' పేరిట గల అందులో ఎప్పటివలెనే అనేక అంశాలున్నాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ తమ వైఖరి ప్రధానంగా అభివృద్ధి, సమ్మిళితత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ, సంక్షేమం వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని ఉందన్నారు. ఆ పార్టీ ఇవన్నీ షరా మామూలుగా చెప్పేవే. అమలు విషయం వేరే. కానీ మౌలికంగా మేనిఫెస్టో అంటూ ఒకటుందన్నది ప్రధానం.



'ఇండియా' కూటమికి అది లేకపోయింది. కూటమి పార్టీల మధ్య పైన పేర్కొన్నట్లు భిన్నాభిప్రాయాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని చాలా ముఖ్యమైన విషయాలు. పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణ, పౌరసత్వ చట్ట సవరణ, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిషేధ చట్టం (ఉపా) రద్దు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, గవర్నర్ పోస్ట్ రద్దు, రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధించే ఆర్టికల్ 356 రద్దు, జమ్మూ–కశ్మీర్‌కు తిరిగి ప్రత్యేక హోదా వంటివి అందులో ఉన్నాయి. ఇవన్నీ కీలకమైనవి. వీటిపై ఏకాభిప్రాయం దాదాపు అసాధ్యం. 'ఇండియా' కూటమి అనే సంక్షిప్త నామానికి పూర్తి పేరు ఏమిటో తక్కువమందికి తెలిసి ఉంటుంది. అది– ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్. పేరు బాగున్నది. కానీ ఇటువంటి కీలకమైన అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడు ఏదైనా ఎట్లా వీలవుతుందన్నది ప్రశ్న.

కూటమి పార్టీలకు కొంత వెసులుబాటు ఇస్తూ, ఎన్నికలకు ముందు కూటమి ఏర్పాటు ఒత్తిడి వల్ల ఉమ్మడి మేనిఫెస్టోకు తగినంత సమయం లేకపోయిందనుకుందాం. కూటమి ఏర్పడింది కేవలం లోక్‌సభ ఎన్నికలు, వాటితోపాటు జరిగిన కొన్ని అసెంబ్లీ ఎన్నికల కోసం కాదు. అదొక దీర్ఘకాలికమనుకునే వేదిక. ఇప్పటి నుంచి తిరిగి 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు, ఈలోగా పలు అసెంబ్లీ ఎన్నికలు వారి అజెండాలో ఉండాలి. అటువంటప్పుడు, కనీసం మొన్నటి లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాతనైనా ఉమ్మడి మేనిఫెస్టో ప్రయత్నాలు తిరిగి ఎందుకు చేయటం లేదు? కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారాలు, పార్లమెంట్ సమావేశాల హడావిడి ముగిసిన వెనుకనైనా? అసలు ఆ శిబిరం నుంచి ఈ ప్రస్తావన నామమాత్రంగానైనా వినిపించటం లేదు. విచిత్రమేమంటే కూటమిలోని 38 పార్టీలలో ఎవరూ ఆ పని చేయటం లేదు. చివరకు తమది సైద్ధాంతికమైన, దీర్ఘకాలికమైన దృక్పథమని చెప్పే వామపక్షాలు సైతం. కూటమిలోని 38 పార్టీలలో సగం పేర్లు మనం ఎన్నడూ విననివి. కూటమి గెలిచిన మొత్తం స్థానాలు 234 కాగా, వాటిలో ఇవి తెచ్చుకున్నవి ఒకటి కూడా లేదు. ఆ యా రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినపుడు వాటికి కూటమి బలంతో ఒకటీ అరా వస్తాయేమో తెలియదు. ఏమైనా ఐక్యత అన్నది ఐక్యతే గనుక వారంతా అక్కడ ఉండటం మంచిదే. అంతిమంగా లెక్కకు వచ్చేది మాత్రం కూటమిలో ఎన్ని పార్టీలు ఉన్నాయనే దానితో పాటు, లేదా అంతకన్నా ముఖ్యంగా, వాటి మధ్య గల ఐక్యత ఏమిటి? కెమిస్ట్రీ ఏమిటి? ఆ కెమిస్ట్రీని సృష్టించే ఉమ్మడి మేనిఫెస్టో ఏమిటి? అన్నవి.

ఇక్కడ చెప్పుకోవలసింది మరొకటి ఉంది. అటువంటి ఉమ్మడి మేనిఫెస్టో ఒకటి వివరమైనది ఉండి కూడా, 'కామన్ మినిమమ్ ప్రోగ్రాం' పేరిట కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని కూడా, 1989–91 కాలపు 'నేషనల్ ఫ్రంట్' కుప్పగూలింది. వాస్తవానికి వీపీ సింగ్ పార్టీ జనతాదళ్‌తో పాటు, సోషలిస్టు నేపథ్యం గల కొన్ని కుల పార్టీలు, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు కలిసి, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ సిద్ధాంతంతో స్థాపించిన బలమైన ఫ్రంట్ అది. ఆ మేనిఫెస్టో ప్రకారం మంచి పనులు అనేకం చేశారు కూడా! కానీ కేవలం దేవీలాల్, చంద్రశేఖర్‌ల అధికార దాహానికి అది బలైంది. లేనట్లయితే, రథయాత్ర కారణంగా అద్వానీని లాలూ యాదవ్ అరెస్ట్ చేసి వీపీ సింగ్ ప్రభుత్వానికి జనసంఘ్ మద్దతు ఉపసంహరించుకున్నా నేషనల్ ఫ్రంట్ కొనసాగి బలపడేది.

ఇండియా కూటమికి అసలు ఉమ్మడి మేనిఫెస్టో అన్నది లేకపోయింది. అందుకోసం ప్రయత్నాలయినా జరగటం లేదు. ఉమ్మడి మేనిఫెస్టో అవసరమనే ఆలోచన కాంగ్రెస్‌కు సీరియస్‌గా ఉన్నదా లేక, ఎన్నికల ముందు చేసిన ప్రయత్నం ఒక తతంగమా? ఈ అనుమానం ఎందుకంటే, కాంగ్రెస్‌కు కావలసింది ఏకచ్ఛత్రాధిపత్యం తప్ప ఇతరులతో అధికారాన్ని పంచుకోవటం ఇష్టముండదు. కూటమి పేరిట చేయజూసేది తక్కిన పార్టీలను నిచ్చెన మెట్లవలె ఉపయోగించుకోవడం మాత్రమే. ఇది ఊహాగానం కాదు. 2004లో, 2009లో గెలిచినపుడు వారు చేయజూసింది అదేననీ, అందువల్ల సమస్యలు తలెత్తి కొన్ని పార్టీలు దూరమైనాయనీ తెలిసిందే. ఇటువంటి స్వభావం కాంగ్రెస్‌కు ఇప్పటికీ మారలేదు. కనుక ఉమ్మడి మేనిఫెస్టో ఉండక పోవచ్చు కూడా!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆడించే శక్తి



భారత క్రీడా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన విశ్వ విఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్! ఆయన జయంతి (29 ఆగస్టు) సందర్భంగా ఏటా మనం జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకోవటం అన్నది భారత క్రీడా రంగానికే వన్నె తెస్తుంది. క్రీడాకారులందరికీ స్ఫూర్తినిస్తుంది.

– గౌతమ్ గంభీర్, భారత క్రికెట్ జట్టు కోచ్

లక్ష్యాన్ని ఇష్టపడండి



ఐఎన్ఐ–సెట్/నీట్ పీజీ భావి అభ్యర్థులకు సలహా. మీ లక్ష్య సాధన ప్రయాణాన్ని ఆస్వాదించండి. ఎంబీబీఎస్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు మారటానికి సోపానంగా మాత్రమే వీటిని పరిగణించకండి. మనసు పెట్టి ప్రిపేర్ అవండి.

– వైభవ్ గార్గ్, వైద్యుడు

విభిన్న పాత్రలు



ఒకరోజు బైక్ రిపేరింగ్‌వాలా. ఒకరోజు కరాటే టీచర్. ఒకరోజు బస్ ట్రక్కు డ్రైవర్. ఒకరోజు డెలివరీ బాయ్. ఒకరోజు కూలీ. ఒక రోజు టీచర్. ప్రఖ్యాత హాలీవుడ్ తారలను గుర్తు చేస్తున్నారాయన! (రాహుల్ గాంధీ గురించి).

– మిస్టర్ సిన్హా, పొలిటికల్ కామెంటేటర్

పరమహంస సూక్తి



నా ప్రసంగంలో నేను ఉపయోగించిన 'ఫోంష్ కారా' అనే మాట శ్రీరామకృష్ణ పరమహంస ఉల్లేఖనమని స్పష్టం చేస్తున్నాను. నేరాలు జరుగుతున్నప్పుడు స్వరం పెంచాలని ఆయన చెప్పారని నేను అనడాన్ని వైద్య విద్యార్థుల నిరసనలకు వ్యతిరేకంగా నేను మాట్లాడటంగా కొన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలు చిత్రీకరించాయి. నేను బీజేపీని వ్యతిరేకించాను తప్ప, విద్యార్థుల ప్రదర్శనను కాదు.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

ఏమిటీ సంకేతాలు!




'జరిగింది చాలు' అని రాష్ట్రపతి ముర్ము హఠాత్తుగా వ్యాఖ్యానించారు! 'బెంగాల్ తగలబడితే అస్సాం, బిహార్, జార్ఖండ్, ఢిల్లీ కూడా తగలబడతాయి' అని సీఎం మమతా బెనర్జీ హెచ్చరించారు. చూస్తుంటే పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించబోతున్నట్లే ఉంది.

– పంకజ్ యాదవ్, అధ్యాపక అభ్యర్థి

ఇన్ బాక్స్

దేశ ఆర్థికానికి వెన్నెముక

స్థూల దేశీయోత్పత్తిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాటా 27 శాతం. మొత్తం ఎగుమతుల్లో వీటి ఉత్పత్తులు 45 శాతం మేర ఉన్నాయి. వీటి ద్వారా 11.1 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. దేశంలో గతేడాది డిసెంబర్ నాటికి దాదాపు 6.03 కోట్ల పరిశ్రమలుంటే, వాటిలో సూక్ష్మ తరహా పరిశ్రమలే 6.01కోట్లు. 5.5 లక్షల చిన్న తరహా, మరో 50 వేల మధ్యతరహా పరిశ్రమలు కొనసాగుతున్నట్లు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికల్లో వెల్లడవుతోంది. వీటిలో 51.25 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండటం విశేషం. కొవ్వొత్తి, మైనపు ఉత్పత్తి, సుగంధ ద్రవ్యాల తయారీ, పండ్ల రసం వెలికితీత, ప్రాసెసింగ్ మరియు ప్యాకేజింగ్, ధూపం కర్ర, కర్పూరం తయారీ, ఊరగాయ, పాపడ్, బేకరీ, చాక్లెట్లు, సబ్బుల ఉత్పత్తి, చిన్న బొమ్మల తయారీ, చేనేత, హస్తకళలు, పేపర్ ప్యాకేజింగ్ వంటివి చిన్న తరహా పరిశ్రమలలో ఎక్కువగా జరిగే ఉత్పత్తులు.



ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కొత్త సాంకేతికతను వినియోగించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను అందించడం వీటి ప్రధాన లక్ష్యాలు. ఇప్పటికే కేంద్రం వీటి అభివృద్ధికి కొన్ని పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు బ్యాంకులు సైతం సంయుక్తంగా ఉచిత శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి మార్గాలు, సొంత యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నాయి. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధాన మంత్రి ఉపాధి పథకం, సూక్ష్మ ద్రవ్య కార్యక్రమం, పనితీరు–క్రెడిట్ రేటింగ్ పథకం వంటి వాటితో పాటు కేంద్రం పలు సబ్సిడీ, తక్కువ వడ్డీ రేట్లతో రుణాలను అందిస్తోంది. ఆర్థికంగా ఊతం ఇస్తూ మరిన్ని పథకాలతో ప్రోత్సాహం అందిస్తే ఈ పరిశ్రమలతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలి.

– శ్రీ తేజస్

(నేడు జాతీయ చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం)

అనుసంధానమా? అపహరణమా?

అభిప్రాయం



దానీ

గోదావరి – కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఫైళ్ళు ఢిల్లీలో వేగంగా కదులుతున్నాయి. అప్పట్లో కేంద్ర జలవనరుల శాఖా మంత్రిగా వున్న నితిన్ గడ్కరీ 2017లో తొలిసారిగా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. 2019 జనవరిలో స్వయంగా అమరావతి వచ్చి, 60 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో దీన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపడుతున్నట్టు ప్రకటించారు.

నిజంగా ఉన్నాయో లేవో స్పష్టంగా తెలియని గోదావరి అదనపు జలాలే కావేరి అనుసంధానం ప్రాజెక్టు రూపకల్పనకు ఆధారం. ప్రతి ఏటా 1,100 టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రం పాలవుతున్నదని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. చెన్నై సభలో నితిన్ గడ్కరీ ఏకంగా ఏటా 3,000 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలవుతున్నదని వ్యాఖ్యానించారు.

జాతీయ ప్రాజెక్టుల నిర్మాణాల్లో 90 శాతం నిధుల్ని అందించాల్సిన బాధ్యత కేంద్రానిదే కనుక అప్పటి రాష్ట్ర (చంద్రబాబు) ప్రభుత్వం ఆనందించిందేగానీ, దీని వెనుక నున్న వాటర్ హైజాక్ కుట్రను గమనించలేదు. ఈ ప్రాజెక్టు వల్ల తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు మేలు జరుగుతుందనే మాట నిజం. ఇందులో బీజేపీకి రాజకీయ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అప్పట్లో కర్ణాటకలో బీజేపీ అధికారంలో వుంది. దక్షణాదిలో ఆ ఒక్క రాష్ట్రాన్ని అయినా కాపాడుకోకుంటే 'ఉత్తరాది హిందీ పార్టీ' అనే నింద తప్పదు. గోదావరి నీటిని ఎరగా చూపి తమిళనాడులోనూ కాలు మోపాలనే ఆశ బీజేపీలో చాలా కాలంగా ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేయడమే విచిత్రం. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పటికే జల వివాదాలు నడుస్తున్నాయి. కావేరి అనుసంధానం ఈ వివాదాల్ని పరిష్కరిస్తుందా? మరింతగా పెంచుతుందా? అనేది ఎవరికయినా రావలసిన ప్రశ్న.

1980 నాటి బచావత్ ట్రిబ్యునల్ గోదావరి నదిలో 3,565 టీఎంసీల నికర జలాలున్నట్టు తేల్చింది. అప్పట్లో గోదావరి నది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాల మీదుగా ప్రవహించేది. ఇప్పుడు అదనంగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. గోదావరి నది నికర జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటా 1,495 టీఎంసీలు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం – 2014 సెక్షన్ 85లో ఈ నీటిని జనాభా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌కు 64 శాతం, తెలంగాణకు 36 శాతం చొప్పున పంపిణీ చేశారు.

కృష్ణానది పరివాహక ప్రాంతం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ. అయినప్పటికీ, బచావత్ ట్రిబ్యునల్ కృష్ణానది నికర



జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా ఇచ్చింది. దానికి రెండు హేతువులు చెప్పింది. మొదటిది, కృష్ణానది మీద తొలి ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఏర్పడ్డాయి. రెండోది, నిర్మాణం పూర్తయి ఆయకట్టు కలిగున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపును ఇచ్చి తీరాలి. అయితే, దీనికో పరిష్కారం కూడా బచావత్ ట్రిబ్యునల్ సూచించింది. భవిష్యత్తులో గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు నీటిని మళ్ళిస్తే, అందులో 18 శాతం మహారాష్ట్రకు, 27 శాతం కర్ణాటకకు కృష్ణా నికర జలాల నుండి ఇవ్వాలని ఓ నియమం పెట్టింది.

పోలవరం నుండి 80 టీఎంసీల నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్ళిస్తే అందులో 35 టీఎంసీలు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందుతాయి. మిగిలిన 45 టీఎంసీల్లో 36 శాతం అంటే 16 టీఎంసీలు తమకు వస్తాయని తెలంగాణ డిమాండ్ చేస్తున్నది. పోలవరం నుండి మళ్ళించే 80 టీఎంసీల్లో ఆంధ్రప్రదేశ్‌కు నికరంగా దక్కేది 29 టీఎంసీలే. కృష్ణా, గోదావరి నదుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నికర జలాలను జనాభా ప్రాతిపదికన కాకుండా, పరివాహక ప్రాంతం ప్రాతిపదికన పంచాలని తెలంగాణ వాదిస్తోంది.

గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టులో మూడు దశలున్నాయి. మొదటి దశలో ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్ మధ్య గోదావరి–కృష్ణా నదుల్ని అనుసంధానం చేస్తారు. రెండో దశలో నాగార్జునసాగర్, సోమశిల ప్రాజెక్టుల మధ్య కృష్ణా, పెన్నా నదుల్ని అనుసంధానం చేస్తారు. మూడవ దశలో సోమశిల నుండి కట్టలాయ్ మధ్య పెన్నా, కావేరి నదుల్ని అనుసంధానం చేస్తారు. పెన్నా– కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుకు 2022 కేంద్ర బడ్జెట్‌లోనే నిధుల్ని కేటాయించారు.

ఈ నాలుగు నదుల అనుసంధానానికి ముందు, ఆ తరువాత కూడా మరో మూడు నదుల అనుసంధానాలు ఉన్నాయి. ఉత్తరాన మహానదిని గోదావరి నదితో అనుసంధానం చేస్తారు. దక్షిణాన కావేరి నదిని తమిళనాడులోని వాగాయ్, గుండార్ నదులతో అనుసంధానం చేస్తారు. కావేరి–గుండార్ ప్రాజెక్టును కర్ణాటక వ్యతిరేకిస్తున్నది. అయినప్పటికీ, ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని తమిళనాడు ఇప్పటికే మొదలు పెట్టేసింది.

భారీ నీటి పారుదల ప్రాజెక్టుల కన్నా చిన్న తరహా ప్రాజెక్టులే మేలనేది ఇప్పుడు బలపడుతున్న అభిప్రాయం. నీటి పారుదల ప్రాజెక్టుల్ని సమర్థంగా నిర్వహిస్తున్న ఉదాహరణ మనకు ఒక్కటీ కనిపించదు. తుంగభద్రా డ్యామ్ గేటు కొట్టుకొని పోవడం దీనికి తాజా ఉదాహరణ. స్టాప్ లాగ్ గేట్లు, కౌంటర్ వెయిట్ వ్యవస్థ, ఇతర పరికరాలు అదనంగా అందుబాటులో ఉంచుకోవాలనే ఆలోచన కూడ నీటిపారుదల శాఖ అధికారులకు రాలేదు. ఆ గేట్లకు కొన్నేళ్ళుగా కనీసం గ్రీజు కూడా పెట్టలేదట.

నదుల అనుసంధానం వల్ల నాలుగు రకాల నష్టాలు ఉంటాయి. మొదటిది – పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. రెండోది – నదులు, నీటి వనరుల మీద రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండే హక్కులన్నీ కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనికి పోతాయి. మూడోది – జల వనరులపై వాణిజ్య హక్కుల్ని మెగా కార్పొరేట్లకు అప్పగించడానికి దారులు తెరచుకుంటాయి. నాలుగోది – ప్రతి ఏటా నది నీళ్ళు సముద్రం లోనికి పారకపోతే సముద్రం నది వైపునకు దూసుకుని వచ్చి డెల్టా భూముల్ని చవిటి పర్రలుగా మార్చేస్తుంది.

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గోదావరి – కావేరి అనుసంధానం ప్రాజెక్టుకు కొత్త ఊపు వచ్చింది. జూలై నెలలో జరిగిన జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ వర్చువల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కొత్త ప్రతిపాదన చేసింది. గోదావరి– కావేరి అనుసంధానం ప్రాజెక్టును పోలవరం నుండి మొదలెట్టాలని కోరింది. తెలంగాణలోని ఇచ్చంపల్లి, సమ్మక్క–సారక్క ప్రాజెక్టుల కన్నా ఏపీలోని పోలవరం నుండి మొదలెడితే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. నరసారావుపేట సమీపాన బొల్లపల్లె వద్ద 300 టీఎంసీల రిజర్వాయర్‌ను నిర్మిస్తే అక్కడి నుండి పెన్నా నదికి సులువుగా అనుసంధానం చేయవచ్చని సూచించింది.

ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలో కొన్ని కొత్త చిక్కులున్నాయి. ఇందులో కీలకమైనది అసలు గోదావరి నదిలో వెయ్యి టీఎంసీల అదనపు జలాలున్నాయని ఎలా, ఎక్కడ, ఎప్పుడు నిర్ధారిస్తారు? గోదావరి నది మీద చివరి ప్రాజెక్టు ధవళేశ్వరం. అక్కడ తేల్చాలి అదనపు జలాలు ఉన్నాయో లేవో! సాధారణంగా గోదావరి నదిలో ఎక్కువ నీళ్ళు ఆగస్టు నెలలో వస్తాయి. ఆగస్టు నెలలో పోలవరం నుండి కావేరి ప్రాజెక్టుకు వెయ్యి టీఎంసీల నీళ్ల విడుదల చేసేస్తే, ఆ తరువాతి నెలల్లో నదిలోనికి అనుకున్నంత నీరు రాకపోతే ఏమిటీ పరిస్థితీ? గోదావరి డెల్టా ఆయకట్టుకు 175 సంవత్సరాలుగా ఉన్న లోయర్ రైపేరియన్ హక్కులు ఏం కావాలి? అంతేకాదు; ఎగువ రాష్ట్రాల నుండి ఇంకో సమస్య కూడా వస్తుంది. గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు వెయ్యి టీఎంసీల నీటిని మళ్ళిస్తే ఎగువ రాష్ట్రాలు అందులో వాటా కోరకుండా వుంటాయా? కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల్ని సాగునీటి సంక్షోభంలోకి నెట్టే పథకం ఇది.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బ.ద్వాదశి తె.3.26 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి త్రయోదశి, నక్షత్రం: పునర్వసు రా.8.21 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.8.10 నుండి 9.46 వరకు, తదుపరి తె.4.41 నుండి 6.17 వరకు (తెల్లవారితే శనివారం), దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.14 వరకు, అమృతఘడియలు: సా.5.57 నుండి 7.36 వరకు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.15.



ఉద్యోగ ఖాళీలెన్ని?

లెక్కలు తేల్చే పనిలో నియామక సంస్థలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల నేపథ్యం

జాబ్ కేలండర్ ప్రకారం ప్రకటనల జారీకి సమాయత్తం.. గ్రూప్-1, విద్యుత్ సంస్థల్లో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీపై కసరత్తు

ఖాళీలు తేలిస్తే ఆర్థిక శాఖ ఆమోదంతో నోటిఫికేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా విడుదల చేసిన జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగ ప్రకటనలు జారీ చేసేందుకు నియామక సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీతో పాటు విద్యుత్ సంస్థల పరిధిలో ఏఈఈ, ఏఈ, సబ్ ఇంజనీర్ పోస్టులతో పాటు గెజిటెడ్ కేటగిరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఉద్యోగాల భర్తీకి సంబంధిత నియామక సంస్థలు నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ నియామక సంస్థల చైర్మన్లు, కార్యదర్శులు, సభ్యులతో గత వారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఉద్యోగ నియామకాలకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వీలైనంత వేగంగా గ్రూప్-1 ఖాళీలతో పాటు ఇంజనీరింగ్ ఉద్యోగ ఖాళీలు తేల్చి, వివరాలు ఆర్థిక శాఖకు సమర్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ శాఖలు బిజీ బిజీ

సీఎస్ ఆదేశాల నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖలు వాటి పరిధిలోని ఖాళీలు గుర్తించడంతో పాటు, వాటి భర్తీకి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఖాళీల లెక్కలు తేల్చిన తర్వాత ఆర్థిక శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఆర్థిక శాఖ ఆమోదం పొందిన తర్వాత రిజర్వేషన్ల వారీగా పోస్టుల విభజన పూర్తి చేసి, ఆ మేరకు ప్రతిపాదనలను నియామక సంస్థలకు అప్పగించాలి. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రెండోసారి గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. విద్యుత్ సంస్థల్లో కొన్ని ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీ రెండోసారి, కొన్నిటి భర్తీ మూడోసారి జరుగుతున్నట్లు సమాచారం.

కేలండర్ ప్రకారం ప్రకటనలు

తెలంగాణ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), సబ్ ఇంజనీర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ ఏడాది అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కేలండర్‌లో స్పష్టం చేసింది. టీజీజెన్‌కో ఈ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అర్హత పరీక్షను వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించాలి. అదేవిధంగా ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా అక్టోబర్‌లోనే జారీ చేయాలి. ప్రిలిమినరీ పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చేపట్టాలి. జీవో 55లో గుర్తించిన 19 కేటగిరీల్లోని పోస్టులు గ్రూప్-1 పరిధిలోకి వస్తాయి. ఈ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేయాలి. జాబ్ కేలండర్లో నిర్దేశించిన నెలల్లో ఆయా ప్రకటనలు జారీ చేయాలని, ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వ శాఖలను సర్కారు ఆదేశించింది.

మరణించిన ఎద్దుల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



కాడెద్దుల హఠాన్మరణం

రైతు కూలీ కుటుంబం విలవిల

కోటపల్లి: ఉన్నట్టుండి హఠాత్తుగా కాడెద్దులు మృతి చెందడంతో రైతు కూలీ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన ఏతం రాజయ్య వ్యవసాయ, హమాలీ కూలీ పనులు చేస్తుంటాడు. గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం పత్తి చేనుకు వెళ్లాడు. ఎడ్లబండి నుంచి ఎడ్లను విడిపించిన అనంతరం ఒక్కసారిగా రెండు ఎడ్లు చేనులోనే కుప్పకూలాయి. ఏమైందో తెలియక రైతు వాటిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కళ్లముందే ఎడ్లు మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదం నింపింది. ఎడ్ల విలువ రూ.80 వేలు ఉంటుందని, జీవనోపాధికి ఆధారమైన ఎడ్ల మరణంతో ఉపాధి కోల్పోయానని రాజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, విషపూరితమైనవి ఏదైనా తిని ఉండవచ్చని పశువైద్యాధికారి తెలిపారు.

అలజడి రేపే ఆసుపత్రులపై చర్య

డెంగీ అసత్య ప్రచారంపై నిఘా..

మంత్రి దామోదర హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: డెంగీ విషయంలో ప్రజలను ఆందోళనలకు గురిచేసే ఆసుపత్రులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. డెంగీపై జరుగుతున్న అసత్య ప్రచారంపై నిఘా పెట్టాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని జిల్లాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు, డెంగీ కట్టడిపై వైద్య ఆరోగ్యశాఖ అధిపతులు, డీఎంహెచ్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కోరారు. ఇంటింటి జ్వర సర్వేలో బాధితుల రక్త నమూనాలను సేకరించి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు రోజూ సాయంత్రం 6 గంటలకు నివేదిక అందజేయాలని కోరారు. జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా అవయవ మార్పిడిపై చర్చించారు.

అసెంబ్లీ ఓటర్ల జాబితానే ప్రామాణికం

దాని ప్రకారమే వార్డులు, జీపీల వారీ ఓటరు లిస్ట్ తయారు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాను యథావిధిగా పరిగణనలోకి తీసుకొని వార్డులు, గ్రామపంచాయతీల వారీగా ముసాయిదా ఓటరులిస్టు తయారు చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఆదేశించారు. ముసాయిదా జాబితాలను వచ్చేనెల 6న గ్రామ పంచాయతీల్లో ప్రచురించాలని సూచించారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వార్డులు, గ్రామపంచాయతీల వారీగా ఓటరు జాబితాల తయారీ, ప్రచురణ పురోగతిపై గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్థసారథి సమీక్షించారు. జిల్లా కలెక్టర్లు (హైదరాబాద్ మినహా) అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), డీపీవో, డీఎల్పీవోలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ తర్వాత మండల, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై వారి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఈ ముసాయిదా జాబితాలో ఏవైనా పొరపాట్లు జరిగితే వచ్చేనెల 13వ తేదీ వరకు సంబంధిత ఎంపీడీవోలు, డీపీవోలకు రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. సవరించిన తుది ఓటర్ల జాబితాను వచ్చేనెల 21న ప్రచురించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా అర్హులైన ఓటర్లు తమ పేర్లు జీపీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా, ఎవరైనా ఓటరును జీపీ ఓటరు లిస్టులో కొనసాగించడానికి ఆక్షేపణలున్నా, వారు నిర్దేశించిన ఫారాలలో సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా తయారీ తర్వాత, వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బంది శిక్షణ తదితరాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ఎస్ఈసీ తయారు చేసిన గ్రీవెన్స్ మాడ్యూల్‌ను పార్థసారథి ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పీఆర్ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, పీఆర్ ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది చివరికి దేవాదుల పూర్తి




నేడు దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వద్ద సమీక్షించనున్న మంత్రి ఉత్తమ్

హాజరుకానున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, సురేఖ

సాక్షి, హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని తొలి ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకుని డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే ఆశయంలో భాగంగా దేవాదుల ప్రాజెక్టు పనులను వేగిరం చేసింది. ఈ ప్రాజెక్టును చేపట్టిన ప్రభుత్వం.. భూసేకరణతో సహా 91% పనులను పూర్తి చేసింది. మిగతా పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేసి కొత్తగా 89,312ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని నిర్ణయించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై అక్కడే సమీక్షించనున్నారు. సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

గ్రూప్-1లో రిజర్వేషన్లపై వివరణ ఇవ్వండి



జీవో 29పై టీజీఎస్‌పీఎస్సీకి హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ సెప్టెంబర్ 27కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ల అమలు తీరుపై వివరణ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను సెప్టెంబర్ 27కు వాయిదా వేసింది. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో భాగంగా నిర్వహించే మెయిన్స్ పరీక్షలకు అర్హుల ఎంపిక విషయంలో మార్పులు చేయాలని టీజీఎస్పీ ఎస్సీ కార్యదర్శి నుంచి గత ఫిబ్రవరి 2, 6 తేదీల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. గతంలోని జీఓ 55లోని పేరా 'బీ'లో సవరణలు చేయాలని కోరుతూ ఆ ప్రతిపాదనలు పంపగా, వీటికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి జీఓ 29ను ఫిబ్రవరి 8న జారీ చేశారు. ఈ జీవో చట్టవిరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘన కిందకే వస్తుందంటూ సికింద్రాబాద్‌కు చెందిన హనుమాన్‌తోపాటు మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కేటగిరీల వారీగా 1:50 నిష్పత్తిని అమలు చేసేలా సర్కార్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు వాదనలు వినిపించారు.

జీవో 29 చట్టవిరుద్ధం: 'గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపిక జాబితా 1:50 నిష్పత్తిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సరిపోయేలా ఉండాలి. జీవో 55 అదే చెబుతోంది. అయితే దీన్ని సవరిస్తూ తెచ్చిన జీవో 29 ప్రకారం.. తొలుత మెరిట్ జాబితా నుంచి 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, ఆ తర్వాత రిజర్వేషన్ల ప్రకారం లెక్క సరిపోకపోవడంతో మరికొందరిని చేరుస్తూ వెళ్లారు. దీంతో మొత్తంగా ఎంపికైన అభ్యర్థుల సంఖ్య పెరిగింది. 563 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో జనరల్-209, ఈడబ్ల్యూఎస్-49, బీసీ(ఏ)-44, బీసీ(బీ)-37, బీసీ(సీ)-13, బీసీ(డీ)-22, బీసీ(ఈ)-16, ఎస్సీ-93, ఎస్టీ-52, స్పోర్ట్స్‌కోటా-4, పీహెచ్‌సీ-24 చొప్పున పోస్టులు రిజర్వు చేసింది. మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ఎంపికైన అభ్యర్థుల నిష్పత్తి 1:50ని దాటింది. రిజర్వేషన్లు సరిగా పాటించకపోవడంతో ఇది జరిగింది' అని చెప్పారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తీవ్ర అస్వస్థత



ఆసిఫాబాద్ అర్బన్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 3 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆమె ఆసిఫాబాద్ పట్టణంలోని ఇంటివద్దే చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం ఒక్కసారిగా రక్తపోటు, మధుమేహం స్థాయి పెరగడంతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఎమ్మెల్యే ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆమెను మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరామర్శించారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు తొలి ప్రాధాన్యం

ఈ చట్టం అమలుపై ఆర్థిక శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి

అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



సచివాలయంలో గురువారం ఉన్నత అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలో నిధుల కేటాయింపు, గురుకుల పాఠశాలల నిర్మాణాలకు అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ఈ ఉప ప్రణాళిక చట్టం అమలుపై ఆర్థిక శాఖ ప్రత్యేకంగా దృష్టిసారించిందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖలోని ప్రత్యేకాధికారి ఒకరు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ సబ్‌ప్లాన్ అమలు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు- ప్రణాళికల గురించి వివిధ శాఖల ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ఉన్నతాధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలించి కార్యాచరణ నివేదిక ఇవ్వాలని సూచించారు. కార్యాచరణ నివేదిక తర్వాత అన్ని శాఖల అధికారులకు నిధుల కేటాయింపు, ఖర్చుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీల భూముల అభివృద్ధికి ఇందిరా జలప్రభ పథకం అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

ఆదివాసీ రైతులకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు

పోడు సాగు చేసుకునే ఆదివాసీ రైతులకు ఆదాయం వచ్చే విధంగా అడవిని కాపాడుకునే విధంగా ఆయిల్ పామ్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగా 24% నిధులు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఖర్చు పెట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో అవగాహన కార్య క్రమం నిర్వహించిన తర్వాత ప్రతీనెల సబ్ ప్లాన్ చట్టం అమలు, నిధుల వ్యయంపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సాంఘిక సంక్షేమ కమిషనర్ శ్రీదేవి, గిరిజన సంక్షేమ కార్యదర్శి శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగే వరకు 'ఉద్యోగ' ఫలితాలు వద్దు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రక్రియను వేగంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ కోరారు. వర్గీకరణ ప్రక్రియ అమల్లోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షల తుది ఫలితాలు వెల్లడించొద్దని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణను దేశంలో మొట్టమొదటగా తెలంగాణ ప్రభుత్వమే అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని.. ఆ మాటను ఆయన నిలబెట్టుకోవాలన్నారు. గురువారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ మాట్లాడారు. వర్గీకరణ ప్రక్రియను అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలకు సంబంధించి తుది ఫలితాలు జారీ చేస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. వర్గీకరణ అంశంపై సీఎం, మంత్రులను సంప్రదించానని... వారి నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. దళిత, గిరిజనులకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ రాజ్యసభలో మాత్రం రిజర్వేషన్లు లేవని.. రాష్ట్రంలోని శాసనమండలిలోనూ రిజర్వేషన్లు లేవని మంద కృష్ణ గుర్తుచేశారు. దళితులు, గిరిజనుల్లోని సంపన్న వర్గాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని.. దీన్ని అమలు చేయకుండా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీ లేయర్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే కార్యదర్శి విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



'మంకీ పాక్స్' టెస్ట్ కిట్ ఆవిష్కరణ..

సాక్షి, అమరావతి: మంకీ పాక్స్ వ్యాధి నిర్ధారణ కోసం దేశంలోనే మొట్టమొదటి ఆర్టీపీసీఆర్ కిట్‌ను విశాఖ మెడ్‌టెక్ జోన్ అందుబాటులోకి తెచ్చింది. దీనిని ఏపీ సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కిట్‌ను తక్కువ ధరతో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. మెడ్‌టెక్ భాగస్వామి అయిన ట్రాన్సాసియా డయాగ్నోస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్బామ్‌డెక్స్ ఆర్టీపీసీఆర్ కిట్ పేరుతో దీనిని తయారు చేసినట్లు మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్ర శర్మ తెలిపారు.

హైస్పీడ్.. ఆపై నిద్రమత్తు

- ఎన్‌హెచ్-44పై రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం.. ముగ్గురికి తీవ్రగాయాలు
- తిరుమల దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన
- మృతులందరూ హైదరాబాద్‌వాసులే



కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం/మీర్‌పేట/చంచల్‌గూడ: నిద్రమత్తుకు.. అతివేగం తోడు కావడంతో నలుగురు మృత్యువాత పడగా, ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నసాగర్ సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌కు చెందిన ఆవుల అశోక్‌యాదవ్(48), ఆవుల అంబిక దంపతులతోపాటు కొడుకు ఆవుల శ్రేయఅగ్రన్య, కూతురు ఆవుల అక్షిత, అంబిక తల్లిదండ్రులు ఉరుసుల కెంపురావు(65), ఉరుసుల సువర్ణలక్ష్మి, అన్న ఉరుసుల వెంకటరమణారావు (43)తోపాటు ఆయన చిన్ననాటి స్నేహితుడు గోనె వెంకటరమణ(43)తో కలిసి మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. వెంకన్న దర్శనం పూర్తి చేసుకొని హైదరాబాద్‌కు కారులో తిరుగు పయనమయ్యారు. గురు వారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పోల్కంపల్లి స్టేజీ సమీపంలో రోడ్డుపై నిలిపిన డీసీఎంను వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆవుల అశోక్‌యాదవ్, కెంపురావు, గోనె వెంకటరమణ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, వెంకటరమణారావు, అంబిక, సువర్ణలక్ష్మి, శ్రేయ అగ్రన్య, అక్షితలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని భూత్పూర్ పోలీసులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కాసేపటికి వెంకటరమణారావు మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో కారు దాదాపు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో ఉన్నట్టు నిలిచిపోయిన మీటర్ రీడింగ్‌లో కనిపిస్తోంది. అయితే ప్రమాదం జరిగినప్పుడు ఆవుల అశోక్‌యాదవ్ కారు నడుపుతున్నాడు. రెండు బైక్‌లను తప్పించబోయి.. రోడ్డు పక్కనే నిలిపి ఉన్న డీసీఎంకు ఢీకొట్టినట్టు తెలుస్తోంది. జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంబిక, సువర్ణలక్ష్మి, శ్రేయ అగ్రన్యల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై వాహనాన్ని నిలిపినందుకు డీసీఎం డ్రైవర్ రాంనరేశ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇటీవల లండన్ నుంచి..

వెంకటరమణారావు కుటుంబం లండన్‌లో నివాసం ఉంటోంది. ఇటీవలే స్వదేశానికి రాగా, తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో కలిసి తిరుపతి దర్శనానికి వెళ్లాడు. గతంలో కూడా లండన్ నుంచి వచ్చిన ప్రతిసారి తిరుపతికి వెళ్లేవాడు. ప్రస్తుతం అతని భార్య, కూతురు లండన్‌లో ఉన్నట్టు సమాచారం. మృతుల్లో కెంపురావు హెడ్‌కానిస్టేబుల్‌గా రిటైర్డ్ కాగా, గోనె వెంకట రమణ, అశోక్‌యాదవ్‌లు హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నారు. కెంపురావు అతడి కొడుకు వెంకటరమణారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడలోని వెంకటేశ్వరకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆ ఇద్దరూ బాల్య స్నేహితులు

వెంకటరమణారావు, గోనె వెంకటరమణ (టిల్లు) బాల్యం నుంచి మంచి స్నేహితులు. వెంకటరమణారావుది ఉప్పరిగూడ కాగా, కొన్నేళ్ల క్రితం జిల్లెలగూడలోని వెంకటేశ్వర కాలనీకి మారాడు. లండన్ నుంచి వచ్చిన స్నేహితుడితో కలిసి తిరుపతికి వెళ్లాడు. స్నేహితులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అందరినీ కలిచివేసింది.

సమస్యల నడుమ సారథ్య పోరు

వచ్చే నెలలో శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు ● రణిల్, సజిత్, నమల్ మధ్యే పోటీ ● ప్రస్తుతానికి ఎవరికీ కన్పించని మొగ్గు

ద్వీప దేశం శ్రీలంక రెండేళ్ల క్రితం కనీవినీ ఎరగని ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అన్నం ముద్దకు, నీటి చుక్కకూ దిక్కులేని పరిస్థితి దాపురించడంతో జనం కన్నెర్రజేశారు. ప్రభుత్వంపై మూకుమ్మడిగా తిరగబడ్డారు. ఎటు చూసినా మొన్నటి బంగ్లాదేశ్ తరహా దృశ్యాలే కన్పించాయి. దాంతో అధ్యక్షుడు గొటబయ రాజపక్స పదవి వీడి పారిపోయారు. నెలల పాటు సాగిన అనిశ్చితి తర్వాత అన్ని పార్టీల అంగీకారంతో పగ్గాలు చేపట్టిన రణిల్ విక్రమసింఘె పలు సంస్కరణలకు తెర తీశారు. అయినా దేశం ఆర్థిక ఇక్కట్ల నుంచి ఇప్పటికీ బయట పడలేదు. నానా సమస్యల నడుమే సెప్టెంబర్ 21న అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతోంది...

బరిలో 39 మంది

అధ్యక్ష ఎన్నికలకు నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. 39 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. వీరిలో మాజీ ఆర్మీ చీఫ్ శరత్ ఫొన్సెకాతో పాటు ఇద్దరు బౌద్ధ సన్యాసులూ ఉండటం విశేషం! అయితే ప్రధాన పోటీ మాత్రం అధ్యక్షుడు రణిల్, శక్తిమంతమైన రాజపక్స కుటుంబ వారసుడు నమల్, విపక్ష నేత సజిత్ ప్రేమదాస మధ్యే కేంద్రీకృతమైంది. మిగతా వారిలో చాలామంది వీళ్ల డమ్మీలేనని చెబుతున్నారు. ఈ ముగ్గురిలోనూ ప్రస్తుతానికి ఎవరికీ స్పష్టమైన మొగ్గు కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో తొలి దశలో ఫలితం తేలడం అనుమానమేనని భావిస్తున్నారు.

రణిల్ విక్రమ సింఘె



ప్రస్తుత అధ్యక్షుడు. పూర్వాశ్రమంలో పేరుమోసిన లాయర్. రికార్డు స్థాయిలో ఆరుసార్లు ప్రధానిగా చేసిన రాజకీయ దిగ్గజం. ఆయన యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ)కి పార్లమెంటులో ఉన్నది ఒక్క స్థానమే. అయినా అన్ని పార్టీల విజ్ఞప్తి మేరకు 2022 జూలైలో అధ్యక్షుడయ్యారు. దేశాన్ని సంక్షోభం నుంచి కాస్త ఒడ్డున పడేయగలిగారు. కానీ 225 మంది ఎంపీలున్న రాజపక్సల శ్రీలంక పొడుజన పెరమున (ఎస్ఎల్‌పీపీ) మద్దతుకు బదులుగా ఆ పార్టీ నేతల అవినీతికి కొమ్ము కాస్తున్నారంటూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. ఎస్ఎల్‌పీపీ సొంత అభ్యర్థిని బరిలో దింపడం పెద్ద ప్రతికూలాంశం. పైగా రణిల్ పార్టీకి క్షేత్రస్థాయిలో పెద్దగా బలం లేదు. దీనికి తోడు విపక్ష నేత సజిత్ ప్రేమదాస నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. తాజాగా 92 మంది ఎంపీలు మద్దతు ప్రకటించడం 75 ఏళ్ల రణిల్‌కు ఊరటనిచ్చే అంశం.

సజిత్ ప్రేమ దాస



మాజీ అధ్యక్షుడు రణసింఘె ప్రేమదాస కుమారుడు. విపక్ష నేత. 2019లో రణిల్ పార్టీ నుంచి విడిపోయి సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) పేరిట వేరుకుంపటి పెట్టుకున్నారు. వామపక్ష భావజాలమున్న 57 ఏళ్ల సజిత్‌కు యువతలో ఆదరణ నానాటికీ పెరుగుతోంది. అవినీతినే ప్రధానాస్త్రంగా మలచుకున్నారు. దానిపై ఉక్కుపాదం మోపుతానన్న హామీతో జనాన్ని విపరీతంగా ఆకట్టుకుంటున్నారు. జనంపై పన్నుల భారాన్ని తక్షణం తగ్గించాల్సిందేనన్న సజిత్ డిమాండ్‌కు భారీ స్పందన లభిస్తోంది. దీనికితోడు శ్రీలంక ముస్లిం కాంగ్రెస్, డెమొక్రటిక్ పీపుల్స్ ఫ్రంట్ వంటి పార్టీలతో పాటు చిన్న గ్రూపుల మద్దతుతో ఆయన నానాటికీ బలపడుతున్నారు. పలు తమిళ సంఘాల దన్ను సజిత్‌కు మరింతగా కలిసిరానుంది.

నమల్ రాజ పక్స



మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు. 38 ఏళ్ల నమల్ శక్తిమంతమైన రాజపక్స రాజకీయ కుటుంబం నుంచి యువతరం వారసునిగా బరిలో దిగారు. అధ్యక్ష పోరులో తనకే మద్దతివ్వాలన్న రణిల్ విజ్ఞప్తిపై ఎస్ఎల్‌పీపీ రోజుల తరబడి మల్లగుల్లాలు పడింది. చివరికి సొంతగా పోటీ చేయాలన్న నిర్ణయానికి వచ్చి రణిల్ సర్కారుకు మద్దతు ఉపసంహరించింది. అనూహ్యంగా నమల్‌ను బరిలో దించింది. ఆయన చిన్నాన్న గొటబయ రాజపక్సపై రెండేళ్ల క్రితం వెల్లువెత్తిన జనాగ్రహం ఇంకా తాజాగానే ఉంది. ఆ వ్యతిరేకతను అధిగమించం నమల్ ముందున్న అతిపెద్ద సవాలు. దీనికి తోడు ఎస్ఎల్‌పీపీకి 225 మంది ఎంపీలున్నా వారిలో పలువురు క్రమంగా రణిల్ వైపు మొగ్గుతున్నారు. మిగతా వారిలోనూ చాలామంది పార్టీ ఆదేశాలను కూడా లెక్కచేయడం లేదు.

పోలింగ్ సెప్టెంబర్ 21
మొత్తం ఓటర్లు 1.7కోట్ల పై చిలుకు
ఫలితాల వెల్లడి సెప్టెంబర్ 22

అనూర కుమార దిస్స నాయకె



నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) సంకీర్ణం తరఫున బరిలో ఉన్నారు. పార్లమెంటులో కేవలం 3 సీట్లే ఉన్నా సుపరిపాలన హామీతో ఆకట్టుకుంటున్నారు. జనతా విముక్తి పెరమున (జేవీపీ) వంటి పార్టీల దన్ను కలిసొచ్చే అంశం. ఇక అంతర్యుద్ధ సమయంలో హీరోగా నిలిచిన ఫీల్డ్ మార్షల్ ఫొన్సెకా తనకు మద్దతుగా నిలిచే పార్టీల కోసం చూస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఇన్‌ఫ్రారెడ్ డిటెక్టర్...
దోమల సీక్రెట్ వెపన్

దోమ కాటు కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా జనారోగ్యానికి అతి పెద్ద ముప్పుగా పరిణమించిందంటే అతిశయోక్తి కాదు. మలేరియా, టైఫాయిడ్ వంటివాటికి తోడు డెంగీ, జికా, ఎల్లో ఫీవర్ వంటి ప్రాణాంతక జబ్బులకు దోమకాటు కారణంగా మారుతోంది. ఒంటి వాసన తదితరాల ఆధారంగా దోమలు మనపైకి వచ్చిపడతాయన్నది ఇప్పటిదాకా తెలిసిన విషయం. వీటికితోడు మనిషిని ఇట్టే గుర్తించేందుకు మరో సీక్రెట్ వెపన్ కూడా వాటిలో దాగున్నట్టు సైంటిస్టులు తాజాగా కనిపెట్టారు. అదే ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ డిటెక్టర్. దీని సాయంతో దోమలు తమ పరిసరాల్లోని ఉష్ణోగ్రతల్లో తేడాలను తేలిగ్గా పసిడగతాయట. అలా తమకు 2.5 అడుగుల సమీపంలోని 'టార్గెట్ల'ను సునాయాసంగా గుర్తించి వచ్చి వాలతాయట!

యాంటెన్నాలో ప్రత్యేక నిర్మాణాలు

ఉష్ణరక్త జీవుల నుంచి వెలువడే ఇన్‌ఫ్రారెడ్ ధార్మికతను పసిగట్టగల సామర్థ్యం దోమలకు పుష్కలంగా ఉందని అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ సైంటిస్టులు తాజాగా తేల్చారు. దాని సాయంతోనే అవి మనుషులను ఎంచక్కా గుర్తించి కుడుతున్నాయట. ఈడిస్ ఈజిప్టీ వంటి వ్యాధికారక దోమల్లో ఈ సామర్థ్యం మరీ ఎక్కువగా ఉంటుందట. ''దోమల యాంటెన్నాల అగ్ర భాగంలో ప్రత్యేకమైన నిర్మాణాలున్నట్టు మా పరిశోధనలో తేలింది. ఇన్‌ఫ్రారెడ్ ధార్మికతను పసిగట్టడానికి అవి వీలు కల్పిస్తాయి'' అని బృందం సభ్యుడు అవినాశ్ చందేల్ వివరించారు. ఆ నిర్మాణాల్లోని టీఆర్‌పీఏ1గా పిలిచే ప్రత్యేక ప్రొటీన్ ఉష్ణోగ్రతలోని తేడాలకు చురుగ్గా స్పందిస్తుంది. పరారుణ ధార్మికత ద్వారా సమీపంలోని లక్ష్యాలను గుర్తించేందుకు సాయపడుతుంది. ''దీనికి తోడు వాటి యాంటెన్నాలో ఉండే ఓపీ1, ఓపీ2 అనే రోడోప్సిన్ ప్రొటీన్లు ఈ పరారుణ గ్రాహక సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నాయి. వీటి ద్వారా ఎక్కువ దూరంలో ఉన్నవాళ్లను కూడా దోమలు సులువుగా గుర్తించగలుగుతున్నాయి'' అని చందేల్ చెప్పుకొచ్చారు.

కీలక ముందడుగు...

దోమలకు సంబంధించిన ఈ కొత్త ఆవిష్కరణను ప్రజారోగ్య రంగంలో కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రపంచ జనాభాలో కనీసం సగం మంది దోమల వల్ల వ్యాపించే వ్యాధుల బారిన పడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో జనాన్ని వణికిస్తున్న డెంగీ, ఎల్లో ఫీవర్, జికా వంటి వ్యాధులను మరింత సమర్థంగా అరికట్టడంలో తాజా సమాచారం బాగా ఉపయోగపడుతుందని సైంటిస్టులు అంటున్నారు. ''వదులుగా ఉండే దుస్తులు ధరించడం మంచిది. తద్వారా ఒంటినుంచి వెలువడే పరారుణ ధార్మికత చర్మానికి, బట్టలకు మధ్యే చెదిరిపోతుంది. దోమకాటు ముప్పును తగ్గిస్తుంది'' అని చెబుతున్నారు. ఈ పరిశోధన ఫలితాలను జర్నల్ నేచర్‌లో ప్రచురించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



మార్షల్‌ఆర్ట్స్ సెషన్‌లో రాహుల్ గాంధీ పాల్గొన్నప్పటి దృశ్యం

త్వరలో భారత్ డోజో యాత్ర!

భారత్ న్యాయ్‌యాత్ర నాటి మార్షల్ ఆర్ట్స్ వీడియోలను షేర్‌చేసిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: మార్షల్ ఆర్ట్స్‌లో తనకున్న ప్రావీణ్యాన్ని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక వీడియోలో రూపంలో మరోసారి గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలతో మమేకం అయ్యేందుకు రాహుల్ గతంలో చేపట్టిన భారత్ న్యాయ్ యాత్ర సందర్భంగా తాను మార్షల్స్ ఆర్ట్స్ సెషన్స్‌లో పాల్గొన్న వీడియోలను బుధవారం ఆయన 'ఎక్స్'లో షేర్‌చేశారు. యువతలో మార్షల్ ఆర్ట్స్ పట్ల మమకారం మరింత పెంచే ఉద్దేశ్యంతో ఈ వీడియోల సమాహారాన్ని షేర్ చేశారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణనిచ్చే ప్రాంగణం లేదా కేంద్రాన్ని డోజో అంటారు. దీనిని స్ఫురణకు తెచ్చేలా త్వరలో 'భారత్ డోజో యాత్ర' రాబోతోంది అని రాహుల్ 'ఎక్స్'లో ఎనిమిది నిమిషాల నిడివి గల వీడియోను షేర్‌చేశారు. ''ఈ ఏడాది వేల కిలోమీటర్ల పొడవునా భారత్ న్యాయ్ యాత్ర చేసినన్ని రోజులూ ప్రతి సాయంత్రం మా శిబిరాల వద్ద జియూ–జిట్సు (బ్రెజిల్ మార్షల్ ఆర్ట్స్) సెషన్లను నిర్వహించుకున్నాం. ప్రజలతో మమేకమయ్యేటపుడు మరింత చురుగ్గా ఉండేందుకు, శారీరక దారుఢ్యం కోసం తోటి న్యాయ్ యాత్రికులను, యువ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను కలుపుకొని సెషన్స్ నిర్వహించాం. ధ్యానంతోపాటు ఎంతో సరళంగా, అహింసాత్మకమైన జియూ–జిట్సు, అకిడో వంటి మార్షల్ ఆర్ట్స్‌ను యువ మెదళ్లలో పాదుకొల్పే ప్రయత్నం చేశాం. ఘర్షణ వాతావరణాన్ని సౌమ్యంగా మార్చే విలువల్ని వారిలో పెంపొందించాలని భావించాం. దయ, సురక్షితమైన సమాజం కోసం కావాల్సిన 'సాధనాలు' వారికి అందించాలని తలిచాం'' అని రాహుల్ ఆ వీడియోలో చెప్పుకొచ్చారు. అకిడో ఆర్ట్స్‌లో తనకు బ్లాక్‌బెల్ట్, జియూ–జిట్సులో బ్లూ బెల్ట్ సాధించానని రాహుల్ చెప్పడం ఆ వీడియోలో ఉంది. విద్యార్థులకు పలు టెక్నిక్‌లు వివరిస్తూనే రాహుల్ వాటిని ప్రాక్టీస్ చేయడం విశేషం.

రాహుల్‌కు కాంగ్రెస్ ఎన్నికల సాయం రూ. 1.4 కోట్లు

సార్వత్రిక ఎన్నికల్లో రాయ్‌బరేలి, వయనాడ్‌ల నుంచి పోటీచేసిన రాహుల్ గాంధీ ఎన్నికల ఖర్చుల నిమిత్తం నియోజకవర్గానికి రూ. 70 లక్షల చొప్పున మొత్తం రూ.1.4 కోట్లను కాంగ్రెస్ పార్టీ అందించింది. రెండు చోట్లా నెగ్గిన రాహుల్ వయనాడ్ స్థానాన్ని వదులుకున్న విషయం తెలిసిందే. తమ అభ్యర్థులకు అందించిన ఆర్థిక సాయం వివరాలను ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సమర్పించింది. రాహుల్ కంటే ఎక్కువగా పార్టీ నిధులను మండీ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్ అందుకున్నారు.

మోదీకి పాక్ ఆహ్వానం



ఇస్లామాబాద్: పాకిస్తాన్ అధ్యక్షతన ఇస్లామాబాద్‌లో అక్టోబర్‌లో జరగబోయే షాంఘై సహకార సంఘం సభ్యదేశాల కీలక సమావేశంలో పాల్గొనేందుకు రావాల్సిందిగా భారత ప్రధాని మోదీకి పాకిస్తాన్ ఆహ్వానం పంపింది. అక్టోబర్ 15, 16 తేదీల్లో జరగబోయే సమావేశానికి విచ్చేసే అగ్రనేతలందరికీ ఆహ్వానాలు పంపామని పాక్ విదేశాంగ శాఖ మహిళా అధికార ప్రతినిధి ముంతాజ్ జారా బలూచ్ గురువారం చెప్పారు. '' భారత ప్రధానికీ ఆహ్వానం వెళ్లింది. కొందరు నేతలు తమ రాకను ఇప్పటికే ధృవీకరించారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తా' అని ఆమె అన్నారు. కశ్మీర్ సమస్య సహా సీమాంతర ఉగ్రవాదం, తరచూ సరిహద్దుల వెంట ఉగ్ర చొరబాట్లు, పాక్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలతో దయాదిదేశాలు ఉద్రిక్త పరిస్థితులను చవిచూస్తున్న విషయం తెల్సిందే. షాంఘై సహకార సంఘం సభ్యదేశాల ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక, మానవతా అంశాల్లో పరస్పర సహకారంపై ఈసారి సమావేశంలో చర్చించనున్నారు.

జూనియర్ డాక్టర్లను బెదిరించలేదు: మమత



కోల్‌కతా: వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ 21 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వాసుపత్రుల జూనియర్ డాక్టర్లను తాను బెదిరించలేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. జూనియర్ డాక్టర్లను తాను బెదిరించాననే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, కీడు తలపెట్టే ఉద్దేశంతో చేస్తున్న దుష్ప్రచారమని గురువారం మమత 'ఎక్స్'లో వివరణ ఇచ్చారు. 'విద్యార్థులకు, వారి ఉద్యమాలకు వ్యతిరేకంగా నేను ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. విద్యార్థి ఉద్యమాన్ని నేను సమర్థిస్తున్నాను. వారి ఉద్యమం ధర్మమైనది. కొందరు ఆరోపిస్తున్నట్లుగా.. నేనెప్పుడూ వారిని బెదిరించలేదు. అవి పూర్తిగా నిరాధార ఆరోపణలు' అని బెంగాల్ సీఎం పోస్ట్ చేశారు.

బళ్లారి జైలుకు దర్శన్ తరలింపు



బెంగళూరు: రేణుకా స్వామి అనే వ్యక్తి హత్య కేసులో పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను గురువారం అధికారులు బళ్లారి జైలుకు తరలించారు. రౌడీ షీటర్ సహా ముగ్గురు ఖైదీలతో దర్శన్ సెంట్రల్ జైలులో ఆవరణలో కుర్చీల్లో కూర్చుని టీ కప్పుతో, సిగరెట్ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా ఒక ఫొటో, సెల్ ఫోన్‌లో వీడియో కాల్‌లో మాట్లాడుతున్నట్లుగా ఒక వీడియో బయటకు రావడం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు దర్శన్‌ను బళ్లారి జైలుకు, సహ నిందితులను వేర్వేరు జైళ్లకు తరలించారు.

సీఎం, కేబినెట్ మంత్రులకు జీతాల్లేవ్!

ఆర్థిక ఇబ్బందుల్లో హిమాచల్



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. తనతోపాటు మంత్రివర్గ సహచరులు రానున్న రెండు నెలల పాటు వేతనాలు, ఇతర అలవెన్సులు అందుకోబోరని సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు తెలిపారు. చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీ(సీపీఎస్)లు, వివిధ బోర్డులు, కార్పొరేషన్ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు కూడా ఇదే వర్తిస్తుందని వివరించారు. ఈ విషయాన్ని సీఎం గురువారం అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. పరిస్థితిని అర్థం చేసుకుని, ప్రభుత్వానికి సహకరించాలని శాసనసభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అనుత్పాదక వ్యయాన్ని తగ్గించుకుని, రాబడి పెంచేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అయితే, ఈ చర్యలు సత్ఫలితాలనిచ్చేందుకు కొంత సమయం పడుతుందని ఆయన అన్నారు.

స్త్రీ ధనంపై మహిళకే హక్కు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తప్పు చేసిన వారికి తగు శిక్ష పడేలా చేయడానికే నేర విచారణ జరుగుతుందని, అంతే తప్ప ప్రతీకారం తీర్చుకోవడానికి కాదని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. తన కూతురికి వివాహ సమయంలో ఇచ్చిన స్త్రీ ధనాన్ని ఆమె మాజీ అత్తమామలు తిరిగి ఇవ్వడం లేదంటూ తెలంగాణకు చెందిన పడాల వీరభద్రరావు సుప్రీంకోర్టులో నమ్మకద్రోహం కేసు వేశారు. పెళ్లి సమయంలో తల్లిదండ్రులు, బంధువులు కానుకల రూపంలో ఇచ్చే నగదు, ఆస్తులను స్త్రీ ధనంగా పరిగణిస్తారు. స్త్రీ ధనంపై భార్య లేదా మాజీ భార్యకు మాత్రమే పూర్తి హక్కు ఉంటుందని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సంజయ్ కరోల్ పేర్కొన్నారు. ఇదివరకే న్యాయస్థానాలు దీన్ని స్పష్టం చేశాయన్నారు. వ్యక్తిగత కక్షలు మనసులో పెట్టుకొని.. ప్రతీకారం తీర్చుకోవడానికి న్యాయ విచారణ ప్రక్రియను ఉపయోగించుకోకూడదని వీరభద్ర రావుకు ధర్మాసనం సూచించింది. 1999లో తన కూతురికి పెళ్లి సమయంలో బంగారు నగలు, ఇతర కానుకలు ఇచ్చానని, తర్వాత దంపతులు అమెరికాకు వెళ్లారని రావు కోర్టుకు తెలిపారు. 2016లో అమెరికాలో విడాకులు తీసుకున్నారని, తన కూతురికి ఇచ్చిన నగలు ఆమె మాజీ అత్తమామల దగ్గరే ఉన్నాయని వాదించారు. అయితే స్త్రీ ధనంపై భర్తకు గాని, తండ్రికి గాని ఎలాంటి హక్కులు ఉండవని, స్త్రీ ధనాన్ని తిరిగి రాబట్టుకోవడానికి కేసు పెడితే ఆమె పెట్టాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అసోంలో ముస్లిం మ్యారేజెస్ యాక్ట్ రద్దు

ఇకపై ముస్లిం పెళ్లిళ్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

న్యూఢిల్లీ: ముస్లింల పెళ్లిళ్లు, విడాకులకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ అసోం అసెంబ్లీ గురువారం బిల్లును ఆమోదించింది. ముస్లిం పెళ్లి, విడాకుల చట్టం–1935 స్థానంలో కంపల్సరీ రిజిస్ట్రేషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజెస్ అండ్ డైవోర్సెస్ బిల్లు–2024ను తీసుకువచ్చింది. బాల్య వివాహాలకు, బహుభార్యత్వానికి అడ్డుకట్ట వేయడానికి హిమంత బిశ్వ శర్మ సర్కారు ఈ కొత్త బిల్లును తెచ్చింది. గతంలో ఖాజీలు చేసిన పెళ్లిళ్లు చెల్లుబాటు అవుతాయని, ఇకపై జరిగే వాటికి మాత్రమే రిజిస్ట్రేషన్ తప్పనిసరని సీఎం హిమంత వివరణ ఇచ్చారు. కొత్త చట్టంలో ముస్లిం అమ్మాయిల కనీస వివాహ వయసును 18 ఏళ్లుగా పేర్కొన్నారు. వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అలాగే పెళ్లి సమయంలో తమ వైవాహిక స్థితిని ప్రకటించాలి. అవివాహితులా, విడాకులు తీసుకున్నారా లేక వైధవ్యం సంప్రాప్తించిందా? అనే వివరాలను వెల్లడించాలి. ఇరువురి అంగీకారంతోనే వివాహం జరగాలి. ఏ ఒక్కరి సమ్మతి లేకుండా వివాహం జరిగినా అది చెల్లదు. వివాహిత మహిళల, భర్తలను కోల్పోయిన వారి హక్కులను ఈ బిల్లు కాపాడుతుందని అసోం ప్రభుత్వం చెబుతోంది.



విశాఖ నావల్ డాక్ యార్డులో విడుదలకు సిద్ధంగా అరిఘాత్

భారత్ అమ్ముల పొదిలో 'అరిఘాత్'

రెండో అణు జలాంతర్గామిని నేవీలో ప్రవేశపెట్టిన రాజ్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: భారత్ అమ్ముల పొదిలో మరో అణు జలాంతర్గామి 'అరిఘాత్'చేరింది. అరిహంత్ క్లాస్‌లో రెండోదైన ఈ అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను విశాఖ నేవల్ డాక్‌యార్డులో గురువారం జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేవీలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన త్రివిధ దళాలు అణుశక్తిని సముపార్జించుకుని మరింత బలోపేతమయ్యాయని తెలిపారు. అణుత్రయాన్ని బలోపేతం చేసుకుంటూ వ్యూహాత్మక సమతుల్యత, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో భారత్ కీలకంగా మారుతోందన్నారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని, సైనికులకు అత్యాధునిక, నాణ్యమైన ఆయుధాలు, మౌలిక సదుపాయాలు, ఇతర పరికరాల్ని సమకూర్చేందుకు మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని చెప్పారు. దేశాన్ని అగ్ర రాజ్యాలతో సమానంగా నిలబెట్టిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయ సంకల్పాన్ని దేశం ఎప్పటికీ మరవదన్నారు. నేటి భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రక్షణ సహా ప్రతి రంగంలోనూ వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.

అరిఘాత్ ప్రత్యేకతలు

పొడవు: 111.6 మీటర్లు
వెడల్పు: 11 మీటర్లు
డ్రాఫ్ట్: 9.5 మీటర్లు
బరువు: 6,000 టన్నులు
సామర్థ్యం: ఉపరితలంలో గంటకు 22–24 కి.మీ. (12–15 నాటికల్ మైళ్లు).. సాగర గర్భంలో గంటకు 24 నాటికల్ మైళ్లు
నిర్మాణం: విశాఖలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్
సెన్సార్ సిస్టమ్, ఇతర ప్రత్యేకతలు: సోనార్ కమ్యూనికేషన్ వ్యవస్థ, టార్పెడోలు, సబ్ మెరైన్ లాంచ్డ్ బాలిస్టిక్ మిస్సైల్స్, పంచేంద్రియ యూనిఫైడ్ సోనార్ సబ్‌మెరైన్, సముద్ర జలాల్లోనూ కమ్యూనికేషన్ వ్యవస్థ, కంట్రోల్ సిస్టమ్.
మిస్సైల్ రేంజ్ : 750 కిలోమీటర్లు

ఏం జరిగిందో చెప్పండి!

వెలుగులోకి 'కోల్‌కతా' వైద్యురాలి తల్లిదండ్రుల ఫోన్‌కాల్ డేటా

కోల్‌కతా: కన్నబిడ్డను కోల్పోయిన విషయం తెలిస్తే పుట్టెడు దుఃఖంలో మునిగిపోయే తల్లిదండ్రులను ఓదార్చుతూ ధైర్యం చెప్పాల్సిందిపోయి వారిని గందరగోళపరుస్తూ అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి యాజమాన్యం వైఖరి తాజాగా బహిర్గతమైంది. కోల్‌కతా జూనియర్ వైద్యురాలి హత్యోదంతం మర్నాడు ఉదయం ఆస్పత్రి యాజమాన్యం ఆమె కుటుంబానికి చేసిన ఫోన్‌కాల్స్ డేటా తాజాగా మీడియాకు వెల్లడైంది. దీంతో సున్నితమైన అంశం పట్ల ఆస్పత్రి యాజమాన్యం ఎంత నిర్దయగా వ్యవహరించిందో అందరికీ అర్థమైంది. ఆగస్టు 9న ఉదయం 10 గంటలకు ఆస్పత్రి మహిళా అసిస్టెంట్ సూపరింటెండెంట్ చేసిన మూడు ఫోన్‌కాల్స్ వివరాలు ఇవీ..

మొదటి ఫోన్‌కాల్ ఉదయం 10.53 నిమిషాలకు..

వైద్యురాలి తండ్రి: అసలేం జరిగింది?
అవతలి వ్యక్తి: ఆమె ఆరోగ్య పరిస్థితి ఏం బాలేదు. ఆస్పత్రిలో చేర్పించాం. త్వరగా వచ్చేయండి
వైద్యురాలి తండ్రి: దయచేసి చెప్పండి. అక్కడేం జరిగింది?
అవతలి వ్యక్తి: ఆ వివరాలన్నీ డాక్టర్ చెప్తారు. మీ నంబర్ దొరికితే ఫోన్ చేశాం. ముందు మీరు బయల్దేరండి
వైద్యురాలి తండ్రి: అసలు మీరెవరు?
అవతలి వ్యక్తి: నేను అసిస్టెంట్ సూపరింటెండెంట్‌ను. డాక్టర్‌ను కాదు.
వైద్యురాలి తండ్రి: అక్కడ వైద్యులే లేరా?
అవతలి వ్యక్తి: మేమే నీ బిడ్డను ఎమర్జెన్సీ వార్డుకు తీసుకొచ్చాం. వచ్చి మమ్మల్ని కలవండి
వైద్యురాలి తల్లి: ఆమెకు ఏమైంది?. డ్యూటీలో లేదా? జ్వరం వచ్చిందా?
వైద్యురాలి తండ్రి: ఆమెకు సీరియస్‌గా ఉందా?
అవతలి వ్యక్తి: అవును. మీరు వీలైనంత త్వరగా వచ్చేయండి

ఐదు నిమిషాల తర్వాత రెండో ఫోన్‌కాల్..

అవతలి వ్యక్తి: ఆర్‌జీ కర్ ఆస్పత్రి నుంచి మాట్లాడుతున్నా
వైద్యురాలి తల్లి: చెప్పండి
అవతలి వ్యక్తి: బయల్దేరారా లేదా?
వైద్యురాలి తల్లి: బయల్దేరాం. ఇప్పుడు ఆమె ఎలా ఉంది?
అవతలి వ్యక్తి: ముందయితే రండి. వచ్చాక మాట్లాడుకుందాం. ఆస్పత్రిలో ఛాతీ విభాగాధిపతి ఆఫీస్‌కే నేరుగా రండి
వైద్యురాలి తల్లి: సరేనండి



మూడో ఫోన్‌కాల్...

వైద్యురాలి తండ్రి: హలో చెప్పండి
అవతలి వ్యక్తి: నేను అసిస్టెంట్ సూపరింటెండెంట్‌ను. చెప్పేది జాగ్రత్తగా వినండి. మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నట్టుంది. చనిపోయిందని అనుకుంటున్నాం. పోలీసులు కూడా వచ్చేశారు. ఆస్పత్రి వాళ్లం కూడా ఇక్కడే ఉన్నాం. త్వరగా రండి అని చెప్పడానికే మీకు ఫోన్ చేశాం
వైద్యురాలి తండ్రి: నేరుగా అక్కడికే వస్తున్నాం
వైద్యురాలి తల్లి: నా కూతురు నాకిక లేదు (బోరున విలపిస్తూ)

పార్లమెంటరీ కమిటీలో కులగణనపై చర్చకు పట్టు

విపక్షాలతో గొంతు కలిపిన బీజేపీ మిత్రపక్షం జేడీయూ

న్యూఢిల్లీ: ఇతర వెనుకబడిన కులాల సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీలో కులగణనపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. ఈ అంశంపై జరగాల్సిందేనని బీజేపీ మిత్రపక్షం జేడీ(యూ) సైతం డిమాండ్ చేసింది. గురువారం కమిటీ తొలి భేటీలో టీఆర్ బాలు (డీఎంకే) ఈ అంశాన్ని లేవనెత్తగా విపక్ష సభ్యులు మద్దతు పలికారు. వీరితో జేడీయూ గొంతు కలిపింది. కులగణనను తొలుత చర్చించాల్సిన అంశాల జాబితాలో చేర్చాలని మాణిక్కం ఠాకూర్ (కాంగ్రెస్) పట్టుబట్టారు. కళ్యాణ్ బెనర్జీ (తృణమూల్), గిర్‌ధారీ యాదవ్ (జేడీయూ) మద్దతిచ్చారు. కులగణన కోసం కేంద్ర హోం శాఖకు కమిటీ సిఫార్సు లేఖ రాయాలని బెనర్జీ పట్టుబట్టారు. కాంట్రాక్ట్, తాత్కాలిక, పరిమితకాల నియామకాల్లోనూ రిజర్వేషన్లను వర్తింపజేస్తే బాగుంటుందని ఒక బీజేపీ సభ్యుడు కూడా వ్యాఖ్యానించారు.



ఆధ్యాత్మిక సిరి.. స్వర్ణగిరి
టెంపుల్ టూరిజానికి ఆదరణ పెరుగుతోంది. భువనగిరి పట్టణ శివారులో నిర్మించిన స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. - సిటీ ప్లస్‌లో




సనాతనమే.. సమాధానం..
నిద్రలేమి నుంచి నిలకడ లేమి దాకా ఆధునిక సమస్యలన్నింటికీ సనాతనం సమాధానం చెప్పింది అంటున్నారు ఇండియన్ వేదిక్ స్కూల్ ఫౌండేషన్ డైరెక్టర్ విక్రమ్. - సిటీ ప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/24.0
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

15 కత్తిపోట్లు

బ్యూటీషియన్ దారుణ హత్య

- ప్రేమోన్మాది ఘాతుకం
- అడ్డొచ్చిన మరో ముగ్గురిపైనా దాడి
- విద్యుత్ తీగలు పట్టుకుని నిందితుడి ఆత్మహత్యాయత్నం





గచ్చిబౌలి పరిధిలో గురువారం విషాదం చోటుచేసుకుంది. మరో వ్యక్తితో చనువుగా ఉంటోందనే అక్కసుతో ఓ యువకుడు బ్యూటీషియన్‌ను దారుణంగా హత్య చేశాడు. అడ్డుగా వచ్చిన మరో ముగ్గురు బ్యూటీషియన్లపైనా దాడికి తెగబడ్డాడు. అనంతరం నిందితుడు విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు.



- వివరాలు 8లో

మహా 'భాగ్య'ం మనదే

టాప్ రిచ్ సిటీస్‌లో హైదరాబాద్‌కు మూడోస్థానం

- సిలికాన్ సిటీ బెంగళూర్‌పై నగరానిదే పైచేయి
- వెల్లడించిన హురున్ ఇండియా రిచ్ లిస్ట్

సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరంగా మారుతున్న భాగ్యనగరం తన పేరును సార్థకం చేసుకుంటోంది. దేశంలో పెద్ద సంఖ్యలో బిలియనీర్లు కలిగిన నగరాల జాబితాలో తొలిసారిగా 3వ స్థానాన్ని దక్కించుకుంది. అంతేకాదు.. శరవేగంగా అత్యధిక సంపద కలిగిన సంపన్నులను సిటీ పెంచుకుంటున్నట్టు 'హురున్' నివేదిక తేల్చింది. దేశవ్యాప్తంగా సంపన్నుల స్థితిగతులపై హురున్ ఇండియా తాజాగా గురువారం ఓ జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారం గత ఏడాది నగరంలో పెద్ద సంఖ్యలో కొత్త బిలియనీర్లు అవతరించారు.

సెంచరీ దాటేసింది...
నగరంలో ప్రస్తుతం మొత్తం 104 మంది అత్యధిక సంపాదన కలిగిన సంపన్నులు ఉన్నారు. ఒక్క ఏడాదిలో ఏకంగా 17 మంది బిలియనీర్లుగా అవతరించి సిటీ సెంచరీ కొట్టడంతో పాటు గత ఏడాది వరకూ 3వ స్థానంలో ఉన్న బెంగళూర్‌ను వెనక్కి నెట్టేసింది. టాప్ 10 జాబితాలో ముంబై (386), ఢిల్లీ (217) తర్వాత హైదరాబాద్ (104) నిలిచింది. శరవేగంగా బిలియనీర్లు పెరుగుతున్న నగరంగా హైదరాబాద్ (17) దాదాపు ఢిల్లీ (18) స్థాయిలో నిలవడం విశేషం.

తొలిస్థానంలో దివీస్...
నగరంలోని బిలియనీర్ల జాబితాలో రూ.76,100 కోట్ల సంపదతో మురళీ దివీస్ అండ్ ఫ్యామిలీ ముందుంది. అదే విధంగా రూ. 54,800 కోట్లతో పిచ్చిరెడ్డి, రూ. 52,700 కోట్లతో పీవీ కృష్ణారెడ్డి, రూ. 29,900 కోట్లతో బి.పార్థసారథి రెడ్డి ఫ్యామిలీలు ఉన్నాయి.

హైడ్రాతో బెంబేలు

ముందుకు వెళ్లేదెలా?

అధికారుల్లో అంతర్మథనం

హెచ్‌ఎండీఏలో నత్తనడకన ఫైళ్లు

ప్రస్తుత పరిస్థితుల్లో మరింత ఎఫెక్ట్

hmda
Growing Global

సాక్షి, సిటీబ్యూరో:
హైడ్రా ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు వివిధ విభాగాల్లోని అధికారులను హడలెత్తిస్తున్నాయి. చెరువులు, కుంటలున్నచోట ఇప్పటికే అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులను బెంబేలెత్తిస్తుండగా.. కొత్త అనుమతులపై మాత్రం అధికారులు అంతర్మథనానికి గురవుతున్నారు. ఎలా ముందుకువెళ్లాలో తేల్చుకోలేకపోతున్నారు. హెచ్‌ఎండీఏలో నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులకు హైడ్రా ఇప్పుడు మరిన్ని బ్రేకులు వేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో లేకపోయినప్పటికీ ఏ కొద్దిగా సందేహం ఉన్నా ఇరిగేషన్, రెవిన్యూ విభాగాలు ఎన్‌ఓసీలు ఇస్తేనే తాము అనుమతులను ఇవ్వనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో వందల కొద్దీ ఫైళ్లు పెండింగ్ జాబితాలో చేరుతున్నట్లు సమాచారం. మరోవైపు చాలామంది దరఖాస్తుదారులు సకాలంలో ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) లభించకపోవడంతో భారీ ప్రాజెక్టులను సైతం వాయిదా వేసుకోవాల్సివస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొంది. హైడ్రా ఏర్పాటుతో ఈ రంగం మరింత కుదేలైంది. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు కూడా బిల్డర్లు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆచితూచి అనుమతి..
ఇబ్రహీంపట్నం తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన ఓ బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం 8 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. సదరు లేఅవుట్ బఫర్‌జోన్‌లో ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ హెచ్‌ఎండీఏ అధికారులు ఎన్‌ఓసీ కోసం షార్ట్‌ఫాల్ ఇచ్చారు. దీంతో ఆ బిల్డర్ ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నాడు.. కానీ తాజా పరిణామాల దృష్ట్యా రెవిన్యూ అధికారులు మాత్రం ఎన్‌ఓసీ ఇచ్చేందుకు వెనకడుగు వేశారు. దీంతో రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన ఈ ప్రాజెక్టుపై ముందుకు వెళ్లలేక, వెనకడుగు వేయలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చాలామంది బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి ఇలాగే ఉంది. పటాన్‌చెరు, ఇస్నాపూర్, శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్కేసర్, మేడ్చల్ తదితర ప్రాంతాలకు చెందిన దరఖాస్తుదారులు సకాలంలో తమ ఫైళ్లకు మోక్షం లభించక హెచ్‌ఎండీఏ వద్ద పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం ప్రతి ఫైల్ పైన ఆచితూచి ముందడుగు వేస్తున్నారు. ఒకటికి నాలుగుసార్లు పరిశీలించిన తర్వాత మాత్రమే అనుమతులను ఇచ్చేందుకు సాహసిస్తున్నారు. ఏ కొంచెం సందేహం ఉన్నా పక్కన పెట్టేస్తున్నారు. 'నిజానికి బఫర్ జోన్‌లో లేదని తెలిసినా ముందుకెళ్లలేకపోతున్నాం. దీంతో ప్రతిదానికి ఇరిగేషన్ అనుమతిని అడగాల్సివస్తోంది' అని ఒక అధికారి అభిప్రాయపడ్డారు. మరోవైపు కొంతకాలం ఇలాంటి ఫైళ్ల జోలికి వెళ్లకపోవడమే మంచిదని మరి కొందరు అభిప్రాయపడ్డారు.

మాస్టర్‌ప్లాన్ ప్రామాణికం...
ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్‌పోలేన్ ప్రకారమే అనుమతులను ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఆ మాస్టర్‌ప్లాన్‌లో నిర్ధారించినవే ఇప్పుడు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో కనిపించడం గమనార్హం. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలోనే లోపాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. వివిధ రకాల ఒత్తిళ్ల కారణంగా మాస్టర్‌ప్లాన్‌లో అనేక రకాల మార్పులు, చేర్పులు జరిగాయి. చెరువులు, కుంటలు, వ్యవసాయ భూములు,, రహదారులు వంటి వాటిని గుర్తించడంలో లోపాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ మాస్టర్‌ప్లాన్‌నే ప్రామాణికంగా భావించి అనుమతులు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు కానీ.. హైడ్రా రాకతో ఆ లోపాలు బట్టబయలు కావడం గమనార్హం.



చందానగర్ గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన భవనాలు

గంగారం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలకు నోటీసులు

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమంగా నిర్మించిన భవనాలకు శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీఓ, శేరిలింగంపల్లి తహసీల్దార్ ఆదేశాల మేరకు నాలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన భవనాలకు నోటీసులు అందించామన్నారు. సుమారు 65 భవనాలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి పేదలకు నోటీసులు

మోతీనగర్: మోతీనగర్ డివిజన్ పద్మావతి నగర్ సమీపంలోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇళ్ల యజమానులకు అధికారులు కొన్ని రోజులుగా నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎప్పటి నుంచో నివసిస్తున్నామని ఇప్పుడు అధికారులు నోటీసులు ఇచ్చి కూల్చి వేస్తామంటే తాము ఎక్కడికి పోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు పైసా పైసా కూడపెట్టి ఇక్కడ స్థలాలు కొని రేకుల ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గం మధ్యలో కలిసి మొత్తం సున్నం చెరువు 10 ఎకరాలు మాత్రమే మిగిలిందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. చెరువులో వెలసిన నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్న హైడ్రా.. సామాన్యులకో న్యాయం.. సంపన్నులకో న్యాయమా అని పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నిమజ్జనం.. ఏర్పాట్లు ముమ్మరం

తక్కువ ఎత్తు విగ్రహాలకు తాత్కాలిక కొలనులు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన కొలనుల కోసం జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. వచ్చే నెల 7 నుంచి 17 వరకు గణేశ్ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో నిమజ్జనాల కోసం చెరువులు, కొలనులు, బేబీ పాండ్స్ సిద్ధం చేయనుంది. తక్కువ ఎత్తున్న విగ్రహాలను ప్రజలు తమ సమీప ప్రాంతాల్లోనే నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. పెద్ద విగ్రహాల నిమజ్జనాలకు పెద్ద చెరువుల్ని వినియోగించుకోనుండగా, మూడు నాలుగడుగుల లోపునే తక్కువ ఎత్తున్న విగ్రహాల నిమజ్జనాల కోసం గతంలో మాదిరిగానే తాత్కాలిక కొలనుల్ని ఏర్పాటు చేయనుంది. జీహెచ్‌ఎంసీ నిర్మించిన ప్రత్యేక కొలనులతో (బేబీ పాండ్స్) పాటు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పోర్టబుల్ కొలనులు, నేలను తవ్వి తాత్కాలికంగా నిర్మించే కొలనుల్ని తక్కువ ఎత్తు విగ్రహాల నిమజ్జనాల కోసం వినియోగించనున్నారు. నిర్వహణలేక వ్యర్థాలతో నిండిపోయిన పెద్ద చెరువులు, బేబీ పాండ్స్‌ను శుభ్రం చేయడంతో పాటు తాత్కాలిక కొలనుల పనులు త్వరలో చేపట్టనున్నారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. పోర్టబుల్, తాత్కాలిక, బేబీపాండ్స్ వెరసి దాదాపు 75 ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. తాత్కాలికంగా తవ్వే చెరువుల కోసం ఒక్కో దానికి దాదాపు రూ. 5 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. వీటితోపాటు నిమజ్జనాలు చేసేందుకు అవసరమైన క్రేన్లను అద్దెలకు తీసుకునేందుకు కూడా టెండర్లు పిలుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం, అంబర్‌పేట, బండచెరువు వంటి ప్రాంతాల్లో ఒక్కో చోట క్రేన్ల కోసం దాదాపు రూ. 35 లక్షల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా.

డెంగీ బాధిత ప్రాంతాలను తనిఖీ చేయాలి: దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, జిల్లా కలెక్టర్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఎంటమాలజిస్టులు, ఏఎంఓహెచ్‌లు, తహసీల్దార్లు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన దిశానిర్దేశం చేశారు. డెంగీ పాజిటివ్ కేసులున్న ప్రాంతాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, ప్రతిరోజు బస్తీ దవాఖానాలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్లు సంబంధిత అధికారులతో నిత్యం సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను సందర్శించి డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫాగింగ్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో షిఫ్ట్ విధానానికి స్వస్తి పలకాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో షిఫ్ట్ విధానానికి స్వస్తి పలకాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డీఈవోలు, డిప్యూటీ ఐఓఎస్, డీఈలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలన్నారు. పనితీరు సరిగా లేని డిప్యూటీ ఐఓఎస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. లక్ష్మణ్ సింగ్ (బండ్లగూడ), యాదగిరి (షేక్‌పేట్), ఖలీల్ అహ్మద్ (బహ దూర్ పురా–2), కుల్దీప్ కౌర్ (బహదూర్‌పురా), ఎండీ ముస్తఫా (ఆసీఫ్‌నగర్)లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డీఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ నూతన మేయర్ ఎన్నిక నేడే

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ ఎన్నిక శుక్రవారం జరగనుంది. ఇప్పటికే అవిశ్వాసం నెగ్గిన కాంగ్రెస్ కార్పొరేటర్లు కొత్త మేయర్‌ని ఎన్నుకోనున్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో 21మంది కాంగ్రెస్ పక్షాన నిలిచారు. మిగిలిన అయిదుగురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికారు. దీంతో మేయర్ జక్క వెంకట్ రెడ్డి పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నూతన మేయర్ ఎన్నికకు సంబంధించి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కార్పొరేటర్లు విధిగా హాజరు కావాలని కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు కోరారు. మేయర్ ఎన్నిక ప్రిసైడింగ్ అధికారిగా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి వ్యవహరించనున్నారు.

నేడు, రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: బాలాపూర్ రిజర్వాయర్ అవుట్ లెట్ 450 ఎంఎం డయా పైపులైన్ డైవర్షన్ పనుల నేపథ్యంలో శుక్రవారం రాత్రి 9 నుంచి శనివారం రాత్రి 9 గంటల వరకు రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి. రాజా నరసింహ కాలనీ, ఇందిరా నగర్, పిసల్ బండా, దర్గా బురాన్షాహి, గాజీ–మిల్లత్, లలితా బాగ్, ఉప్పుగూడ, మిధాని, ఒవైసీ హాస్పిటల్, కేంద్రీయ విద్యాలయం, హస్నాబాద్, ఖలందానగర్, సంతోష్ నగర్ పాత కాలనీ, న్యూ కాలనీ, యాదగిరి కమాన్, ఫహబా మసీదు, మారుతీ నగర్, పోచమ్మ గడ్డ, హనుమాన్ టైలర్ గల్లి, బాబానగర్, మక్బూల్ నగర్, జీఎం నగర్, ఖాద్రీ కాలనీలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది.









నగరంలో నర్సరీ మేళా

నగరంలోని పీపుల్స్‌ప్లాజా వేదికగా గురువారం ఆల్ ఇండియా హార్టికల్చర్‌షోను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. నర్సరీ మేళాలో రూ.50 నుంచి రూ.3 లక్షల వరకు మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మేళా సెప్టెంబరు 2 వరకు కొనసాగనుంది.
- సాక్షి, సిటీబ్యూరో

హబ్సిగూడలో మరో విషాదం

లారీ ఢీకొని 6వ తరగతి విద్యార్థిని దుర్మరణం

- ఇదే ప్రాంతంలో 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదం.. మృతి చెందిన పదో తరగతి విద్యార్థిని

లాలాపేట: దాదాపు 10 రోజుల క్రితం తార్నాకకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఆటోలో స్కూల్‌కు వెళ్తుండగా.. హబ్సిగూడ చౌరస్తాలో లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన దుర్ఘటన మరవక ముందే అదే హబ్సిగూడలో గురువారం మరో విషాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న విద్యార్థినిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన అందరినీ కలచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక హనుమాన్ నగర్‌కు నీలం కుమార్ కుమార్తె శ్రీకామేశ్వరి (10) హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో 6వ తరగతి చదువుతోంది. ఇదే పాఠశాలలో ఆమె తమ్ముడు వేదాన్ష్ 2వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం స్కూల్ ముగించుకుని తల్లి సంతోషితో స్కూటీ వెనకాల కూర్చుని తార్నాకలోని వీరి ఇంటికి బయలుదేరారు. హబ్సిగూడలోని అన్‌లిమిటెడ్ షోరూం సమీపంలోకి రాగానే.. ఉప్పల్ వైపు నుంచి ఓవర్ లోడుతో వచ్చిన లారీ.. వెనకవైపు నుంచి వీరి స్కూటీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై నుంచి తల్లి సంతోషి, కుమారుడు వేదాన్ష్ ఎడమవైపు ఎగిరి కింద పడ్డారు. కుడివైపు పడిన కామేశ్వరి కాలుపై నుంచి లారీ చక్రాలు వెళ్లగా తీవ్ర గాయాలయ్యాయి. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బిడ్డను చూసి తల్లి సంతోషి రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. కామేశ్వరిని వెంటనే అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రాజస్థాన్‌కు చెందిన మియారామ్ జాట్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఓయూ పోలీసులు తెలిపారు.



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ



కామేశ్వరి (ఫైల్)



తల్లి ఒడిలో గాయాలతో కామేశ్వరి

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు

అనుమతులున్న మండపాలకు ఉచిత విద్యుత్

- సుప్రీంకోర్టు నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాలి
- సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని నగరం తొలి నుంచి మత సామరస్యానికి పేరు గాంచిందని, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. నిమజ్జనం శాంతియుతంగా కొనసాగేలా చూడాలని సీఎస్ శాంతికుమారికి ఆయన సూచించారు. విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లోనే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ప్రభుత్వానికి ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమతులున్న మండపాలకు ఉచిత విద్యుత్ అందజేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి పర్యావరణ హిత (ఎకో ఫ్రెండ్లీ) విగ్రహాలను ప్రతిష్ఠించాలని మంత్రి శ్రీధర్ బాబు ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. 25 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కాల్పుల కేసులో దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో నిందితుడు శివ, మరో 15 మంది అనుమానితులు
- తుపాకీ తెచ్చిన నరేష్ కోసం గాలింపు

కుత్బుల్లాపూర్ : పెట్రోల్ చోరీ విషయంపై గాజుల రామారం సమీపంలోని ఓ బార్ వద్ద మంగళ వారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనపై పోలీసులు పురోగతి సాధించారు. కాల్పులకు తెగబడ్డ శివ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న జీడిమెట్ల పోలీసులు తుపాకీ తెచ్చిన నరేష్ కోసం గాలింపు చేపట్టారు. ఇందుకుగాను నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే అనుమానితులుగా ఉన్న 15 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రియురాలి కోసం తన వద్ద దాచుకున్న నాటు తుపాకీతో వచ్చిన వ్యక్తి ఆ తుపాకితో కాల్పులు జరిపిన విషయాన్ని సీరియస్‌గా పరిగణించారు.

అసలు 'గురి 'ఎవరి వైపు...?

మల్లంపేట్ ప్రాంతానికి చెందిన నరేష్ బీహార్ నుంచి నాటు తుపాకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. అతని టార్గెట్ ఎవరు.. 'గురి' ఎవరి వైపు పెట్టాడు.. అన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారింది. కాల్పుల అనంతరం అతను బార్ సిబ్బందితోపాటు స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఎవరైనా మీడియాకు, పోలీసులకు సమాచారం ఇస్తే వారి అంతు చూస్తామని బెదిరించినట్లు తెలిసింది. నాటు తుపాకీ ఆయుధం ఎందుకు అవసరం వచ్చింది అన్న విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నరేష్ దొరికితే గానీ అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేవని పోలీసులు పేర్కొంటున్నారు. ఇప్పటికే 15 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు అందులో అరుగురి పాత్ర ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు నరేష్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.


నరేష్ (ఫైల్)

నరేష్‌పై ఇప్పటికే పలు ఆరోపణలు...

నాటు తుపాకితో హల్చల్ చేస్తూ పలు సెటిల్మెంట్లు చేసినట్లు... కొందరిని బెదిరించినట్లు ఇప్పటికే నరేష్‌పై దుండిగల్ ,బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు విచారణలో ఉంది. అయితే పోలీసులు ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోకపోవడంతో నాటు తుపాకీ విషయం ఇప్పుడు వెలుగులోకి రావడంతో పోలీసులు కంగు తినాల్సి వచ్చింది. నిజాంపేట్ ప్రాంతానికి చెందిన పలువురిపై దాడులు చేస్తూ.. ఇటీవల కేపీఆర్ లేఅవుట్ పార్కులో విషయంపై పలువురు ఫిర్యాదు చేయగా వారిని తుపాకీతో బెదిరించి కబ్జాదారులకు అండగా నిలిచారని ఆరోపణలు ఉన్నాయి. గత కొంతకాలంగా బెదిరింపులకు పాల్పడుతున్న నరేష్‌పై పోలీసులు నిఘా ఎందుకు కేసులు నమోదు చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న నరేష్ ఆ పార్టీకి చెందిన నాయకునితో అత్యంత సన్నిహితంగా ఉండేవాడని, నాటు తుపాకీతో ఎవరిని హత్య చేసేందుకు పన్నాగం పన్నాడు... అన్న విషయంపై ఇప్పుడు పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు.

ఏసీబీలో పని చేస్తున్నామంటూ..

- బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్
- నకిలీ ఐడీకార్డులు, రెండు బైక్‌లు స్వాధీనం

అత్తాపూర్: ఏసీబీలో పని చేస్తున్నామని, మీరు చేస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలను సోషల్ మీడియాలో బట్టబయలు చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సన్‌సిటీ పీఏటీ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్, బండ్లగూడకు చెందిన రహిమాన్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు గత కొంతకాలంగా ఒకరు పోలీసు అధికారిగా, మరొకరు విలేకరిగా చెలామణి అవుతూ బెల్ట్ షాపుల నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో శివరాంపల్లి ప్రాంతంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న రాహుల్‌వర్ధన్‌గౌడ్ వద్దకు వెళ్లిన వారు చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించి రూ.10వేలు డిమాండ్ చేశారు. దీంతో అతను వారు అడిగిన సొమ్ము ఇచ్చి పంపాడు. అయితే అందులో రూ 7 వేలే ఉన్నాయని, మిగతా మొత్తాన్ని ఇవ్వాలని ఫోన్‌చేసి బెదిరించడంతో బాధితుడు అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు బైక్‌లు, నకిలీ ఐడెంటిటీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

బ్యూటీషియన్ దారుణ హత్య

ప్రేమోన్మాది ఘాతుకం

- 15కు పైగా కత్తి పోట్లు
- అడ్డు వచ్చిన మరో ముగ్గురు బ్యూటీషియన్లపైనా దాడి
- విద్యుత్ తీగలు పట్టుకుని నిందితుడి ఆత్మహత్యాయత్నం

గచ్చిబౌలి: వేరే వ్యక్తితో చనువుగా ఉంటూ తనను దూరం పెట్టిందన్న కక్షతో ఓ యువకుడు బ్యూటీషియన్‌ను కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్, కూచ్‌బీహర్ జిల్లా, లంకపాలకు చెందిన దీప్నా తమాంగ్(26) నల్లగండ్లలోని అపర్ణ జెనిత్‌లో పీఅండ్ బి సెలూన్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. రెండేళ్ల క్రితం బెంగళూర్‌లో పని చేస్తుండగా బీదర్‌కు చెందిన రాకేష్(25) పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరు కొంతకాలం బాగానే ఉన్నా ఆ తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. రాకేష్‌ను దూరం పెట్టిన దీప్నా రెండు నెలల క్రితం బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చి గోపన్‌పల్లి తాండాలో ముగ్గురు బ్యూటీషియన్లతో కలిసి నివాసం ఉంటూ సెలూన్‌లో పని చేస్తోంది. రాకేష్ కూడా హైదరాబాద్‌కు వచ్చి అయ్యప్ప సొసైటీలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. దీప్నా వేరే వ్యక్తితో చనువుగా ఉంటున్నట్లు తెలుసుకున్న రాకేష్ తనను పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో మంగళవారం గోపన్‌పల్లి తాండాలోని ఇంటికి వెళ్లి ఆమెతో గొడవ పడ్డాడు. బుధవారం రాత్రి దీప్నా ఇంటికి వెళ్లి మరోసారి గొడవ పడటంతో ఆమె బయటికి వచ్చింది. పక్కకు వెళ్లి మాట్లాడుకుందామని కొద్ది దూరం తీసుకెళ్లిన రాకేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీనిని గమనించిన తోటి బ్యూటీషియన్లు అడ్డుకునేందుకు యత్నించగా వారిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనలో సావిత్రి వీపుపై, కృష్ణ లంక కుడి చేతి మణికట్టు, పునీత కుడి భుజంపై గాయాలయ్యాయి. 15కు పైగా కత్తిపోట్లకు గురై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న దీప్నాను సిటిజన్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సావిత్రి పరిస్థితి విషమంగా ఉందని, బాధితులు సిటిజన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.


దీప్నా తమాంగ్ (ఫైల్)


నిందితుడు రాకేష్

తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టి..

దాడి అనంతరం ఇదే చివరి రోజు అని తల్లిదండ్రులకు రాకేష్ మెసేజ్ పెట్టి బైక్‌పై వెళ్లాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బీదర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గచ్చిబౌలి పోలీసులను సంప్రదించారు. అప్పటికే రాకేష్ కోసం గచ్చిబౌలి పోలీసులు గాలింపు చేపట్టారు. బైక్‌పై వెళ్లిన రాకేష్ మొయినాబాద్ శివార్లలో చెట్టును ఢీ కొట్టడంతో సెల్ ఫోన్ కిందపడి పోయింది. అక్కడ నుంచి కనకమామిడి గ్రామ శివార్లలో విద్యుత్ స్తంభం ఎక్కి హైటెన్షన్ వైర్లను పట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అతను విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 50 శాతం కాలిన గాయాలతో ఉన్న రాకేష్‌ను లంగర్ హౌస్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా దీప్నాకు వివాహం జరిగిందని, కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మనస్పర్థల కారణంగా భర్తతో కొంత కాలంగా దూరంగా ఉంటూ బ్యూటీషియన్‌గా పని చేస్తోందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

బాలిక ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధిస్తుండటంతో మనస్తాపానికి లోనైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన బాలికను కొన్నాళ్లుగా మహేశ్వరం ప్రాంతానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎయిర్‌పోర్టు ఉద్యోగి మృతి

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో ఎయిర్‌పోర్టు ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.జయశంకర్ భూపాల పల్లి జిల్లా, దుబ్బల గ్రామానికి చెందిన సంగీ మహేష్ (33) పట్టణంలోని సిద్ధాంతిలో ఉంటూ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్న అతను సిద్ధాంతి సమీపంలో నీమ్ ట్రీ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీ కొనడంతో మహేష్ ఎదురుగా నిలిపి ఉన్న కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రచారానికే ప్రాధాన్యం.. పనులు మాత్రం శూన్యం

సాక్షి,సిటీబ్యూరో: పనిలేకున్నా ప్రచారం మాత్రం కావాలన్నట్లుగా వ్యవహరిస్తోంది జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం. యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, తదితర కార్యక్రమాలేవీ చేయకుండానే పనులు చేసినట్లు ప్రతిరోజూ పత్రికా ప్రకటనలతో ప్రచారం కుమ్మరిస్తోంది. వేల కాలనీలు, లక్షల ప్రాంతాల్లో ఆయా పనులు చేసినట్లు బూటకపు ప్రచారం చేస్తోంది. ఉన్నతాధికారులు ఒక్కసారి నిర్వహించిన సమీక్ష సమావేశ వివరాలనే పదేపదే పత్రికా ప్రకటనల రూపంలో జారీ చేస్తోంది. సదరు సమావేశం ఎక్కడ నిర్వహించారో, ప్రత్యక్ష సమావేశమో, టెలికాన్ఫరెన్సా.. వంటి కనీస సమాచారం కూడా లేకుండానే ప్రకటనలు జారీ చేస్తోంది. దోమల నివారణ పేరిట రూ.కోట్ల ఖర్చు చూపుతూ రూ. లక్షలు దండుకుంటున్న ఆ విభాగంలోని అధికారులు తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి ప్రచారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ విభాగంలోని అధికారులు ఇతర జిల్లాలకు బదిలీలైనా వెళ్లకుండా జీహెచ్‌ఎంసీలోనే ఉండటం, ఆయా సందర్భాల్లో వారి అవినీతి వెల్లడైనా తగిన చర్యలు లేనందునే ఇలాంటి ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కానీ, సంబంధిత విభాగం అడిషనల్ కమిషనర్ కానీ కాకుండా కేవలం ఆ విభాగం అధికారులే ప్రకటనలు విడుదల చేయడం వెనుక మర్మమేమిటో వారికే తెలియాలి.

నాటు తుపాకీతో బెదిరించి..

దారి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

రాజేంద్రనగర్: అర్ధరాత్రి ఒంటరిగా వెళుతున్న వారిని అటకాయించి వారి నుంచి సెల్‌ఫోన్లు, నగదు లాక్కెళుతున్న ముఠాను రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన మహ్మద్ ముసాహీద్ ఆలం, మహ్మద్ డిబార్, మహ్మద్ షానవాజ్ బతుకు దెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. ఉప్పర్‌పల్లిలోని హ్యాపీ హోమ్స్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ స్థానికంగా బ్లాంకెట్‌లను విక్రయించేవారు. వ్యాపారం అంతగా సాగకపోవడంతో 15 రోజుల క్రితం బిహార్‌కు వెళ్లి రూ.8 వేలతో కంట్రీమేడ్ తుపాకీ, బుల్లెట్‌ను కొనుగోలు చేశారు. గత వారంలో కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద ఒంటరిగా వెళుతున్న వ్యక్తిని అడ్డుకుని అతడి వద్ద సెల్‌ఫోన్‌తో పాటు రూ.200 నగదును లాక్కున్నారు. మర్నాటు జనచైతన్య అపార్ట్‌మెంట్ వద్ద ఓ వ్యక్తిని ఆటకాయించి తుపాకీతో బెదిరించి, అతడి నుంచి సెల్‌ఫోన్, రూ.11 వేల నగదు లాక్కుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితులు మహ్మద్ ముసాహీద్ ఆలం, మహ్మద్ డిబార్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు షానవాజ్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, కంట్రీమేడ్ తుపాకీ, బుల్లెట్, సెల్‌ఫోన్, రూ.200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

జలమండలి 'డిప్యుటేషన్' ఇంజినీర్లు వెనక్కి..?

- ఎనిమిదేళ్లుగా తిష్టవేసిన హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీర్లు
- ఇప్పటికే పలువురిపై అవినీతి ఆరోపణలు
- వెనక్కి వెళ్లేందుకు ససేమిరా అంటున్న ఇంజినీర్లు
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో హౌసింగ్ కార్పొరేషన్‌కు పునరుజ్జీవం

సాక్షి,సిటీ బ్యూరో: జలమండలిలో ఏళ్ల తరబడి 'డిప్యుటేషన్' పై తిష్ట వేసిన హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీర్లు తిరిగి మాతృ సంస్థకు వెనక్కి పంపేందుకు రంగం సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గూడు లేని వారి కోసం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించ తలపెట్టడంతో హౌసింగ్ కార్పొరేషన్ తిరిగి పునరుజ్జీవం పోసుకుంటోంది. దీంతో ప్రభుత్వం కార్పొరేషన్‌కు చెందిన ఇంజినీర్లందరిని వెనక్కి తీసుకునేందుకు చర్యలు చేపట్టింది. వాస్తవంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట జరిగిన అక్రమాలపై సీబీడీ విచారణ జరిపించి అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థపై చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా తొలుత డిప్లొమా అర్హత గల ఇంజినీర్లకు డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. 2016 ఆగస్టు 20న రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసే సుమారు 66 మంది ఏఈ (సహాయక ఇంజినీర్)లను ఒక ఏడాది కాలపరిమితితో డిప్యూటేషన్‌పై జలమండలికి కేటాయించింది. ఈ ఉత్తర్వులు అందుకున్న ఏఈలు జలమండలిలో రిపోర్టు చేశారు. అదేవిధంగా మిగిలిన ఇంజనీర్లు, ఉద్యోగులను దశల వారిగా సుమారు 12 ప్రభుత్వ శాఖల ఇంజనీరింగ్ విభాగాల్లో సర్దుబాటు కాగా, తాత్కాలిక సిబ్బంది విధుల నుంచి తొలగింపునకు గురయ్యారు. డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం రోడ్లు, భవనాల శాఖలో హౌసింగ్ కార్పొరేషన్‌ను పూర్తిగా విలీనం చేశారు. అప్పటి నుంచి హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఆర్ అండ్ బీలో ఒక విభాగంగా కొనసాగుతూ వస్తోంది. అయితే జలమండలిలో రిపోర్ట్ చేసిన ఇంజినీర్లు ఎనిమిదేళ్ల నుంచి డిప్యూటేషన్ పై కొనసాగుతూ వస్తున్నారు.



ఇందిరమ్మ పథకానికి 'పునరుజ్జీవం'

కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలనే ఆలోచనతో ఆర్ అండ్ బీలో విలీనమైన హౌసింగ్ కార్పొరేషన్‌ను విడదీసి పటిష్టం చేసేందుకు సిద్ధమైంది. దీంతో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మళ్లీ ప్రత్యేకశాఖగా మారనుంది. ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ పథకం కింద అర్హులైన ప్రతికుటుంబం ఇంటిని నిర్మించుకునేందుకు(స్థలం లేని వారికి స్థలం, ఉన్న వారికి ఆర్థిక సాయం) రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. ఈ పథకాన్ని అమలుచేసేందుకు ఇప్పటికే అవసరమైన దరఖాస్తులను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించింది. ప్రస్తుతం ఆర్ అండ్ బీలోని గృహ నిర్మాణ విభాగంలో సుమారు 50 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. వాస్తవంగా విలీనానికి ముందు ఆ శాఖలో 500 మందికి పైగా ఉద్యోగులు ఉండేవారు. కానీ, వివిధ శాఖలకు కేటాయింపు కారణంగా సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు దాదాపు 800 మంది వరకు ఏఈలు, వారితో పాటు డీఈలు, ఈఈలు అవసరమని శాఖ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.

వెనక్కి వెళ్లేందుకు ససేమిరా...

వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీర్లందరిని వెనక్కి పిలిపించాలని ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశించినట్లు సమాచారం. సొంత ఉద్యోగులు వచ్చిన తరువాత ఇంకా అవసరమైతే ఇతర శాఖల నుంచి కూడా డిప్యూటేషన్‌పై గృహ నిర్మాణ శాఖకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే జలమండలిలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇంజనీర్లు ప్రస్తుతం వివిధ సెక్షన్లలో మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వారిలో కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుండగా, మరికొందరు సస్పెన్షన్లకు సైతం గురై తిరిగి విధుల్లో చేరిన సంఘటనలు లేకపోలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాదిరిగానే జలమండలి విధుల్లో సైతం చేతివాటానికి అలవాటు పడటంతో తిరిగి మాతృ సంస్థ హౌసింగ్ కార్పొరేషన్‌కు వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముఖంపై యాసిడ్ పోసి..దారి దోపిడీ

బంజారాహిల్స్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ యువకుడిని అరుగురు ఆగంతకులు అర్ధరాత్రి అడ్డగించి డబ్బులు లాక్కోవడమే కాకుండా తమను గుర్తు పట్టవద్దనే ఉద్దేశంతో ముఖంపై యాసిడ్ పోసి గాయపరిచిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెస్ట్‌బెంగాల్‌కు చెందిన నసీంమాలిక్ బుధవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని శ్మశానవాటిక ముందు నుంచి నడుచుకుంటూ జహీరానగర్ వైపు వెళ్తున్నాడు. అర్ధరాత్రి అరుగురు యువకులు నసీంను అడ్డగించి తీవ్రంగా కొట్టి అతడి జేబులో ఉన్న రూ.500 లాక్కున్నారు. అనంతరం తమను గుర్తుపట్టకుండా నసీంను బలవంతంగా శ్మశానవాటికలోకి లాక్కెళ్లి ముఖంపై, చేతులపై, మెడపై యాసిడ్ పోశారు. దీంతో బాధితుడు తన స్నేహితుడు నూర్‌హుస్సేన్‌ను పిలిపించుకుని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సంతానం కలగడం లేదని.. మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: వివాహం జరిగి 11 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రేమావతిపేట ప్రాంతానికి చెందిన స్వాతి (30)కి ఉప్పర్‌పల్లికి చెందిన శ్రీధర్‌తో 2013లో వివాహం జరిగింది. అయితే ఆమెకు సంతానం కలుగలేదు. గత కొన్ని రోజులుగా పుట్టింట్లోనే ఉంటున్న స్వాతి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం తెల్లవారుజామున దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


స్వాతి (ఫైల్)

మహిళా సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

ఉప్పల్: ఓ మహిళా సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ వెంకటరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అమీర్ బాషా భార్య షేక్ షాయిన్(36) సికింద్రాబాద్ మెట్రో స్టేషన్‌లో సెక్యురిటీ గార్డుగా పని చేస్తుంది. ఈ నెల 28న డ్యూటీకి వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు షేక్ షకీరా పాషా తలుపు తట్టినా తీయక పోవడంతో కిటికీలోనుంచి చూడగా షేక్ షాయిన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో అతను ఇరుగు పొరుగు సహాయంలో ఆమెను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


షేక్ షాయిన్ (ఫైల్)

యూనియన్ నిధులు దిగమింగారు

11 మంది యూనియన్ నేతలపై చీటింగ్ కేసు నమోదు

బంజారాహిల్స్: యూనియన్ బిల్డింగ్ కొనుగోలు, యూనియన్ రజతోత్సవ వేడుకల వసూళ్లలోనూ లక్షలాది రూపాయలు దండుకుని మోసం చేశారంటూ తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ ప్రొడక్షన్ మేనేజర్, అప్పటి సెక్రటరీ కాట్రగడ్డ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు 11 మంది యూనియన్ నేతలపై చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ కార్యాలయం ఉంది. బిల్డింగ్ కొనుగోలులో అప్పటి అధ్యక్షుడు కె. సాంబశివరావు, కె. అమ్మిరాజు, ఆర్. వెంకటేశ్వర్‌రావు అలియాస్ బండారు బాబీ, కొప్పినేడి సతీష్‌కుమార్, గౌతి హరినాథ్, రాందాస్ ధనరాజ్ అలియాస్ భాగ్యరాజ్, వక్కాల్కర్ బాల్ మోహన్, పాలాటి శ్రీనివాసరావు, భూమా వెంకటరామకృష్ణారావు, వాసిరెడ్డి సాయిబాబు, టి. ప్రసన్న ఆంజనేయులు రూ. 10 లక్షల మేర మోసం చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనియన్ రజతోత్సవ వేడుకల పేరుతో అకౌంట్ ఓపెన్ చేసి విరాళాలు అందులోకి దారి మళ్లించారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు వీరందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఇదిలా ఉండగా నిందితుల్లో ఒకరైన అమ్మిరాజు తాజాగా జరిగిన ఎన్నికల్లో తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ అధ్యక్షుడిగా, తెలుగు ఫిలిం ఫెడరేషన్ జనరల్ సెక్రటరిగా ఎన్నిక కావడం గమనార్హం. వీరందరిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాల్సిందిగా బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు అవసరం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అగ్ని ప్రమాదాలు పెరిగిపోతున్నట్లు తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన అగ్నిమాపక శాఖ నివేదించిందని గత 2019-23 మధ్య నగరంలో 6,525 అగ్నిమాపక, రెస్క్యూ కాల్‌లు నమోదైన నేపథ్యంలో వీటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ సామ కొండల్ రెడ్డి అన్నారు.గురువారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటికే 2,550 అగ్ని ప్రమాదాలు నమోదయ్యాయన్నారు. పరిశ్రమలలో ప్రతి రెండు రోజులకో అగ్నిప్రమాదం జరుగుతోందని, గత 2021-23 మధ్యకాలంలో పరిశ్రమల్లో 600కు పైగా ప్రమాదాలు చోటు చేసుకోగా ఆయా ప్రమాదాల కారణంగా రాష్ట్రంలో 1,116 మంది మరణించారని, అంటే అగ్నిప్రమాదాల కారణంగా రోజుకు ఒక మరణం సంభవిస్తోందని అంచనాకు రావచ్చునన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసే ప్రయత్నాలకు ఫెడరేషన్ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని కొండల్ రెడ్డి తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: కూరగాయలు కొనేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చిన ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొనడంతో మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేటలోని భవ్యాస్ ఆనందం అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి సీ.ఎస్. నరసింహారావు (75) బుధవారం సాయంత్రం కూరగాయలు కొనేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నిజాంపేట కమాన్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల ముప్పేట దాడి!

- అవగాహన కల్పించేందుకు బస్తీబాట పట్టిన అధికారులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుప్రతులకు రోగుల క్యూ
- డెంగీ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు
- దోమల నివారణ కోసం చర్యలు
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు



పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీ దవాఖానాలో సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి..



బీఎస్ మక్తాలో పర్యటిస్తున్న సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సూది మందు కోసం జ్వర పీడితులు గజగజ వణుకుపోతూ వేచి చూస్తున్నారు. దాదాపుగా ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు, చికున్ గున్యా, డెంగీ, టైఫాయిడ్, డయేరియాలతో బాధపడుతూ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రులు, బస్తీ దవాఖానాలతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా డెంగీ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణపై దృష్టిపెట్టాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 అధికారులు అప్రమత్తమయ్యారు. ఉప కమిషనర్లు, ఏఎంహెచ్‌ఓలు, ఎంటమాలజిస్టులు బస్తీల్లో పర్యటించి డెంగీ నివారణ కోసం అవగాహనతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్-17 డీఎంసీ జి.రజనీకాంత్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ భాస్కర్ తదితరులు బీఎస్ మక్తాలో పర్యటించారు. యాంటీ లార్వా ఆపరేషన్లను విస్తృతం చేస్తున్నామని, ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రజనీకాంత్‌రెడ్డి సూచించారు. ఇళ్లల్లో నీళ్ల నిల్వ ఉంటే దోమల వృద్ధి జరుగుతుందని, ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు.

సర్కిల్-18 పరిధిలో..

జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ నారాయణ, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రజిత తదితరులు పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీ దవాఖానాను సందర్శించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో బస్తీ దవాఖానా వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో ప్రతిరోజూ జ్వరంతో బాధపడుతూ 80 మంది వరకు వస్తున్నారని, బస్తీ దవాఖానా వైద్యాధికారి వెల్లడించారు. దాదాపు అన్ని ఆస్పత్రుల్లోనూ జ్వర పీడితుల సంఖ్య ఇలాగే ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ కిట్ల ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీసీ ప్రశాంతి తెలిపారు. ఏడాది కాలంలో ఈ బస్తీ దవాఖానా పరిధిలో ఒకే డెంగీ కేసు నమోదైనట్లు గుర్తించామన్నారు. చాలా మంది డెంగీ పరీక్షలు బస్తీ దవాఖానాల్లో చేయించుకుంటున్నారని, రక్త నమూనాలను సేకరించి టీఎస్ హబ్‌కు పంపించి నివేదిక తెప్పించుకోవడం జరుగుతుందన్నారు. చాలా మంది వైరల్ ఫీవర్లతో బాధపడుతూ ఆస్పత్రులకు వస్తున్నారని, రెయిన్‌బో ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించుకున్న వారు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభిస్తున్న ఉచిత సేవలను వినియోగించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు.

మాతృభాషను మరువకూడదు

లిబర్టీ: మాతృభాష తెలుగును మరువకూడదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పీ.వీ.రాజేశ్వరరావు కోరారు. ప్రపంచ భాష అయిన ఇంగ్లిష్‌లో కొట్టుకపోకూడదని హితవు పలికారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందూ తెలుగులెస్సా అని శ్రీకృష్ణ దేవరాయలు అనేక ఏళ్ల క్రితమే ప్రబోధించారని ఆయన గుర్తు చేశారు. ఏ ప్రాంతానికైనా భాష, ప్రాంత సంస్కృతి ముఖ్యమని అన్నారు. కానీ నేడు ఆధునిక యుగంలో ఆంగ్ల భాషకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి బోనాల సమర్పణ



బొడ్రాయి వద్ద బోనాలు సమర్పిస్తున్న బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఉదయ్‌నగర్ బస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు గురువారంతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా బస్తీలో రోజుకో కార్యక్రమంతో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలను ఉత్సవ కమిటీ నేతలు నిర్వహించారు. గురువారం బొడ్రాయికి బస్తీలోని ప్రతీ ఇంటి నుంచి ఓ బోనాన్ని సమర్పించారు. దీంతో బస్తీలో పండుగ వాతావరణం నెలకొంది. ఆఖరి రోజు నిర్వహించిన సామూహిక కుంకుమార్చన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం



వెంగళరావునగర్: తమ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి నూతన కమిటీ హయాంలో పనులకు శ్రీకారం చుట్టామని మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావులు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో గత కొన్నేళ్ళుగా జి-బ్లాకులో ఉన్న పార్కులో సమస్యలు తాండవిస్తుండటంతో సమస్యలను స్థానికులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలకు వివరించారు. దీనికి స్పందించిన సంక్షేమ సంఘం నాయకులు పార్కును సందర్శించి అప్పటికప్పుడు కాలనీ సిబ్బంది ద్వారా పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. బుల్డోజర్ తెప్పించి చుట్టుపక్కల ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ నగరంలోనే తమ కాలనీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కాలనీలో ఇకపై ఎలాంటి సమస్యలు లేకుండా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి స్థానికుల సహకారంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ (బి-బ్లాక్) రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండప నిర్వాహకులకు ఇబ్బందులు కలిగించొద్దు



పంజగుట్ట: వినాయక మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంజగుట్ట పోలీస్ డివిజన్ ఏసీపీ మోహన్ కుమార్ సిబ్బందికి సూచించారు. వినాయకచవితి పండగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పంజగుట్ట, మధురానగర్ పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిమజ్జన మార్గంలో ఎక్కడెక్కడ రోడ్లపై గుంతలు ఉన్నాయి, చెట్లకొమ్మలు అడ్డుగా ఉన్నాయి గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలను ముందుగానే గుర్తించి అక్కడ తగు భద్రత ఏర్పాటు చెయ్యాలని సూచించారు. మండప నిర్వాహకులకు కూడా తగిన సూచనలు ఇవ్వాలని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంజగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిజం, నక్సలిజంతో నష్టపోయేది దళితులే..

ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ మురళీ మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

పంజగుట్ట: దళిత యువతి బంటి రాధ అలియాస్ నిల్సోను మావోయిస్టులు దారుణంగా హత్య చేయటాన్ని ఖండిస్తున్నామని, కమ్యూనిజం, నక్సలిజం కారణంగా తీవ్రంగా నష్టపోయ్యేది దళితులే అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రాధను దారుణంగా హత్య చేసినా మాట్లాడని మహిళా, మానవ హక్కుల సంఘాల నాయకులు, మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని వారు ప్రశ్నించారు. దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మావోయిస్టుల చేతిలో దారుణ హత్యకు రాధ అలియాస్ నిల్సో చావుకు సమాధానం చెప్పాలి, ఆగని మావోయిస్టుల మారణహోమం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ మురళీ మనోహర్, బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి అనూష, డాక్టర్ వంశ తిలక్ మాదిగ, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.పవన్, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీలు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతున్న రాధకు మాయమాటలు చెప్పి చైతన్య మహిళా సంఘం అడవి బాట పట్టించి మావోయిస్టులలో చేరేలా చేసిందన్నారు. అనతికాలంలోనే ఆమె దళ కమాండర్ స్థాయికి ఎదిగిందన్నారు. కరోనా సమయంలో మావోయిస్టులకు ఎన్నో సేవలు చేసిందని గుర్తు చేశారు. ఆమె పదోన్నతిపై ఏఓబీకి పంపే క్రమంలో ఉద్యమ ద్రోహానికి పాల్పడిందని, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారి తమ సమాచారం వారికి అందిస్తుందన్న నెపంతో ఈ నెల 18న ఆమెను అతి దారుణంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యువతిని దారుణంగా హత్య చేస్తే మహిళా సంఘాలు, మేధావులు, మానవ హక్కుల గూర్చి మాట్లాడే మేధావులు ఎక్కడకు పోయారని ప్రశ్నించారు. నక్సల్స్ ఐడియాలోనే ఏదో లోపం ఉందని, మావోలు చెప్పింది ఏదీ పాటించరని ఆరోపించారు. ఈ సమావేశంలో కె.శ్రీధర్, కె.ప్రసాద్, సాయికృష్ణ, దేవిక, కొప్పు భాషా, కాంతి కిరణ్, నెహ్రూనాయక్, అరవింద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో మంచి ఫలితాలు సాధించొచ్చు



సాక్షి, సిటీబ్యూరో: మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించొచ్చని రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వెస్ట్ మారేడ్‌పల్లిలోని డాక్టర్ మునగా రామమోహన రావు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు రోటరీ జూబ్లీహిల్స్, బీజీఆర్ మైనింగ్-ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకోటిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ వనరులు, ఆన్‌లైన్ లెర్నింగ్, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే ఈ ప్రాజెక్ట్ విద్యార్థుల విద్యతో పాటు వారి భవిష్యత్తు అవకాశాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. ప్రత్యేకంగా ల్యాప్‌టాప్‌లు అందుకోవడం పట్ల విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీ శాంతి ప్రియ, రోటరీ జూబ్లీహిల్స్ సభ్యులు డాక్టర్ ఎమ్.రామమోహనరావు, కే.ఆర్.సురేష్ కుమార్, జీ.నరేష్, అభిషేక్, శ్రీదేవి, లక్ష్మి విసిరెడ్డి, భార్గవి, చొక్కా లింగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాల్లో ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్, సీఎన్ రెడ్డిలు

రహమత్‌నగర్: సలీం బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ఎంఐఎం జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ అన్వర్ సాదిత్, షేక్‌పేట్ కార్పొరేటర్ ఫరాజోద్దీన్ తదితరులు ఉత్సవాల సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయండి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. ఫిలింనగర్ వినాయకనగర్‌లో గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రారంభమవుతున్న దృష్ట్యా ఈ రోడ్డు పనులపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర, బీఆర్ఎస్ నాయకులు రమేష్, దయానంద్, శెట్టి, మనోహర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

కఠిన శిక్షలతోనే నేరాల అదుపు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పంజగుట్ట: కఠిన శిక్షలతోనే నేరాలు అదుపులో ఉంటాయని రబీంద్రనికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ కరుణ అన్నారు. కోల్‌కోతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎర్రమంజిల్ కాలనీలోని రబీంద్రనికేతన్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కరుణ కొన్ని కేసుల్లో తీర్పులు వెంటనే వెలువరించి కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ న్యాయం జరగడంలో ఆలస్యం కాకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తీర్పులు వెలువరించాలని, నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్లను నియమించాలి



అంబేద్కర్ వర్సిటీలో ధర్నా నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది

బంజారాహిల్స్: అన్ని విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను వెంటనే నియమించాలని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య సహాయ కోశాధికారి జి.మహేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో అఖిల భారత విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బంది సమాఖ్య పిలుపు మేరకు గురువారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ముందు డిమాండ్ల సాధనకై 'డిమాండ్స్ డే' పేరిట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలని, బోధనేతర ఖాళీలను భర్తీతోపాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. టైమ్స్ స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జనరల్ సెక్రటరీ హబీబుద్దీన్, పాండు, పి.విశ్వనాథ్, కె. ప్రేమ్‌కుమార్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం..

బంజారాహిల్స్: ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఈనెల 20వ తేదీన జూబ్లీహిల్స్ క్లబ్ సమీపంలోని రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఓ యువకుడు అపస్మారక స్థితిలో ఉన్నాడని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి ఆరా తీయగా ఎవరూ సమాధానం చెప్పలేదు. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అయితే మృతి చెందిన వ్యక్తి వివరాల కోసం పోలీసులు ఆరా తీసినా ఎటువంటి వివరాలు తెలియరాలేదు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న పాఠశాలలకు మినహాయింపులు ఇవ్వాలి

రహమత్‌నగర్: చిన్న బడ్జెట్ నడిచే పాఠశాలలకు ప్రభుత్వం మినహాయింపులు ఇవ్వాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఎన్నో పాఠశాలలు చిన్న బడ్జెట్‌తోనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందిస్తున్నాయన్నారు. విద్యనందించే సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఆర్ఎస్ఎంఏ) అమీర్‌పేట్, ఖైరతాబాద్ మండలాల అధ్యక్షుడు ఎం. ఆగస్టీన్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు, చిన్న బడ్జెట్ పాఠశాలలు రెండు కేటాగిరీలుగా విభజించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. చిన్న బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలకు వాణిజ్య చార్జీల నుంచి మినహాయించాలని కోరారు. వాణిజ్య లైసెన్స్‌ల కోసం జీహెచ్ఎంసీ అధికారులు చిన్న ప్రైవేటు పాఠశాలలపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో డీఈఓ రోహిణితో పాటు ఆర్ఎస్ఎంఏ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ ఖాజా ఖుత్బుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిబియ్యంతో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ తదితరులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా బోనాల ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, పీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్, కృష్ణయాదవ్‌లతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ భవానీ కృష్ణయాదవ్, శ్రీశైలం, బాలయ్య, అనిల్, రామేశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు నిధులు మంజూరు చేయండి

రహమత్‌నగర్: డివిజన్‌లోని సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు కోసం నిధులు విడుదల చేయాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం జలమండలి ఫైనాన్స్ మేనేజర్ అనూషకు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని చాలా బస్తీల్లో కొత్త పైప్ లైన్లు లేక నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా డివిజన్‌వాసులు కొత్త పైప్‌లైన్లు లేక సీవరేజీ, మంచినీటి సమ స్యలతో వారంతా బాధపడుతున్నారన్నారు. వెంటనే పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి నిధులు విడుదల చేయాలని మేనేజర్ అనూషను కోరారు. తాను చేసిన విజ్ఞప్తికి మేనేజర్ సానుకూలంగా స్పందించారని సీఎన్ రెడ్డి తెలిపారు.

ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

ఖైరతాబాద్: హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు గురువారం మహాసభ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈ సంవత్సరం సెప్టెంబర్ 1న కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఉదయం 10 గంటల నుంచి వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదికలో పాల్గొనాలనుకునే వారు నేరుగా స్పాట్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9246547563, 9849910303 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో దాన్ని అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన కోరారు. గురువారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఆచరణలో అమలు చేసి బీసీలపై ప్రేమ చాటాలని ఆయన కోరారు. డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. వెంటనే కుల జనగణన చేసేందుకు ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. చాలా కాలంగా బీసీలకు స్థానిక సంస్థల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని, బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కార్పొరేటర్ కవితారెడ్డి సూచించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ మెడ్‌ప్లస్ పక్క వీధిలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ. 5 లక్షల వ్యయంతో గురువారం కార్పొరేటర్ కవితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యమైన పనులు చేయడంతో పాటు త్వరితగతిన పనులు పూర్తి చేసి బస్తీవాసులకు రోడ్డును అందుబాటులోకి తేవాలని ఆమె ఏఈ సతీష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం బ్లేడ్‌తో దాడి

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఓ వ్యక్తిని అడ్డగించి డబ్బులు లాక్కోవడమే కాకుండా బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సింగాడబస్తీలో నివసించే సయ్యద్ ఖాద్రి (19) బుధవారం రాత్రి స్థానిక ఉదయ్‌నగర్ సరస్వతీ స్కూల్ నుంచి 11.30 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా షోయబ్ (25) అనే రౌడీ అడ్డగించాడు. బలవంతంగా జేబులో నుంచి రూ.1100 లాక్కొన్నాడు. అడ్డుకునేందుకు యత్నించగా సర్జరీ బ్లేడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పా నిర్వాహకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్ : నిబంధనలు పాటించకుండా స్పా నిర్వహిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఆర్‌నగర్ సమీపంలో పి.నవీన్‌గౌడ్ యాపిల్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా పేరుతో సెలూన్ స్పా నిర్వహిస్తున్నాడు. అయితే నిబంధనలు పాటించడం లేదని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మధురానగర్ పోలీసులు దాడి చేసి పరిశీలించగా కొన్ని నిబంధనలు పాటించనట్టుగా నిర్ధారణ అయింది. సీసీ టీవీలు కొన్ని పనిచేయడం లేదని, థెరపీ చేసే ఇరువురు మహిళలకు అధికారిక సర్టిఫికెట్ లేదని, కస్టమర్స్ రిజిస్టర్ కూడా సక్రమంగా మెయింటెయిన్ చేయడం లేదని తెలుసుకున్నారు. దీంతో స్పా అండ్ సెలూన్ నిర్వాహకుడు నవీన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతి

వెంగళరావునగర్: గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన సురేష్ (30) గత కొంతకాలంగా రహమత్‌నగర్‌లో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం గుండె నొప్పిగా ఉందంటూ తన రూంలో ఉంటున్న షేక్ మీరాకు ఫోన్ చేశాడు. అతను వచ్చేలోగా మెట్లమీద నుంచి కిందకు దిగే సమయంలో సురేష్ రోడ్డుమీద పడిపోయాడు. హుటాహుటిన మీరా 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే సురేష్ మృతి చెందినట్టుగా నిర్ధారించారు. మీరా ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ క్రీడా దినోత్సవంనేపథ్యంలో నగరంలోని సెంట్రల్ బ్యాంక్ జోనల్ ఆఫీస్, రీజినల్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో సంస్థలో నూతనంగా చేరిన ట్రైనీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆటల పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆటల పోటీలను లా ఆఫీసర్ చంద్రావతి, ఏఓ రామ్మోహన్‌తో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బందికి రన్ అండ్ వాక్, లెమన్ అండ్ స్పూన్, షాట్‌పుట్, త్రోబాల్, చెస్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో కలెక్టరేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి పట్ల హర్షం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో 83 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించడంపై తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) హర్షం వ్యక్తం చేసింది. గతంలో కూడా పదోన్నతులను ఇప్పించిన చరిత్ర టీజీటీఏకే ఉందన్నారు. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ గురువారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం ఒకేసారి 83 మంది డీటీలకు పదోన్నతి కల్పించడం గర్వించదగిన విషయమన్నారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూసే డీటీలకు తహసీల్దార్లుగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించాలి

హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటా చారి



సాక్షి, సిటీబ్యూరో: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి సత్వరమే చర్యలు చేపట్టాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటచారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులతో గురువారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో అయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలు, మూసీనది ఆక్రమణలు, ల్యాండ్ బ్యాంక్, పీఓబీ, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎన్ఓసీ బిల్డింగ్ అనుమతులు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, వాల్టా చట్టం, మీ సేవ ధృవపత్రాలు, ఆసరా పెన్షన్లు, సీఎంఓ ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి నివేదికలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటచారి మాట్లాడుతూ ప్రజాసమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశించారు. సీఎంఓ, ప్రజావాణి, మీ సేవ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, మీ సేవ డాష్ బోర్డ్‌లో పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు నగరం అనుకూలం

- ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- హైటెక్స్‌లో ఎలక్ట్రి ఎక్స్‌పో ప్రారంభం



మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎలక్ట్రి ఎక్స్‌పోలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్: దేశంలోని పలు మ్యానుఫాక్చరింగ్ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చి యూనిట్లను ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం సికింద్రాబాద్ ఎలక్ట్రికల్ ట్రేడర్స్ అసోసియేషన్(సెటా) ఆధ్వర్యంలో ఎలక్ట్రి ఎక్స్‌పో 2024ను నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని తెలిపారు. నగరం పెట్టుబడులకు అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో మరిన్ని మౌళిక వసతులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. కొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చిన వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్న ఎక్స్‌పోలో పాలిక్యాబ్, ఫైన్‌క్యాబ్, జెమ్స్, ఎలెంటి, ఫైబ్రోస్, కేఈఐ కంపెనీలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 15 నుంచి 20వేల వరకు సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీఐఐ, ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయి హైదరాబాద్ అధ్యక్షుడు వి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు మంచి రోజులు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పోర్ట్స్ స్కూల్‌ను అనుసంధానం చేస్తాం
- గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నేషనల్ స్పోర్ట్స్ డే



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు

గచ్చిబౌలి: రాష్ట్రంలో ప్రజాపాలనలో భాగంగా క్రీడలకు మంచి రోజులు రాబోతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలను పంచాయతీరాజ్ శాఖామంత్రి సీతక్కతో కలిసి పూలమాలలు వేసి ఈ వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారులను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడలను అన్ని రకాలుగా ప్రోత్సహించడంలో భాగంగానే ప్రత్యేక క్రీడా పాలసీ రూపొందించి అమలు చేయాలని సీఎం నిర్ణయించారన్నారు. ఇటీవల జరిగిన ఒలంపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన పథకాల గురించి ఆ దేశ పర్యటనలో సీఎంతో కలిసి అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే సామర్థ్యం కలిగిన క్రీడాకారులను తయారు చేయడంలో త్వరలో ప్రారంభించే స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పోర్ట్స్ స్కూల్స్‌ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు కిందిస్థాయి నుంచి ప్రత్యేకంగా ప్రొఫెషనల్స్‌తో శిక్షణ ఇప్పించాలని కూడా నిర్ణయించినట్లు చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం రూ.364 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ గ్రౌండ్‌లో ధ్యాన్‌చంద్ మెమోరియల్ హాకీ మ్యాచ్‌ను మంత్రులు ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ట్రిపుల్ ఒలంపియన్ ముఖేష్‌కుమార్, అర్జునా అవార్డు గ్రహీతలు నీతాదద్వే, అనూప్ కుమార్‌యామ, నయీమొద్దీన్‌తో పాటు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎన్.శివసేనారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, యూత్, కల్చర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ వైస్‌చైర్మన్, ఎండీ సోని బాలాదేవి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జగదీశ్వర్ యాదవ్, కొండా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ల ముట్టడి



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చేనెల 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన చేపడతామని తెలిపారు. ఇందిరాపార్కు చౌరస్తాలోని బీసీ భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సమగ్ర కులగణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇది బీసీల పోరాట విజయం అన్నారు. కులగణన ప్రారంభించేందుకు ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్, విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, నాయకులు గొడుగు మహేష్, మాదేశీ రాజేందర్, గూడూరు భాస్కర్, దేవిక, వాణి, భరత్ పాల్గొన్నారు.

నెక్నాంపూర్ చెరువును కాపాడండి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్(ఇబ్రహింబాగ్) పెద్ద చెరువు భూమి అనేక నిర్మాణాలతో ఆక్రమణలకు గురైందని, సర్వే నంబర్-20లోని ప్రభుత్వ భూమి, వెంకటేశ్వరకాలనీలోని పార్కు స్థలాల్లో నిర్మాణాలు వెలిశాయని, వాటిని తొలగించి పరిరక్షించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ది సిటిజన్ కౌన్సిల్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. నెక్నాంపూర్ చెరువు చుట్టుపక్కల వెలిసిన నిర్మాణాలు, ఆక్రమణలు, పార్కుల్లో వెలిసిన నిర్మాణాలు, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం తదితర వాటిపై సమగ్రంగా పలు దినపత్రికల్లో వచ్చిన పేపర్ కటింగ్‌లతో పాటు ఫిర్యాదు చేశారు. ఇటీవల చెరువు అభివృద్ధి పనులు చేపట్టినా అవి పూర్తికాకపోవడం, ఆక్రమణలను వదలిపెట్టడంపై ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఆరిఫ్, సంయుక్త కార్యదర్శి బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే ఆయన నెక్నాంపూర్ చెరువును పరిశీలించి, ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. మణికొండ రెవెన్యూ పరిధిలోని మూడు ఎకరాల మైసమ్మకుంట, 22.26 ఎకరాల్లోని ఎల్లమ్మ చెరువులను పరిరక్షించాలని మాజీ వార్డు సభ్యురాలు సముద్రాల వాణి హైడ్రా కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఓయూ చుట్టూ రక్షణ వలయం!

- ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు
- నూతన సాంకేతికత సాయంతో రక్షణ
- జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు కృషి

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పుడు ఎక్కడ చూసినా భూఆక్రమణలు, కబ్జాదారులు, అక్రమ కట్టడాలు, హైడ్రా కూల్చివేతల గురించే చర్చ జరుగుతోంది. ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన విలువైన భూములు కూడా ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే.. అయితే ఇప్పటికైనా ఉన్న భూములను కాపాడాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉస్మానియా వర్సిటీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వర్సిటీ సరిహద్దు చుట్టూ జియో ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నిస్తోంది. దీనిద్వారా అక్రమ కార్యకలాపాల నుంచే కాకుండా విశ్వవిద్యాలయం భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చేయాలని చూస్తోంది.

జియో ఫెన్సింగ్ అంటే..

శాటిలైట్, జీపీఎస్ సాయంతో వర్సిటీ సరిహద్దు చుట్టూ ఒక వలయం ఏర్పాటు చేయొచ్చు. ఇది మనం చూసే కంచెలా ఉండదు. వర్చువల్‌గా మాత్రమే ఉంటుంది. ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరిగినా వెంటనే పర్యవేక్షణ అధికారులకు సమాచారం చేరుతుంది. ఆ వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)తో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకోవాలని యోచిస్తోంది. ఎన్ఆర్ఎస్‌సీ కార్టోశాట్-3 శాటిలైట్ సాయంతో క్యాంపస్ హైక్వాలిటీ చిత్రాలను ఎప్పటికప్పుడు తీస్తూ పంపిస్తుంది. ఈ చిత్రాలను ముందుగా ఉన్న చిత్రాలతో పోల్చుకుని ఏదైనా మార్పులు జరిగినా, అనధికారిక నిర్మాణాలు జరిగినా వెంటనే అధికారులు రంగంలోకి దిగుతారు. ఈ చిత్రాలు ఎంత క్లియర్‌గా ఉంటాయంటే కనీసం చిన్నపాటి రాయి కదిలినా అందులో గుర్తుపట్టొచ్చు.

వీసీ నియామకంతో ముడి..

ఈ ఐడియా బాగున్నా.. వర్సిటీకి పూర్తిస్థాయి వైస్ చాన్స్‌లర్ లేకపోవడంతో ఈ ప్రణాళికలు ముందుకు సాగట్లేదు. వీసీ నియామకం తర్వాత దీని గురించి చర్చించి అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. వర్చువల్ కంచెతో ఓయూ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవచ్చని, భావితరాలకు అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: వచ్చేనెల 1 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే అఖిల భారత పశుగణన కార్యక్రమం పోస్టర్‌ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని పశుజాతులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలతో పాటు అన్నిరకాల పశు సంపద గణన జరుగుతుందన్నారు. పశుగణన కోసం ఇంటికి వచ్చే విషయ సేకరణ దారులకు మీ పశువుల సమగ్ర సమాచారం అందించాలని, తద్వారా పశుగణన రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలని ఆయన తెలిపారు. జిల్లాలో పశుగణన కోసం 127 మంది ఎన్యుమరేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లు 92 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పశుగణన చేపడతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశు సంవర్థక అధికారి డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, డీఈవో ఆర్.రోహిణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

లిబర్టీ: నగరంలో ఆకాశహర్మ్యాలు, అందమైన భవనాలు నిర్మిస్తున్నా భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో మాత్రం వెలుగులేదని, వారి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ భవన నిర్మాణ సంఘం ఏఐటీయూసీ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు, అదే సహజ మరణం పొందితే రూ.5 లక్షలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లోని క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించి అమలు చేయాలని, అడ్డాలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. 1996 చట్టాన్ని ఇష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, కార్మికుల పక్షాన ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌గౌడ్

ఏసీబీకి చిక్కిన అధికారి

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సహకార శాఖ అధికారి ఏసీబీకి చిక్కారు. ఏసీబీ సిటీ రేంజ్-2 డీఎస్పీ శ్రీధర్ కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో బొమ్మల శ్రీనివాస్ రాజు అసిస్టెంట్(అర్బిట్రేటర్) రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. నవభారత్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ కేసులో ఫిర్యాదుదారు సహాయం చేయాలని అర్బిట్రేటర్‌గా ఉన్న శ్రీనివాస్ రాజును కోరారు. ఫిర్యాదుదారుకు ఫేవర్ చేసేందుకు రూ.5 లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.లక్ష ఇస్తానన్నాడు. ఈ విషయమై 24వ తేదీన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు రూ.లక్ష నగదు తీసుకొని గురువారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. తన కారు కలెక్టర్ కార్యాలయం పార్కింగ్‌లో ఉందని, అందులో పెట్టాలని శ్రీనివాస్ రాజు సూచించారు. వెంటనే ఏసీబీ అధికారులు శ్రీనివాస్ రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

నగరంలో నేడు

- అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం భవన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఎలక్ట్రికల్ ట్రేడర్స్ అసోసియేషన్(సెటా) ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎలక్ట్రి ఎక్స్‌పో-2024 జరుగుతుంది.
- ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా సాయంత్రం 4 గంటలకు జూబ్లీహిల్స్ రోడ్ నెం.55లోని పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించనున్నారు. అదేవిధంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని భోలనగర్‌కి చెందిన మస్జిద్ ఈ బాఖి మసీదును కూడా సందర్శించనున్నారు.
- యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో మాదాపూర్ నాలెడ్జ్ సిటీ రోడ్‌లోని ది ఖోరం హైదరాబాద్‌లో ఉదయం 10.30 గంటలకు రౌండ్ టేబుల్ కన్వెర్షన్ ఆన్ సస్టేనబుల్ ఫ్యాషన్ జరుగుతుంది.
- విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు జాబ్‌మేళా జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

న్యూ పెన్షన్ స్కీమ్ వద్దు : సీపీఎస్‌టీఈఏటీఎస్

సాక్షి,సిటీబ్యూరో: కొత్త పెన్షన్ విధానం(ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి ని పునరుద్ధరించాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ టీచర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సీపీపీఎస్‌టీఈఏటీ ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థించారు. గురువారం సీపీఎస్ ఉద్యోగులు న్యూపెన్షన్ స్కీమ్ రద్దు కోరుతూ ట్విట్టర్ లో ఉధృతంగా నినదించారు. కేంద్రం యూపీఎస్ పేరిట చేసిన ప్రతిపాదన సైతం ఆమోదయోగ్యం కాదన్నారు.

రియాల్టీ రంగంలోకి ఎమ్ఎస్ఎన్ సంస్థ



- 20 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రణాళికలు
- ఎమ్ఎస్ఎన్ గ్రూప్ వ్యవస్థాపకులు ఎమ్ఎస్ఎన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఫార్మా రంగంలో విశేష పరిశోధనలతో ప్రసిద్ధిగాంచిన ఎమ్ఎస్ఎన్ సంస్థ రియాల్టీ రంగంలోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా నగరంలోని ఐటీసీ కోహినూర్ వేదికగా ఎమ్ఎస్ఎన్ రియాల్టీని గురువారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఎమ్ఎస్ఎన్ గ్రూప్ వ్యవస్థాపకులు ఎమ్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాతో పాటు సామర్థ్యమున్న రంగాల్లో రియల్ ఎస్టేట్ ఒకటి. అందుకే ఈ రంగంలోకి ప్రవేశించి వినూత్న ప్రణాళికలతో దాదాపు 20 మిలియన్ చదరపు అడుగుల నివాస, వాణిజ్య స్థలాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. మొదటగా ఎగువ మధ్యతరగతి కుటుంబాలను ఎంచుకోగా భవిష్యత్‌లో ప్రీమియం అపార్ట్‌మెంట్లు, ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఆధునిక పట్టణ జీవన అవసరాలను తీర్చే నిర్మాణాలు, హెచ్ఐజీ, ఎమ్ఐజీ వంటి వాటికి కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం నియోపోలిస్‌లో 15 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంచిరేవుల, తెల్లాపూర్, పటాన్‌చెరు, ఇస్నాపూర్ వంటి ప్రదేశాల్లో కొనసాగిస్తామని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న బఫర్ జోన్ల వివాదాలను దృష్టిలో పెట్టుకుని కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా, రియాల్టీ నిబంధనలకు లోబడి పారదర్శకంగా, నిబద్ధతతో ప్రాజెక్టులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పరిశోధనల రంగం నుంచి వచ్చాం కాబట్టి ఈ రంగంలోనూ అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాకే పనులు కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో పలువురు రియల్ రంగ ప్రముఖులు, ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైనర్లు పాల్గొన్నారు.

బీసీ నేతల ఆమరణ దీక్షకు మద్దతు

బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

గాంధీఆస్పత్రి: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బీసీ నేతలు చేపట్టిన ఆమరణ దీక్ష సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఐదో రోజు గురువారం కొనసాగింది. సమగ్ర బీసీ కులగణన చేపట్టాలని, 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్, హిందు బీసీ మహాసభ అధ్యక్షులుడు బత్తుల సిద్దేశ్వర్ ఆమరణ దీక్ష చేపట్టగా, దీక్షలను భగ్నం చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి వైద్య చికిత్సల నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించిన సంగతి విదితమే. ఆస్పత్రిలోనూ ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న బీసీ నేతలను గురువారం గాంధీ ఆస్పత్రిలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కోశాధికారి ఆకారం రమేష్ పరామర్శించి మద్దతు ప్రకటించారు. డిమాండ్ల సాధనకు శాంతియుతంగా దీక్ష చేపట్టిన బీసీ నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. బీసీ నాయకుల ఆందోళనకు మద్దతు ప్రకటించేందుకు వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో సాధారణ రోగులకు అసౌకర్యం కలగకుండా గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనం మూడవ అంతస్తులో ఉన్న బీసీ నేతలను రెండవ అంతస్తులోని ప్రత్యేక వార్డుకు తరలించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ రాజ్యసభ సభ్యులు హన్మంతరావు తదితరులు సైతంపరామర్శించి, సంఘీభావం తెలిపారు.



యువకుడి దారుణ హత్య

- డబ్బుల విషయంలో గొడవ
- మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తుల దాడి



మేడ్చల్‌రూరల్: డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడటంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అమలాపురానికి చెందిన తాళ్లబత్తుల కళ్యాణ్(26) కొన్నేళ్ల క్రితం కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వచ్చి ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో అతను మేడ్చల్ పారిశ్రామిక వాడ పరిధిలోని కేఎంపీ ఫుడ్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న సమయంలో తోటి కార్మికుడు గౌడవెల్లి గ్రామానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. దీంతో కళ్యాణ్ తరచూ గౌడవెల్లిలోని మిత్రుడి ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో కళ్యాణ్ ఓ రోజు మిత్రుడి ఇంట్లో నుంచి రూ.20 వేలు ఎత్తు కెళ్లాడు. ఈ విషయం తెలిసిన అతను కళ్యాణ్‌కు ఫోన్‌చేసినా స్పందించకపోగా అతని కంటపడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక వైన్స్‌షాప్ సమీపంలో కళ్యాణ్ కనిపించడంతో అతను కళ్యాణ్‌ను పట్టుకుని తన డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అంతేగాక సదరు యువకుడు తన స్నేహితులు మరో ఇద్దరితో కలిసి కళ్యాణ్‌ను ఒత్తిడి చేయగా తన వద్ద డబ్బులు లేవని తన ద్విచక్ర వాహనం హాస్టల్‌లో ఉందని దాన్ని అమ్మేసి డబ్బులు చెల్లిస్తానని లేని పక్షంలో వాహనం అప్పగిస్తానని చెప్పడంతో వారు హాస్టల్ వద్దకు చేరుకున్నారు. హాస్టల్ యజమానిని తన బైక్ ఇవ్వాలని కోరగా హాస్టల్ ఫీజు పూర్తిగా చెల్లిస్తేనే వాహనం ఇస్తానని చెప్పడంతో వారు కళ్యాణ్‌తో ఘర్షణకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు కళ్యాణ్‌పై గ్యాస్ పైపులు, వైర్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన కళ్యాణ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు 108 సిబ్బందిని రప్పించి కళ్యాణ్‌ను పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్న అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. కాగా మృతుడు కళ్యాణ్ హాస్టల్ ఫీజు కట్టేందుకు ఇంటి నుంచి రూ.17 వేలు తీసుకుని వచ్చినట్లు అతడి కుటుంబసభ్యులు తెలిపారు.

హైదరాబాద్‌ తూర్పున టెంపుల్‌ టూరిజానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఇష్టదైవాన్ని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఇటీవల భువనగిరి పట్టణ శివారులో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆధ్యాత్మిక భక్తులను అమితంగా ఆకట్టుకుంటోంది. నిత్యం వేల సంఖ్యలో సందర్శకులు, యాత్రికులు క్యూ కడుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఈ ఆలయాన్ని తీర్చిదిద్దడం విశేషం. దీంతో పాటు దేవాలయం పరిసర ప్రాంతాల్లో అనేక ఇతర ఆధ్యాత్మిక మందిరాలు సైతం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.. - సాక్షి, సిటీబ్యూరో, యాదాద్రి







'సూత్ర' వస్త్ర ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: పండుగలు, పర్వదినాల కోసం ధరించేందుకు అరుదైన సంప్రదాయ వస్త్రాల ఎగ్జిబిషన్‌ గురువారం ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని తాజ్‌ కృష్ణలో విస్తృత శ్రేణి వస్త్ర ప్రదర్శన శుక్ర, శనివారాల్లో కొనసాగనుంది. 'సూత్ర' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో సంప్రదాయ దుస్తులతో పాటు వివిధ దేశాల నుంచి ఎంపిక చేసి తీసుకొచ్చిన సరికొత్త ఫ్యాషన్‌ దుస్తులు అందుబాటులో ఉంచారు. వస్త్రాలే కాకుండా ఫ్యూజన్‌ వేర్, యాక్ససరీస్, జ్యూయలరీ, బ్యాగ్స్, గృహ అలంకరణ సామాగ్రి, లైఫ్‌ స్టైల్‌ వస్తువులతో పాటు గిఫ్ట్‌ ఆర్టికల్స్‌ వంటి ఎన్నో వినూత్న వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. భారతీయ సంప్రదాయంతో పాటు అంతర్జాతీయ ఫ్యాషన్‌ సమ్మిళితంతో అనేక ఉత్పత్తులు లభ్యం అవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.




మెక్‌డొనాల్డ్స్‌లో.. క్రిస్పీ ఫ్రైడ్‌ చికెన్‌..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని తమ అన్ని రెస్టారెంట్స్‌లో క్రిస్పీ ఫ్రైడ్‌ చికెన్‌ను మెనూలో నూతనంగా జతచేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా ప్రముఖ సినీ నటుడు కిచ్చా సుదీప్‌ (ఈగ ఫేం) తమ మెక్‌డొనాల్డ్స్‌ రెస్టారెంట్‌ గ్రూప్‌కు బ్రాండ్‌ అంబాసిడర్‌గా ఎంపికయ్యారని, లెట్‌ ద క్రంచ్‌ టేకోవర్‌ అనే తమ ప్రచారం ద్వారా సిటీలోని చికెన్‌ లవర్స్‌కు చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మెహ్‌ఫిల్‌ ఏ సూఫీ..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సూఫీ గాయకుడు తేజాస్‌ గంభీర్‌ నగరంలో ప్రదర్శన ఇవ్వనున్నారు. జూబ్లీ హిల్స్‌లోని ఇల్యూజన్‌ క్లబ్‌ అండ్‌ కిచెన్‌లో శుక్రవారం మెహ్‌ఫిల్‌ ఏ సూఫీ పేరిట శ్రోతలను రంజింపజేయనున్నారు. సున్నితమైన మెలొడీ సంగీత నేపథ్యంలో బాలీవుడ్‌ గీతాలతో పాటు సూఫీ గానాలాపనతో.. ఆహ్లాదభరితంగా సాగే ఈ ఈవెంట్‌ అహూతులను మంత్రముగ్ధుల్ని చేస్తుందని నిర్వాహకులు అంటున్నారు. ఈ లైవ్‌ కన్సర్ట్‌ రాత్రి 8 గంటలకు ప్రారంభం అవుతుంది.



నేడు నగరంలో 'కింగ్‌' లిజనింగ్‌ పార్టీ

సాక్షి, సిటీబ్యూరో: మన దేశపు అగ్రగామి హిప్‌ హాప్‌ ర్యాప్‌ సింగర్‌ కింగ్‌.. నగరంలో నేడు ప్రదర్శన ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ పార్టీ వేదిక 'ఎయిర్‌ లైవ్‌'లో ఆయన తన కొత్త ఆల్బమ్‌కు సంబంధించిన లిజనింగ్‌ పార్టీ సమర్పించనున్నారు. గతంలో రెండు సార్లు నగరంలో తన ప్రదర్శన ఇచ్చిన కింగ్‌కు సిటీ యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ ఉంది. ఈ నేపథ్యంలోనే తన మోనోపలీ మూవ్స్‌ లిజనింగ్‌ పార్టీ టూర్‌లో ఆయన నగరానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చారు. ఈ ఈవెంట్‌ రాత్రి 7గంటలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.



హైదరాబాద్‌ వైబ్స్‌

ఆధ్యాత్మిక సిరి స్వర్ణగిరి

అందరి నోటా ఇదే మాట

ఆకట్టుకుంటున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

సమీపంలో మరికొన్ని పుణ్య క్షేత్రాలు

అందుబాటులో రైలు, రోడ్డు మార్గాలు

భువనగిరిలోని స్వర్ణగిరితోపాటు కొలనుపాకలో వెలసిన జైన మందిరం, జగద్గురు రేణుకాచార్యులు ఉద్భవించిన చండికాండ సహిత సోమేశ్వరాలయాలకు సైతం భక్తుల తాకిడి కనిపిస్తోంది. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఇదే ప్రాంతంలో ఉండనే ఉంది. ఒక్క రోజులో దేవాలయాలన్నీ చుట్టి రావచ్చు. వారాంతం, సెలవు రోజుల్లో ఆధ్యాత్మిక పర్యాటకుల తాకిడి మరింత పెరుగుతోంది.

భక్తులతో కిటకిట..

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ఈ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు గడిచిన నాలుగు నెలలుగా భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. నిత్యం భక్తులతో కిటకిటలాడే యాదగిరి గుట్టకు రోజుకు సుమారు 40 వేల మంది భక్తులు సందర్శించుకుంటుండగా, తాజాగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరాలయంలోనూ సుమారు 25 వేల మంది భక్తులు వస్తున్నారని అంచనా వేస్తున్నారు. వారాంతం, సెలవు రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాను పోలి ఉండటంతో అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాలకు చెందినవారే కాకుండా ఆంధ్రప్రదేశ్‌ నుంచి సైతం భక్తులు దేవాలయాలను దర్శించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తెలియనివారుండరు. తాజాగా స్వర్ణగిరి ఆదే స్థాయిలో గుర్తింపు పొందుతోంది. వరంగల్‌ జాతీయ రహదారికి అనుకుని ఆలయాలు రూపుదిద్దుకోవడం, బస్సు, రైళ్ల సదుపాయాలూ ఉండటంతో ప్రయాణం మరింత సులభంగా మారుతోంది. అదే సమయంలో విశాలమైన రహదారి సదుపాయాలు ఉన్నాయి. దీంతో సొంత వాహనాల్లోనూ పెద్ద సంఖ్యలోనే వస్తున్నారు. స్వర్ణగిరి ఆలయంలో భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదాలు అందిస్తున్నారు.



ప్రయాణం ఇలా..

హైదరాబాద్‌ నుంచి సుమారు 55 కిలోమీటర్ల దూరంలో స్వర్ణగిరి దేవాలయం ఉంది. ఈ ఆలయానికి సమీపంలోనే యాదగిరి గుట్ట, కొలనుపాక ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు వెళ్లేందుకు వరంగల్‌ జాతీయ రహదారి ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం వేలాదిగా బస్సులు, కార్లు, ఇతర రవాణా వాహనాలు ఆ మార్గంలో నడుస్తున్నాయి. ఉప్పల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆర్టీసీ బస్సులను నడిపిస్తుంది. కొలనుపాక వెళ్లాలనుకునే జైన భక్తులు ఆలేరు నుంచి ఆరు కిలో మీటర్లు వెళ్లాలి. సికింద్రాబాద్‌ నుంచి ఖాజీపేట మార్గంలో వెళ్లే కృష్ణా, గోల్కొండ, భాగ్యనగర్, కాకతీయ, పుష్పుల్, ఇంటర్‌ సిటీ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు భువనగిరి, యాదాద్రి, ఆలేరు రైల్వే స్టేషన్లలో ఆగుతాయి. అక్కడి నుంచి ఆటో, బస్సులో వెళ్లవచ్చు.

మరికొన్ని దర్శనీయ ప్రాంతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, స్వర్ణగిరి ఆలయంతో పాటు తెలంగాణలో పేరొందిన పది దేవాలయాలు ఉన్నాయి.. ఆ వివరాలు...

- అలంపూర్‌ జోగులాంబ దేవాలయం
- బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం
- వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం
- కొండగట్టు వీరాంజనేయస్వామి దేవాలయం
- యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం
- చిలుకూరు బాలాజీ దేవాలయం
- ఖర్మన్‌ఘాట్‌ హనుమాన్‌ దేవాలయం
- ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

తిరుపతి ఫీల్‌ ఉంది



కుటుంబ సభ్యులతో కలసి స్వర్ణగిరి, యాదగిరి గుట్ట, ఆ చుట్టూ ఉన్న టెంపుల్స్‌ వెళ్లాము. స్వర్ణగిరి కొత్తగా కడుతున్నారు. అక్కడికి వెళ్లగానే తిరుపతి ఫీల్‌ ఉంటది. యాదగిరి గుట్ట కొత్తగా కట్టిన తరువాత తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ చూడాలి. ఒక్క రోజులో దేవాలయాలన్నీ దర్శనం చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చేశాం. ఆధ్యాత్మిక టూర్‌ ప్లాన్‌ చేసుకున్నవారికి ఇది బాగుంది. - జలజా రెడ్డి, మణికొండ




సనాతనమే.. సమాధానం

పురాణ కథలు, వేదాలు సరళమైన భాషలో

నిద్రలేమి నుంచి నిలకడ లేమి దాకా ఆధునిక సమస్యలన్నింటికీ సనాతనం సమాధానం చెప్పింది అంటున్నారు నగరానికి చెందిన ఇండియన్‌ వేదిక్‌ స్కూల్‌ ఫౌండేషన్‌ డైరెక్టర్‌ డా. విక్రమ్‌రాజు.. కఠినమైన గణితం నుంచీ సంక్లిష్ట మానవ సంబంధాల దాకా విడమరిచి చెప్పాయనే పురాణాలను, శాస్త్రాలను స్తుతిస్తారు. ఆధునికులకు వాటిని అందించడం అంటే సమస్యల నుంచి విముక్తి కల్పించడమే అంటున్నారు. ఈ ఆలోచనలకు అనుగుణంగా తాను 2017లో ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి కృషి చేసి సులభంగా అర్థమయ్యే రీతిలో వందలాది పుస్తకాలను, మెటీరియల్‌ను రూపొందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూపొందిన ఈ పుస్తకాలు వచ్చే నెల్లో పాఠశాలలకు అందుబాటులోకి తెస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో తన ఆలోచనలను పంచుకున్నారిలా...

- సాక్షి, సిటీబ్యూరో



దశావతారాన్ని మించిన మానవ పరిణామక్రమ సిద్ధాంతం లేదు. దీని ఆధారంగా మానవ పరిణామ క్రమానికి సంబంధించి 50 థియరీల పుస్తకంతో సహా విభిన్న కేటగిరీల్లో 150 బుక్స్‌ రూపొందించాం. ఆన్‌లైన్‌లో ఇండియన్‌ వేదిక్‌ స్కూల్‌ డాట్‌ కామ్‌లో 25 రకాల ఫ్రీ రికార్డెడ్‌ కోర్సులు తెలుగులో ఉండగా, కొన్ని ఇంగ్లిష్‌లో ఉన్నాయి. యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకుని కూడా చదువుకోవచ్చు.

'చిరు'నవ్వుల యోగం..

ఆరేళ్ల చిన్నారికి ఎలాంటి యోగా నేర్పాలి? ఎవరికీ తెలియని పరిస్థితిలో 1 నుంచి 10వ తరగతి దాకా ఉపయోగపడేలా యోగా, చక్రాస్, ముద్రాస్, ధ్యాన విశేషాలతో బుక్స్‌ తయారు చేశాం.

వేదం.. నిత్యజీవన నాదం..

వేదాలు, పురాణాలను సరిగా అర్థం చేసుకుంటే నిత్య జీవితంలో ఎన్నో చిక్కుముళ్లు విడిపోతాయి. అయితే నేటి చిన్నారులకు ఇవేవీ అందుబాటులో లేవు. అందుకే రుగ్వేదం, సామవేదం, అధర్వణ వేదం, యజుర్వేదం వంటివన్నీ అర్థమయ్యే రీతిలో అందిస్తున్నాం.

మన గణితం.. ఘన చరితం..

ప్రస్తుత ఇంగ్లిష్, మ్యాథ్స్‌ రైట్‌ నుంచి లెఫ్ట్‌కి వెళితే.. వేదిక్‌ మ్యాథ్స్‌లో లెఫ్ట్‌ నుంచి రైట్‌కి చేస్తాం. ఒక నిమిషం పట్టే గణిత సమస్యను, వేదిక్‌ మ్యాథ్స్‌ వల్ల ఒక సెకనులోనే చేసేయవచ్చు. అందుకే క్లాస్‌–1 నుంచి క్లాస్‌–8 వరకూ ఈ కోర్సు మెటీరియల్‌ తయారు చేయించాం.

వేదిక్‌ సైన్స్, హెర్బాలజీలు పుస్తకాలుగా..


బొమ్మరిల్లు సైతం కొత్త రూపంలో తెస్తున్న వేదిక్‌ స్కూల్‌..

పురాణం.. ఆభరణం..

మొత్తం 18 పురాణాలు క్లుప్తీకరించి ఒక్కొక్కటి 100 పేజీల చొప్పున చేయించాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మహాభారతం కథ దశరథుడితో ప్రారంభమైతే, మేం అంతకన్నా ముందున్న బ్రహ్మ నుంచి స్టార్ట్‌ చేశాం. అలాగే రాముడు 81వ రాజు ఆయన కన్నా ముందున్న గొప్ప రాజుల గురించి కూడా ఇచ్చాం. మహాభారతంలో కౌరవ పాండవుల భాగం కన్నా ముందున్న కథని కూడా కలిపి అందిస్తున్నాం

మెటీరియల్‌ వర్క్‌ మొదలైంది..

పలు ప్రైవేటు పాఠశాలలతో ఒప్పందం చేసుకున్నాం. అలాగే అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ ఈ మెటీరియల్‌ అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నాం. ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి తెచ్చాం. ఇవి చదివిన వారికి పరీక్ష నిర్వహించి పొట్టి శ్రీరాములు వర్సిటీ వారి సర్టిఫికెట్‌ అందిస్తున్నాం. చిన్నారులకు యోగా నేర్పేందుకు సెట్విన్‌తో కూడా ఒప్పందం చేసుకున్నాం.



సహకరిస్తే.. సాధిస్తాం..

ప్రభుత్వం స్పందించి సహకారం అందిస్తే దేశంలోనే ఎక్కడా లేని స్థాయిలో భారీగా వేదిక్‌ స్కూల్‌ క్యాంపస్‌ పెడదాం అనుకుంటున్నాం. సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు ప్రతి రోజూ 1వ క్లాస్‌ నుంచి 10వ తరగతి వరకూ యోగా, వేదిక్‌ మ్యాథ్స్, వేదిక్‌ సైన్సెస్‌.. భారతీయ సంప్రదాయ నృత్యాలు, క్రీడలు, వేదాలు ఒకే క్యాంపస్‌లో నేర్చుకుంటే భావితరం దృక్పథం చాలావరకూ మారిపోతుంది. కనీసం 100 మంది నిరుపేద చిన్నారులకు ఉచిత ఆశ్రయమిచ్చి ఆ తర్వాత వారినే అక్కడ టీచర్లుగా తయారు చేయాలి.. ఇలాంటి ఆలోచనలతో మా ఫౌండేషన్‌ పనిచేస్తోంది.

బొమ్మరిల్లు..కొత్తగా...

మన చిన్నప్పుడు బొమ్మరిల్లు ఎంతగా ఆదరణ పొందిందో తెలిసిందే. మేం గత 2012లో బొమ్మరిల్లు పబ్లికేషన్స్‌ను సొంతం చేసుకున్నాం. ఆ కథల రీతిలో నైతిక విలువలు జొప్పించిన పురాణేతిహాసాల్లోని కథలను సంక్షిప్తంగా అందిస్తున్నాం. అలాగే ముఖ్యమైన దేవతలు 50 మంది గురించి సింప్లిఫై చేసి 100 పేజీల్లో రాయించాం.





1న 'రావణ కృత శివతాండవ స్తోత్రం

ఉప్పల్‌: స్థానిక శిల్పారామం వేదికగా ఐసీఎండీఏ సారథ్యంలో ప్రపంచ రికార్డును నెలకొల్పే మెగా ఈవెంట్‌ 'రావణ కృత శివ తాండవ స్తోత్రం' సెప్టెంబర్‌ 1న సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఐసీఎండీఏ అధ్యక్షులు సంగీత కళానిధి కన్యాకుమారి, ఫౌండర్‌ నాద బ్రహ్మ ఈఆర్‌ జనార్ధన్‌ తెలిపారు. ఈ మెగా ఈవెంట్‌కు విశిష్ట అతిథులుగా కేంద్ర సంగీత అకాడమీ అవార్డు గ్రహీత ప్రొ.అలేఖ్య పుంజాల, ప్రముఖ గాయకులు సంగీత రత్నాకర, డీఎస్‌వీ శాస్త్రి, జయలక్ష్మి అయ్యగారి, ప్రొ.అయ్యగారి సోమ సుందరం తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. మన దేశంలో ప్రముఖ పుణ్య క్షేత్రం కాశీ నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం ఏక కాలంలో చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్‌ నగరాల్లో ప్రారంభమవ్వనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 5000 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. అదే సమయంలో హైదరాబాద్‌ మహానగరం ఉప్పల్‌ శిల్పారామంలో 700 నుంచి 800 వరకూ కళాకారులు తమ ప్రతిభను చాటుకుంటారు. కూచిపూడి, భరత నాట్యం, వాయిద్యం, చిత్ర, సంగీత కళాకారులు పాల్గొంటారని కో–ఆర్డినేటర్స్, హైదరాబాద్‌ ఇన్‌ఛార్జీలు ఉమామహేశ్వరి, అరుణ శ్రీనివాస్, భవాని, విజయ్‌లు వివరించారు.





తిరుమల శ్రీవారి లడ్డూలు

లడ్డూలు ఇక రెండే

- తిరుమల శ్రీవారి ప్రసాదంపై టీటీడీ వివాదాస్పద నిర్ణయం
- కొత్త విధానం గురువారం నుంచే అమల్లోకి..

తిరుమల/తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి లడ్డూ అంటే భక్తులకు ఎంతో సెంటిమెంట్. స్వామివారి దర్శనం జన్మజన్మల పుణ్యఫలంగా భావించే వీరికి ఈ లడ్డూ ప్రసాదం స్వీకరించడం ద్వారా స్వామి అనుగ్రహం లభిస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే తిరుమలకు వచ్చేవారు సరాసరి 10–20 లడ్డూలను తీసుకెళ్తారు. ఇలా తీసుకెళ్లిన వీటిని ఆఫీసుల్లో.. ఇంటి చుట్టుపక్కల వారికి భక్తిప్రపత్తులతో పంచిపెట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఇంత విశిష్టత కలిగిన శ్రీవారి లడ్డూపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తాజాగా ఆంక్షలు విధిస్తూ కోతలు పెట్టింది. ఉచితంగా ఇచ్చే లడ్డూకు అదనంగా కేవలం రెండు మాత్రమే విక్రయించాలని నిర్ణయించింది. పైగా.. ఆధార్ కార్డు ఉంటేనే అంటూ మెలిక పెట్టారు. దీనిని గురువారం నుంచే అమలుకు శ్రీకారం చుట్టారు. గతంలో కోరినన్ని లడ్డూలు ఇచ్చేవారని, ఇప్పుడు కొత్తగా ఉచిత లడ్డుతో పాటు కేవలం రెండు అదనపు లడ్డూలకే పరిమితం చేయడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం దళారీ వ్యవస్థను అరికట్టేందుకు భక్తులు కోరినన్ని లడ్డూలు ఇస్తే కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వ నిర్ణయం దళారీ వ్యవస్థను పెంచిపోషించేలా ఉందని వారు విమర్శిస్తున్నారు.

కేవలం రెండు లడ్డులే ఇస్తామన్నారు..



మేం బుధవారం దర్శనానికి వెళ్లి వచ్చాం. ఈరోజు లడ్డూ కొనడానికి కౌంటర్‌కు వెళ్తే టికెట్ లేకుంటే లడ్డూ ఇవ్వడం సాధ్యంకాదని కౌంటర్‌లోని వ్యక్తి చెప్పాడు. ఆధార్ కార్డు చూపితే కేవలం రెండు లడ్డూలు మాత్రమే ఇస్తామని చెప్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మాకు ఇలా ఆంక్షలు పెడితే ఎలా?

– దివ్య, కలకడ, అన్నమయ్య జిల్లా

దళారులను అరికట్టేందుకే ఈ నిర్ణయం..



ఆధార్‌తో లడ్డూ ప్రసాదాలు విక్రయించేందుకు చర్యలు తీసుకున్నాం. సోషల్ మీడియాతో పాటు, కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా చానళ్లల్లో ప్రసారమవుతున్న నిరాధార ఆరోపణలను భక్తులు నమ్మొద్దు. భక్తులు లడ్డూ కౌంటర్లలో తమ ఆధార్ కార్డును నమోదు చేసుకుని రెండు లడ్డూలు పొందవచ్చు. దళారులను అరికట్టేందుకే టీటీడీ ఇలా నిర్ణయించింది.

– టీటీడీ అదనపు ఈఓ. వెంకయ్య చౌదరి

సీఎం హోదాలో ఉండి సుప్రీం తీర్పుపై వ్యాఖ్యలా!

కవితకు బెయిలుపై రేవంత్‌రెడ్డి స్పందనపై న్యాయమూర్తుల తీవ్ర అసంతృప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవితకు బెయిలు మంజూరుపై స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అలా ఎలా మాట్లాడతారంటూ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ తప్పుబట్టారు. ఇలాంటి ప్రకటనల వల్ల ప్రజల్లో భయాందోళనలు కలగొచ్చని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిందితుడిగా ఉన్న ఓటుకు కోట్లు కేసు దర్యాప్తు హైదరాబాద్ నుంచి భోపాల్‌కు బదిలీ చేయాలంటూ, బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్, మొహమ్మద్ అలీలు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ గవాయి, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మార్పు అంశం ప్రస్తావనకు వచ్చిన సమయంలో.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య కుదిరిన ఒప్పందం వల్లే కవితకు బెయిలు వచ్చిందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తులు ఘాటుగా స్పందించారు.



మనస్సాక్షి ప్రకారమే విధులు నిర్వర్తిస్తాం

'సుప్రీంకోర్టు తీర్పులపై వచ్చే విమర్శలు పట్టించుకోబోం. మాకెలాంటి ఇబ్బందీ లేదు. మనస్సాక్షి ప్రకారమే విధులు నిర్వర్తిస్తాం. ఇష్టం ఉన్నా లేకపోయినా మా విధులు మేం నిర్వర్తిస్తాం. కానీ న్యాయమూర్తులను అవమానించేలా ఇలాంటి ప్రకటనలు చేయకూడదు. ఆ తరహా ప్రకటనలు ఎలా చేయగలరు? రాజకీయ పార్టీలతో సంప్రదించిన తర్వాత ఆదేశాలు జారీ చేయాలా? రాజకీయ సంప్రదింపుల వరకూ వేచి ఉండాలా? సుప్రీంకోర్టు ఆదేశాలపై వ్యాఖ్యలు చేసే ధైర్యం ఎవరికైనా ఉంటే, మా తీర్పులపై గౌరవం లేకుంటే.. కేసు విచారణ సుప్రీంకోర్టులో కాకుండా మరెక్కడైనా జరగనివ్వండి..' అంటూ జస్టిస్ గవాయి ఘాటుగా వ్యాఖ్యానించారు.

పదే పదే అలాంటి వ్యాఖ్యలా?

'ఆ తరహా వ్యాఖ్యలు..మళ్లీ గురువారం ఉదయం కూడా! బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తొలి వంద రోజుల్లోనే ఈ తరహా స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. కోర్టుపై ఆక్షేపణలు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి చేసే బాధ్యతాయుతమైన ప్రకటనేనా ఇది? న్యాయవ్యవస్థకు ఆమడ దూరంలో ఉండడమే కార్యనిర్వాహకుల ప్రాథమిక విధి. విమర్శించండి.. కానీ ఆక్షేపణలు వద్దు..' అని జస్టిస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

అలాగైతే న్యాయాధికారులపై విశ్వాసం లేనట్లే అవుతుంది..

'ఓటుకు నోటు కేసు విచారణ బదిలీ చేయాలన్న పిటిషన్లు విచారణకు స్వీకరిస్తే న్యాయాధికారులపై కోర్టుకు విశ్వాసం లేనట్లే అవుతుంది. ఎన్నికల సమయంలో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తారు. చట్టసభల్లో జోక్యం చేసుకోబోమని ఎప్పుడూ చెబుతుంటాం. వారికీ ఇది వర్తిస్తుంది..' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచాలి

ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మా సనం.. స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తే దర్యాప్తుపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. గతంలో దర్యాప్తుపై స్టే ఇచ్చిన అంశం, సీబీఐకి బదిలీ తదితర అంశాలపై ఆరా తీసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంపై తెలంగాణకు చెందిన సహచరులను సంప్రదిస్తామని తెలిపింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తామని, అయితే ప్రస్తుత పిటిషన్‌ను కొట్టివేస్తామని పేర్కొంది. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంచాలని, అందరికీ విశ్వాసం కలిగేలా నియామకం చేపడతామని జస్టిస్ గవాయి చెప్పారు. ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రరావుతో పాటు మరో న్యాయవాది ఉమా మహేశ్వరరావు ఉత్తమమని భావిస్తున్నామ న్నారు. అయితే తమకు పోలీసు అధికారుల విషయంలో ఆందోళన ఉందని పిటిషనర్ల తరఫు మరో సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు చెప్పారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం లేదు: పిటిషనర్ల తరఫు న్యాయవాది

వ్యాఖ్యల సవరణకు ప్రయత్నిస్తామని తెలంగాణ ప్రభుత్వం తరఫు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అయితే జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని, అటువంటి వ్యాఖ్యలు న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకు రావడంతోపాటు దిగువ కోర్టులకూ వ్యాపించే అవకాశం ఉందని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సి.సుందరం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎం కావడంతో పాటు ఏసీబీని కూడా తన అధికార పరిధిలో ఉంచుకున్నారని, దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం ఉండదని అన్నారు. దర్యాప్తు అధికారులు కూడా మారారని చెప్పారు. గతంలో దాఖలు చేసిన కౌంటరుకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. పోలీసులపై కూడా రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యా ఖ్యలు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అని, ఏ వ్యక్తీ తన సొంత విషయంలో న్యాయ మూర్తి కాకూడదనే సహజ న్యాయసూత్రం గుర్తుచేశారు.

తిరిగి ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్!

- రైతాంగ సమస్యలపై పోరాటానికి కార్యాచరణ
- సభలు, సమావేశాలు నిర్వహించే యోచన
- ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎర్రవల్లి నివాసానికి పరిమితమైన బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టేలా కార్యాచరణకు పదును పెడుతున్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా రాష్ట్రంలో పర్యటించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే కొందరు పార్టీ ముఖ్యనేతలతో చర్చించి ప్రజల్లోకి వెళ్లాల్సిన తీరుపై ప్రాథమికంగా ఓ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇదే అంశంపై మరోమారు పార్టీ నేతలతో మరింత లోతుగా చర్చించి ఒకట్రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టేందుకు కేసీఆర్ ప్రత్యక్షంగా జనంలోకి వెళ్లాలని పార్టీ నేతలు సూచిస్తున్నట్లు తెలిసింది.

రుణమాఫీ, రైతు బంధు వైఫల్యంపై..

రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ కష్టాలతోపాటు రుణమాఫీ జరగకపోవడం, రైతుబంధు ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతు సంక్షేమం కేంద్రంగా అమలు చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. రుణమాఫీ, రైతు భరోసా అంటూ ఎన్నికల హామీలను ఉల్లంఘిస్తున్న వైనాన్ని కేసీఆర్ ఎండగట్టనున్నారు. దీని కోసం లోక్‌సభ ఎన్నికల ప్రచారం తరహాలో బస్సు యాత్ర పెట్టాలా లేక భారీ సభలు నిర్వహించాలా అనే కోణంలో పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్, రైతులతో సభలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ కసరత్తు జరుగుతోంది.

అమెరికా పర్యటనకు కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుధవారం రాత్రి అమెరికా పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి సోదరి కవితతోపాటు హైదరాబాద్‌కు చేరుకున్న కేటీఆర్ కొద్ది గంటల వ్యవధిలోనే అమెరికాకు వెళ్లారు. తన కుమారుడు హిమాన్షుకు సంబంధించిన విద్యాపరమైన విషయాల కోసం కేటీఆర్ అమెరికాకు వెళ్లినట్లు సమాచారం. సెప్టెంబర్ రెండో వారంలో కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని సమాచారం. ఇదిలాఉంటే 'తండ్రి బాధ్యతల్లో అమెరికాకు వెళ్తున్నా' అనే అర్థం వచ్చేలా కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్‌పెట్టారు.

ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కి చేరుకున్న కవిత
- ఆప్యాయంగా హత్తుకున్న కేసీఆర్

మర్కూక్/గజ్వేల్/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ స్వాగతం లభించింది. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై హైదరాబాద్‌కు చేరుకున్న కవిత గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి భర్త అనిల్ కుమార్, కుమారుడితో కలిసి ఎర్రవల్లికి వెళ్లారు. ఎర్రవల్లిలోని నివాసానికి చేరుకున్న కవితను ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆప్యాయంగా హత్తుకున్నారు. కేసీఆర్ పాదాలకు నమస్కరించి తండ్రి చేతిని కవిత ఆప్యాయంగా ముద్దాడారు. కేసీఆర్ పాదాలకు కవిత నమస్కరిస్తున్న సమయంలో ఎర్రవల్లి నివాసంలో ఉద్విగ్న వాతావరణం కనిపించింది. పలువురు మహిళలు కవితకు దిష్టితీసి మంగళహారతులతో స్వాగతం పలికారు. అప్పటికే ఫామ్‌హౌస్‌లో ఉన్న ఎంపీ జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, మాజీ టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా కవితకు స్వాగతం పలికారు. కవిత రెండు గంటలకుపైగా ఫామ్‌హౌస్‌లో గడిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.



కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది

- ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం బాగుంది
- జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన
- అవార్డు గ్రహీతలను కలిసిన గవర్నర్

జనగామ, సాక్షి యాదాద్రి: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇక్కడకు గవర్నర్‌గా వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఓ మారుమూల గ్రామానికి రావడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. గురువారం జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించారు. రెండు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల ప్రముఖులు, కవులు, కళాకారులు, రచయితలతో భేటీ అయ్యారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న తర్వాత ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు చాలామంచి వ్యక్తులని, అందులో ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం సంతోషం కలిగించిందన్నారు. ఊరిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కొద్దిరోజుల్లో టూరిస్టు సెంటర్‌గా మారబోతుందని చెప్పారు. అంతకుముందు జనగామ జియోగ్రాఫికల్ వివరాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ రిజ్వాన్ బాష, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, సాహిత్యంలో యాదాద్రి టాప్..

సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరు చాలా ప్రభావవంతంగా ఉందన్నారు. వివిధ రంగాల్లో పద్మశ్రీ అవార్డులు పొందిన వారు ఎక్కువగా ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వివిధ రంగాలలో అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాలరెడ్డి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ శాలువాలతో సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎన్.గోపి, నిఖిలేశ్వర్, కాళోజీ పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర ప్రభుత్వ యువ పురస్కార గ్రహీత తిరునగరి శ్రీనివాస్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, నంది అవార్డు గ్రహీత ఎం.డి.అబ్దుల్, శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత లింగంపల్లి రామచంద్రం తదితరులతో గవర్నర్ సమావేశమయ్యారు. అనంతరం వారితో కలిసి రాత్రి భోజనం చేశారు.

ఆలయాల సందర్శన

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. అదేవిధంగా శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర దేవాలయాలను సందర్శించిన గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొలాల్లో సోలార్ ప్లాంట్లు

- రైతులు 4 వేల మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి
- పీఎం–కుసుం పథకం కింద కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయనున్న డిస్కంలు
- యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చెల్లించనున్న విద్యుత్ సంస్థలు



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద రైతులు/రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకంలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజ్ఞప్తి చేయడంతో కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాలకు కలిపి ఇప్పటివరకు 8,112 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు కేంద్రం అనుమతి ఇవ్వగా, అందులో అత్యధికంగా 4 వేల మెగావాట్ల ప్లాంట్లు రాష్ట్రా నికి సంబంధించినవే కావడం గమనార్హం. రైతులు వ్యక్తిగ తంగా లేదా ఇతరులతో కలిసి తమ పొలాల్లో 0.5 మెగా వాట్లు నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చిన్న సోలా ర్ పవర్ ప్లాంట్లను పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తారు. రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్పీవో) నిబంధనల ప్రకారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఏటా తప్పనిసరిగా కొంత శాతం పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్లాంట్ల ద్వా రా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా ఆర్పీఓ నిబంధనల కింద డిస్కంలు తప్పనిసరిగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులకు డిస్కంలు చెల్లించనున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు 0.40 పైసలు చొప్పున ఐదేళ్ల పాటు డిస్కంలకు కేంద్ర పునరు త్పాదక ఇంధన శాఖ ప్రోత్సాహకంగా అందించనుంది.

పెట్టుబడిలో 30% రైతుల వాటా

రైతులు స్వయంగా తమ స్థలాల్లో ప్లాంట్ పెట్టుకోవచ్చు. లేకుంటే సహకార సంఘాలు/పంచాయతీలు/రైతుల గ్రూపులు/నీటి వినియోగ సంఘాలతో కలిసి ఏర్పాటు చేయవచ్చు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ స్థలాలను లీజుకు ఇచ్చి ప్లాంట్ పెట్టించవచ్చు. మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సగటున 16 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా, రైతులు/డెవలపర్లకు రూ.50.08 లక్షల ఆదాయం రానుంది. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యయం మెగావాట్‌కు రూ.4 కోట్ల నుంచి రూ.4.5 కోట్ల వరకు కానుంది. ఇందులో రైతులు 30 శాతం పెట్టుబడి పెడితే మిగిలిన 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇచ్చే అవకాశం ఉంటుంది. 10–12 ఏళ్లలో రైతుల పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జనరల్ మేనేజర్ జీఎస్వీ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

త్వరలో ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం..

డిస్కంలు తమ 33/11 కేవీ, 66/11 కేవీ, 110/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా వాటి పరిధిలో ఎంత సామర్థ్యం మేరకు సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టేందుకు అవకాశం ఉందో గుర్తించి తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తైంది. త్వరలో రైతుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తూ డిస్కంలు ప్రకటన జారీ చేయనున్నాయి. ఆసక్తి గల రైతులు/డెవలపర్లు మెగావాట్‌కు రూ.,5000కి మించకుండా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రైతులు/డెవలపర్లు కుదుర్చుకునే విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఆధారంగా రైతులు/డెవలపర్లకు బ్యాంకులు రుణం ఇవ్వనున్నాయి.

'మార్గదర్శి' పై అప్పీళ్లు ఉపసంహరించుకున్న సీఐడీ

ఈనాడుకు బాబు గిఫ్ట్

సాక్షి, అమరావతి: 'కుమ్మక్కు బంధం' ఏపీ ప్రయోజనాలకు ఎంతటి విఘాతమో మరోసారి తేటతెల్లమైంది. పరస్పర ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఎలా పణంగా పెడతారో సీఎం చంద్రబాబు, ఈనాడు రామోజీ కుటుంబం మరోసారి రుజువు చేసింది. వైఎస్సార్‌సీపీ సర్కారుపై ఐదేళ్ల పాటు దుష్ప్రచారం చేసిన రామోజీ కుటుంబానికి టీడీపీ కూటమి ప్రభుత్వం కృతజ్ఞతాపూర్వకంగా 'కానుక'సమర్పించింది. అదీ రాష్ట్రంలో వేలాదిమంది మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల ప్రయోజనాలను కాలరాసి మరీ!! మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఆంధ్రప్రదేశ్ డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5 వర్తించదంటూ ప్రత్యేక కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను, అలాగే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన దాదాపు రూ.1,050 కోట్ల విలువైన ఆస్తుల జప్తును ఖరారు చేసేందుకు నిరాకరిస్తూ గుంటూరు కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన అప్పీళ్లను సీఐడీ ద్వారా ఉపసంహరింప చేశారు. ఈమేరకు సీఐడీ అదనపు డీజీ గురువారం హైకోర్టుకు నివేదించారు. దీంతో అప్పీళ్ల ఉపసంహరణకు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ వ్యాజ్యాలు తాజాగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముందు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (మెండ) లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. సీఐడీ కేసులన్నింటినీ తనకు అప్పగిస్తూ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ (ఈ అప్పీళ్లలో శైలజా కిరణ్ తరఫున వాదనలు వినిపించారు) ప్రొసీడింగ్స్ ఇచ్చారని నివేదించారు. అందువల్ల సీఐడీ తరఫున తాను హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ అప్పీళ్లను ఉపసంహరించుకోవాలంటూ సీఐడీ అదనపు డీజీ లేఖ రాశారన్నారు. దీంతో తాము తమ అప్పీళ్లను ఉపసంహరించుకుంటున్నట్లు అదనపు డీజీ రాసిన లేఖను కోర్టుకు సమర్పించారు. ఆ లేఖను పరిశీలించిన న్యాయస్థానం పీపీ లక్ష్మీనారాయణ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకుని నమోదు చేసింది. అప్పీళ్లను ఉపసంహరించుకున్న నేపథ్యంలో వాటిని పరిష్కరిస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు.

భారీ గురు దక్షిణ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఈనాడు పత్రిక ఐదేళ్ల పాటు సాగించిన విష ప్రచారానికిగానూ చంద్రబాబు ప్రభుత్వం నుంచి భారీ ప్రతిఫలాన్ని పొందింది. ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను, కీలక ప్రాజెక్టులను అటకెక్కించేసిన సీఎం చంద్రబాబు.. రామోజీ కుటుంబం కోసం మాత్రం రంగంలోకి దిగారు. సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు పూర్తిస్థాయిలో విచారణ జరిపి కింది కోర్టు ఉత్తర్వులను కొట్టివేస్తే మార్గదర్శి ఫైనాన్షియర్స్ మాదిరిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా ఇరుక్కుపోవడం ఖాయమని పసిగట్టి ఆ పరిస్థితి తలెత్తకుండా సీఐడీని రంగంలోకి దించి అనుకున్న విధంగా పని కానిచ్చేశారు. అంతేకాదు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉన్న కేసులను క్రమంగా ఎత్తివేసే దిశగా పావులు కదులుతున్నాయి. మార్గదర్శి విషయంలో రామోజీ కుటుంబం అక్రమాలకు పాల్పడినట్లు సీఐడీ గతంలో పూర్తి ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు సంఘం ఏర్పాటు చేసుకుని మరీ ఆందోళనలను నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటుఇతర రాష్ట్రాల్లోనూ బాధితులున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు నాలుగు రాష్ట్రాలకు విస్తరించడం, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినందున ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి సారించాలని సీఐడీ అధికారులు గతంలో కోరడం గమనార్హం.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి రూ.4,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసి చట్టపరంగా పీకల్లోతుల్లో కూరుకుపోయిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ యాజమాన్యం ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యవహారంలో ఇరుక్కోకుండా జాగ్రత్త పడుతోంది. తేడా వస్తే దాదాపు రూ.1,050 కోట్ల ఆస్తులు జప్తు అయ్యే అవకాశం ఉండటంతో బయట పడేందుకు వ్యూహాలను అమలు చేస్తోంది. ఇందుకు చంద్రబాబు సర్కారు, కీలక దర్యాప్తు సంస్థలు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయి. అందులో భాగంగా రామోజీరావు (ఇటీవల మృతి చెందారు) డైరెక్టర్‌గా, ఆయన కోడలు శైలజా కిరణ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఉన్న ఆరోపణలను నీరుగారుస్తోంది.

అప్పీళ్ల ఉపసంహరణతో జరిగేదిది...

తాజాగా అప్పీళ్లను సీఐడీ ఉపసంహరించుకోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు భారీ ఊరట లభించినట్లయింది. తద్వారా నామమాత్రమైన ఐపీసీ సెక్షన్ల కింద విచారణకు ఆస్కారం ఉంటుంది. దీని వల్ల మార్గదర్శి యాజమాన్యానికి వచ్చే నష్టం ఏమీ లేదు. ప్రత్యేక కోర్టులో విచారణ జరిగి మార్గదర్శి డిపాజిటర్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5 కింద ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలే పరిస్థితి ఉంటే దాని యాజమాన్యానికి, మేనేజర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా, అలాగే ఆ సంస్థకు రూ 5 లక్షల జరిమానా విధించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఈ పరిస్థితి నుంచి మార్గదర్శి, దాని యాజమాన్యం బయటపడినట్లే. అదే రీతిలో రూ.1050 కోట్ల ఆస్తుల జప్తు కూడా ఉండదు. ఎందుకంటే ఆ జప్తును ఖరారు చేసేందుకు గుంటూరు కోర్టు తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. ఇలా ఈ మొత్తం కేసును నీరుగార్చి దాన్ని కొట్టేసేందుకు సీఐడీ ఆస్కారం కలిగించింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 30-8-2024

స్ఫూర్తి


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న అఖిల

అన్నీ తానై.. తానే నాన్నయి

తండ్రి ఉన్నప్పుడు అఖిలకు చదువే లోకం. ఎప్పుడో తప్ప పొలానికి వెళ్లేది కాదు. నాన్నకు మాత్రం వ్యవసాయమే లోకం. నాన్న ఈ లోకాన్ని విడిచి వెళ్లిన తరువాత అఖిలకు దుఃఖం తప్ప బతుకు దారి కనిపించలేదు. ఆ విషాద సమయంలో 'నాన్నా... నీకు నేను ఉన్నాను' అంటూ పచ్చటి పొలం అఖిలకు అభయం ఇచ్చింది. కుటుంబ బాధ్యతలను తలకెత్తుకున్న అఖిల ఇప్పుడు రైతుగా మారింది. తన రెక్కల కష్టంతో కుటుంబానికి అండగా నిలుస్తోంది. 'డిగ్రీ సదివి ఏందమ్మా ఈ కష్టం' అంటారు చాలామంది సానుభూతిగా. కానీ వ్యవసాయం చేయడం తనకు కష్టంగా కంటే ఇష్టంగా మారింది. ఎందుకంటే... పొలం దగ్గరికి వెళితే నాన్న దగ్గరికి వెళ్లినట్లు అనిపిస్తుంది. నాన్న ఎక్కడి నుంచో తన కష్టాన్ని చూస్తున్నట్లు, సలహాలు ఇస్తున్నట్లు అనిపిస్తుంది.


తల్లికి ఆహారం తినిపిస్తున్న అఖిల

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఎల్మ శ్రీనివాస్ నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు.

'చనిపోవాల్సిన వయసు కాదు' అని తల్లడిల్లిన వాళ్లు....

'పిల్లల గతి ఏం కావాలి' అని కన్నీళ్లు పెట్టుకున్న వాళ్లు ఎంతోమంది ఉన్నారు.

'ఇంత అన్యాయం చేసి పోతవా కొడకా' అంటూ వృద్ధాప్యంలో ఉన్న శ్రీనివాస్ తల్లి ఏడుస్తుంటే అక్కడ ఉన్నవారికి ఏడుపు ఆగలేదు.

'కాలం ఎంత బాధకు అయినా మందుగా పనిచేస్తుంది' అంటారు. అయితే రోజులు గడిచినా, నెలలు గడిచినా శ్రీనివాస్ భార్య బాధ నుంచి తేరుకోలేదు. ఆ బాధతోనే ఆమె మంచం పట్టింది. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు. గత ఏడాది పెద్దకుమార్తె వివాహం జరిగింది. ఇక కుటుంబ భారాన్ని మోయాల్సిన బాధ్యత చిన్న కుమార్తె అఖిలపై పడింది.

'ఎవ్వసాయం నీ వల్ల ఎక్కడ అవుతుంది బిడ్డా... పట్నంలో ఏదన్న ఉద్యోగం చూసుకో' అన్నారు కొందరు.

'వ్యవసాయం అంటే వంద సమస్యలుంటయి. నీ వల్ల కాదుగని పొలాన్ని కౌలుకు ఇయ్యంర్రి' అని సలహా ఇచ్చారు కొందరు.

'వ్యవసాయం ఎందుకు చేయకూడదు. అఖిల చెయ్యగలదు' అనే మాట ఏ నోటా వినిపించలేదు.

పూరింట్లో మంచం పట్టిన అమ్మను, వృద్ధాప్యంలో ఉన్న నానమ్మను విడిచి పట్నంలో ఉద్యోగంలో చెయ్యాలా?

'చెయ్యను. వ్యవసాయమే చేస్తాను' అని గట్టిగా నిశ్చయించుకుంది అఖిల.

వ్యవసాయం అనేది కాలేజీని మించిన మహా విశ్వవిద్యాలయం. ఎప్పటికప్పుడు నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉంటాయి. కాలేజీలో చదివే వారికి సంవత్సరానికి ఒక సారే పరీక్ష ఉంటుంది. కాని రైతుకు ప్రతిరోజూ పరీక్షే.

'యస్... ఆ పరీక్షల్లో నేను పాస్ కాగలను' అంటూ ధైర్యంగా పొలం బాట పట్టింది కాలేజి స్టూడెంట్ అఖిల.

'వచ్చినవా బిడ్డా' అంటూ నాన్న చల్లగా నవ్వినట్లు అనిపించింది. ఆ ఊహ తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది.

'నేను పరాయి దేశానికి పోలేదు. నాన్నకు ఇష్టమైన చోటుకే వచ్చాను. నాకు భయమెందుకు!' అనుకుంది.

మొదట బైక్ రైడింగ్ నేర్చుకుంది. ఆ తరువాత ట్రాక్టర్ నడపడం నేర్చుకుంది. ఇప్పుడు తనకు మరింత ధైర్యం, 'వ్యవసాయం చేయగలను' అనే నమ్మకం వచ్చింది. పొలంలో రెండు బోర్ల సాయంతో రెండు ఎకరాల వరకు వరి సేద్యం చేస్తోంది.

ఇప్పుడు అఖిలకు వ్యవసాయం మాత్రమే కాదు... ఏ పనులు చేసుకోలేక మంచానికే పరిమితమైన తల్లి ఆలనాపాలన, నానమ్మ ఆరోగ్యం గురించి పట్టించుకోవడంలాంటి ప్రధాన బాధ్యతలు ఉన్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇప్పుడు అమ్మకు అమ్మ అయింది. నానమ్మకు కొడుకు అయింది అఖిల.

– బిర్రు బాలకిషన్,
సాక్షి, రాజాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా



నాన్న చెప్పిన మాట

'ఎందుకింత కష్టపడతవు నాన్నా' అని పిల్లలు అన్నప్పుడు 'రెక్కల కష్టం వుట్టిగ పోదురా' అని నవ్వేవాడు నాన్న. 'రెక్కల కష్టం' విలువ గురించి చిన్న వయసులోనే నాన్న నోటి నుంచి విన్న అఖల ఇప్పుడు ఆ కష్టాన్నే నమ్ముకుంది. ఒకవైపు వ్యవసాయం చేస్తూనే మరోవైపు పోటీ పరీక్షలపై దృష్టి పెట్టింది. కానిస్టేబుల్ కావాలనుకుంటోంది. అలా అని వ్యవసాయానికి దూరం కావాలనుకోవడం లేదు. ఎందుకంటే... తనకు వ్యవసాయం అంటే నాన్న!

మై వార్డ్‌రోబ్



'మనం ఎలా ఉంటున్నామో మన వార్డ్‌రోబ్ మనకే పరిచయం చేస్తుంది అందుకే, పర్ఫెక్ట్ ప్లాన్ కంపల్సరీగా ఉండాల్సిందే. అలాగని ఎప్పుడూ షాపింగ్ చేయాల్సిన అవసరం లేదు. ఉన్న వాటినే కొద్దిపాటి మార్పులతో మనదైన బడ్జెట్‌లో స్టయిలిష్ లుక్‌తో మార్కులు కొట్టేసేలా డిజైన్ చేసుకోవాలి. సందర్భానుసారమే కాదు సీజన్‌ని బట్టి కూడా ఎంపిక ఉండాలి..' అంటూ తన వార్డ్‌రోబ్ ముచ్చట్లను మనతో పంచుకుంటున్నారు హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉంటున్న సుమిత కందిమళ్ల.

కొన్ని మార్పులే.. కొత్తగా!

ఓల్డ్ శారీస్‌తో న్యూ లుక్

ఈ రోజుల్లో ఒక మంచి డిజైన్ ఘాగ్రా కొనాలంటే చాలా ఖర్చు. అందుకని, అదే మోడల్స్‌లో అంతే లుక్‌తో ఉండే తక్కువ రేట్ లెహంగాలు ఆన్‌లైన్ వేదికలపై వెతికి తీసుకుంటాను. పాతికేళ్ల క్రితం ఉన్న చీరలను రీ యూజ్ చేయాలనే ఆలోచనతో చుడీదార్స్, లెహంగాలను డిజైన్ చేయిస్తుంటాను. చేనేతలకు పేరొందిన ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి స్థానిక మార్కెట్‌లో షాపింగ్ చేస్తాను. దీని వల్ల తక్కువ బడ్జెట్‌లో అనుకున్నవి లభిస్తాయి.



డిజైన్స్‌కి ముందుగా డ్రాయింగ్

శారీస్‌ను బట్టి బ్లౌజ్ డిజైన్స్ నాకేవి బాగుంటాయో ఒక పేపర్ మీద డ్రా చేసుకుంటాను. ఆ తర్వాత ఎప్పుడూ కుట్టించే టైలర్ దగ్గర ఇస్తాను. మనం ఉండే ప్లేస్, వాతావరణాన్ని బట్టి కూడా స్టైల్ మార్చుకోవాల్సి ఉంటుంది. నైట్ పార్టీ అయితే షిమ్మర్, గ్లిట్టర్ లైట్ వెయిట్ డ్రెస్సులను ఎంపిక చేసుకుంటాను. వేసవిలో కంచి పట్టు కాకుండా బెనారస్, షిఫాన్స్‌ని ఎంపిక చేసుకుంటాను. పూజలు అంటే పట్టు చీరలు సహజమే. పెళ్లి, రిసెప్షన్ వంటి వాటికి చీరలు కట్టినా హెయిర్ స్టైల్స్‌లో మార్పులు చేసుకుంటాను. జ్యువెలరీని కూడా మిక్స్ అండ్ మ్యాచ్ చేస్తుంటాను. వీటికి తగినట్లుగా డిజైనర్ బ్యాగ్స్, సన్‌గ్లాసెస్, వాచీ కలెక్షన్స్ యూజ్ చేస్తాను.



ముగ్గురం... డిఫరెంట్‌గా!

నాకు ఇద్దరూ అమ్మాయిలే కాబట్టి నాతోపాటు వారికీ అన్నీ సెట్ చేయాల్సిందే. చాలావరకు ఫ్యామిలీ కాంబినేషన్ సేమ్ కలర్ థీమ్ అంటుంటారు. కానీ, ఒక్కొక్కరు ఒక్కో స్కిన్ టోన్‌లో ఉంటారు. వారికి నచ్చిన కలర్ కాంబినేషన్స్ తీసుకొని ప్లాన్ చేస్తాను. ఒకరిని ట్రెడిషనల్‌గా, మరొకరిని ఫ్యాన్సీగా తయారు చేస్తాను. నేను వారికి భిన్నంగా ఉండేలా ప్లాన్ చేసుకుంటాను.

ఒకరికి బ్రేస్‌లెట్స్ ఇష్టం, మరొకరికి రింగ్స్ ఇష్టం. నాకు గాజులు బాగా ఇష్టం. ఒకరు బ్రేస్‌లెట్ ధరిస్తే, మరొకరు పది, పదకొండు రింగ్స్ పెట్టుకుంటారు. ఇంకొకరు బ్యాంగిల్స్ ఎక్కువగా వేసుకుంటారు.తిరుపతికి వెళితే అక్కడి నుంచి రకరకాల గాజులు కొనుక్కొస్తాను. డ్రెస్‌కు తగినట్టు గాజులు అలా సెట్ చేస్తాను. ప్రతి ఫంక్షన్స్‌కి 2-3 రోజుల ముందే ప్రతిదీ సెట్ చేసి ఉంచుతాను.

ఆల్‌టైమ్ ఫేవరెట్

మగ్గం వర్క్‌లో థ్రెడ్ వర్క్ కన్నా జర్దోసి వర్క్ చాలా ఇష్టం. అందుకే, వెల్వెట్ మీద హెవీ వర్క్ చేయించాను. ఇది ఎప్పటికీ ట్రెండ్‌లో ఉంటుంది. వెల్వెట్ లెహంగాకి ఎంబ్రాయిడరీ చేయించాను. దానికి బ్లౌజ్ మారుస్తుంటాను. మగ్గం వర్క్‌లో క్వాలిటీ మాత్రం మిస్ కాకూడదు.

కలర్స్.. కాంట్రాస్ట్

ఎప్పుడూ ఒకే తరహా వేస్తే డ్రెస్సింగ్ అయినా, కలర్ కాంబినేషన్స్ అయినా బోర్‌గా అనిపిస్తుంది. కొన్నిసార్లు గ్రీన్ షేడ్స్‌లో కావాలనుకుంటే మోనో క్రోమ్ లుక్‌లో ప్లాన్ చేసుకుంటాను. ఒక్కోసారి పూర్తిగా కాంట్రాస్ట్ వేసుకుంటాను. నా డ్రెస్సింగ్ లేదా మేకప్‌లో ఏమైనా చేంజెస్ కోసం మా అమ్మాయిల సూచనలూ తీసుకుంటాను. బర్త్ డే పార్టీలకు పూర్తిగా వెస్ట్రన్ వేర్, డే టైమ్ అయితే నీ లెంగ్త్, ఈవెనింగ్ అయితే షార్ట్స్ కూడా ప్లాన్ చేసుకుంటాను. కొన్నింటిని డెనిమ్, లెదర్ జాకెట్స్‌తో కవర్ చేసేవీ ఉంటాయి.

పాతదైనా ప్రత్యేకమే...

మా అమ్మమ్మ చీరల్లో నుంచి నా దగ్గరకు ఒక గద్వాల కాటన్ శారీ వచ్చింది. అప్పటి నేత ఇప్పటికీ బాగుంటుంది. దానిని కూడా డిజైనర్ బ్లౌజ్‌తో ఫంక్షన్స్‌కి కట్టుకుంటాను. ఏ చీర కొన్నా నా తర్వాత నా పిల్లలకు ఆ చీరలు వెళ్లేలా ప్లాన్ చేసుకుంటాను. నా పెళ్లప్పుడు కొన్న కోటా చీర ఇప్పటికీ కట్టుకుంటాను.



మీరూ మీ వార్డ్‌రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్‌రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్‌రోబ్ శీర్షికన ప్రచురిస్తాం.
మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34.
sakshifamily3@gmail.com



నేటి 'సాక్షి' ఈపేపర్‌లో ప్రత్యేక 'సినిమా' పేజీ
'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

● పరంపర

ఆధ్యాత్మిక కళకూ ఒక చరిత్ర ఉంది


అనితా షా

ఆమెది హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీ కుటుంబం. ఆమె వృత్తీ, ప్రవృత్తీ రెండూ కళలను అధ్యయనం చేయడమే కావడం వల్ల భారతీయ చిత్రరీతుల మీద విస్తృతంగా పరిశోధన చేస్తున్నారు. మనదేశంలో విలసిల్లిన కళారూపాలు ఏయే దేశాల మ్యూజియాల్లో ఉన్నాయో తెలుసుకుని ప్రతి విషయాన్నీ గ్రంథస్తం చేస్తున్నారు. ఆమే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేసిన డాక్టర్ అనితా షా, చిత్రకళల పరిశోధకురాలు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ఐసీఓఎమ్)లో కీలక సభ్యురాలిగా ప్రపంచదేశాల్లో పర్యటిస్తూ మ్యూజియాలజీ విద్యార్థులకు గెస్ట్ ఫ్యాకల్టీగా బోధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మనదేశంలో విస్తరించిన వైవిధ్యభరితమైన చిత్రకళారూపాల గురించిన సమగ్రమైన వివరాలతో 'కలర్స్ ఆఫ్ డివోషన్' పేరుతో ఆవిష్కరించారు. అమెరికా, ఇండియాల్లోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ చిత్రకళ మీద సదస్సులు నిర్వహిస్తున్న అనితా షా గతంలో ఆమె భర్త భరత్ షాతో కలిసి 'థ్రెడ్స్ ఆఫ్ డివోషన్' పేరుతో రాజస్థాన్, గుజరాత్‌లోని కచ్‌లో అభివృద్ధి చెందిన ఎంబ్రాయిడరీలతో ప్రదర్శన నిర్వహించారు.

చిత్రకళలో కృష్ణతత్వం

మన చిత్రకళ, శిల్ప కళ అన్నీ చరిత్ర, పురాణేతిహాసాల ఆధారంగానే అభివృద్ధి చెందాయి. సామాజిక మార్పులను ఇముడ్చుకుంటూ ముందుకు సాగుతుంటాయి. భాగవత పురాణాల ప్రభావం ఉత్తరాదిలో ఎక్కువ. కాబట్టి ఉత్తరాది చిత్రకళలు ఎక్కువగా కృష్ణతత్వాన్ని ప్రతిబింబిస్తుంటాయి. కృష్ణుడు ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యుడే. ప్రతి సంఘటనను కృష్ణుడితో అన్వయించుకుంటారు.





రాస్తే కావ్యం... గీస్తే చిత్రం

''చిత్రం అంటే సాహిత్యాన్ని కంటితో చూపించే ప్రక్రియ. నిరక్షరాస్యులకు ఒక గ్రంథ సారాన్ని బొమ్మల్లో చూపించవచ్చు. చిత్రకారులు కాలానుగుణంగా మార్పులను జోడించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో దక్కనీ– హైదరాబాదీ ఆర్టిస్టులు సంయుక్తంగా కృషి చేసి గోల్డెన్ కలంకారీ పెయింటింగ్స్‌కు రూపకల్పన చేశారు. ఇది పద్దెనిమిదవ శతాబ్దపు చివరి రోజుల్లో అభివృద్ధి చెందింది. కళాకారుల కళానైపుణ్యం అంతా కృష్ణుడు, గోపికల రూపాలను తీర్చిదిద్దడంలో కనిపిస్తుంది. నేను శ్రీవల్లభాచార్య వల్లభ సంప్రదాయ తత్వం పుష్టిమార్గం మీద ఎక్కువగా పని చేశాను. వల్లభాచార్య తత్వం శుద్ధ అద్వైతం, కృష్ణతత్వంతో ఉంటుంది. శైవం ప్రభావం కొన్ని చిత్రాల్లో కనిపిస్తుంది. ఇందులో తాత్విక చింతన, పురాణాల అవలోకనమే ప్రధానంగా సాగుతుంటుంది. సద్గురువుల ప్రవచనాలు, ప్రబోధాల వల్ల అనేక ఊహాచిత్రాలకు రూపం వచ్చింది. సామాన్యులకు ఆరోగ్యకరమైన, ఆచరణీయమైన దైనందిన జీవనశైలిని కూడా పౌరాణిక కథల ద్వారానే వివరించే వారు. తల్లి బిడ్డను లాలనగా నిద్ర లేపడం, బిడ్డకు స్నానం చేయించి దుస్తులు ధరింపచేసి చక్కగా అలంకరించడం వంటివన్నీ కృష్ణుడు, యశోద పాత్రల ద్వారా బొమ్మల్లో రూపుదిద్దుకున్నాయి.

ముస్లిం ఆర్టిస్టులు హిందూచిత్రాలు

నా తాజా రచన కలర్స్ ఆఫ్ డివోషన్ పుస్తకం వెనుక ఏడేళ్ల శ్రమ ఉంది. ఇది పాఠకుల సాంస్కృతిక, సామాజిక దృష్టి కోణాన్ని విస్తృతపరుస్తుందని చెప్పగలను. హిందూ పురాణాల ఆధారంగా చిత్రాలకు రూపకల్పన చేసిన వారిలో ముస్లిం చిత్రకారులున్నారు. ఆదిల్ షా స్వయంగా సరస్వతీ మాతను పూజించాడు. ఇలాంటి అనేక సామరస్య సహజీవన ఆధారాలు మన ప్రాచీన చిత్రాల్లో దొరుకుతాయి. భారతీయ చిత్రకళలో సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలియచేశాను. గతంలో 'విజిటర్స్ టూ సౌత్ ఇండియన్ మ్యూజియమ్స్– మ్యూజియోలాజికల్ కాంటెక్స్ అండ్ విజిటర్ స్టడీ' పేరుతో పుస్తకం తెచ్చాను. చిత్రకళారీతులతో పాటు వాటిని చిత్రించిన వస్త్రనైపుణ్యాన్ని కూడా ప్రత్యేకంగా గుర్తించాలి. మన చిత్రకళారీతులన్నీ ఒకచోట గుదిగుచ్చి లేకపోవడం దురదృష్టకరం. ఒక్కొక్కటి ఒక్కోచోట ఉండడంతో ఒక సమగ్రమైన స్వరూపం రావడం లేదు. అందుకే మ్యూజియాల్లో ప్రదర్శనలో ఉన్న కళాఖండాల ఫొటోలు, వివరాలతో రచనలు చేస్తున్నాను. ఇదే నా పని'' అని వివరించారు డా. అనితా షా.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

గింజ గింజలో రుచి



వంటిల్లు

మార్కెట్‌లో స్వీట్ కార్న్ రాశులుగా పోగయి ఉన్నాయి. బలవర్ధకమే... కానీ రోజూ ఉడికించి తినాలంటే బోర్. కొంచెం వెరైటీగా ప్రయత్నం చేస్తే... పిల్లలు లంచ్‌బాక్స్‌ను ప్రేమిస్తారు... ఈవెనింగ్ స్నాక్ కోసం ఎదురుచూస్తారు.

చీజ్ బాల్స్



కావలసినవి: బంగాళదుంప – 150 గ్రా (పెద్దది ఒకటి); మొక్కజొన్న గింజలు – వంద గ్రాములు (స్వీట్ కార్న్ లేదా మామూలు మొక్కజొన్న లేతగా ఉండాలి; చీజ్ – 50 గ్రాములు; మిరియాల పొడి– అర టీ స్పూన్; కొత్తిమీర తరుగు – టీ స్పూన్; ఆరెగానో పౌడర్ – అర టీ స్పూన్; వెల్లుల్లి పేస్ట్ – అర టీ స్పూన్; మైదా లేదా శనగపిండి – 4 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు;

తయారీ: ● బంగాళదుంపను ఉడికించి తొక్క తీసి చిదిమి పక్కన పెట్టాలి. మొక్కజొన్న గింజలను ఉడికించి నీటిని వంపేసి పక్క పెట్టాలి. చీజ్‌ను తురమాలి. ● ఒక పాత్రలో బంగాళదుంప, మొక్కజొన్న గింజలు, శనగపిండి, చీజ్ తురుము, వెల్లుల్లి పేస్ట్, మిరియాల పొడి, ఉప్పు, కొత్తిమీర, ఆరెగానో వేసి కలపాలి. రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు, మిరియాలపొడి కలుపుకోవచ్చు. ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో పావు టీ స్పూన్ నూనె వేయాలి. పెనం, నూనె బాగా వేడయ్యేలోపు బంగాళదుంప మిశ్రమాన్ని చిన్న గోళీలంత బాల్స్ చేసి పక్కన పెట్టాలి. ● నూనె వేడెక్కిన తర్వాత ఒక్కో గోళీని ఒక్కో గుంతలో పెట్టి మూత పెట్టాలి. మీడియం మంట మీద ఓ నిమిషం పాటు కాలనిచ్చి మూత తీసి ప్రతి బాల్‌నీ తిరగేయాలి. తిరగేసిన తర్వాత మూత పెట్టకుండా రెండో వైపు కూడా ఎర్రగా కాలనిచ్చి తీయాలి. వేడిగా కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
గమనిక: గుంత పొంగనాల పెనం లేకపోతే మామూలు బాణలిలో నూనె వేడి చేసి చీజ్ బాల్స్‌ని ఎర్రగా ఆయిల్ రోస్ట్ చేసుకోవాలి.

ఫ్రైడ్ రైస్



కావలసినవి: బాసుమతి బియ్యం – 200 గ్రాములు; నూనె – అర టీ స్పూన్; నీరు – 3 కప్పులు; మొక్క జొన్న గింజలు – 300 గ్రాములు (స్వీట్ కార్న్ లేదా మామూలు మొక్కజొన్న లేత గింజలు); ఉల్లి పాయ ముక్కలు – అర కప్పు; ఉల్లి కాడల ముక్కలు – 3 టేబుల్ స్పూన్‌లు; సెలెరీ లేదా కొత్తిమీర తరుగు – 2 టీ స్పూన్‌లు; క్యాప్సికమ్ తరుగు – పావు కప్పు; మిరియాల పొడి– టీ స్పూన్; సోయా సాస్– టేబుల్ స్పూన్; ఉప్పు – ఒకటిన్నర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నెయ్యి లేదా నువ్వుల నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● బియ్యాన్ని కడిగి 20 నిమిషాల సేపు నానబెట్టి నీటిని వంపేసి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో మూడు కప్పుల నీరు పోసి వేడి చేసి మరిగేటప్పుడు అందులో పావు టీ స్పూన్ ఉప్పు, అర టీ స్పూన్ ఆయిల్, కడిగి పెట్టిన బియ్యం వేయాలి. అన్నం ఉడికిన తర్వాత వార్చి అన్నాన్ని ఒక పళ్లెంలో పోసి పక్కన పెట్టాలి ●అన్నం ఉడికేలోపు మరొక స్టవ్ మీద పాత్ర పెట్టి మొక్కజొన్న గింజలను ఉడికించాలి ● ఇప్పుడు స్టవ్ మీద వెడల్పు పాత్ర లేదా పెద్ద బాణలి పెట్టి నెయ్యి లేదా నువ్వుల నూనె వేడి చేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, ఉల్లికాడల ముక్కలు వేసి దోరగా వేయించాలి. తర్వాత క్యాప్సికమ్ ముక్కలు, సెలెరీ తరుగు వేసి అవి వేగిన తర్వాత ఉడికించిన మొక్కజొన్న గింజలు, సోయాసాస్ వేసి దోరగా వేయించాలి. అందులో మిరియాలపొడి, ఉప్పు వేసి కలిపి ఇప్పుడు అందులో సగం అన్నం వేసి అన్నం మెతుకులు నలగనంత సున్నితంగా ఒక నిమిషం పాటు వేయించాలి. ఇప్పుడు మిగిలిన అన్నాన్ని కూడా వేసి అంతా కలిసేటట్లు బాణలిని కదిలించి మూత పెట్టి స్టవ్ మీద నుంచి దించేయాలి.

• సక్సెస్ స్టోరీ

బస్తాలు మోసిన భుజం పతకాలు తెస్తోంది...

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడో తరగతితోనే చదువు ఆపేసిన భద్రాద్రి ఏజెన్సీకి చెందిన మోడెం వంశీ ఇప్పుడు వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిస్తున్నాడు. కూలీగా మొదలైన ప్రస్థానం ఇపుడు కామన్‌వెల్త్ దిశగా సాగుతోంది...



మోడెం వంశీ స్వస్థలం ఒకప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా, ప్రస్తుత ములుగు జిల్లాలోని వాజేడు మండలం ఇప్పగూడెం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడో తరగతితోనే చదువు అర్ధాంతరంగా ఆపేయాల్సి వచ్చింది. దీంతో బతుకుదెరువు కోసం పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం ఇబ్రహీంపట్నంలో ఓ నర్సరీలో పని చేస్తున్న తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లాడు. అక్కడ నర్సరీలో 50 కేజీల బరువు ఉన్న యూరియా బస్తాలను అలవోకగా ఎత్తుకుని తిరగడాన్ని ఆ నర్సరీ యజమాని, మాజీ వెయిట్ లిఫ్టరైన అబ్దుల్ ఫరూక్ గమనించాడు. దీంతో నర్సరీ ప్రాంగణంలోనే వంశీలో ఉన్న ప్రతిభకు సాన పట్టాడు. ఎంతటి బరువులైనా అవలీలగా ఎత్తేస్తుండటంతో తక్కువ సమయంలోనే ఇబ్రహీంపట్నం నర్సరీ నుంచి భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ మీదుగా హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలోని పవర్ లిఫ్టింగ్ హాల్‌కు వంశీ అడ్రస్ మారింది

హైదరాబాద్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తూనే ఎల్‌బీ స్టేడియంలో వంశీ కోచింగ్ తీసుకునేవాడు. అక్కడ పవర్ లిఫ్టింగ్‌లో ఇండియా తరఫున ఏషియా లెవల్ వరకు ఆడిన సాయిరాం వంశీ ఎదుగుదలకు అండగా నిలిచాడు. గోవాలో 2021లో జరిగిన పోటీల్లో మొదటిసారి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు వంశీ. ఆ తర్వాత 2022లో కేరళ, హైదరాబాద్‌లో 2023లో ఇండోర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పతకాలు గెలుచుకున్నాడు. ఈ ఏడాది రాజస్థాన్, పటియాల (పంజాబ్)లో జరిగిన పోటీల్లోనూ వంశీ పతకాలు గెల్చుకున్నాడు. దీంతో యూరప్‌లోని మాల్టా దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు వంశీని ఎంపిక చేస్తూ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 2024 జూన్‌లో నిర్ణయం తీసుకుంది.

> ఆగస్టు 28 రాత్రి (భారత కాలమానం ప్రకారం) 66 కేజీల జూనియర్ విభాగంలో జరిగిన పోటీలో స్క్వాట్ 280 కేజీలు, బెంచ్‌ప్రెస్ 140 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 242.50 కేజీలు మొత్తం 662.5 కేజీలు ఎత్తడంతో వంశీకి ప్రథమ స్థానం స్థానం దక్కింది.

తొలిసారిగా విదేశాల్లో జరిగే అంతర్జాతీయ పోటీలో పాల్గొనే అవకాశం దక్కిందనే ఆనందం కొద్ది సేపట్లోనే ఆవిరైంది. పాస్‌పోర్టు, వీసా, ప్రయాణం తదితర ఖర్చులకు రూ. 2.10 లక్షల అవసరం పడింది. హైదరాబాద్‌లో స్పాన్సర్‌లు దొరకడం కష్టం కావడంతో తన వెయిట్ లిఫ్టింగ్ ప్రస్థానం మొదలైన భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లో కోచింగ్ ఇచ్చిన రామిరెడ్డిని సంప్రదించాడు. క్రౌడ్ ఫండింగ్ కోసం లోకల్ గ్రూప్‌లలో రూ.100 వంతున సాయం చేయండి అంటూ మెసేజ్‌లు పెట్టాడు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో పాటు పట్టణానికి చెందిన వైద్యులు సోమయ్య, శ్రీకర్, కృష్ణప్రసాద్, రోశయ్య, స్పందనలు తమ వంతు సాయం అందించారు.

యూరప్ వెళ్లేందుకు వీసా కోసం కాన్సులేట్‌లో జరిగిన ఇంటర్వ్యూలో వంశీకి ఊహించని ఇబ్బంది ఎదురైంది. 'యూరప్ ఎందుకు వెళ్లాలి అనుకుంటున్నావ్?' అని ఇంటర్వ్యూ చేసే వ్యక్తి ఇంగ్లిష్‌లో ప్రశ్నిస్తే 'ఇక్కడ ఏం జాబ్ చేస్తున్నావు?' అని అడిగినట్లు భావించి 'పార్ట్‌టైం జాబ్' అని బదులు ఇచ్చాడు వంశీ. వీసా క్యాన్సల్ అయ్యింది. దీంతో క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన రూ.20వేలు వృథా కాగా మళ్లీ స్లాట్ బుకింగ్‌కు రూ.15 వేల వరకు అవసరం పడ్డాయి.

ఈసారి ఆర్థిక సాయం అందించేందుకు భద్రాచలం ఐటీడీఏ – పీవో రాహుల్ ముందుకు వచ్చాడు.

ఇంగ్లీష్ గండం దాటేందుకు స్నేహితులు, కోచ్‌ల ద్వారా ప్రశ్నా – జవాబులు రాయించుకుని వాటిని ప్రాక్టీస్ చేశాడు. కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఫోన్ చేసి నేర్చుకున్న దాన్ని వల్లెవేయడం, అద్దం ముందు మాట్లాడటం చేస్తూ చివరకు వీసా గండం గట్టెక్కాడు. ఈ పోటీలో పాల్గొనే బృందం ముందుగానే మాల్టా వెళ్లిపోయింది. దీంతో ఆగస్టు 25న హైదరాబాద్ నుంచి ముంబైకి వంశీ ఒక్కడే బస్సులో వెళ్లాడు. అక్కడి నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ మీదుగా మాల్టా వరకు ఎయిర్‌బస్‌లో చేరుకున్నాడు.

ఆగస్టు 28 రాత్రి (భారత కాలమానం ప్రకారం) 66 కేజీల జూనియర్ విభాగంలో జరిగిన పోటీలో స్క్వాట్ 280 కేజీలు, బెంచ్‌ప్రెస్ 140 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 242.50 కేజీలు మొత్తం 662.5 కేజీలు ఎత్తడంతో వంశీకి ప్రథమ స్థానం దక్కింది. ఈ విజయం అందించిన ఉత్సాహంతో వచ్చే అక్టోబరులో జరిగే కామన్‌వెల్త్ గేమ్స్‌లో సత్తా చాటేందుకు వంశీ సిద్ధం అవుతున్నాడు.

– తాండ్ర కృష్ణ గోవింద్,
సాక్షి ప్రతినిధి,
భద్రాద్రి కొత్తగూడెం.

• గేమింగ్

అగ్నికెరటం



రియల్–టైమ్ స్ట్రాటజీ వీడియోగేమ్ 'ఏజ్ ఆఫ్ మైథాలజీ:రీటోల్డ్' వచ్చే నెల 4న విడుదల కానుంది. 'ఏజ్ ఆఫ్ మైథాలజీ'కి రీమాస్టర్డ్ వెర్షన్‌గా వస్తున్న గేమ్ ఇది. 'ఏజ్ ఆఫ్ మైథాలజీ' అనేది ఒరిజినల్ గేమ్‌లోని ఎలిమెంట్స్‌తో కూడిన మోడ్రన్ రియల్–టైమ్ స్ట్రాటజీ డిజైన్, విజువల్స్ కాంబినేషన్. సౌండ్‌ట్రాక్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. ప్లేయర్స్ కోసం రకరకాల ఆప్షన్‌లు ఉన్నాయి. ప్లేయర్స్ గ్రీకు, ఈజిప్షియన్...మొదలైన పురాణాలలో నుంచి పాత్రలను ఎంపిక చేసుకోవచ్చు. 'మీరు తీసుకునే ఒక నిర్ణయం ప్రపంచ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది' అంటుంది 'ఏజ్ ఆఫ్ మైథాలజీ' గేమ్.
ప్లాట్‌ఫామ్స్: విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: రియల్–టైమ్ స్ట్రాటజీ ; మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీ ప్లేయర్.

• పర్యావరణ హిత

షూట్ ఎట్ ప్లాస్టిక్స్!

ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిట్టూర్చడం కంటే.... 'నీవంతుగా ఒక పరిష్కారం' సూచించు అంటున్నాడు ముంబైకి చెందిన ఆశయ్ భవే. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి స్నీకర్స్ తయారుచేసే 'థైలీ' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి విజయం సాధించాడు....

మన దేశంలో ప్రతిరోజూ టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నాయి. ఈ నేపథ్యంలో 'థైలీ' అనే కంపెనీ ప్లాస్టిక్ వ్యర్థాలు కొండలా పేరుకుపోకుండా తనవంతు కృషి చేస్తోంది. వ్యాపారపరంగా పెద్ద కంపెనీలతో పోటీ పడుతోంది.

'థైలీ' అంటే హిందీలో సంచి అని అర్థం.

'ప్లాస్టిక్ సంచులను సరిగ్గా రీసైకిల్ చేయకపోవడం వల్ల పర్యావరణ కాలుష్యం గణనీయంగా పెరుగుతుందనే విషయం తెలుసుకున్నాను. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి థైలీ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాను. పారేసిన ప్లాస్టిక్ సంచుల నుండి ప్రత్యేకంగా సృష్టించిన వినూత్న లెదర్‌ను స్నీకర్స్ కోసం వాడుతున్నాం' అంటున్నాడు ఆశయ్ భవే.

షూస్‌కు సంబంధించిన సోల్‌ను ఇండస్ట్రియల్ స్క్రాప్, టైర్ల నుండి రీసైకిల్ చేసిన రబ్బరుతో తయారుచేస్తారు. షూబాక్స్‌ను రీసైకిల్ చేసిన జతల నుండి కూడా తయారుచేస్తారు. వాటిలో విత్తనాలు నిక్షిప్తం చేస్తారు. మొక్కలు పెంచడానికి ఇవి ఉపయోగపడతాయి. 2000 సంవత్సరంలో బాస్కెట్‌బాల్ స్నీకర్ ఫ్యాషన్‌ను దృష్టిలో పెట్టుకొని 'థైలీ' స్నీకర్ డిజైన్ చేశారు. డిస్కౌంట్ కావాలనుకునేవారు పాత స్నీకర్‌లు ఇస్తే సరిపోతుంది. షూ తయారీ ప్రక్రియలో ప్రతి దశలో పర్యావరణ స్పృహతో వ్యవహరించడం అనేది ఈ స్టార్టప్ ప్రత్యేకత. ఆశయ్ శ్రమ వృథా పోలేదు. కంపెనీకి 'పెటా' సర్టిఫికేషన్‌తో పాటు ఆ సంస్థ నుంచి ప్రతిష్ఠాత్మక ఉత్తమ స్నీకర్ అవార్డ్ లభించింది. పర్యావరణ స్పృహ మాట ఎలా ఉన్నా బడా కంపెనీలతో మార్కెట్‌లో పోటీ పడడడం అంత తేలిక కాదు.

> **ఆ పోటీని తట్టుకొని నిలబడింది 'థైలీ' కంపెని.**
> 'మేడ్ ఇన్ ఇండియా' ప్రొడక్ట్‌గా గుర్తింపు పొందిన 'థైలీ' ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌పై కూడా దృష్టి సారించింది. ఇప్పటి వరకు కంపెనీ వేలాది ప్లాస్టిక్ బాటిల్స్, బ్యాగులను రీసైకిల్ చేసింది.

లాభ, నష్టాల మాట ఎలా ఉన్నా... 'డోన్ట్ జస్ట్ డూ ఇట్ డూ ఇట్ రైట్' అనేది కంపెనీ నినాదం.

'మా కృషికి గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు లేని ప్రపంచం నా కల' అంటున్నాడు 24 సంవత్సరాల ఆశయ్ భవే. న్యూయార్క్‌లోని ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీలో ఫుట్‌వేర్ డిజైన్ కోర్సు చేశాడు ఆశయ్.



ఈ స్టార్టప్ పనితీరు, అంకితభావం పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రకు బాగా నచ్చింది. 'థైలీ ఇన్‌స్పైరింగ్ స్టార్టప్. యూనికార్న్‌ల కంటే పర్యావరణ బాధ్యతతో వస్తున్న ఇలాంటి స్టార్టప్‌ల అవసరం ఎంతో ఉంది' అంటూ ఆశయ్ భావేను ప్రశంసించాడు ఆనంద్ మహీంద్ర.

యువర్స్

• టెక్.. టాక్

మ్యాజిక్ ఎడిటర్

ఆబ్జెక్ట్స్ మూవ్ చేయడానికి, రిమూవ్ చేయడానికి, బ్యాక్ గ్రౌండ్ మార్చడానికి, లైటింగ్ అడ్జెస్ట్ చేయడానికి గూగుల్ ఫొటోస్ 'మ్యాజిక్ ఎడిటర్' ఉపకరిస్తుంది. ఈ ఫీచర్‌ని ఉపయోగించడానికి...

1. గూగుల్ ఫొటోస్ ఓపెన్ చేయాలి
2. ఎడిట్ చేయాలనుకున్న ఇమేజ్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
3. ట్యాప్ ఎడిట్–ఫొటో ఎడిటర్ ఓపెన్ అవుతుంది.
4. ఎడిటింగ్ స్క్రీన్ బాటమ్‌లో మ్యాజిక్ ఎడిటర్ కనిపిస్తుంది.
5. ఇప్పుడు ఎడిటింగ్ స్టార్ట్ చేయవచ్చు.

గూగుల్ పిక్సెల్ 9



డిస్‌ప్లే: 6.30 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080X2424 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
మెమోరీ: 128జీబి 12జీబి ర్యామ్ 256జీబి 12జీబి ర్యామ్
బరువు: 198 గ్రా.
బ్యాటరీ: 4700 ఎంఏహెచ్

వివో వి 40



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ
రిజల్యూషన్: 2800X1260 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
ర్యామ్: 8జీబి, 12 జీబి
స్టోరేజ్: 256జీబి, 512జీబి
బ్యాటరీ: 5500 ఎంఏహెచ్
బరువు: 192 గ్రా.

పోకో ప్యాడ్ 5జీ



సైజ్: 12.1 అంగుళాలు; వోఎస్: ఆండ్రాయిడ్ 14
రిజల్యూషన్: 1600X2560 పిక్సెల్స్
బరువు: 568 గ్రా. ఇంటర్నల్: 128జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబి ర్యామ్;
బ్యాటరీ: 10000 ఎంఏహెచ్ కలర్స్: డార్క్ గ్రే, బ్లూ

English Idioms

ఔట్ ఆఫ్ ది వుడ్స్

ప్రమాదకరమైన, ఇబ్బందికరమైన పరిస్థితి నుంచి బయటపడినప్పుడు ఉపయోగించే మాట...ఔట్ ఆఫ్ ది వుడ్స్.

ఉదా: ఆఫ్టర్ మంత్స్ ఆఫ్ అన్‌సెర్టినిటి, ది కంపెనీ ఈజ్ ఫైనల్లీ ఔట్ ఆఫ్ ది వుడ్స్ అండ్ బ్యాక్ ఆన్ ట్రాక్.

చికెన్ ఔట్

ధైర్యం లేకపోవడం వల్ల ఒక పనిచేయకపోవడం, విత్ డ్రా కావడం... మొదలైన సందర్భాల్లో వాడే మాట... చికెన్ ఔట్.

ఉదా: హీ ప్లాన్‌డ్ టు గో బంగీ జంపింగ్ బట్ చికెన్‌డ్ ఔట్ ఎట్ ది లాస్ట్ మినిట్.

మూలం: కోడిపందేలలో నుంచి పుట్టిన మాట...చికెన్ ఔట్.

సినిమా


అడ్జస్ట్‌మెంట్ అంటే శిక్షించాలి

– విశాల్



మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రకంపనలు పుట్టిస్తున్న లైంగిక వేధింపుల వ్యవహారం ఇప్పుడు కోలీవుడ్‌నూ తాకింది. ఇక్కడా పలువురు నటీమణులు తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నటుడు, దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ స్పందించారు. గురువారం తన పుట్టిన రోజు వేడుకలను చెన్నైలోని కీల్‌పాక్కంలోని వృద్ధాశ్రమంలో జరుపుకున్నారు విశాల్. అక్కడ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఇక్కడ వీరి సమక్షంలో పుట్టిన రోజు జరుపుకోవడం భాగ్యంగా భావిస్తున్నాని అన్నారు విశాల్. అనంతరం మీడియాతో విశాల్ మాట్లాడుతూ– ''సినిమాల్లో 20 శాతం మందికే నటించే అవకాశాలు లభిస్తున్నాయి. చాలా మంది అవకాశాలు రాక చాలా సినిమా కార్యాలయాల్లో మోసపోతున్నారు. అయితే తాము ఏ సినిమా కార్యాలయానికి వెళుతున్నాం? వాళ్లు చెప్పేది నిజమేనా? నిజంగానే ఆ కంపెనీ సినిమా నిర్మిస్తుందా? వంటి విషయాల గురించి నటీమణులు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. నటీమణులకు ధైర్యం ఉండాలి. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే చెప్పుతో కొట్టాలి. ఎవరైనా సరే మహిళలను అడ్జస్ట్‌మెంట్ కోరితే శిక్షించబడాలి. తమిళ చిత్ర పరిశ్రమలో అడ్జస్ట్‌మెంట్ పరిస్థితులు లేవని చెప్పలేం. చాలా కాలంగా ఇలాంటి ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని ఉప్మా కంపెనీలు ఒక కార్యాలయాన్ని ప్రారంభించి ఫొటోషూట్ నిర్వహించి మహిళలను ఉపయోగించుకుంటున్నాయి. మేం పోలీసులం కాదు. అయితే ఎవరైనా దక్షిణ భారత సినీ నటీనటుల సంఘంలో లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. హేమా కమిషన్‌లాగా తమిళ సినిమా సంఘం ద్వారానూ పది మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నాం. దీనికి సంబంధించిన ప్రకటన త్వరలోనే వస్తుంది'' అని స్పందించారు. కాగా విశాల్‌పై నటి శ్రీరెడ్డి చేసిన ఆరోపణల గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... నటి శ్రీరెడ్డి ఎవరో తనకు తెలియదని, అయితే ఆమె చేసే చిల్లర పనులు తెలుసు అని పేర్కొన్నారు. – సాక్షి, చెన్నై.

స్టైలిష్ సైమన్



నాగార్జున

హీరో అక్కినేని నాగార్జున పుట్టినరోజు (ఆగస్టు 29) సందర్భంగా ఆయన నటిస్తున్న 'కూలీ', 'కుబేర' సినిమాల నుంచి సరికొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కూలీ'. కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో నాగార్జున ప్రత్యేక పాత్ర పోషించినట్లు ప్రకటించింది చిత్రబృందం. ఈ చిత్రంలో ఆయన చేసిన సైమన్ పాత్ర స్టైలిష్ లుక్‌ని విడుదల చేశారు.

కుబేర... ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన తారలుగా నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే నాగార్జున లుక్ పోస్టర్ విడుదలైంది. బర్త్ డే సందర్భంగా ఓ కొత్త ఫొటోను విడుదల చేశారు. ''హై బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'కుబేర' రూపొందుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

విజువల్స్ అదిరిపోయాయి

– ఆది సాయికుమార్

''లగ్గం' టీజర్ చాలా బాగుంది. విజువల్స్ అదిరిపోయాయి. రమేష్ చెప్పాలగారు మంచి అభిరుచితో ఈ చిత్రం తీశారనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అని హీరో ఆది సాయికుమార్ అన్నారు. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా జంటగా రాజేంద్రప్రసాద్, రోహిణి, కృష్ణుడు, రఘుబాబు, ఎల్బీ శ్రీరాం కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'లగ్గం'. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని ఆది సాయికుమార్ విడుదల చేశారు. రమేశ్ చెప్పాల మాట్లాడుతూ– ''కథ, కథనం ఈ మూవీకి బలం. కుటుంబమంతా చూసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''మంచి కథ, స్క్రీన్‌ప్లే, చక్కని పాటలు 'లగ్గం'లో ఉన్నాయి'' అని వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. ''ఇలాంటి మంచి సినిమా చేశానన్న సంతృప్తి కలిగింది'' అని సాయి రోనక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి రోహిణి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: మణిశర్మ, కెమెరా: బాల్ రెడ్డి.



వేణుగోపాల్, ఆది, రమేష్

తెలుగు భాషని ప్రతిబింబించేలా ఉంటుంది

– వైవీఎస్ చౌదరి



సాయిమాధవ్, చంద్రబోస్, వైవీఎస్

''తెలుగు భాషా దినోత్సవం, గిడుగు వెంకట రామమూర్తిగారి జన్మదినాన్ని పురస్కరించుకుని నేను తీయబోయే కొత్త సినిమా నేపథ్యం ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. 1980 నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యం వంటి అంశాలను ప్రతిబింబించేలా మా సినిమా ఉంటుంది'' అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. దివంగత ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత జానకీ రామ్ (ఎన్టీఆర్ సోదరుడు) తనయుడు తారక రామారావు హీరోగా, తెలుగమ్మాయి వీణా రావ్‌ని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి ఓ సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. యలమంచిలి గీత ఈ చిత్రం నిర్మించనున్నారు. కాగా గురువారం హీరో అక్కినేని నాగార్జున బర్త్ డే, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ– ''ప్రపంచంలో అత్యంత మధురమైన భాషల్లో రెండోది తెలుగు. ఈ సినిమాలో మరింత అందమైన, అర్థవంతమైన పాటలు రాసే అవకాశం ఇచ్చిన చౌదరిగారికి, కీరవాణిగారికి ధన్యవాదాలు'' అన్నారు. మాటల రచయిత సాయి మాధవ్ బుర్రా మాట్లాడుతూ–''తెలుగు వాడు తెలుగు భాష గొప్పదనం గురించి తెలుగువాళ్లకి చెప్పడం విచిత్రమైన పరిస్థితి. తెలుగు మాట్లాడితే తల్లిదండ్రులు, టీచర్లు కొప్పడే పరిస్థితి తెలుగులోనే ఉంది. ఇప్పుడున్న సమాజం ఇలానే కొనసాగితే తెలుగు ఉనికి కోల్పోయే పరిస్థితి ఉంటుంది'' అన్నారు. ''వైవీఎస్ చౌదరి, కీరవాణి, చంద్రబోస్, సాయి మాధవ్ గార్లతో ఈ సినిమా కోసం పని చేయనుండటం ఆనందంగా ఉంది'' అని యలమంచిలి గీత తెలిపారు.

ఈ సినిమా చేయాలంటే దమ్ముండాలి

– శ్రీవిష్ణు



శ్రీవిష్ణు, విశ్వప్రసాద్, హసిత్

''శ్వాగ్' చాలా గొప్ప కథ. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదు. ఇది మనందరి ఇళ్లలోని కామన్ పాయింట్ అయినా స్క్రీన్‌పైకి ఇప్పటి వరకూ రాలేదు. ఇలాంటి కథ నాకు ఇచ్చిన హసిత్‌కి థ్యాంక్స్. 'శ్వాగ్' లాంటి సినిమాలు చేయాలంటే చాలా దమ్ముండాలి.. కథని నమ్మి సినిమా చేసిన విశ్వప్రసాద్‌గారికి కృతజ్ఞతలు'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. శ్రీవిష్ణు హీరోగా హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శ్వాగ్'. రీతూ వర్మ, మీరా జాస్మిన్, సునీల్, దక్షా నగార్కర్, శరణ్య ప్రదీప్ ఇతర పాత్రల్లో నటించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకలో హసిత్ గోలి మాట్లాడుతూ– ''తాతలు, ముత్తాతలతో కలిసి చూడగలిగేలా ఉంటుంది'' అని తెలిపారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''శ్రీ విష్ణు, హసిత్‌లతో కలసి 'రాజ రాజ చోర' సినిమా చేశాను. మా కాంబినేషన్‌లో 'శ్వాగ్' సెకండ్ మూవీ. కమల్‌హాసన్‌గారి 'ఇంద్రుడు చంద్రుడు' లాంటి సినిమాలు చూసిన అనుభూతిని ఇస్తుంది'' అని చెప్పారు.

ఆరు భాషల్లో కుంభ



సముద్ర, విజయ్ రామ్

వి. సముద్ర స్వీయ దర్శకత్వంలో వి. సముద్ర ఫిలిం బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'కుంభ'. విజయ్ రామ్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో తొలి సన్నివేశానికి సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు క్లాప్ కొట్టారు. చంద్రమహేశ్, దేవీ ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. వి. సముద్ర మాట్లాడుతూ– ''బలమైన కథలను నమ్ముకుని కొత్తవాళ్లతో 5 సినిమాలు చేస్తున్నాను. అందులో 'కుంభ' ఒకటి. ఈ చిత్రంతో పాటు 'వరద రాజు గోవిందం, రామ జన్మభూమి, ఇండియా సీఈఓ, మరో సినిమాని కూడా ఆరు భారతీయ భాషల్లో చేయబోతున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీ వెంకట్, సంగీతం: వరంగల్ శ్రీను.

ట్రైలర్ చూడగానే ఉద్వేగం కలిగింది

– రామ్‌గోపాల్ వర్మ



''కోర్టు రూమ్ డ్రామాలు విజువల్‌గా అద్భుతంగా ఉంటాయి. 'ఉద్వేగం' చిత్రం ట్రైలర్ చూడగానే అలాంటి ఉద్వేగం కలిగింది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ తెలిపారు. త్రిగుణ్ లీడ్ రోల్‌లో శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఉద్వేగం'. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో శంకర్ లుకలపుమధు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేసిన రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''ఉద్వేగం' ట్రైలర్ చూస్తే ఈ సినిమా తెలుగు పరిశ్రమలో అద్భుతం సృష్టించబోతోందని తెలుస్తోంది'' అన్నారు. ''ఈ సినిమాలో సస్పెన్స్‌తో పాటు ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఓటీటీ – ఇది చూడొచ్చు

మనమందరమూ తెలుసుకోవాల్సిన విషయం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'శాస్త్రి విరుద్ధ్ శాస్త్రి' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



సినిమా అన్నది వినోద సాధనమన్న విషయం మనందరికీ తెలుసు. మన కథలనే మనం వెండి తెర మీద చూసుకుని మనమే ముచ్చటపడతాం. ఓ రకంగా చెప్పాలంటే సినిమా అన్నది మన జీవితాలకు అద్దం లాంటిదన్నమాట. చాలా సినిమాలు ఆనందాన్నిస్తే కొన్ని సినిమాలు మాత్రం మనలో ఆలోచనలను రేకెత్తిస్తాయి. నెట్ ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఇటీవల విడుదలైన 'శాస్త్రి విరుద్ధ్ శాస్త్రి' ఈ కోవలోకి చెందినదే. నందితా రాయ్, ముఖర్జీ సంయుక్త దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఓ సున్నిత అంశానికి మూలాధారం. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన పరేష్ రావెల్ ఈ సినిమాలో గురూజీగా పిలవబడే ప్రధాన పాత్ర పోషించారు. కథాంశానికొస్తే... ఏడేళ్ల యమన్ శాస్త్రి వారం మొత్తం తన నానమ్మ, తాతయ్యల దగ్గర ఉంటూ వారాంతంలో తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి వస్తూ ఉంటాడు. కొంత కాలానికి యమన్ శాస్త్రి తల్లిదండ్రులకు ఈ విషయం రుచించదు. తమ బిడ్డ మొత్తానికే తమ దగ్గర ఉండాలని మలర్ శాస్త్రి తన తండ్రైన మనోహర్ శాస్త్రిని ఉరఫ్ గురూజీని అడుగుతాడు. దానికి ఆయన ససేమిరా అంటూ వారాంతంలో మాత్రమే బిడ్డను చూసుకునే తీరిక కలిగిన మీ దగ్గర యమన్ సరిగా ఇమడలేడు అని నిక్కచ్చిగా చెప్తాడు. అయినా యమన్ విషయంలో మలర్ పట్టుబడతాడు. ఇక చేసేది లేక గురూజీ తన మనవడి కోసం తన కొడుకు, కోడలిపై కోర్టులో కేసు వేస్తాడు. ఈ కేసులో మనవడి మీద తాత మమకారం గెలుస్తుందా లేక తల్లిదండ్రుల అనురాగం గెలుస్తుందా? అన్నది 'శాస్త్రి విరుద్ధ్ శాస్త్రి' సినిమాలోనే చూడాలి. ఇది నేటి తరానికి ఓ చక్కటి లైబ్రరీ మూవీ అని చెప్పాలి. ఉరుకుల పరుగుల మన నిత్య జీవితంలో ప్రేమ, అనురాగం, ఆప్యాయత వంటివి కూడా తల దించుకుని మొబైల్ స్క్రీన్‌లోనే చూస్తున్నాము తప్ప తల ఎత్తి సాటి వ్యక్తులను చూడడం కూడా లేదు. అందుకే 'శాస్త్రి విరుద్ధ్ శాస్త్రి' సినిమా మనందరికీ ఓ మేలుకొలుపు లాంటిది, మనమందరమూ తెలుసుకోవాల్సిన విషయం చాలానే ఉంది ఈ సినిమాలో. రేపటి మీ పిల్లల భవిష్యత్తు కోసం నేడు రెండుగంటలు వెచ్చించి ఈ సినిమా చూడండి.

– ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్
శుక్రవారం
30-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	349	82,135
నిఫ్టీ ▲	100	25,152

విదేశీ సూచీలు (తొలి సెంచు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,717	▲	163
డోజోన్స్	41,540	▲	449
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,340	▲	36
డాక్స్	18,913	▲	130
షాంఘై	2,823	▼	14
నికాయ్	38,362	▼	10

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,001	▲	310
బంగారం (99.5 స్వచ్ఛత)	71,713	▲	309
వెండి (కేజీ)	85,072	▲	143

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.53	84.55
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	109.54	112.13
€	యూరో	ఒకటికి	92.64	95.05
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	57.35	58.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	56.00	57.98
S$	సింగపూర్ డాలర్	ధామసమినక	62.11	66.59
SAR	సౌదీ రియాల్	ధామసమినక	21.48	23.02
UAE D	యూఏఈ దిర్హామ్	ధామసమినక	21.96	23.74
¥	చైనా యువాన్	ధామసమినక	10.90	12.73

ఆస్టన్ మార్టిన్ వాంటేజ్ @ 4 కోట్లు



న్యూఢిల్లీ: సూపర్ లగ్జరీ కార్ల తయారీలో ఉన్న బ్రిటిష్ కంపెనీ ఆస్టన్ మార్టిన్ భారత్‌లో కొత్త వాంటేజ్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం ధర రూ.3.99 కోట్లు. 4.0 లీటర్ ట్విన్ టర్బో వీ8 ఇంజన్, 8 స్పీడ్ జడ్‌ఎఫ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, ఎల్రక్టానిక్ పవర్ అసిస్టెడ్ స్టీరింగ్, బావర్స్ అండ్ విల్కిన్స్ 15 స్పీకర్స్ సౌండ్ సిస్టమ్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ పొందుపరిచారు. ఈ 2 డోర్ల కూపే 665 పీఎస్ పవర్, 800 ఎన్‌ఎం టార్క్ అందిస్తుంది. గరిష్ట వేగం గంటకు 325 కి.మీ. 3.5 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. కీలకమైన, ఆశాజనక మార్కెట్ కాబట్టి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అన్ని మోడళ్లను భారత్‌లోనూ విడుదల చేస్తున్నట్లు ఆస్టన్ మార్టిన్ న్యూఢిల్లీ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ ఆనంద్ తెలిపారు. సెప్టెంబర్ 2న అంతర్జాతీయంగా వీ12 మోడల్‌ను కంపెనీ విడుదల చేస్తోందన్నారు. ఈ మోడల్ భారత్‌లో తొలిసారిగా వెంటనే అందుబాటులోకి వస్తోందన్నారు.

ఉత్తరాది కంటే వేగంగా దక్షిణాది..

సూపర్ లగ్జరీ కార్ల మార్కెట్ దేశంలో రెండేళ్లుగా ఏటా 35–40% వృద్ధి చెందుతోందని ఆనంద్ చెప్పారు. గతేడాదితో పోలిస్తే కంపెనీ అమ్మకాల్లో 90% వృద్ధి నమోదైందని వివరించారు. ఆస్టన్ మార్టిన్ కార్ల అధికారిక దిగుమతిదారుగా ఆస్టన్ మార్టిన్ న్యూఢిల్లీ వ్యవహరిస్తోంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుండి పెరుగుతున్న డిమాండ్‌ను అధిగమించడానికి కంపెనీ నెట్‌వర్క్‌ను విస్తరించనుంది. ప్రస్తుతం కంపెనీకి న్యూఢిల్లీలో షోరూం ఉంది. ఏడాది చివరికల్లా బెంగళూరులో ఔట్‌లెట్ రానుంది. సూపర్ లగ్జరీ స్పోర్ట్స్ కార్స్ మార్కెట్ ఉత్తరాది కంటే దక్షిణాది వేగంగా వృద్ధి చెందుతోందని ఆనంద్ తెలిపారు.

రిలయన్స్ బొనాంజా

1 షేరుకు షేరు బోనస్

- 1:1లో షేర్ల జారీపై సెప్టెంబర్ 5న బోర్డు నిర్ణయం
- త్వరలో గ్లోబల్ టాప్–30లో కంపెనీకి చోటు
- జియో యూజర్లకు భారీగా ఉచిత క్లౌడ్ స్టోరేజీ
- 5–7 ఏళ్లలో ఓ2సీ స్థాయికి న్యూ ఎనర్జీ బిజినెస్
- కంపెనీ 47వ ఏజీఎంలో చైర్మన్ ముకేశ్ అంబానీ



రిలయన్స్ ఇండస్ట్రీస్ 47వ సాధారణ వార్షిక సమావేశం (ఏజీఎం)లో చైర్మన్ ముకేశ్ అంబానీ వాటాదారులకు బోనస్ షేర్లను ప్రకటించారు. సమీప భవిష్యత్‌లో టాప్–30 గ్లోబల్ దిగ్గజాల్లో ఒకటిగా కంపెనీని తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు టెక్నాలజీ విస్తృత వినియోగం, ఆధునిక తయారీ విధానాలు దన్నుగా నిలుస్తాయని చెప్పారు.

ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఆర్‌ఐఎల్ విస్తృత స్థాయి టెక్నాలజీ కంపెనీగా మారుతోందని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. అన్ని వ్యాపారాల్లోనూ ఏఐ సంబంధ డిజిటల్ ఇన్‌ఫ్రాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తద్వారా కంపెనీ అత్యంత వృద్ధి పథంలో సాగనున్నట్లు చెప్పారు. వెరసి రానున్న కాలంలో కంపెనీ విలువ భారీగా మెరుగుపడనున్నట్లు వివరించారు. ఏజీఎంలో వాటాదారులను ఉద్దేశించి పలు అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ఆర్‌ఐఎల్ గతేడాది ఆర్అండ్‌డీపై రూ. 3,643 కోట్లు వెచ్చించింది. గత ఐదేళ్లలో రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనుంది. అంటే వాటాదారుల వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరుని ఉచితంగా(బోనస్) అందించనుంది. ఈ అంశాన్ని సెప్టెంబర్ 5న సమావేశంకానున్న డైరెక్టర్ల బోర్డు పరిశీలించనుంది. కంపెనీ ఇంతక్రితం 2017 సెప్టెంబర్, 2009 నవంబర్‌లోనూ 1:1 ప్రాతిపదికన బోనస్ షేర్లను జారీ చేసింది.

రిటైల్ జోరు..: గతేడాది రిలయన్స్ రిటైల్ తొలిసారి రూ. 3 లక్షల కోట్ల టర్నోవర్ మైలురాయిని దాటింది. రానున్న 3–4ఏళ్లలో బిజినెస్‌ను రెట్టింపు చేసే లక్ష్యంతో ఉన్నట్లు ఆర్‌ఐఎల్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు. మూడు ప్రయివేట్ లేబుళ్లు రూ. 2,000 కోట్ల వార్షిక అమ్మకాలను అందుకున్నాయి. లగ్జరీ జ్యువెలరీ విభాగంలోకి కంపెనీ ప్రవేశించనుంది. దేశవ్యాప్తంగా 18,836 స్టోర్లను నిర్వహిస్తోంది. దీంతో స్టోర్లరీత్యా టాప్–5 గ్లోబల్ రిటైలర్‌గా నిలుస్తోంది. ఆన్‌లైన్ గ్రోసరీ డెలివరీ సర్వీసుల మిల్క్‌బాస్కెట్‌ను కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోంది. కళానికేతన్, జివామే, క్లోవియా, అర్బన్ ల్యాడర్‌లలో పెట్టుబడులు ఫ్యాషన్ విభాగంలో పట్టుసాధించేందుకు దోహదం చేస్తున్నాయి.

జియో.. బంపర్ ఆఫర్: 100జీబీ క్లౌడ్ స్టోరేజ్ ఫ్రీ

రానున్న దీపావళి కానుకగా రిలయన్స్ జియో యూజర్లకు ఉచితంగా 100 జీబీ క్లౌడ్ స్టోరేజీని అందించనుంది. తద్వారా ఫొటోలు, వీడియోలు ఇతర డిజిటల్ ఫైళ్లను భద్రంగా దాచుకునేందుకు వీలుంటుంది. వచ్చే 3–5 ఏళ్లలో రిలయన్స్ రిటైల్, జియో, డిజిటల్ సర్వీసుల ఆదాయం, నిర్వహణ లాభం (ఇబిటా) రెట్టింపు కానున్నట్లు ముకేశ్ అంచనా వేశారు. డేటా ఆధారిత ఏఐ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రీమియం డివైస్‌ల అందుబాటులోఉన్న క్లౌడ్ సేవలను లగ్జరీగా కాకుండా చౌకగా అందించనున్నట్లు వెల్లడించారు. టీవీ వినియోగదారులకు హలోజియో పేరుతో వాయిస్ అసిస్టెంట్ సేవలను ప్రారంభించింది.

రిలయన్స్ డిస్నీ.. వినోదంలో కొత్త శకం

డిస్నీతో ఒప్పందం దేశీ వినోద రంగంలో సరికొత్త శకానికి దారి చూపనున్నట్లు ముకేశ్ పేర్కొన్నారు. జియో, రిటైల్ తరహాలో మీడియా బిజినెస్ సైతం వృద్ధి బాటలో సాగుతుందని చెప్పారు. డిజిటల్ స్ట్రీమింగ్‌తో కంటెంట్ సృష్టిని జత చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ ప్రయాణంలో భాగంగా ఈ ఏడాది (2024–25) చివరికల్లా ఆర్‌ఐఎల్ తొలి సోలార్ గిగా ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు ముకేశ్ వెల్లడించారు. ఈ ప్లాంటులో ఒకే చోట పీవీ మాడ్యూల్స్, సెల్స్, వేఫర్స్, పాలీసిలికాన్, గ్లాస్ తయారీని చేపట్టనున్నారు. తద్వారా ఈ యూనిట్ సౌరశక్తిని విద్యుత్‌గా మార్చనుంది.

సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త శిఖరాలకు



ముంబై: ఫైనాన్స్, ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో దేశీ సూచీలు గురువారం ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. రిలయన్స్, టాటా మోటార్స్, ఐటీసీ వంటి అధిక వెయిటేజీ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 500 పాయింట్లు ఎగసి 82,283 వద్ద కొత్త రికార్డు నమోదు చేసింది. చివరికి 349 పాయింట్ల లాభంతో 82,135 రికార్డు స్థాయి వద్ద ముగిసింది. ఈ సూచీకిది ఎనిమిదో రోజు లాభాల ముగింపు. వరుసగా 11వ రోజూ లాభాలు కొనసాగించిన ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 100 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,152 వద్ద స్థిరపడింది. ఒక దశలో 141 పాయింట్లు బలపడి 25,193 వద్ద కొత్త ఆల్‌టైం హైని నమోదు చేసింది.

- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.51% పెరిగి రూ.3,041 వద్ద స్థిరపడింది. ఏజీఎంలో ముకేశ్ అంబానీ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించడంతో ఇంట్రాడేలో 2.63 శాతం ర్యాలీ చేసి రూ.3,075 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.30,390 కోట్లు పెరిగి రూ.20.57 లక్షల కోట్లకు చేరింది.
- తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌లో 'డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్'కు ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించడంతో పేటీఎం షేరు 3% పెరిగి రూ.554 వద్ద ముగిసింది.

అంబానీని మళ్లీ దాటేసిన అదానీ

అత్యంత సంపన్న భారతీయుడిగా అగ్రస్థానంలోకి • 11.6 లక్షల కోట్లకు సంపద • హురున్ జాబితా



న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బ నుంచి వేగంగా కోలుకున్న పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ (62) దేశీయంగా అత్యంత సంపన్నుల జాబితాలో మరోసారి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని (67) అధిగమించి అగ్రస్థానం దక్కించుకున్నారు. ఏడాది వ్యవధిలో ఆయన సంపద ఏకంగా 95 శాతం ఎగిసి రూ. 11.6 లక్షల కోట్లకు చేరింది. హురున్ గురువారం విడుదల చేసిన సంపన్నుల జాబితా– 2024లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2023 నివేదికలో అదానీ సంపద 57 శాతం క్షీణించి రూ. 4.74 లక్షల కోట్లకు పడిపోయింది. అప్పుడు అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగా నమోదైంది. తాజాగా అంబానీ మొత్తం సంపద 25 శాతం పెరిగి రూ. 10.14 లక్షల కోట్లకు చేరడంతో ఆయన రెండో స్థానంలో నిల్చారు. తాజా జాబితాలో జూలై 31 నాటి వరకు రూ. 1,000 కోట్ల పైగా నికర విలువ ఉన్న భారతీయ సంపన్నులను పరిగణనలోకి తీసుకున్నారు. ఈసారి కుబేరుల సంఖ్య 220 మేర పెరిగి 1,539కి చేరింది. మొత్తం సంపద 46 శాతం వృద్ధి రూ. 159 లక్షల కోట్లకు చేరింది. ఇది సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్ దేశాల సంయుక్త జీడీపీ కన్నా అధికం కాగా భారతదేశ జీడీపీలో సగానికన్నా అధికం కావడం గమనార్హం. భారత్‌లో ప్రతి ఐదు రోజులకు ఒక కొత్త బిలియనీరు నమోదయ్యారు.

మరిన్ని విశేషాలు..

- హురున్ టాప్–5 జాబితాలో హెచ్‌సీఎల్ అధిపతి శివ్ నాడార్ (రూ. 3.14 లక్షల కోట్లు) మూడో స్థానంలో, సీరమ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన సైరస్ పూనావాలా (రూ. 2.89 లక్షల కోట్లు) ఒక స్థానం తగ్గి నాలుగో స్థానంలో ఉన్నారు. సన్ ఫార్మా అధినేత దిలీప్ సంఘ్వి రూ. 2.50 లక్షల కోట్ల సంపదతో ఆరు స్థానం నుంచి అయిదో స్థానానికి చేరారు.
- 7,300 కోట్ల సంపదతో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ తొలిసారిగా ఈ లిస్టులో చోటు దక్కించుకున్నారు.

టాప్–3లో హైదరాబాద్..

17 మంది కొత్త కుబేరులు జత కావడంతో హైదరాబాద్ తొలిసారిగా బెంగళూరును అధిగమించింది. 104 మంది సంపన్నులతో సంఖ్యాపరంగా మూడో స్థానంలో నిల్చింది. తెలంగాణలో 109 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 9 మంది అత్యంత సంపన్నులు ఉన్నారు. 396 మంది కుబేరులతో ముంబై అగ్రస్థానంలో, 217 మందితో న్యూఢిల్లీ రెండో స్థానంలో ఉంది. అత్యంత సంపన్న తెలుగువారిలో మురళి దివి (దివీస్), సి.వెంకటేశ్వర రెడ్డి–ఎస్.సుబ్రహ్మణ్యం రెడ్డి (అపర్ణ కన్‌స్ట్రక్షన్స్), జీఎం రావు–కుటుంబం (జీఎంఆర్), హర్షా రెడ్డి పొంగులేటి (రాఘవ కన్‌స్ట్రక్షన్స్), పి.పి.రెడ్డి–పీవీ కృష్ణా రెడ్డి (ఎంఈఐఎల్), బి.పార్థసారథి రెడ్డి–కుటుంబం (హెటిరో ల్యాబ్స్), ప్రతాప్ రెడ్డి–కుటుంబం (అపోలో హెల్త్‌కేర్), పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి (అరబిందో ఫార్మా) తదితరులు ఉన్నారు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
వృద్ధి పటిష్టం.. రేటింగ్ యథాతథం ఫిచ్
ఎల్ఐసీ, ఐఓసీ భారీ డివిడెండ్లు

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో అనిరుధ్ జోడీ

రఫా నాదల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. స్పెయిన్‌లోని మనాకోర్ పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ (భారత్)–డేవిడ్ వెగా హెర్నాండెజ్ (స్పెయిన్) ద్వయం 6–4, 6–7 (4/7), 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో రుడాల్ఫ్ మొలెకర్ (జర్మనీ)–జెరోమ్ కిమ్ (స్విట్జర్లాండ్) జోడీపై గెలిచింది.

క్వార్టర్స్‌లో తన్వీ రెడ్డి, ప్రశంస, వెన్నెల

ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల అండర్–19 సింగిల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన అంద్లూరి తన్వీ రెడ్డి, బోనం ప్రశంస, కలగోట్ల వెన్నెల క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పుణేలో బుధవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో తన్వీ రెడ్డి 21–14, 21–9తో ప్రాంజల (భారత్)పై, ప్రశంస 21–18, 21–11తో కర్ణిక (భారత్)పై, వెన్నెల 21–12, 16–21, 21–18తో ప్రాకృతి (భారత్)పై నెగ్గారు.


శీతల్ దేవి

శీతల్ దేవి శుభారంభం

- క్వాలిఫయింగ్‌లో ప్రపంచ రికార్డు
- రెండో ర్యాంక్‌తో నేరుగా రెండో రౌండ్‌లోకి
- పారాలింపిక్స్ క్రీడలు

పారిస్: పారా ఆర్చరీలో గత కొంత కాలంగా సంచలన విజయాలు సాధిస్తున్న భారత ప్లేయర్ శీతల్ దేవి పారాలింపిక్స్‌లోనూ శుభారంభం చేసింది. ఆర్చరీ కాంపౌండ్ ఈవెంట్ మహిళల వ్యక్తిగత విభాగంలో ఆమె నేరుగా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్‌లో శీతల్ రెండో స్థానంలో నిలిచింది. మొత్తం 703 పాయింట్లతో ఆమె తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడంతో పాటు 700 పాయింట్లు దాటిన భారత తొలి మహిళా పారా ఆర్చర్‌గా ఘనత సాధించింది. ఈ క్రమంలో ఆమె కొత్త ప్రపంచ రికార్డు కూడా సృష్టించింది. ఈ నెలలోనే ఫోబ్ పేటర్సన్ (బ్రిటన్) 698 పాయింట్లతో నెలకొల్పిన ప్రపంచ రికార్డును శీతల్ బద్దలు కొట్టింది. అయితే కొద్ది సేపటికే 704 పాయింట్లతో ఈ రికార్డును సవరిస్తూ ఒజ్నర్ క్యూర్ (టర్కీ) మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో శీతల్ 2 స్వర్ణాలు, ఒక రజతం గెలుచుకుంది. ఆ తర్వాత పారా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కూడా పతకం సాధించింది. కశ్మీర్‌కు చెందిన శీతల్ పుట్టుకతోనే 'ఫొకొమెలియా సిండ్రోమ్' వ్యాధి బారిన పడటంతో ఆమె రెండు చేతులూ పని చేయకుండా ఉండిపోయాయి.

సుకాంత్, సుహాస్, తరుణ్ ముందంజ...

బ్యాడ్మింటన్ పోటీల్లో తొలి రోజు భారత్ మెరుగైన ఫలితాలు సాధించింది. భారత్‌కు చెందిన సుకాంత్ కదమ్, సుహాస్ యతిరాజ్, తరుణ్ గ్రూప్ దశలో తమ మొదటి రౌండ్‌లలో విజయాలు అందుకున్నారు. సుకాంత్ 17–21, 21–15, 22–20తో మొహమ్మద్ అమీన్ (మలేసియా)పై, సుహాస్ 21–7, 21–5తో హిక్మత్ రమ్‌దాని (ఇండోనేసియా)పై, తరుణ్ 21–17, 21–19తో ఒలీవిరా రోజరియో (బ్రెజిల్)పై గెలుపొందారు. అయితే మరో ఇద్దరు షట్లర్లు మన్‌దీప్ కౌర్, మానసి జోషిలకు తొలి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. మానసి 21–16, 13–21, 18–21తో ఇక్తియార్ (ఇండోనేసియా) చేతిలో, మన్‌దీప్ 8–21, 14–21తో మరియమ్ బొలాజి (నైజీరియా) చేతిలో పరాజయంపాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో నితీశ్ కుమార్–తులసిమతి 21–14, 21–17తో భారత్‌కే చెందిన సుహాస్ యతిరాజ్–పలక్ కోహ్లిలను ఓడించి ముందంజ వేయగా... శివరాజన్–నిత్యశ్రీ ద్వయం 21–23, 11–21తో మైల్స్ క్రాజెస్కీ–జేసీ సైమన్ (అమెరికా) చేతిలో ఓడారు. తైక్వాండో భారత ప్లేయర్ అరుణ తన్వర్ కథ ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో టర్కీకి చెందిన నూర్సిహన్ ఎకిన్సీ 19–0తో అరుణను చిత్తుగా ఓడించింది. సైక్లింగ్ 3000 మీటర్ల వ్యక్తిగత పర్స్యూట్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన జ్యోతి గడేరియా 10వ స్థానంలో నిలిచి నిష్క్రమించింది. జ్యోతి ఈ రేసును 4 నిమిషాల 53.929 సెకన్లలో ముగించింది.

కోకో జోరు

మూడో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంపియన్

- సబలెంకా, అజరెంకా ముందంజ



న్యూయార్క్: స్వదేశంలో తన జోరు కొనసాగిస్తూ... అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఈ టోర్నీలో అడుగుపెట్టిన మూడో సీడ్ కోకో గాఫ్ రెండో రౌండ్‌లో 6–4, 6–0తో ప్రపంచ 99వ ర్యాంకర్ తాత్యానా మరియా (జర్మనీ)పై గెలిచింది. 80 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో కోకో గాఫ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 28 సార్లు దూసుకొచ్చి 19 సార్లు పాయింట్లు నెగ్గిన కోకో 25 విన్నర్స్ కొట్టింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–3, 6–1తో లూసియా బ్రోన్‌జెట్టి (ఇటలీ)పై, మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్) 6–1, 6–4తో క్లారా బురెల్ (ఫ్రాన్స్)పై గెలిచి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) వరుసగా మూడో ఏడాది మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. రెండో రౌండ్‌లో కిన్‌వెన్ జెంగ్ 6–7 (3/7), 6–1, 6–2తో ఎరికా ఆండ్రీవా (రష్యా)ను ఓడించింది. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో 12వ సీడ్ దరియా కసత్కినా (రష్యా) 1–6, 6–7 (3/7)తో పేటన్ స్టెర్న్స్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

జొకోవిచ్ ముందుకు...

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) మూడో రౌండ్‌కు చేరుకున్నారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జొకోవిచ్ 6–4, 6–4, 2–0తో లాస్లో జెరె (సెర్బియా)పై, జ్వెరెవ్ 6–4, 7–6 (7/5), 6–1తో ముల్లర్ (ఫ్రాన్స్)పై, రూడ్ 6–4, 6–2, 2–6, 7–6 (7/3)తో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు. జెరెతో జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ తొలి రెండు సెట్‌లు గెలిచి, మూడో సెట్‌లో 2–0తో ఆధిక్యంలో ఉన్న దశలో గాయం కారణంగా జెరె వైదొలిగాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 4–6, 5–7, 6–1, 6–2, 6–2తో రిండర్‌నీచ్ (ఫ్రాన్స్)పై, 13వ సీడ్ షెల్టన్ (అమెరికా) 6–3, 6–4, 6–4తో అగుట్ (స్పెయిన్)పై, తొమ్మిదో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–1, 6–1, 7–6 (7/4)తో హిజికాటా (ఆస్ట్రేలియా)పై గెలిచారు.


కోకో గాఫ్

సెమీస్‌లో హైదరాబాద్


అభిరత్ రెడ్డి (211)


అనికేత్ రెడ్డి (5/46)

చెన్నై: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 229 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు జట్లున్న గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్ జట్టు రెండు విజయాలు సాధించి 13 పాయింట్లతో 'టాప్'లో నిలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మ్యాచ్ మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 439/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 129.3 ఓవర్లలో 6 వికెట్లకు 560 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. వరుణ్ గౌడ్ (63 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), టి.రవితేజ (54 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. 353 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ జట్టు 47 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి 46 పరుగులిచ్చి 5 వికెట్లు, తనయ్ త్యాగరాజన్ 35 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు రెండో రోజు హైదరాబాద్ ఓపెనర్ ఎం. అభిరత్ రెడ్డి (243 బంతుల్లో 211; 24 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో మెరిశాడు. మధ్యప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది.

ప్రజ్ఞానందకు ఐదు...గుకేశ్‌కు ఆరు


ప్రజ్ఞానంద

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ అంతర్జాతీయ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌ను భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ అజేయంగా ముగించారు. చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌లను కూడా వీరిద్దరు 'డ్రా' చేసుకోవడం విశేషం. ఎనిమిదో రౌండ్‌లోనే టైటిల్‌ను ఖరారు చేసుకున్న అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ప్రజ్ఞానంద 47 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. వెస్లీ సో (అమెరికా)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరిగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానంద, గుకేశ్, వెస్లీ సో 4.5 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... ప్రజ్ఞానందకు ఐదో స్థానం, గుకేశ్‌కు ఆరో స్థానం, వెస్లీ సోకు ఏడో స్థానం ఖరారయ్యాయి. 6 పాయింట్లతో అలీరెజా ఫిరూజా టైటిల్‌ను దక్కించుకోగా...5.5 పాయింట్లతో ఫాబియానో కరువానా (అమెరికా) రన్నరప్‌గా నిలిచాడు.

రూట్ సెంచరీ



లార్డ్స్: మాజీ కెప్టెన్ జో రూట్ (206 బంతుల్లో 143; 18 ఫోర్లు) రికార్డు సెంచరీతో చెలరేగడంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 7 వికెట్లకు 358 పరుగులు చేసింది. రూట్‌కు ఇది 33వ టెస్టు శతకం కాగా... ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా అలిస్టర్ కుక్ (33)ను రూట్ సమం చేశాడు. అట్కిన్సన్ (81 బంతుల్లో 74 బ్యాటింగ్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) వన్డే తరహాలో వేగంగా ఆడగా... ఓపెనర్ బెన్ డకెట్ (47 బంతుల్లో 40; 4 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 33; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ ఒలీ పోప్ (1), డాన్ లారెన్స్ (9) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, మిలాన్ రత్నాయకే, లహిరు కుమార తలా రెండు వికెట్లు పడగొట్టారు.

తెలుగు భాష చాలా గొప్పది: మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు భాష చాలా గొప్పదని... దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసిన భాష అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగును మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్న వారందరినీ అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. తెలుగు ప్రజలందరికీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు అనేది కేవలం భావవ్యక్తీకరణ కోసం ఉపయోగించే ఒక భాష మాత్రమే కాదని.., యుగయుగాలుగా కవుల ఊహలకు రెక్కలు కట్టి, మన పండితుల జ్ఞానానికి పదును పెట్టిన మన జాతి ప్రాచీన వారసత్వానికి ప్రాణం కూడా అని అన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం పాటుపడే ప్రతి తెలుగు వ్యక్తికి ఈ రోజు మరింత స్ఫూర్తిని కలిగిస్తుందని ఆశిస్తున్నానని అమిత్ షా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


పాస్‌పోర్టు స్లాట్ల రీషెడ్యూల్‌పై ఎస్సెమ్మెస్

- సోమవారం ఉదయం వరకు సేవల నిలిపివేత



సాక్షి, హైదరాబాద్: పాస్‌పోర్టు సేవా పోర్టల్‌కు సాంకేతిక నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం రాత్రి 8 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల దాకా సేవలు నిలిచిపోనున్నాయి. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజ జొన్నలగడ్డ గురువారం ఒక ప్రకటనలో కోరారు. దీంతో శుక్రవారం రాష్ట్రంలో వివిధ పాస్‌పోర్టు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు దాఖలు చేసేవారు.. స్లాట్లు తీసుకున్నవారి అపాయింట్‌మెంట్స్‌ను రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వివరించారు. దీనిపై ఆయా దరఖాస్తుదారులకు సంక్షిప్త సందేశాలు (ఎస్సెమ్మెస్) వస్తాయని, అందులో ఉండే రీ షెడ్యూల్ స్లాట్ సమయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ఎస్సెమ్మెస్‌లో బుక్ చేసుకున్న స్లాట్‌తో పాటు రీ షెడ్యూల్ అయిన స్లాట్ వివరాలు కూడా ఉంటాయన్న విషయం దృష్టిలో పెట్టుకోవాలని ఆమె సూచించారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం రికార్డు స్థాయిలో 15,573 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. 2024–25 సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ అని తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్ ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు విరామం తీసుకోగా, ఎండల తీవ్రత పెరిగింది. దీనికి తోడు వానాకాలం వరి పంట పొట్టకొచ్చే దశకు చేరడంతో నీటి అవసరాలు పెరిగాయి. దీంతో వానాకాలంలో సైతం వేసవి తరహాలో రాష్ట్రంలో భారీగా విద్యుత్ వినియోగం పెరిగింది. వాస్తవానికి గత మార్చి 8న రాష్ట్రంలో నమోదైన 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఇప్పటివరకు అత్యధికం కాగా, అప్పుడు వేసవి కాలం కావడంతో సాధారణ విషయంగా పరిగణించారు.



ఫొటో చాలా బాగుంది కదూ..

ఈ చిత్రాన్ని శ్రేయోవీ మోహతా అనే చిన్నారి తీసింది.



రాజస్తాన్‌లోని కీలదూ నేషనల్ పార్కులో తన తల్లిదండ్రులతో కలిసి నడిచివెళ్తున్నప్పుడు ఈ దృశ్యం కనిపించిందట. దాంతో తన తండ్రి వద్ద ఉన్న కెమెరాను తీసుకుని ఈ ఫొటోను తీశారట. ఇంతకీ విషయమేమిటంటే.. ఇప్పుడీ చిత్రం ప్రఖ్యాత వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్–2024 పురస్కారానికి సంబంధించి జ్యూరీ ప్రశంసలు అందుకుంది. ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా క్రేజు ఉంది. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం 60 ఏళ్లుగా వివిధ విభాగాల్లో ఈ అవార్డులను ఇస్తోంది. ఈ ఏడాది 117 దేశాల నుంచి 60 వేల దాకా ఎంట్రీలు రాగా.. అందులో జ్యూరీ ప్రశంసలు పొందిన కొన్ని చిత్రాలను మీడియాకు విడుదల చేశారు. అందులో శ్రేయోవీ తీసిన చిత్రం 'యంగ్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్(10 ఏళ్ల లోపల)'కేటగిరీలో ఉంది. విజేతలను అక్టోబర్ 8న ప్రకటిస్తారు.

పారిశ్రామికవేత్తలే టార్గెట్

మాయలేడి కాదంబరిని అడ్డుపెట్టుకుని ఏపీ సర్కారు సరికొత్త దందా



సాక్షి, అమరావతి : బాలీవుడ్ హీరోయిన్‌గా చెప్పుకునే కాదంబరి జత్వానీ అత్యంత వివాదాస్పదురాలు. బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, బ్యూరో క్రాట్లు తదితరులను లక్ష్యంగా చేసుకుని 'వలపు వల (హనీ ట్రాప్)' వేసి...అనంతరం బ్లాక్ మెయిలింగ్ చేస్తూ భారీగా డబ్బులు గుంజడంలో ఆమె సిద్ధహస్తురాలు. అందుకోసం సంతకాలు ఫోర్జరీ చేయడం, బోగస్ పత్రాలను సృష్టించడం వంటి నేరాలకు పాల్పడుతూ మరీ భారీగా ఆస్తులను కొల్లగొట్టడం ఆమె చరిత్ర. ఈ విషయాలన్నీ పలు ఆధారాలతో సహా నిర్ధారణ అయ్యాయి. అయితే ఈ మాయలేడి బ్లాక్ మెయిలింగ్ దందాను ఆసరాగా తీసుకుని ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం దుష్ట రాజకీయాలకు తెరతీసింది. బాధితులకు బాసటగా నిలవాల్సింది పోయి.. బాధితులనే బెదిరింపులకు గురిచేస్తూ దొరికిన కాడికి దండుకోవాలని వ్యూహం పన్నింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు.. ఇన్నాళ్లూ ప్రత్యర్థి పార్టీ వరకే పరిమితం చేసిన వేధింపులను తాజాగా పారిశ్రామికవేత్తలకూ వర్తింపజేశారు. ఈ పరంపరలో బడా పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌ను తాజాగా ఈ కేసులోకి లాగుతున్నారు. ఇందుకు ఎల్లో మీడియా ఆయన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ఊతమిస్తోంది. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో యునైటెడ్ బెవరేజెస్ పరిశ్రమను.. వైఎస్సార్ జిల్లాలో జువారి, దాల్మియా సిమెంటు పరిశ్రమల యాజమాన్యాన్ని సర్కారు పెద్దలు ముడుపుల కోసం బెదిరింపులకు పాల్పడ్డారు. జాతీయ రహదారి పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థలను ముడుపుల కోసం వేధిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ తీరు వల్ల పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. అయినా సరే టీడీపీ పెద్దలు బరితెగించి మరీ బాడా పారిశ్రామికవేత్తలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారు. మరోవైపు ఎన్నికల హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన తమ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించాలన్నది కూడా చంద్రబాబు ప్రభుత్వ పన్నాగంగా ఉంది.

దండుకునే దందా..

దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా కూడా వలపు వల (హనీ ట్రాప్) పేరుతో బ్లాక్ మెయిలింగ్ దందా అది పెద్ద సమస్యగా మారింది. బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, రక్షణ రంగంలోని ఉన్నతాధికారులు, బ్యూరోక్రాట్లను లక్ష్యంగా చేసుకుని వలపు వల విసిరి.. అనంతరం వారీ నుంచి భారీగా డబ్బులు, ఆస్తులు కొల్లగొట్టడం ఓ మాఫియాస్థాయికి చేరడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అటువంటి ఓ హనీట్రాప్ కేసును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ పోలీసులు అత్యంత సమర్థంగా సత్వరం పరిష్కరించి శభాష్ అనిపించారు. పూర్తి ఆధారాలతో కేసు నమోదు చేసి.. న్యాయస్థానం అనుమతితో నిందితురాలిని ముంబయి నుంచి తీసుకువచ్చి... విజయవాడ న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. అంతా చట్ట ప్రకారం వ్యవహరించారని అందరూ ప్రశంసించారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆ వ్యవహారంలో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డ ఘరానా మోసగత్తెకు వత్తాసు పలుకుతోంది. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరోయిన్‌గా చెప్పుకునే 'హనీట్రాప్ స్పెషలిస్ట్' కాదంబరీ జత్వానీని అడ్డంపెట్టుకుని టీడీపీ కూటమి ప్రభుత్వం ఐపీఎస్ అధికారులకు గురిపెట్టింది. రెడ్‌బుక్ రాజ్యాంగం సృష్టిస్తు న్న టెర్రర్‌లో మరో అంకానికి తెర తీసింది.

వలపు వల.. ఆపై బ్లాక్ మెయిలింగ్

వలపు వల, బ్లాక్ మెయిలింగ్, ఫోర్జరీ దందా కోసం కాదంబరీ జత్వానీ పకడ్బందీగా వ్యవహరించేవారు. పోలీసుల విచారణలో ఆమె అక్రమాలలన్నీ పూర్తి ఆధారలతో సహా బట్టబయలయ్యాయి. అవేమిటంటే.. కాదంబరీ జత్వానీకి రెండు పాస్ పోర్టులు, రెండు ఆధార్ కార్డులు ఉన్నాయి. ఒక్కొక్కరి వద్ద ఒక్కో పేరుతో పరిచయం చేసుకునేది. ఈ పకడ్బందీ దందాలో కదాంబరీ తమ్ముడు అంబరీశ్ జత్వానీ కూడా ప్రధాన పాత్రధారే. దుబాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే తన తమ్ముడికి అండర్ వరల్డ్ మాఫీయాతో సంబంధాలు ఉన్నాయని... ఆ మాఫియా ద్వారా అంతం చేస్తామని కూడా కాదంబరీ తీవ్ర స్థాయిలో బెదిరించే వారు. మాఫియాతో సంబంధాలు ఉండటమే కాదు హవాలా రాకెట్‌ను కూడా అతను నిర్వహించే వాడు. ఈ విధంగా ముంబయి, ఢిల్లీ, బెంగళూరులతో పాటు దేశంలోని పలు నగరాల్లోని పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, బ్యూరో క్రాట్లను బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడి భారీగా ఆస్తులు కొల్లగొట్టారు. ఏసియన్ పెయింట్స్ ప్రమోటర్ మాలవ్ దానీ కూడా ఆమె బాధితుల జాబితాలో ఉన్నారు. ఆయన ఫిర్యాదుతో ముంబయిలోని గమ్‌దేవీ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదు చేశారు. అదే రీతిలో దేశంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌పై తప్పుడు ఆరోపణలతో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడింది.

అంతా చట్టబద్ధంగానే..

తనకు అలవాటైన రీతిలోనే కాదంబరీ జత్వానీ ఓ రాజకీయ నేత కుక్కల విద్యాసాగర్‌పై వలపు వల విసిరి అనంతరం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడింది. ఆయన నుంచి భారీగా డబ్బులు వసూలు చేయడమే కాకుండా దుబాయిలోని మాఫియాతో అంతం చేయిస్తానని బెదిరించింది. విద్యాసాగర్‌కు చెందిన జగ్గయ్యపేటలో సర్వే నంబరు 396/2ఏ2హెచ్/1తో 5 ఎకరాల భూమిని ఫోర్జరీ పత్రాలతో సొంతం చేసుకుంది. ఆ భూమిని మరొకరికి విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో విద్యాసాగర్‌కు విషయం తెలిసింది. దాంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన విజయవాడ పోలీసులు చట్టానికి లోబడి విచారణ నిర్వహించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. మెజిస్ట్రేట్ నుంచి సెర్చ్ వారెంట్ తీసుకుని ముంబయి వెళ్లారు. ముంబయి పోలీసు ఉన్నతాధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే కాదంబరీ జత్వానీని అరెస్ట్ చేసి అక్కడి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలతో సంతృప్తి చెందిన మెజిస్ట్రేట్.. ఆమెను ఏపీకి తీసుకువచ్చేందుకు ట్రాన్సిట్ వారెంట్ జారీ చేశారు. దాంతో కాదంబరీ జత్వానినీ పోలీసులు విజయవాడ తీసుకువచ్చి అదే రోజు స్థానిక మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించంతో ఆమెను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. అనంతరం ఆమెకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఆమె కొన్నాళ్లు ఇబ్రహీంపట్నంలో నివాసం ఉండి, తర్వాత ముంబయికి వెళ్లింది. దీన్ని బట్టి చూస్తే సినీ నటి అరెస్టులో అంతా చట్టబద్ధంగా జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో ఆమెకు న్యాయవాదుల సహాయం అందించేందుకు పోలీసులు సంసిద్ధత చూపారు. కానీ ఆమె అందుకు తిరస్కరించి ముంబయి నుంచి తన సొంత న్యాయవాదులను రప్పించుకున్నారు. ఈ కేసు విషయంలో విజయవాడ పోలీసులు పూర్తిగా చట్టబద్ధంగా వ్యవహరించారు. న్యాయస్థానాల అనుమతితో, నిబంధనలకు లోబడి దర్యాప్తు ప్రక్రియ పూర్తి చేశారు. దేశంలోనే ఎందరో బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలు, బ్యూరో క్రాట్లను బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడూ మోసం చేస్తున్న కాదంబరీ నేరాలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యను అభినందించాల్సింది పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం.. పోలీసు అధికారులపై తప్పుడు ఆరోపణలతో వేధించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

సర్కారే లీకులిచ్చి..

భారత రాజ్యాంగాన్ని గౌరవించం అని, తాము అమలు చేసేది లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగమేనని టీడీపీ కూటమి ప్రభుత్వం పదే పదే స్పష్టం చేస్తోంది. తాము లక్ష్యంగా చేసుకున్న పోలీసు అధికారులు, రాజకీయ నేతలను వేధించడమే ధ్యేయంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగానే కాదంబరీ జత్వానీ కేసును నేపథ్యంగా తీసుకుని పోలీసు అధికారులకు గురి పెట్టింది. ప్రభుత్వం దురుద్దేశంతోనే ఈ కేసుకు సంబంధించి అవాస్తవాలు, అభూత కల్పనలను టీడీపీ అనుకూల మీడియాకు లీకులు ఇచ్చింది. తద్వారా ఆ పోలీసు అధికారులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోంది. టీడీపీ అనుకూల పత్రికల్లో పతాక శీర్షికలతో కథనాలు... పచ్చ టీవీ చానళ్లలో రోజంతా చర్చలతో రాద్ధాంతం చేస్తోంది. తాజాగా ఇంకో అడుగు ముందుకేసి.. కాదంబరీ జత్వానీ ఉదంతంపై పత్రికలు, టీవీల్లో వస్తున్న కథనాలపై విచారించాలని విజయవాడ ఏసీపీ కె.స్రవంతి రాయ్‌ను గురువారం విచారణాధికారిగా నియమించింది.

కన్హా సేవలు అభినందనీయం: భట్టి

నందిగామ: సమాజ అభ్యున్నతికి హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ (కన్హా శాంతివనం) నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన 'వెల్‌నెస్ బై హార్ట్ ఫుల్‌నెస్ సెంటర్'ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మాట్లాడారు. సంస్థ గురూజీ కమ్లేశ్ పటేల్ దూర దృష్టితో కన్హాను ఏర్పాటు చేశారని, సంపూర్ణ ఆరోగ్యానికి ఈ కేంద్రం ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. ఆరోగ్యకరమైన, మెరుగైన భవిష్యత్తు నిర్మాణం కోసం ఈ సెంటర్ చాలా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి కుల, మతభేదాల్లేకుండా ప్రతిఒక్కరూ ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా ఉండాలనే ఉద్దేశంతో నిరంతరం ధ్యానాన్ని బోధించడం గొప్ప విషయమని కొనియాడారు. కన్హాలోని విద్యా సంస్థలు, క్రికెట్ స్టేడియం, ఆస్పత్రి, బ్యాంకు తదితర మౌలిక వసతులు అద్భుతంగా ఉన్నాయని వివరించారు. హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గురూజీ మాట్లాడుతూ, అందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతోనే సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఆచార్య శ్రీవర్మ మాట్లాడుతూ.. పలు ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో హోలిస్టిక్ మెడిసిన్ కీలకంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెల్‌నెస్ బై హార్ట్ ఫుల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

రుణ దరఖాస్తుదారులే టార్గెట్

డబ్బులు గుంజుతున్న 8 మంది అరెస్టు

సాక్షి, హైదరాబాద్: రుణ దరఖాస్తుదారులే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతున్న కీలక సూత్రదారి సహా 8 మందిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వనపర్తి సైబర్ సెక్యూరిటీ బ్యూరో, కొత్తకోట పోలీసుల ఉమ్మడి ఆపరేషన్‌లో వీరు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పీఎం విశ్వకర్మ కింద రూ.లక్ష రుణం కోసం కొత్తకోటకు చెందిన ఒకరు జనవరి 11న మీ సేవకేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. అదే రోజు అతని వాట్సాప్ నంబర్‌కు తెలియని నంబర్ నుంచి ఓ సందేశం వచ్చింది. రుణం మంజూరు కావాలంటే ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కొంత మొత్తం పంపాలన్నారు. దీంతో ఆయన రూ.3,700, రూ.8,500 పంపించారు. ఆ తర్వాత మరో రూ.9 వేలు కావాలని మోసగాళ్లు అడిగారు. దీనికి నిరాకరించిన అయన జనవరి 21 కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనపర్తి డీఎస్పీ, కొత్తకోట పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించి వర్తియావత్ నర్సింహ, రత్లావత్ రమేశ్, పోతులపల్లి గురుమూర్తి, ఇస్లావత్ రాములు అలియాస్ బాబు, కొత్తపల్లి ఉమేశ్, బోయ వీరేశ్, ఇస్లావత్ సూరజ్ అలియాస్ బాలు, వర్తియావత్ ప్రవీణ్‌లను అరెస్ట్ చేశారు.టీజీసీఎస్‌బీ డిప్యూటీ ఎస్పీ ఎన్.బీ.రత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐపీ ఎం.రాంబాబు, డబ్ల్యూఎస్ఐ ప్రియదర్శిని, ఎస్ఐపీ మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వనపర్తి ఎస్పీ యాదగిరి నేతృత్వం వహించారు.

మహిళలంటే గౌరవం తరగతి గది నుంచే మొదలవ్వాలి

స్త్రీలు, చిన్నారుల రక్షణ, చట్టాలను పాఠ్యాంశంగా బోధించాలి

'మానవ అక్రమ రవాణా' జాతీయ సదస్సులో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: 'మహిళలను ఎలా గౌరవించాలి? నేరం చేస్తే ఎలాంటి శిక్ష పడుతుంది? సమాజంలో ఎలా ఛీత్కారానికి గురవుతారు? వంటి అంశాలపై తరగతి గది నుంచే విద్యార్థులకు బోధించాలి. ఆయా అంశాలను క్రోడీకరించి ప్రత్యేకంగా పాఠ్యాంశంగా పెట్టాలి'అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. రాజకీయాలు, వ్యాపారాలు, పరిపాలన ఇలా అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నా, నేటికీ సమాజంలో మహిళలంటే చిన్నచూపే ఉందని, ఇంటా.. బయటా ఏదో ఒక రూపంలో వేధింపులు, అవమానాలకు గురవుతూనే ఉన్నారని చెప్పారు. మహిళలంటే శృంగారం కోసమనే భావన ఇప్పటికీ ఉందని చెప్పారు. తెలంగాణ మహిళా భద్రతావిభాగం ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణాలో కొత్త పోకడలు, ఎదుర్కొనే వ్యూహాలు'అనే అంశంపై గురువారం హెచ్ఐసీసీలో రెండు రోజుల జాతీయసదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. నేరం చేసిన వెంటనే నేరస్తులను పట్టుకోవడం, న్యాయస్థానంలో హాజరుపర్చడం, శిక్ష వేయడం త్వరితగతిన జరిగిపోవాలని, అప్పుడే నేరస్తులలో భయం కలుగుతుందని చెప్పారు.

ఉచిత బస్సుతో నేరాలు తగ్గాయి..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలయ్యాక రాత్రి పూట మహిళల అపహరణలు తగ్గాయని మంత్రి సీతక్క అన్నారు. బస్టాండ్‌లో ఒంటరిగా మహిళ కనిపిస్తే పోకిరీనో, నేరస్తుడో వేధించే పరిస్థితులు ఇప్పుడు లేవని, ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు గుంపులు గుంపులుగా ఉంటున్నారని చెప్పారు. మహిళల్లో ధైర్యం, వ్యక్తిగత భద్రత పెంచేలా ఈ పథకం ఉందన్నారు.



సదస్సులో మంత్రి సీతక్క, ఐఏఎస్ అధికారిణి దివ్య దేవరాజన్, డీజీ శిఖాగోయల్, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, డీజీపీ జితేందర్

'కొత్తరకం నేరాలపై అధ్యయనానికి ప్రత్యేక విభాగం'

మానవ అక్రమ రవాణాను అరికట్టాలంటే పోలీసు, న్యాయవ్యవస్థ అత్యంత కీలకమని డీజీపీ జితేందర్ తెలిపారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాతోపాటు అవయవాల వ్యాపారం, సైబర్ బానిసత్వం, కాస్మొటిక్ సర్జరీ వంటి కొత్తరకం నేరాలు మొదలయ్యాయని చెప్పారు. వివిధ దేశాల్లో జరుగుతున్న కొత్తరకం నేరాలపై అధ్యయనం చేసేందుకు మహిళా భద్రత విభాగంలోనే ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేస్తామని డీజీపీ ప్రకటించారు. ఈ విభాగం ఆయా నేరాలపై వివిధ దేశాల్లోని పోలీసులు, న్యాయవ్యవస్థలు అవలంబిస్తున్న చట్టాలు, పాలసీలను విశ్లేషించి, ఉత్తమ విధానాలను సూచిస్తుందని వివరించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) బృందాలు 31 ఉన్నాయని, వీటి ద్వారా పదేళ్లలో 62 వేల మంది చిన్నారులను రక్షించామన్నారు మహిళలపై నేరాలకు పాల్పడే నిందితులపై హిస్టరీ షీట్లు తెరుస్తున్నామని, ఇప్పటివరకు 147 మంది రిపీటెడ్ నేరస్తులపై షీట్లు ఓపెన్ చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీసుఅకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, మహిళా భద్రతవిభాగం డీఐజీ రెమారాజేశ్వరి, సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డానియల్ అజోయ్ వర్ఘీస్, ప్రజ్వల ఫౌండర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


నీ కుడి చేయి నేనే నాన్నా...

భువనగిరి టౌన్: ఆటో నడుపుతూ కుటుంబాన్ని నడిపే నాన్నకు పక్షవాతం సోకింది. బండి నడిపితే తప్ప బతుకు బండి నడవదు. తొమ్మిదో తరగతి చదువుతున్న పెద్ద కూతురు పెద్దమనసు చేసుకుంది. తండ్రితో కలిసి ఆటో నడుపుతోంది. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరికి చెందిన ఏర్పుల ఎల్లయ్యకు ఆరు నెలల క్రితం పక్షవాతం రావడంతో కుడి చేయి పని చేయడం లేదు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఎల్లయ్యకు.. కుటుంబ పోషణ భారం కావడంతో 9వ తరగతి చదువుకుంటున్న కుమార్తె ఊర్మిళ.. రోజూ తండ్రితో కలిసి ఆటో నడిపేందుకు వెళ్తోంది. ఆటోలో ఎల్లయ్య ఎడమ చేతితో గేరు వేస్తే.. ఊర్మిళ ఎక్స్‌లేటర్ ఇస్తుంది.. ఎల్లయ్యే బ్రేక్ వేస్తాడు. ఇలా ఇద్దరూ కలిసి రోజూ సాయంత్రం భువనగిరి పట్టణంలో ఆటో నడిపిస్తారు. ఎల్లయ్యకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు కాగా.. ఊర్మిళ పెద్ద కుమార్తె. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లయ్య భార్య అనిత కోరుతోంది.



ఒక్కరే మాస్టారు.. ఒక్కడే విద్యార్థి!

ఆ విద్యార్థి కూడా అనారోగ్యంతో గైర్హాజరు



అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం పడమటితండా ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఒక్క విద్యార్థి ఉన్నాడు. ఆ విద్యార్థి కూడా అనారోగ్య సమస్యతో సక్రమంగా పాఠశాలకు రావడం లేదు. డీఈవో అశోక్ బుధవారం పాఠశాలను తనిఖీ చేయగా.. ఆ విద్యార్థి గైర్హాజరైన విషయం వెల్లడైంది. పాఠశాలలో ఏకైక ఉపాధ్యాయుడు వేమారెడ్డి.. విద్యార్థి రాక ఖాళీగా కూర్చున్నారు.

తండ్రిని పట్టించుకోని కొడుకు గిఫ్ట్ డీడ్ రద్దు

6 ఎకరాల భూమిని తిరిగి తండ్రి పేరిట మార్చిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ప్రకటన

ధర్మారం(పెద్దపల్లి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదంటూ కొడుకు పేరిట చేసిన ఆస్తి గిఫ్ట్ డీడ్‌ను తిరిగి తండ్రి పేరిట బదిలీ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి తన కుమారుడైన గడ్డం స్వామిరెడ్డికి వివిధ సర్వే నంబర్లలోని తనకున్న 6 ఎకరాల 5 గుంటల భూమిని గిఫ్ట్ డీడ్ చేశారు. అయితే కొంతకాలంగా తన బాగోగులు చూసుకోవట్లేదని కొడుకుపై పెద్దపల్లి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన ఆర్డీవో.. స్వామిరెడ్డికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా కొడుకు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన బాపురెడ్డి గతంలో తన కొడుకు పేరిట చేసిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసేందుకు దరఖాస్తు సమర్పించారు. ఆ దరఖాస్తును అప్పీలుగా స్వీకరించి ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి కలెక్టర్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఆర్డీవో ఉత్తర్వుల అమల్లో స్వామిరెడ్డి నిర్లక్ష్యం వహించినట్లు కలెక్టర్ నిర్ధారించారు. దీంతో వయోవృద్ధుల సంక్షేమ చట్టం–2007 ప్రకారం గడ్డం బాపురెడ్డి కొడుకు పేరిట చేసిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి తిరిగి తండ్రి పేరిట బదిలీ చేయాలని నిర్ణయించారు. అలాగే తండ్రి పోషణకు ప్రతి నెలా రూ. 10వేలను ఆయన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కుమారుడు స్వామిరెడ్డి, కుమార్తె సింగిరెడ్డి లతను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుందని.. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థికంగా 'లిఫ్ట్' ఇస్తే పతకం 'ఎత్తాడు'



ప్రథమ స్థానంలో నిలిచిన వంశీ

వాజేడు/భద్రాచలం: అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా మొండి పట్టుదలే ఓ గిరిజన బిడ్డను మారుమూల గూడెం నుంచి యూరప్ దాకా తీసుకెళ్లింది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అతనికి విజయాన్ని అందించింది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి మారుమూల గ్రామం ఇప్పగూడేనికి చెందిన మోడెం వంశీ టెన్త్ వరకు చదువుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేసి కూలి పనులకు వెళ్తున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. యూరప్ వెళ్లడానికి రూ. 2.10 లక్షలు అవసరమవగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులతోపాటు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మరికొందరు విరాళాలు సేకరించి వంశీని పోటీలకు పంపించారు. యూరప్‌లోని మాల్టాలో ఈ నెల 28న వంశీ 66 కేజీల జూనియర్ విభాగంలో మొత్తం 662.50 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించాడు.

3 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్: మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లోని ఉత్తర బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడి శుక్రవారం ఉదయానికల్లా పశ్చిమ–మధ్య పరిసర వాయవ్య బంగాళాఖాతం వద్ద కేంద్రీకృతమయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఆంధ్రప్రదేశ్, పరిసర దక్షిణ ఒడిశా వైపు కదిలే క్రమంలో మరింత బలపడి వాయుగుండంగా మారొచ్చని తెలిపింది. ఆ తర్వాత పశ్చిమ–మధ్య, పరిసర వాయవ్య బంగాళాఖాతం వద్ద కేంద్రీకృతం కానుందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


● అజయ్ దేవగన్


● ఎన్టీఆర్

ఒక్కోసారి ఒక్కో ఇండస్ట్రీలో ఒక్కో ట్రెండ్ కనిపిస్తుంటుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో మల్టీస్టారర్ ట్రెండ్ కనిపిస్తోంది. గతంలో కూడా బాలీవుడ్ తెరపై మల్టీస్టారర్ ట్రెండ్ ఉంది. కానీ ఇప్పుడు ఈ తరహా చిత్రాలు చాలానే నిర్మాణంలో ఉన్నాయి. ఇలా మల్టీస్టార్స్‌తో బాక్సాఫీస్‌పై వార్‌కు రెడీ అవుతున్న చిత్రాల గురించి, ఆ చిత్రాల్లో నటిస్తున్న హీరోల గురించి తెలుసుకుందాం.

మల్టీస్టార్స్... బాక్సాఫీస్‌పై వార్!

పోలీస్ పవర్


● రణ్‌వీర్ సింగ్

ఓ సినిమాలో ఇద్దరు స్టార్ యాక్టర్స్ కనిపిస్తే మల్టీస్టారర్ అనేస్తుంటారు సినీ అభిమానులు. అలాంటిది ఏడుగురు స్టార్స్ కలిసి ఓ సినిమా చేస్తే... అది బడా మల్టీస్టారర్ అన్నమాట. ఈ ప్రస్తావన 'సింగమ్ ఎగైన్' సినిమా గురించే. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలో ఒకటైన 'సింగమ్' సిరీస్ నుంచి 'సింగమ్ ఎగైన్' రానుంది. అజయ్ దేవగన్, కరీనా కపూర్ జంటగా నటిస్తున్న ఈ సినిమాకు రోహిత్ శెట్టి దర్శకుడు. పోలీస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. అర్జున్ కపూర్ విలన్‌గా నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. రోహిత్ శెట్టి, అజయ్ దేవగణ్, జ్యోతి దేశ్ పాండే ఈ 'సింగమ్ ఎగైన్' సినిమాను నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నారు... కానీ వాయిదా వేశారు. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం రిలీజయ్యే అవకాశాలు ఉన్నాయని బీ టౌన్ టాక్. ఇక హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టిల కాంబినేషన్‌లో 'సింగమ్' సిరీస్‌లో ఇప్పటికే వచ్చిన 'సింగమ్' (2011), 'సింగమ్ రిటర్న్స్' (2014) సినిమాలు హిట్స్‌గా నిలవడంతో 'సింగమ్ ఎగైన్'పై బాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. పైగా అక్షయ్ కుమార్‌తో రోహిత్‌శెట్టి 'సూర్యవన్షీ', రణ్‌వీర్ సింగ్‌తో 'సింబ' వంటి పోలీస్ యాక్షన్ సినిమాలను తీసి హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు అజయ్ దేవగన్, ఈ ఇద్దరూ, మరికొందరు స్టార్స్‌తో కలిసి రోహిత్ శెట్టి అందించనున్న ఈ 'సింగమ్ ఎగైన్' ఏ రేంజ్‌లో వసూళ్ల కొల్లగొడుతుందో చూడాలి.

స్పై వార్


● హృతిక్ రోషన్

వెండితెరపై హృతిక్ రోషన్‌తో స్పై వార్ చేస్తున్నారు ఎన్టీఆర్. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొంది, 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'వార్'. వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రలో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని బాలీవుడ్ సమాచారం. ఇక 'వార్ 2' సినిమాను తొలుత 2025 జనవరిలో రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం రిలీజ్‌ను 2025 ఆగస్టు 14కు వాయిదా వేశారు. ఎన్టీఆర్ హిందీలో చేస్తున్న తొలి స్ట్రయిట్ ఫిల్మ్ కూడా 'వార్ 2' కావడం విశేషం.

ఢీ అంటే ఢీ


● షారుక్ ఖాన్


● అభిషేక్ బచ్చన్

'కింగ్'తో ఢీ అంటున్నారు అభిషేక్ బచ్చన్. షారుక్ ఖాన్, ఆయన తనయ సుహానా ఖాన్ లీడ్ రోల్స్‌లో 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రూపొందనుంది. సుజోయ్ ఘోష్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. నిజ జీవితంలో తండ్రీకూతుళ్లు అయిన షారుక్ ఖాన్, సుహానా ఈ సినిమాలో గురు శిష్యులుగా కనిపిస్తారట. అలాగే ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ విలన్‌గా నటించనున్నారు. 'కింగ్' సినిమాలో తాను విలన్‌గా నటించనున్న విషయాన్ని ఇటీవల సోషల్ మీడియాలో పరోక్షంగా కన్ఫార్మ్ చేశారు అభిషేక్ బచ్చన్. గతంలో 'కభీ అల్విదా నా కెహనా (2006)', 'హ్యాపీ న్యూ ఇయర్ '(2014) వంటి సినిమాల్లో షారుక్ ఖాన్, అభిషేక్ బచ్చన్ కలిసి నటించారు. కానీ ఈ చిత్రాల్లో ఈ ఇద్దరు హీరో తరహా పాత్రల్లో నటించారు. ఇప్పుడు 'కింగ్' సినిమా కోసం షారుక్ ఖాన్, అభిషేక్ ఒకరితో ఒకరు ఢీ అంటే ఢీ అంటూ తలపడనుండటం విశేషం. ప్రస్తుతం 'కింగ్' మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాదిలోనే చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట.

ట్రయాంగిల్ లవ్‌స్టోరీ


● విక్కీ కౌశల్


● ఆలియా భట్

లవ్ అండ్ వార్ అంటున్నారు ఆలియా భట్. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ లీడ్ రోల్‌లో నటించనున్న హిందీ చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది జనవరిలో ప్రకటించారు. కానీ చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. సెప్టెంబరు చివర్లో లేదా అక్టోబరులో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించనున్నారని బాలీవుడ్ టాక్. ఈ సినిమా ముక్కోణపు ప్రేమకథగా సాగుతుందట. మరి.. రణ్‌బీర్ కపూర్-ఆలియాల ప్రేమకు మధ్యలో విక్కీ కౌశల్ వస్తారా? లేక ఆలియా భట్- విక్కీ కౌశల్‌ల మధ్యలోకి రణ్‌బీర్ కపూర్ వస్తారా? అనే చర్చ బాలీవుడ్‌లో జరుగుతోంది. పైగా వివాహం చేసుకున్న తర్వాత రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ కలిసి చేయనున్న సినిమా కూడా ఇదే కావడంతో 'లవ్ అండ్ వార్'పై బాలీవుడ్‌లో అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఆల్రెడీ చిత్రయూనిట్ ప్రకటించింది.

సైనికుల పోరాటం


● వరుణ్ ధావన్


● సన్నీ డియోల్

సన్నీ డియోల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'బోర్డర్' (1997). 1971లో జరిగిన ఇండియా-పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ చిత్రం విడుదలై ఇరవయ్యేడేళ్లయిన సందర్భంగా ఇటీవల 'బోర్డర్'కు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' చిత్రాన్ని ప్రకటించారు. కాగా 'బోర్డర్ 2' సినిమాలో బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ కూడా మరో లీడ్ రోల్ చేయనున్నారు. ఈ విషయాన్ని ఇటీవల చిత్రబృందం ప్రకటించింది. అలాగే ఆయుష్మాన్ ఖురానా కూడా మరో లీడ్ రోల్‌లో కనిపించనున్నారట. అయితే 'బోర్డర్'కు జేపీ దత్తా దర్శకత్వం వహించగా, సీక్వెల్‌కు మాత్రం అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించనున్నారు. 2026 జనవరి 23న 'బోర్డర్ 2'ను రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హౌస్‌ఫుల్ ఎంటర్‌టైన్మెంట్

బాలీవుడ్‌లోని హిట్ ఫ్రాంచైజీలో 'హౌస్‌ఫుల్' ఒకటి. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి నాలుగు సినిమాలు రావడం, ప్రేక్షకుల్లో ఈ ఫ్రాంచైజీకి ఉన్న ఆదరణను స్పష్టం చేసింది. తాజాగా 'హౌస్‌ఫుల్ 5' కూడా రెడీ అవుతోంది. సంజయ్ దత్, అక్షయ్ కుమార్, జాన్ అబ్రహాం, అభిషేక్ బచ్చన్, కృతీ సనన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఇందులో నటిస్తున్నారు. తరుణ్ మన్సుఖాని దర్శకుడు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీని తొలుత ఈ ఏడాది చివర్లోనే రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఆ తర్వాత 2025 జూన్ 6న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రమే కాకుండా అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న 'వెల్‌కమ్ టు ది జంగిల్', 'జాలీ ఎల్ఎల్‌బీ 3' సినిమాల కూడా మల్టీ స్టారర్ మూవీసే! ఈ చిత్రాలు కూడా 2025లోనే విడుదల కానున్నాయని బాలీవుడ్ సమాచారం.


● అక్షయ్ కుమార్


● సంజయ్ దత్

ఈ చిత్రాలే కాదు.. కార్తీక్ ఆర్యన్, 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రీ జంటగా నటిస్తున్న 'భూల్ భూలయ్యా 3'లో మాధురీ దీక్షిత్, విద్యాబాలన్ కీ రోల్స్‌లో నటిస్తున్నారు. 'రేస్ 4' మూవీలో సైఫ్ అలీఖాన్, సిద్ధార్థ్ మల్హోత్రా లీడ్ రోల్స్‌లో కనిపిస్తారని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇలా మరికొన్ని మల్టీస్టారర్ మూవీస్ బాలీవుడ్‌లో ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు



నేను అండగా ఉంటాను - సమంత

'విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యూసీసీ)లోని మహిళలందరికీ నేను అండగా ఉంటాను. న్యాయం కోసం మీ పోరాటం నాతో సహా చాలా మందికి స్ఫూర్తినిచ్చింది'' అంటూ పేర్కొన్నారు హీరోయిన్ సమంత. మలయాళ చిత్ర పరిశ్రమలో నెలకొన్న వేధింపులపై నియమించిన 'హేమా' కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపైన ఇతర సినీ ఇండస్ట్రీకి చెందిన నటీనటులు కూడా స్పందిస్తూ తమ వంతు మద్దతు తెలుపుతున్నారు. తాజాగా సమంత కూడా తన సోషల్ మీడియా వేదికగా 'డబ్ల్యూసీసీ' కి మద్దతుగా ప్రకటించారు. పరిశ్రమలో మహిళలను రక్షించడానికి సంస్కరణల తక్షణ అవసరాన్ని హేమ కమిటీ నివేదిక హైలైట్ చేసింది.. అయితే దీని వెనక 'డబ్ల్యూసీసీ' కమిటీ కృషి ఎంతో ఉంది. సినిమా రంగంలో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన స్థానం కోసం వాదించడంలో డబ్ల్యూసీసీ సమిష్టి పట్టుదల, కృషి ప్రశంసనీయం'' అన్నారు సమంత.

చలో స్పెయిన్


● అజిత్

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అదిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారని, కీలక పాత్రల్లో హీరోయిన్ శ్రీలీల, సునీల్ కనిపిస్తారని కోలీవుడ్ సమాచారం. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ స్పెయిన్‌లో జరగనుందట. త్వరలోనే చిత్రబృందం స్పెయిన్‌కు వెళ్లనుందట. అక్కడ కొంత టాకీ పార్టుతో పాటు ఓ సాంగ్, యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట దర్శకుడు అదిక్ రవి చంద్రన్. ఈ చిత్రంలో అజిత్ క్యారెక్టర్‌లో మూడు వేరియేషన్స్ ఉండనున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.


● తమన్నా


● విజయ్ వర్మ

ఆ ఫోటోలను బయటపెట్టం - విజయ్ వర్మ

నటుడు విజయ్ వర్మ, హీరోయిన్ తమన్నా ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా వారి రిలేషన్‌షిప్‌పై విజయ్ వర్మ రెస్పాండ్ అయ్యారు. ''ఈ రోజుల్లో ఓ రిలేషన్‌షిప్‌ను దాచాలంటే చాలా కష్టం. కలిసి బయటకు వెళ్లకూడదు. మన స్నేహితులతో మనం ఉన్నప్పుడు వాళ్లు మన ఫొటోలు తీయకూడదు. నిజానికి ఇలాంటివి నాకు అసలు ఇష్టం ఉండవు. నా ఫీలింగ్స్‌ను ఏదో పంజరంలో బంధించినట్లుగా ఉంచడం నాకు నచ్చదు. తనతో (తమన్నాను ఉద్దేశిస్తూ....) నేను ఉన్న ఫొటోలు దాదాపు 5 వేల వరకు ఉన్నాయి. కానీ వాటిని మేం సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా బహిర్గతం చేయాలనుకోవడం లేదు. వాటిని మా మనసులకు దగ్గరగా దాచుకుంటున్నాం. అయినా ఈ రోజుల్లో తోటివారి జీవితాల్లో ఏం జరుగుతోందన్న విషయాలను తెలుసుకోవడం పట్ల అందరూ ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు'' అని చెప్పుకొచ్చారు.

ఆదిపురుష్ బాగానే ఆడింది - ఓం రౌత్



'రామాయణం' ఆధారంగా రూపొందిన చిత్రం 'ఆదిపురుష్'. ఈ చిత్రంలో రాఘవ పాత్రలో ప్రభాస్, జానకి పాత్రలో కృతీ సనన్, శేష్ పాత్రలో సన్నీ సింగ్, భజరంగ్ పాత్రలో దేవ్ దత్తా, లంకేష్ పాత్రలో సైఫ్ అలీఖాన్ నటించిన విషయం తెలిసిందే. ఓం రౌత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. భూషణ్‌కుమార్, క్రిషణ్‌కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ నిర్మించిన ఈ సినిమా 2023 జూన్ 16న విడుదలైంది. అయితే 'ఆదిపురుష్' సినిమాకు మిశ్రమ స్పందన లభించింది. పైగా ఓం రౌత్ దర్శకత్వాన్ని చాలామంది నెటిజన్లు విమర్శిస్తూ, సోషల్ మీడియాలో కామెంట్స్ పెట్టారు. అప్పటి అంశాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఓం రౌత్ స్పందించారు. ''ప్రభాస్, సల్మాన్ ఖాన్ వంటి వాళ్ల స్టార్‌డమ్ జయాపజయాలకు అతీతంగా ఉంటుంది. వారికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉంది. ప్రభాస్‌తో నేను తీసిన 'ఆదిపురుష్' సినిమాకు దేశవ్యాప్తంగా తొలి రోజు 70 కోట్ల రూపాయల వసూళ్లు వచ్చాయి. ఫైనల్‌గా 400 కోట్ల రూపాయల వరకు ఈ సినిమా కలెక్ట్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 200 కోట్ల రూపాయల కలెక్షన్స్ వచ్చాయి. ఓ సినిమాకు బాక్సాఫీస్ నంబర్సే కొలమానం అయితే 'ఆదిపురుష్' సినిమా బాగా ఆడింది. రెవెన్యూ పరంగా నష్టం లేదు. ఇక సినిమా టికెట్‌ను కొని చూసినవారికి, ఆ సినిమా నచ్చకపోతే ట్రోల్స్ చేసే హక్కు ఉంటుంది. కానీ మనకు తెలియని వారు చేసే విమర్శలను మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. పైగా కొందరు సినిమా పెర్ఫార్మెన్స్‌ను చూడకుండా సోషల్ మీడియాలో క్లిప్పింగ్స్ షేర్ చేశారు. ఇది కూడా కరెక్ట్ కాదు'' అని అన్నారు.

కొత్త శకం మొదలైంది!


● జాన్సన్, బెయిలీ

హాలీవుడ్‌లో 'జురాసిక్ పార్క్' ఫ్రాంచైజీ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ ఉంది. కాగా ఈ ఫ్రాంచైజీ నుంచి తాజాగా రానున్న సినిమాకు 'జురాసిక్ వరల్డ్: రీ బర్త్' అనే టైటిల్ ఖరారైంది. ''జురాసిక్ వరల్డ్‌లో కొత్తశకం మొదలైంది'' అంటూ 'జురాసిక్ వరల్డ్: రీ బర్త్' సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. గారెత్ ఎడ్వర్డ్స్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో స్కార్లెట్ జాన్సన్, జోనాథన్ బెయిలీ, మాన్యువల్ గార్సియా, రూపర్ట్, లూనా బ్లేజ్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఫ్రాంక్ మార్షల్, పాట్రిక్ క్రౌలి నిర్మిస్తున్న ఈ 'జురాసిక్ వరల్డ్: రీ బర్త్' చిత్రం 2025 జూలైలో రిలీజ్ కానుంది.

డేట్ ఫిక్స్


● విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి, సూరి లీడ్ రోల్స్‌లో నటించిన పీరియాడికల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'విడుదలై'. 'వడ చెన్నై, అసురన్' చిత్రాల ఫేమ్ వెట్రిమారన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా, ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. భవానీ శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, రాజీవ్ మీనన్ వంటివారు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. కాగా 2023 మార్చి 31న రిలీజైన ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఈ సినిమాకు కొనసాగింపుగా 'విడుదలై 2'ను రెడీ చేశారు దర్శక-నిర్మాతలు. ఇందులో విజయ్ సేతుపతి, సూరి, మంజు వారియర్, అనురాగ్ కశ్యప్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. ఎల్రెడ్ కుమార్‌తో కలిసి వెట్రిమారన్ ఈ సినిమాను నిర్మించారు. డిసెంబరు 20న 'విడుదలై 2'ని రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం అందించారు.

బిజినెస్ రీల్

యూజియా ఫార్మాకు ఫార్మెక్సిల్ అవార్డు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా స్పెషాలిటీస్ 2022-23లో ఫార్మా ఎగుమతులకు సంబంధించి ఫార్మెక్సిల్ ప్లాటినం స్టార్ అవార్డు అందుకుంది. ఫార్మా ఎగుమతుల్లో కీలక పాత్ర పోషించినందుకు గాను నోయిడాలో జరిగిన కార్యక్రమంలో దీన్ని ప్రదానం చేశారు. కంపెనీ సీఈవో పి. యుగంధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ విజయ్ నటరాజన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ ఈ పురస్కారాన్ని అందజేశారు.

మార్కెట్స్ మోజో నుంచి 'మోజో ఎంఎఫ్'

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ మార్కెట్స్ మోజో.. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు, పంపిణీ సేవల కోసం కొత్తగా 'మోజోఎంఎఫ్' పేరుతో ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. పెట్టుబడులపై మంచి రాబడులు ఎలా సమకూర్చుకోవాలి, ఏ తరహా ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి తదితర సలహా సేవలను ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. అత్యాధునిక ఆల్గోరిథమ్ రూపొందించిన ఫండ్స్ ఎంపికల ద్వారా ఇన్వెస్టర్లు ప్రయోజనం పొందొచ్చని తెలిపింది. రానున్న రోజుల్లో వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలను సైతం అందించనున్నట్లు ప్రకటించింది.

అవెస్తాజెన్‌తో అపోలో ఆయుర్వేద్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లైఫ్‌సైన్సెస్ కంపెనీ అవెస్తాజెన్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన ఆయుర్వేద ఉత్పత్తుల్లో ఉన్న అపోలో ఆయుర్వేద్ చేతులు కలిపాయి. ఇందులో భాగంగా వైద్య సంబంధ ఆహార ఉత్పత్తుల తయారీ, విక్రయిస్తారు. అవెస్తా ఆయుర్వేద్ బ్రాండ్ కింద వీటిని మార్కెట్ చేస్తారు.

కొచర్ అండ్ కో కార్యకలాపాల విస్తరణ

ముంబై: గ్లోబల్ ఫార్చూన్ 100, 500 కంపెనీలు, దేశీ కార్పొరేట్లకు న్యాయసలహా సేవలు అందిస్తున్న కొచర్ అండ్ కో తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. వృద్ధి వ్యూహాల అమలుకు, క్లయింట్ల సేవలను మరింత మెరుగుపర్చుకునేందుకు ఇది దోహదపడగలదని కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ రోహిత్ కొచ్చర్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-8-2024	
విశాఖ	525-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	1,112.90	3.57
BAJAJFINSV	1,758.30	2.61
BRITANNIA	5,842.85	2.45
BAJFINANCE	7,066.65	2.42
BPCL	356.5	2.4

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,674.95	-1.5
M&M	2,763.00	-1.25
JSWSTEEL	938.2	-1.16
EICHERMOT	4,902.65	-0.89
KOTAKBANK	1,777.85	-0.75

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,147
ఎన్ఎస్ఈ	1,31,402
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,78,973
ఎఫ్ఐఐ	+ 3,260
డీఐఐ	+ 2,691

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	75.77	$ 74.52
బ్రెంట్	78.61	$ 77.58

వృద్ధి పటిష్టం.. రేటింగ్ యథాతథం: ఫిచ్

న్యూఢిల్లీ: పటిష్ఠ వృద్ధి తీరు, ద్రవ్య విశ్వసనీయత నేపథ్యంలో భారత్ ఆర్థిక వ్యవస్థకు 'స్టేబుల్ అవుట్‌లుక్‌తో బీబీబీమైనస్' ను కొనసాగిస్తున్నట్లు గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ స్పష్టం చేసింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటును 7.2 శాతంగా అంచనావేసిన ఫిచ్, 2025-26లో ఈ రేటు 6.5 శాతంగా ఉంటుందని పేర్కొంది. 2023-24లో దేశం సాధించిన 8.2 శాతంతో పోల్చితే ఒక శాతంపైగా వృద్ధిరేటు తగ్గుతుండడం గమనార్హం. ఈ ఏడాది మేలో మరో రేటింగ్ దిగ్గజం- ఎస్ అండ్‌పీ గ్లోబల్ దేశ రేటింగ్ అవుట్‌లుక్‌ను 'స్టేబుల్ నుంచి పాజిటివ్‌కు' పెంచింది. అయితే 'బీబీబీమైనస్'ను కొనసాగించింది. రెండు సంస్థల రేటింగ్‌లూ 'జంక్ స్టేటస్'కు ఒక అంచె ఎక్కువ. మూడీస్ కూడా ఇదే స్థాయి రేటింగ్‌ను దేశానికి ఇస్తోంది.

మూడీస్ వృద్ధి అంచనాల పెంపు

మూడీస్ తాజాగా ఒక నివేదికను విడుదల చేస్తూ, దేశ ఎకానమీ వృద్ధి రేటు అంచనాలను పెంచింది. 2024లో జీడీపీ వృద్ధి అంచనాలను 6.8 శాతం నుంచి 7.2 శాతానికి, 2025లో 6.4 శాతం నుంచి 6.6 శాతానికి పెంచుతున్నట్లు పేర్కొంది.




మళ్లీ ఐపీవోకు కంకార్డ్ ఎన్విరో

న్యూఢిల్లీ: పర్యావరణ ఇంజినీరింగ్ సొల్యూషన్ల కంపెనీ కంకార్డ్ ఎన్విరో సిస్టమ్స్ మరోసారి పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 192 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 51.94 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ఇంతక్రితం 2022లోనూ సెబీ నుంచి లిస్టింగ్‌కు అనుమతులు పొందింది. అయితే ఐపీవోను చేపట్టలేదు. కాగా.. ఈక్విటీ జారీ నిధులలో రూ. 25 కోట్లు నీటి శుద్ధి వ్యవస్థల కొత్త అసెంబ్లీ యూనిట్ ఏర్పాటుకు కంకార్డ్ ఎన్విరో ఎఫ్‌జెడ్‌ఈపై వెచ్చించనుంది. మరో రూ. 10.5 కోట్లు రోకెమ్ సెపరేషన్ సిస్టమ్స్ విస్తరణకు వినియోగించనుంది. రూ. 50 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 33.5 కోట్లు వృద్ధి కార్యక్రమాలకు కేటాయించనుంది.

ఎంటీఎన్ఎల్ ఖాతాలు ఫ్రీజ్

యూనియన్ బ్యాంక్ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికం సేవల సంస్థ ఎంటీఎన్ఎల్ ఖాతాలను ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్తంభింపజేసింది. బకాయిలు చెల్లించనందుకు ఈ చర్య చేపట్టింది. రుణాలు చెల్లించనందుకు ఖాతాలను ఫ్రీజ్ చేసినట్టుగా ఆగస్ట్ 21న యూనియన్ బ్యాంక్ తమకు సమాచారం ఇచ్చినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎంటీఎన్ఎల్ తెలిపింది. రూ.422 కోట్ల రుణ బకాయిల చెల్లింపుల్లో విఫలమైనట్టు ఈ నెల ఆరంభంలో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఎంటీఎన్ఎల్ సమాచారం ఇవ్వడం గమనార్హం. ఇందులో యూనియన్ బ్యాంక్‌కు రూ.155.76 కోట్లు, ఎస్‌బీఐకి రూ.40 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాకి రూ.40 కోట్లు చొప్పున బకాయి పడింది.



ఆర్థికమంత్రి సీతారామన్‌కు డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

ఎల్ఐసీ, ఐవోసీ భారీ డివిడెండ్లు

కేంద్రానికి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) భారీ డివిడెండ్లను అందించాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ ఎండీ సిద్ధార్థ మొహంతి రూ.3,662.17 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది మార్చి 1వ తేదీన ఎల్ఐసీ రూ.2,441.45 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను అందించింది. తాజాగా అందజేసిన డివిడెండ్‌తో కలిసి 2023-24లో సంస్థ మొత్తం రూ.6,103.62 కోట్ల డివిడెండ్‌ను అందించినట్లైంది. ఇక ఐవోసీ రూ.5,091 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి సమర్పించింది. 2024-25లో ఇప్పటి వరకూ కేంద్రానికి రూ.10,604.74 కోట్ల డివిడెండ్ అందింది. 2023-24లో డివిడెండ్లు రూ.50,000 కోట్లుకాగా, 2024-25లో ఈ విలువ అంచనాలు రూ.56,260 కోట్లు.

3 ఎయిర్‌లైన్స్‌పై డీజీసీఏ చర్యలు



న్యూఢిల్లీ: వివిధ నిబంధనల ఉల్లంఘనలకు గాను మూడు విమానయాన సంస్థలు, 1 ఫ్లయింగ్ ట్రైనింగ్ సంస్థపై విమానయాన రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ చర్యలు తీసుకుంది. రద్దయిన ఫ్లయిట్లకు సంబంధించి ప్రయాణికులకు పరిహారం చెల్లించనందుకు గాను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు రూ. 10 లక్షల జరిమానా విధించింది. అలాగే సంక్షోభంలో చిక్కుకున్న స్పైస్‌జెట్‌పై పర్యవేక్షణ స్థాయిని పెంచడంతో పాటు పలు ఉల్లంఘనలకు గాను ఆకాశ ఎయిర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఫ్లయిట్స్ తరచుగా రద్దవుతున్న వార్తల నేపథ్యంలో ఆగస్టు 7, 8 తేదీల్లో కంపెనీ ఇంజినీరింగ్ యూనిట్ల స్పెషల్ ఆడిట్ నిర్వహించగా, నిర్దిష్ట లోపాలు తమ దృష్టికి వచ్చినట్లు డీజీసీఏ తెలిపింది. ఈ నేపథ్యంలోనే సంస్థపై పర్యవేక్షణను మరింతగా పెంచినట్లు పేర్కొంది. అటు, ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదంపై ఆడిట్ నిర్వహించిన మీదట అల్కెమిస్ట్ ఏవియేషన్ అనుమతులను డీజీసీఏ సస్పెండ్ చేసింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా పెంపు



న్యూఢిల్లీ: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం జీక్యూజీ పార్ట్‌నర్స్ 0.43 శాతం వాటాను అదనంగా కొనుగోలు చేసింది. దీంతో కంపెనీలో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా 4.74 శాతం నుంచి 5.17 శాతానికి పెరిగింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆగస్టు 23న జీక్యూజీ పార్ట్‌నర్స్ తన అనుబంధ సంస్థల ద్వారా ఓపెన్ మార్కెట్లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాకు చెందిన 4.52 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది. ఆ రోజు నాటి షేరు ముగింపు ధర రూ. 95.85 ప్రకారం ఇందుకోసం రూ. 433 కోట్లు వెచ్చించినట్లయింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాలో జీక్యూజీ పార్ట్‌నర్స్‌కి గతంలో 7.66 శాతం వాటాలు ఉన్నప్పటికీ కార్పొరేట్ చర్యల కారణంగా అది 5 శాతం లోపునకు తగ్గింది.

హెచ్‌యూఎల్‌కు రూ.963 కోట్ల పన్ను నోటీసు



న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఆదాయ పన్ను శాఖ నుంచి రూ.963 కోట్లకు పన్ను నోటీసు అందుకుంది. చట్టప్రకారం దీనిపై అప్పీల్‌కు వెళ్లనున్నట్టు ప్రకటించింది. హెచ్‌యూఎల్ లోగడ గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్స్యూమర్ నుంచి హార్లిక్స్, బూస్ట్, మాల్టోవా, వివా బ్రాండ్లను, వాటికి సంబంధించి మేధో సంపత్తి హక్కులను కొనుగోలు చేసింది. ఇందుకు రూ.3,045 కోట్లు చెల్లించింది. దీనిపై టీడీఎస్ వసూలు చేయలేదు. దీంతో రూ.329 కోట్ల వడ్డీ సహా మొత్తం రూ.962.75 కోట్లు చెల్లించాలంటూ ఆదాయపన్ను శాఖ నోటీసు జారీ చేసింది. నాటి చెల్లింపులపై టీడీఎస్ వసూలు చేయకపోవడం వెనుక చట్టబద్ధమైన సహేతుకత ఉన్నట్టు హెచ్‌యూఎల్ పేర్కొంది. కనిపించని ఆస్తుల (ఇంటాంజిబుల్) విక్రయం ద్వారా వచ్చే ఆదాయం భారతీయ పన్ను చట్టాల పరిధిలోకి రాదని తెలిపింది.

భారత్‌పే నుంచి యూపీఐ టీపీఏపీ



న్యూఢిల్లీ: వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పించేలా ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాం భారత్‌పే తాజాగా యూపీఐ టీపీఏపీని (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్) ఆవిష్కరించింది. ఇందుకోసం యూనిటీ బ్యాంకుతో జట్టుకట్టినట్లు తెలిపింది. ఈ సేవల కోసం కస్టమర్లు భారత్‌పే యాప్‌లో @ఐఐ ఎక్స్‌టెన్షన్‌తో తమ యూపీఐ ఐడీని క్రియేట్ చేసుకుని ఇటు వ్యక్తులకు అటు వ్యాపార వర్గాలకు చెల్లింపులు జరపవచ్చని పేర్కొంది. కంపెనీ ఇప్పటివరకు వ్యాపారవర్గాల మధ్య యూపీఐ చెల్లింపుల కోసం భారత్‌పే ఫర్ బిజినెస్ యాప్‌ను నిర్వహిస్తోంది. తాజాగా తమ బై-నౌ-పే-లేటర్ యాప్ 'పోస్ట్‌పే' పేరును 'భారత్‌పే'గా మార్చి వినియోగదారుల చెల్లింపుల సేవల కోసం మరో యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలిపింది.

గూగుల్‌తో ఏథర్ జట్టు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ టూ వీలర్స్ కంపెనీ ఏథర్ తాజాగా టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తమ కస్టమర్లు 'ఏథర్ గ్రిడ్' ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్ల సమాచారం రియల్ టైమ్‌లో తెలుసుకునేందుకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని ఏథర్ తెలిపింది. ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఎక్కడ ఉన్నా గూగుల్ మ్యాప్స్‌లో ప్రత్యక్షం అవుతాయి.

కార్మికులకు పన్ను రిటర్నులు సులభం

క్లియర్ ట్యాక్స్ వాట్సాప్ సేవ



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో పన్ను రిటర్నుల సేవలు అందించే క్లియర్ ట్యాక్స్ సంస్థ మైక్రోసాఫ్ట్‌తో జట్టుకట్టింది. గిగ్ వర్కర్లు వాట్సాప్ నుంచే సులభంగా రిటర్నులు దాఖలు చేసుకునే సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మైక్రోసాఫ్ట్ అజూర్ ఓపెన్ ఏఐ సేవలను ఇందుకు వినియోగించుకుంది. కేవలం ఐదు వారాల్లోనే 98,000 మంది గిగ్ వర్కర్లు ఈ నూతన సిస్టమ్ ద్వారా రిటర్నులు దాఖలు చేసినట్టు క్లియర్ ట్యాక్స్ ప్రకటించింది. బ్లూ కాలర్ కార్మికులు (పరిశ్రమల్లో, నిర్మాణ సంస్థల్లో పనిచేసే) సైతం పన్ను రిటర్నుల దాఖలు, టీడీఎస్ రిఫండ్‌ల కోసం ఈ సేవలను ఆఫర్ చేయనున్నట్టు తెలిపింది.

డి బీర్స్ గ్రూప్‌తో తనిష్క్ జట్టు

న్యూఢిల్లీ: జ్యుయలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్, అంతర్జాతీయ డైమండ్ దిగ్గజం డి బీర్స్ గ్రూప్ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది తోడ్పడగలదని ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. నిఖార్సయిన డైమండ్‌ల ధృవీకరణ, వజ్రాభరణాల గురించి కస్టమర్లలో అవగాహన పెంచడంలో తనిష్క్ రిటైల్ సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడగలదని పేర్కొన్నాయి. భారత్‌లో సహజసిద్ధమైన వజ్రాభరణాలకు ఇటీవలి కాలంలో ఆదరణ గణనీయంగా పెరిగినట్లు వివరించాయి. మధ్య తరగతి జనాభా, విలువైన ఆభరణాలను కొనే వారి సంఖ్య పెరుగుతుండటంతో అంతర్జాతీయ డిమాండ్‌లో 11 శాతం వాటా భారత్‌దే ఉంటోందని పేర్కొన్నాయి. సహజసిద్ధ వజ్రాభరణాలకు రెండో అతి పెద్ద మార్కెట్‌గా చైనా స్థానాన్ని భారత్ ఆక్రమించిందని పేర్కొన్నాయి. అయితే, అమెరికా వంటి సంపన్న దేశాలతో పోలిస్తే భారత్‌లో డైమండ్‌ల కొనుగోలు ఇంకా తక్కువగానే ఉందని, ఈ నేపథ్యంలో దేశీయంగా పెరిగే డిమాండ్‌ను బట్టి సహజసిద్ధ వజ్రాభరణాల మార్కెట్ వృద్ధికి మరిన్ని అవకాశాలు ఉన్నాయని కంపెనీలు వివరించాయి. తనిష్క్ ఇప్పటికే తమ డైమండ్ వెరిఫికేషన్ టెక్నాలజీ సేవలు పొందుతోందని, దానికి తాజా ఒప్పందం కొనసాగింపని డి బీర్స్ పేర్కొంది.

కార్యాలయ వసతులకు రికార్డు స్థాయి డిమాండ్

8 నగరాల్లో 80 మిలియన్ ఎస్ఎఫ్‌టీ

- ఆకర్షణీయ అవకాశాలు.. అనుకూల వాతావరణం
- కుష్‌మ్యాన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ నగరాల్లో ఈ ఏడాది స్థూల ఆఫీస్ స్పేస్ (కార్యాలయ వసతి) డిమాండ్ 80 మిలియన్ చదరపు అడుగులు (ఎస్ఎఫ్‌టీ) దాటుతుందని కుష్‌మ్యాన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక తెలిపింది. 2023లో 74 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండడం గమనార్హం. హైదరాబాద్‌తోపాటు, పుణె, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ పట్టణాల గణాంకాలు ఈ నివేదికలో ఉన్నాయి. డీఎల్ఎఫ్ రెంటల్ వ్యాపారం ఎండీ, వైస్ చైర్మన్ శ్రీరామ్ ఖట్టర్ ఈ నివేదికపై స్పందిస్తూ.. భారత్ అంతర్జాతీయంగా పోటీతత్వంతో కూడిన సానుకూల ప్రయోజనాలను ఆఫర్ చేస్తున్నట్టు చెప్పారు. మన దేశంలో యువ, సాంకేతిక నిపుణులు అధిక సంఖ్యలో ఉన్నారని, వీరు నాణ్యమైన రియల్ ఎస్టేట్‌ను కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ అనుకూలతలు అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్నట్టు పేర్కొన్నారు. విశ్వసనీయత కలిగిన డెవలపర్ల నుంచి గ్రేడ్-ఏ ఆఫీస్ వసతుల కోసం అంతర్జాతీయ కంపెనీలు చూస్తున్నట్టు ఖట్టర్ తెలిపారు. 2024 మొదటి ఆరు నెలల్లో 41.9 మిలియన్ ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైందని.. బహుళజాతి కంపెనీల నుంచి తాజా డిమాండ్ ఇందుకు తోడైనట్టు ఈ నివేదిక వెల్లడించింది. ద్వితీయ ఆరు నెలల్లోనూ ఇదే ధోరణి ఉంటుందని, మరో 40 మిలియన్ చదరపు అడుగుల మేర ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదు కావచ్చని అంచనా వేసింది.

గ్రేడ్ ఏ డిమాండ్ డౌన్..



గ్రేడ్ ఏ ఆఫీస్ వసతుల లీజింగ్ ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 0.40 శాతం తగ్గి 17.7 శాతంగా ఉంది. 2021 చివరి మూడు నెలల కాలం తర్వాత ఇంత తక్కువ లీజింగ్ తిరిగి మళ్లీ ఇదే కావడం గమనార్హం. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో ఐటీ-బీపీఎం రంగం అత్యధికంగా 26 శాతం మేర స్థూల ఆఫీస్ వసతుల డిమాండ్‌ను ఆక్రమించింది. ఆ తర్వాత బీఎఫ్ఎస్ఐ రంగం రెండో స్థానంలో ఉంది. ''భారత ఆఫీస్ లీజింగ్ మార్కెట్ రికార్డు స్థాయి డిమాండ్‌ను చూస్తోంది. బలమైన ఆర్థిక మూలాలు, అత్యాధునిక డిజిటల్ సాంకేతికత, కార్యాలయాలకు వచ్చి పనిచేసే ఉద్యోగులు పెరగడం, కరోనా కాలంలో వాయిదా పడిన విస్తరణ ప్రణాళికలు అమల్లోకి రావడం ఇవన్నీ డిమాండ్‌ను నడిపిస్తున్నాయి'' అని టెనెంట్ రిప్రజెంటేషన్ ఎండీ వీరబాబు తెలిపారు. దేశీయ కంపెనీల నుంచి డిమాండ్ స్థిరంగా ఉండగా, అంతర్జాతీయ కంపెనీలను సైతం భారత ఆర్థిక వ్యవస్థ ఆకర్షిస్తున్నట్టు చెప్పారు. దీంతో 2024 మొదటి ఆరు నెలల్లో లీజింగ్ కార్యకలాపాలు జోరుగా సాగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆఫీస్ లీజింగ్ కొత్త రికార్డులను నమోదు చేయవచ్చన్నారు. విభిన్నమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులు, టెక్నాలజీ అనుకూల వాతావరణం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం.. ఇవన్నీ గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాల (జీసీసీ) ఏర్పాటుకు వీలు కల్పిస్తున్నట్టు టెనెంట్ రిప్రజెంటేషన్ ఇండియా సీఈవో అన్షుల్ జైన్ తెలిపారు. కేవలం టెక్నాలజీయే కాకుండా దాదాపు అన్ని రంగాల నుంచి ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ నెలకొన్నట్టు చెప్పారు.

పీఅండ్‌జీ లాభం నేలచూపు

ఏప్రిల్-జూన్‌లో రూ. 81 కోట్లకు పరిమితం




న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్(పీఅండ్‌జీ) హైజీన్ హెల్త్‌కేర్ ఈ ఏడాది(2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ4)లో నికర లాభం 46 శాతం క్షీణించి రూ. 81 కోట్లకు పరిమితమైంది. కంపెనీ జులై-జూన్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 151 కోట్ల నికర లాభం ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 853 కోట్ల నుంచి రూ. 932 కోట్లకు బలపడింది. హెల్త్‌కేర్, మహిళా సంరక్షణ విభాగాల అభివృద్ధి వ్యయాలు లాభాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. కాగా.. మొత్తం వ్యయాలు 26 శాతం ఎగసి రూ. 827 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 675 కోట్లకు పరిమితమైంది. గతేడాది రూ. 678 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 7 శాతం పుంజుకుని రూ. 4,206 కోట్లయ్యింది. బీఎస్ఈలో పీఅండ్‌జీ షేరు 2.5 శాతం నీరసించి రూ. 16,551 వద్ద ముగిసింది.

స్విగ్గీలో అమితాబ్ బచ్చన్ కుటుంబానికి వాటాలు



న్యూఢిల్లీ: ఐపీవోకి సన్నద్ధమవుతున్న ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం స్విగ్గీలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కి చెందిన ఫ్యామిలీ ఆఫీస్ స్వల్ప వాటాలు తీసుకున్నట్లు సమాచారం. కంపెనీ ఉద్యోగులు, ప్రారంభ దశ ఇన్వెస్టర్ల నుంచి షేర్లను కొనుగోలు చేయడం ద్వారా ఈ లావాదేవీని నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 10,414 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు స్విగ్గీ షేర్‌హోల్డర్లు ఏప్రిల్‌లో ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఐపీవోలో భాగంగా కొత్తగా షేర్లను జారీ చేయడంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద షేర్లను విక్రయించనున్నారు.

పేటీఎం పేమెంట్స్‌లో పెట్టుబడులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌లో (పీపీఎస్ఎల్) పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించినట్లు పేటీఎం బ్రాండ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ వెల్లడించింది. కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం ఆగస్టు 27న అనుమతులు మంజూరు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. దీంతో పేమెంట్ అగ్రిగేటర్ (పీఏ) లైసెన్సు కోసం మరోసారి దరఖాస్తు చేసుకోనున్నట్లు వివరించింది. ఈ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ సేవలను, పేమెంట్ అగ్రిగేటర్ సర్వీసులను ఒకే కంపెనీ అందించకూడదనే నిబంధన కారణంగా, 2022 నవంబర్‌లో పీఏ లైసెన్సు కోసం పేటీఎం సమర్పించిన దరఖాస్తును రిజర్వ్ బ్యాంక్ తిరస్కరించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనలకు సంబంధించిన ప్రెస్ నోట్ 3కి అనుగుణంగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రెస్ నోట్ 3 ప్రకారం భారత సరిహద్దు దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు కేంద్రం నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. అప్పట్లో పేటీఎంలో చైనాకు చెందిన అలీబాబా గ్రూప్ అతి పెద్ద వాటాదారుగా ఉండేది. తాజాగా మారిన పరిస్థితుల ప్రకారం కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో, ప్రెస్ నోట్ 3 నిబంధనలకు అనుగుణంగా పేటీఎం మరోసారి పీఏ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోనుంది.

439 బిలియన్ యూపీఐ లావాదేవీలు

- 2029 మార్చి నాటికి మూడింతలు
- పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక

న్యూఢిల్లీ: యూపీఐ వినియోగం ఏటేటా గణనీయంగా పెరుగుతూనే ఉంది. 2028-29 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి యూపీఐ లావాదేవీలు మూడు రెట్ల వృద్ధితో 439 బిలియన్లకు (ఒక బిలియన్ వంద కోట్లకు సమానం) చేరుకుంటాయని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ లావాదేవీలు 131 బిలియన్లుగా ఉన్నట్టు తెలిపింది. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అద్భుతమైన వృద్ధిని చూసినట్టు పేర్కొంది. ఈ కాలంలో లావాదేవీల విలువ రూ.265 లక్షల కోట్ల నుంచి రూ.593 లక్షల కోట్లకు పెరిగినట్టు వెల్లడించింది.

రిటైల్ చెల్లింపుల్లో యూపీఐ హవా

రిటైల్ డిజిటల్ చెల్లింపుల్లో ఇప్పుడు యూపీఐ వాటా 80 శాతాన్ని అధిగమించిందని.. 2028-29 నాటికి 91 శాతానికి చేరుకోవచ్చని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. యూపీఐ ఏటేటా చక్కని వృద్ధిని చూస్తోందంటూ.. లావాదేవీల పరిమాణంలో 57 శాతం వృద్ధి ఉన్నట్టు పేర్కొంది. క్రెడిట్ కార్డ్ విభాగం సైతం 2023-24లో బలమైన వృద్ధిని చూసిందని, కొత్తగా 1.6 కోట్ల కార్డులను పరిశ్రమ జోడించుకున్నట్టు వివరించింది. దీంతో లావాదేవీల పరిమాణం 22 శాతం మేర, లావాదేవీల విలువ 28 శాతం చొప్పున పెరిగినట్టు వెల్లడించింది.



2028-29 నాటికి క్రెడిట్‌కార్డులు 20 కోట్లకు చేరుకోవచ్చని తెలిపింది. ఇక డెబిట్ కార్డుల వినియోగం తగ్గుతోంది. లావాదేవీల పరిమాణం, విలువలోనూ క్షీణత కనిపించింది. వచ్చే ఐదేళ్లలో చెల్లింపుల పరిశ్రమ ఎకోసిస్టమ్ విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వొచ్చని, ప్రస్తుతమున్న ప్లాట్‌ఫామ్‌లపైనే కొత్త వినియోగ అవకాశాలను గుర్తించొచ్చని పీడబ్ల్యూసీ ఇండియా పేమెంట్స్ పార్ట్‌నర్ మిహిర్ గాంధీ అంచనా వేశారు.


భారత బృందం పతాకధారులుగా సుమిత్ అంటిల్, భాగ్యశ్రీ





అంతటా అదే ఉత్సాహం

ఘనంగా ప్రారంభమైన పారాలింపిక్స్ క్రీడలు


ఒలింపిక్స్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణలో పారిస్ ఒలింపిక్ కమిటీ మరోసారి తమ అభిరుచిని ప్రదర్శించింది. నెల రోజుల క్రితం జరిగిన ఒలింపిక్స్ ప్రధాన ఈవెంట్ కార్యక్రమంతో పోలిస్తే ఏమాత్రం తగ్గకుండా పారాలింపిక్స్ పోటీల ప్రారంభాన్ని ఘనంగా నిర్వహించింది. సుమారు నాలుగు గంటల పాటు ఈ వేడుకలు జరిగాయి. సూర్యాస్తమయ వేళ సుమారు 50 వేల మంది ప్రేక్షకులు ఈ సంబరాలకు హాజరయ్యారు. 250 మంది పారా అథ్లెట్ల బృందంతో బ్రెజిల్ హైలైట్‌గా నిలవగా... మయన్మార్ నుంచి ముగ్గురు మాత్రమే మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. వీల్‌చైర్‌కు మాత్రమే పరిమితమైన ఆటగాళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారత బృందానికి పతాకధారులుగా జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, మహిళా షాట్‌పుటర్ భాగ్యశ్రీ జాదవ్ వ్యవహరించారు. ప్రధాన క్రీడల తరహాలోనే ఈసారి కూడా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా ఫ్రాన్స్ సంస్కృతిని ప్రతిబింబించేలా సాగాయి. వేదికపై జరిగిన ప్రదర్శనలో పలువురు దివ్యాంగ కళాకారులు కూడా తమ ఆటాపాటలతో అలరించడం విశేషం. పారిస్ పారాలింపిక్స్ తొలి స్వర్ణ పతకం నెదర్లాండ్స్ ఖాతాలో చేరింది. మహిళల పారా సైక్లింగ్ ట్రాక్ సీ4–5 500 మీటర్ల టైమ్ ట్రయల్ ఈవెంట్‌లో నెదర్లాండ్స్ సైక్లిస్ట్ కరోలైన్ గ్రూట్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.


మార్చ్‌పాస్ట్‌లో ఫ్రాన్స్ బృందం


భారత సైక్లిస్ట్ జ్యోతి గడేరియా


బ్రెజిల్ స్విమ్మర్ అరాజూ దస్ సాంతోస్

‘విట్‌నెస్’గా రెజ్లర్ సాక్షి ఆత్మకథ



న్యూఢిల్లీ: కొన్నాళ్ల క్రితం బౌట్‌లలో... మెడలో పతకాలతో... తదనంతరం ఢిల్లీ రోడ్లపై కనిపించిన భారత స్టార్ మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ ఇప్పుడు అక్షర రూపంలో చదివించనుంది. ఆమె స్వీయచరిత్ర ఇప్పుడు పుస్తకంగా మార్కెట్లోకి రానుంది. ‘విట్‌నెస్’ పేరుతో ఆమె ఆత్మకథను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు ప్రచురణకర్తలు వెల్లడించారు. రచయిత జొనాథన్ సెల్వరాజ్ రాసిన ఈ పుస్తకాన్ని జుగ్గర్‌నాట్ బుక్స్ అనే సంస్థ ప్రచురించింది. బౌట్‌లో నిబద్ధతను చాటిన ఆమె... పుస్తకంలో తన జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్ని నిజాయితీగా, నిక్కచ్చిగా వెలిబుచ్చినట్లు పబ్లిషర్లు తెలిపారు. ఆమె బాల్యం, రోహ్‌తక్‌లోని అఖాడాలో రెజ్లింగ్ నేర్చుకోవడం, దాన్ని కెరీర్‌గా మలచుకోవడం అక్కడి నుంచి గ్రామీణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల నుంచి ఏకంగా ‘రియో’ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో మువ్వన్నెల పతాకాన్ని ఎగరేయడం దాకా అన్నీ పుస్తకంలో ఉన్నాయి. ఈ క్రమంలో ఆమె పడిన పాట్లు, ఓడినప్పుడు నేర్చుకున్న గుణపాఠాలు, పోరాటం పెట్టిన పరీక్షలు, భారత రెజ్లింగ్ సమాఖ్యలోని చీడపురుగుల వికృత చేష్టలపై పిడికిలి బిగించిన వైనం, వెన్ను చూపని తీరు ఇవన్నీ కూడా పుస్తక రూపంలో అందుబాటులోకి రానుంది. కొన్ని ఆత్మకథలు ఆసక్తికర, నాటకీయ మలుపులకే పెద్దపీట వేస్తాయి. కానీ సాక్షి స్వీయచరిత్ర మాత్రం మలుపులతో కాదు... ప్రతి అడుగుతో ముడిపడి రాబోతోందని ప్రచురణ సంస్థ వెల్లడించింది. పురుషాధిక్య భారత రెజ్లింగ్ ప్రపంచంలో మహిళలకు ఎదురైన సవాళ్లు, శిక్షణ శిబిరంలో అబలల పాట్లు, బౌట్లలో ప్రత్యర్థులతో కుస్తీ పట్టినట్లే... ఆర్థిక సమస్యలపై పట్టిన కుస్తీ, బాడీ ఇమేజ్, డేటింగ్ ఇలా ఏ ఒక్కటీ వదలకుండా నిగూఢమైన నిజాలన్నీ పుస్తకంలో అక్షర సాక్ష్యాలు కానున్నాయి. ‘నా జీవితాన్ని నిజాయితీగా వివరించాను. ఎదురైన సవాళ్లు, ఎత్తు పల్లాలు ప్రతిఒక్కటి స్పృశించాను’ అని సాక్షి మలిక్ తెలిపింది.



26 ఏళ్లకే వీడ్కోలు

- ఆస్ట్రేలియా క్రికెటర్ పకోవ్‌స్కీ నిర్ణయం
- తరచూ ‘కన్‌కషన్’లతో కెరీర్ అయోమయం

మెల్‌బోర్న్: ఆటను ఆస్వాదించేకాలం కెరీర్‌లో కొనసాగుతానని కొందరు, ప్రపంచకప్ గెలిచేదాకా విశ్రమించను, వీడ్కోలు చెప్పనని ఇంకొందరు భీష్మించుకు కూర్చుంటారు క్రికెట్లో! టీనేజ్‌లోనే అరంగేట్రం చేసినా... ఆటపై తనివితీరని ప్రేమో లేదంటే వ్యామోహమో గానీ కొందరైతే 36 నుంచి 38 ఏళ్లదాకా సుదీర్ఘ కెరీర్‌ను కొనసాగించిన వారూ ఉన్నారు. కానీ ఆస్ట్రేలియన్ బ్యాటర్ పకోవ్‌స్కీది విచిత్రమైన పరిస్థితి. అతను అరంగేట్రం చేసింది క్రికెట్ ప్రపంచానికే కాదు... ఆస్ట్రేలియా దేశంలోనే సరిగ్గా తెలియదు. కానీ ఇంతలోనే 26 ఏళ్లకే రిటైరవడం ద్వారా వార్తల్లో వ్యక్తిగా ఇప్పుడు ప్రపంచానికి తెలిసొచ్చాడు. అతను 2021 జనవరిలో టెస్టు ద్వారా అరంగేట్రం చేశాడు. భారత్‌తో సిడ్నీలో ఆడిన టెస్టే మొదటిది... ఇప్పుడు అదే ఆఖరుది! నిజం... అతను అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడింది ఒకే ఒక టెస్టు మాత్రమే! తర్వాత వన్డే సంగతే ఎరుగడు. టి20 ఆడింది లేదు. పకోవ్‌స్కీ పేరుకు టాపార్డర్ ప్లేయర్ అయినప్పటికీ ‘కన్‌కషన్’ (స్పృహ తప్పడం) ప్లేయర్‌గా స్థిరపడ్డాడు. మైదానంలో తరచూ తలకు దెబ్బలు తగిలించుకొని నెలల తరబడి సిరీస్‌లకే దూరమవడం అతని కెరీర్‌లో నిత్యకృత్యం. భారత్‌పై ఆడిన టెస్టులో ఒక అర్ధసెంచరీ చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో కేవలం రెండు ఇన్నింగ్స్‌లకే పరిమితమైన ఈ అరుదైన క్రికెటర్ 72 పరుగులు చేశాడంతే! విక్టోరియా తరఫున 36 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన తను 2350 పరుగులు చేశాడు. మరీ విడ్డూరం ఏమిటంటే... నేటి తరం క్రికెటర్లలో ఆసీస్‌లోని సుప్రసిద్ధ బిగ్‌బాష్ లీగ్ సహా ఏ స్థాయిలోనూ టి20 క్రికెట్ ఆడని ఏకైక క్రికెటర్ బహుశా ఇతనొక్కడే ఉంటాడేమో!

స్టీపుల్‌చేజ్‌లో షారుఖ్ జాతీయ రికార్డు




లిమా (పెరూ): భారత యువ అథ్లెట్ షారుఖ్ ఖాన్ 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ అండర్–20 విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అండర్–20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన హీట్‌లో 18 ఏళ్ల షారుఖ్ ఖాన్ 8 నిమిషాల 45.12 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఆరో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ క్రమంలో రాజేశ్ (8 నిమిషాల 50.12 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును షారుఖ్ బద్దలు కొట్టాడు. ఒక్కో హీట్ నుంచి తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సాధించగా... శనివారం తుది రేసు జరగనుంది. మరోవైపు పురుషుల 400 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ జయ్ కుమార్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సెమీఫైనల్లో జయ్ కుమార్ 46.96 సెకన్లలో గమ్యాన్ని చేరి మూడోస్థానంతో ఫైనల్లో అడుగుపెట్టాడు.

షాహీన్ అఫ్రిదిపై వేటు

- పాకిస్తాన్ జట్టు నుంచి తొలగింపు
- నేటి నుంచి బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

రావల్పిండి: సొంతగడ్డపై తొలి టెస్టులో బంగ్లాదేశ్ చేతిలో ఘోర పరాజయం ఎదుర్కొన్న పాకిస్తాన్ క్రికెట్ జట్టు దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మొదటి టెస్టులో నలుగురు పేసర్లతో బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు... టెస్టుల్లో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఓటమి పాలైంది. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తగా... లెఫ్టార్మ్ పేసర్ షాహీన్ షా అఫ్రిదిని రెండో టెస్టు జట్టు నుంచి తప్పించింది. శుక్రవారం నుంచి రావల్పిండి వేదికగా ఆఖరి మ్యాచ్ ప్రారంభం కానుండగా... ఈసారి ఒక పేసర్‌ను తగ్గించుకొని అతడి స్థానంలో స్పిన్నర్‌తో బరిలోకి దిగాలని పాకిస్తాన్ జట్టు యాజమాన్యం నిర్ణయించింది. షాహీన్ షా భార్య ఇటీవల మగబిడ్డకు జన్మనివ్వగా... కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఈ విరామం అతడికి ఉపయోగ పడుతుందని పాకిస్తాన్ హెడ్ కోచ్ జేసన్ గిలెస్పీ అన్నాడు. ‘షాహీన్‌తో చర్చించాం. పరిస్థితి అర్థం చేసుకున్నాడు. అత్యుత్తమ కూర్పుతో బరిలోకి దిగేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం’ అని గెలెస్పీ పేర్కొన్నాడు.



భారత్‌లో ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ

న్యూఢిల్లీ: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీకి ఈసారి భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది నవంబర్ 11 నుంచి 20 వరకు బిహార్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. హాకీ ఇండియా, బిహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తాయి. గత ఏడాది మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి జార్ఖండ్ ఆతిథ్యమివ్వగా... భారత జట్టు విజేతగా నిలిచింది. ఈ ఏడాది టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో పాటు చైనా, జపాన్, కొరియా, మలేసియా, థాయ్‌లాండ్ పాల్గొనే అవకాశం ఉంది.

ముగ్గురు పాక్ హాకీ ఆటగాళ్లపై నిషేధం

శరణార్థులుగా ఆశ్రయం కోరినందుకు చర్య

లాహోర్: ముగ్గురు పాకిస్తాన్ హాకీ ఆటగాళ్లు సహా ఒక ఫిజియోథెరపిస్ట్‌పై ఆ దేశ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్) జీవితకాల నిషేధం విధించింది. ఈ నలుగురు ఒక యూరోపియన్ దేశంలో రాజకీయ పీడిత శరణార్థిగా ఆశ్రయం కోరారు. దీంతో ఆగ్రహించిన పీహెచ్‌ఎఫ్ ఆ నలుగురుపై కఠిన నిర్ణయం తీసుకుంది. ప్లేయర్లు ముర్తజా యాకుబ్, ఎతేషామ్ అస్లామ్, అబ్దుర్ రహ్మాన్, ఫిజియో వకాస్ గత నెల నెదర్లాండ్స్, పోలాండ్‌లలో జరిగిన నేషన్స్ కప్ ఆడేందుకు జట్టుతో పాటు వెళ్లారు. తిరిగొచ్చాక ఆసియా చాంపియన్స్ ట్రోఫీ కోసం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తే ఆ నలుగురు వ్యక్తిగత కారణాలతో గైర్హాజరు అయ్యారు. అనంతరం వారంతా నేషన్స్ కప్ ఆడేందుకు వెళ్లొచ్చిన షెన్‌జెన్ వీసా (ఐరోపాయేతర పౌరులకు 90 లేదా 180 రోజుల వ్యవధి కోసం మంజూరు చేసే తాత్కాలిక వీసా)తో మళ్లీ నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడ ఆశ్రయం పొందారు. ఇది తమ దేశానికి తలవంపు మాత్రమే కాదు... భవిష్యత్తులో యూరోపియన్ దేశాలకు వీసాలు దరఖాస్తు చేసే వారందరికీ ఇది పెద్ద సమస్యగా పరిణమిస్తుంది. ఆయా దేశాల్లో జరిగే ఈవెంట్ల కోసం ఇకపై తమ దరఖాస్తులు ఆమోదం పొందడం క్లిష్టతరమవుతుందని పీహెచ్‌ఎఫ్ కార్యదర్శి రాణా ముజాహిద్ వాపోయారు.

న్యూజిలాండ్ బౌలింగ్ కోచ్‌గా ఓరమ్

ఆక్లాండ్: టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ జట్టు... మాజీ పేసర్ జాకబ్ ఓరమ్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకుంది. గతంలో పలు దఫాలు ఈ బాధ్యతలు నిర్వర్తించిన ఓరమ్.. అక్టోబర్ 7 నుంచి కివీస్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. జాతీయ జట్టు తరఫున మూడు వన్డే ప్రపంచకప్‌లు, నాలుగు టి20 ప్రపంచకప్‌లు ఆడిన అనుభవం ఉన్న 46 ఏళ్ల ఓరమ్... ఇటీవల టి20 ప్రపంచకప్ సమయంలో న్యూజిలాండ్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. అంతకుముందు 2022లో మహిళల టి20 ప్రపంచకప్ సందర్భంగా న్యూజిలాండ్ మహిళల జట్టుకు శిక్షణ ఇచ్చాడు. మూడు ఫార్మాట్లలో కలిపి న్యూజిలాండ్ తరఫున 229 మ్యాచ్‌లు ఆడిన ఓరమ్ 252 వికెట్లు పడగొట్టాడు. గత ఏడాది బంగ్లాదేశ్ పర్యటనలోనూ కివీస్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుండగా... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా న్యూజిలాండ్ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ 50 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. భారత్ టాప్ ప్లేస్‌లో ఉండగా.. ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది.



బెంగళూరు స్మాషర్స్ ‘హ్యాట్రిక్’ విజయం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్ టోర్నమెంట్‌లో పీబీజీ బెంగళూరు స్మాషర్స్ జట్టు ‘హ్యాట్రిక్’ విజయాన్ని నమోదు చేసింది. జైపూర్ పేట్రియాట్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో బెంగుళూరు 11–4తో ఘనవిజయం సాధించింది. భారత స్టార్ మనిక బత్రా, అల్వారో రోబ్లెస్‌లతో కూడిన బెంగళూరు జట్టు ఈ గెలుపుతో 32 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో చెన్నై లయన్స్‌తో యు ముంబా; పుణేరి పల్టన్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

దళిత ఓట్లే కీలకం

జమ్మూకశ్మీర్‌లో 24 సీట్లలో దళితుల ప్రభావం

- ఏడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి అడుగేస్తున్న ప్రధాన పార్టీలు
- గెలుపు గుర్రాలపై గురిపెట్టిన బీజేపీ
- యువత, వ్యాపారవేత్తలపై కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీ నజర్



50 శాతం కంటే ఎక్కువ దళిత ఓటర్లు ఉన్న ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు
రాంనగర్, కథువా, రామ్‌గఢ్, బిష్నా, సుచేత్ గఢ్, మఢ్, అఖ్‌నూర్

20 నుంచి 25 శాతం ఎస్సీ ఓట్లు ఉన్న సీట్లు
ఆర్‌ఎస్ పురా జమ్మూ , బాహు, జమ్మూ ఈస్ట్, జమ్మూ వెస్ట్, జమ్మూ నార్త్ , నగ్రోటా, ఛంబ్, సాంబా, విజయపూర్, బిలావర్, బనీ, బసోహలి, జస్రోటా, హీరానగర్, ఉధంపూర్ వెస్ట్, ఉధంపూర్ ఈస్ట్, చినైని

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 24 స్థానాల్లో దళిత ఓటర్లే కింగ్ మేకర్లుగా మారనున్నారు. దీంతో రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో పరిణామాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పోటీ చేయాలనుకుంటున్నాయి. జమ్ము, సాంబా, కథువా, ఉధంపూర్ జిల్లాల్లోని 17 సీట్లలో 20 నుంచి 25 శాతం మంది ఓటర్లు ఎస్సీ వర్గానికి చెందినవారు ఉండగా... ఏడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో 50 శాతానికి పైగా ఎస్సీ ఓటర్లు ఉన్నారు. దీంతో రిజర్వ్‌డ్ సీట్లలో సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయడంపైనే పార్టీలు దృష్టి సారించాయి. జమ్మూలోని సుచేత్‌గఢ్, మఢ్, అఖ్‌నూర్, బిష్నా, సాంబాలోని రామ్‌గఢ్, కతువాలోని కతువా, ఉధంపూర్‌లోని రామ్‌నగర్ నియోజకవర్గాలను ఎస్సీలకు రిజర్వ్ చేశారు.

గెలుపు గుర్రాలను బరిలో నిలిపేందుకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రముఖ నాయకులను పోటీలో దింపి విజయాన్ని సొంతం చేసుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలో గెలుపు గుర్రాలను ఎంపిక చేసే విషయంపై బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే విడుదల చేసిన జాబితాల్లో మూడో విడతలో ఎన్నికలు జరుగనున్న రామ్‌నగర్ నుంచి సునీల్ భరద్వాజ్, రామ్‌ఘడ్ నుంచి డా.దేవిందర్ కుమార్ మనియాల్, సుచేత్ గఢ్ నుంచి ఘరు రామ్ భగత్, అఖ్‌నూర్ నుంచి మోహన్‌లాల్ భగత్‌లను ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల నుంచి బీజేపీ బరిలో నిలిపింది. కాగా కూటమిలో ఉన్న కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సైతం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలతో పాటు ఎస్సీ ఓటర్లు ఎక్కువగా ఉన్న స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సైతం ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలను గెలిచేందుకు పాత నాయకులపైనే దృష్టి సారించింది. ఈ స్థానాల్లో యువకులు, సీనియర్లకు సీట్లు కేటాయించేలా కాంగ్రెస్ పార్టీ మేధోమథనం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో రిజర్వ్‌డ్ స్థానాల్లో బీజేపీకి కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. ఆర్‌ఎస్ పురా, సుచేత్‌గఢ్‌లలో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. ఆర్‌ఎస్ పురా, మఢ్, సుచేత్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ యువకులకు అవకాశం ఇవ్వొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఎస్సీ ఓట్లపై బహుజన సమాజ్ పార్టీ ప్రభావం ఎప్పుడూ ఉండేదే. ఆర్‌ఎస్ పురా, విజయ్‌పూర్, కథువా వంటి రిజర్వ్ స్థానాలను గతంలో బీఎస్పీ గెలుచుకుంది. అటువంటి పరిస్థితిలో, రిజర్వ్‌డ్ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని బీఎస్పీ ప్రయత్నిస్తోంది. ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలో పెద్దగా ప్రభావం లేని పీడీపీ యువకులకు అవకాశం ఇవ్వాలని యోచిస్తోంది.

ఇరాన్ 'అణు' దూకుడు

వియన్నా: యురేనియం నిల్వలను ఇరాన్ నానాటికీ పెంచుకుంటోందని ఐక్యరాజ్య సమితి గురువారం పేర్కొంది. అంతేగాక 'అణ్వాయుధ స్థాయి శుద్ధీకరణ'ను సాధించే దిశగా వడిగా అడుగులు వేస్తోందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) తాజా నివేదికను ఉటంకిస్తూ వ్యాఖ్యలు చేసింది. ''ఇరాన్ వద్ద ప్రస్తుతం 60 శాతం శుద్ధి చేసిన యురేనియం నిల్వలు 164 కిలోల మేరకు చేరినట్టు ఐఏఈఏ తేల్చింది. మూడు నెలల క్రితంతో పోలిస్తే ఇది 22.6 కిలోలు ఎక్కువ. ఈ నిల్వలను అణ్వాయుధ తయారీకి కావాల్సిన 90 శాతం నాణ్యతకు పెంచేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది''అని ఐరాస వివరించింది. ఇరాన్ వద్ద ప్రస్తుతం 5,751 కిలోల యురేనియం నిల్వలున్నట్టు ఐఏఈఏ తెలిపింది. ఐఏఈఏ అణ్వాయుధ తనిఖీదారులకు దేశంలోకి ప్రవేశాన్ని 2023లో ఇరాన్ నిషేధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ అణు దూకుడుపై ఐరాస ఆందోళన వెలిబుచ్చింది. అణు కార్యక్రమాలపై అమెరికాతో సంప్రదింపులకు సిద్ధమని ఇరాన్ ఆధ్యాత్మిక నేత అయతొల్లా అలీ ఖమేనీ మంగళవారమే ప్రకటించడం తెలిసిందే. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ దేశ అణు కార్యక్రమాలపై ఐఏఈఏతో చర్చలను పునఃప్రారంభిస్తారని ఐరాస ఆశాభావంతో ఉంది. ఈ విషయమై ఐఏఈఏ చీఫ్‌తో చర్చలకు పెజష్కియాన్ సమ్మతించారు.



పిల్లలకు కుతూహలం ఎక్కువ. వద్దన్నది చేసి చూస్తారు. కొత్తవి కనిపిస్తే చూసినప్పుడు వాటిలో ఏముందోనని అన్వేషిస్తారు. అలా నాలుగేళ్ల పిల్లాడి క్యూరియాసిటీ ఓ జాడీని ముక్కలు చేసింది. కుండే కదా అని కొట్టిపారేయకండి. అది 3,500 ఏళ్లనాటిది!

మూడున్నర వేల ఏళ్ల నాటిది.. ముక్కలైంది!

ఇజ్రాయెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైఫాలో 'ది హెక్ట్' మ్యూజియం ఉంది. ఇందులో మ్యూజియంలో తామ్రశిలా యుగం (క్రీ.పూ. 4500 నుండి క్రీ.పూ. 3500 దాకా) నాటి వస్తు సంచయముంది. క్రీస్తుపూర్వం 2200-1500 నాటి కాంస్య యుగపు కూజాల వంటివీ ఉన్నాయి. క్రీస్తుపూర్వం 10వ శతాబ్దంలో పురాతన ఇశ్రాయేలు, యూదా రాజ్యాలను పాలించిన దావీదు, సొలొమోను రాజుల పాలనలకు ముందు వైన్ లేదా ఆలివ్ నూనె తదితరాల నిల్వ, రవాణాకు ఈ కూజాలను వాడేవారు. వాటిలో ఒకటి నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. దాన్ని మ్యూజియం ప్రవేశ ద్వారం వద్ద పెట్టారు. ఆటంకాల్లేకుండా అంతా దాన్ని చూసేందుకు వీలుగా చుట్టూరా గ్లాస్ కేస్ తదితర రక్షణలేవీ ఏర్పాటు చేయలేదు.

ఏముందో చూద్దామని...

గత శుక్రవారం మ్యూజియాన్ని సందర్శించడానికి ఓ బాలుడు కుటుంబంతో సహా వచ్చాడు. కూజాలో ఏముందో చూద్దామనుకున్నాడో ఏమో, దాన్ని కాస్త ముందుకు లాగాడు. అంతే! అంతంతమాత్రంగా ఉన్న ఆ కుండ కాస్తా కిందపడి పగిలిపోయింది. తండ్రి అప్రమత్తమయ్యేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పగిలిన కళాఖండాన్ని, పక్కనే ఉన్న తన కొడుకును చూసి షాకయ్యాడు. విషయం అర్థం కాగానే మ్యూజియం సిబ్బందికి సమాచారమిచ్చాడు.

దగ్గరుండి మ్యూజియమంతా చూపించిన చీఫ్

అంత పురాతన వస్తువును పగలగొట్టినా పిల్లాన్ని మ్యూజియం సిబ్బంది ఒక్క మాటా అనలేదు. కుటుంబానికి జరిమానా వంటివీ విధించలేదు. పైపెచ్చు, హతాశులైన తల్లిదండ్రులను మ్యూజియం హెడ్ ఇనబల్ రివ్లిన్ స్వయంగా ఊరడించారు. ''ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. మరేం పర్లేదు'' అంటూ ధైర్యం చెప్పారు. ఆ బాలున్ని, తల్లిదండ్రులను మ్యూజియం ప్రైవేట్ టూర్‌కు ఆహ్వానించారు. ఆమే దగ్గరుండి మరీ మ్యూజియమంతా తిప్పి చూపించారు.

''మ్యూజియమంటే శ్మశానం కాదు. జీవకళ ఉట్టిపడే చోటు. తల్లిదండ్రులందరికీ చెప్పేదొక్కటే. మీ పిల్లలు ఏ వస్తువును ఏం చేస్తారోనని భయపడకండి'' అని చెప్పుకొచ్చారు. కూజాను సరిచేసి మళ్లీ అక్కడే ప్రదర్శనకు పెడతామని ప్రకటించారు. కాకపోతే ఈ ఘటన నేపథ్యంలో ఏ వస్తువును తాకొచ్చో, వేటిని తాకరాదో స్పష్టంగా పేర్కొంటూ అంతటా సూచికలు ఏర్పాటు చేశారు. మ్యూజియం సిబ్బంది ప్రస్తుతం కూజాను పగిలిన ఆనవాళ్లు లేకుండా చక్కగా అతికించే పనిలో పడ్డారు. ''ఇప్పటికే సంబంధిత నిపుణుడిని సంప్రదించాం. వీలైనంత త్వరగా కూజాను తిరిగి యథాస్థితికి తీసుకొస్తాం'' అని చెప్పారు.



అందుబాటులో ఉంచాలని...

కూజా వంటి పలు వస్తువులను రక్షిత గాజు వంటివి లేకుండా ప్రదర్శనకు ఉంచాలన్న నిర్ణయాన్ని మ్యూజియం సమర్థించుకుంది. కళాఖండాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని దాని వ్యవస్థాపకుడు నొక్కిచెప్పారట! పురావస్తు అన్వేషణను ఎలాంటి అడ్డంకుల్లేకుండా అనుభవించడంలో ప్రత్యేక ఆకర్షణ ఉందని ఆయన నమ్మేవారట. అందుకే ఓ కళాఖండం పగిలి ముక్కలైనంత మాత్రాన మిగతా వాటిని గ్లాస్ అరల్లో బంధించే ఆలోచనేదీ లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. బాలుని తండ్రి మాత్రం, కూజాను ఎంత బాగా అతికించినా పూర్వపు స్థితికి వస్తుందా అంటూ విచారం వ్యక్తం చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బోనుకు చిక్కిన మరో తోడేలు

47 రోజుల్లో ఏడుగురిని పొట్టనబెట్టుకున్న తోడేళ్ల గుంపు కోసం కొనసాగుతున్న అధికారుల వేట

బహ్రెయిచ్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో గత 47 రోజుల్లో ఏడుగురిని పొట్టనబెట్టుకుని బహ్రెయిచ్ జిల్లాలో 35 గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న తోడేళ్ల గుంపులో నాలుగోదానికి మెహసీ తాలూకాలో అటవీ అధికారులు ఎట్టకేలకు బంధించారు. ఎర వేసి మాటువేసి గురువారం విజయవంతంగా మగ తోడేలును పట్టుకున్నారు. మత్తు మందు ఇచ్చి గోరఖ్‌పూర్ జంత ప్రదర్శనాశాలకు తరలించారు. డ్రోన్లు గుర్తించిన ఆరు తోడేళ్ల గుంపులో గురువారం నాలుగో తోడేలును బంధించామని, మరో రెండు తోడేళ్లను పట్టుకుంటే ఈ 'ఆపరేషన్ భేడియా'సుఖాంతంగా ముగిసినట్లేనని అధికారులు గ్రామస్తులకు ధైర్యం చెబుతున్నారు. బుధవారం రాత్రి 11 గంటలపుడు థర్మల్ ఇమేజింగ్ డ్రోన్ సాయంతో తోడేలును గుర్తించి, గురువారం ఉదయం సిసయా గ్రామంలోని చెరకుతోటలో బంధించామని అటవీ విభాగ ముఖ్య ప్రధాన కార్యదర్శి(వన్యప్రాణి) సంజయ్ శ్రీవాస్తవ చెప్పారు. తోడేళ్లను బంధించడంలో విజయవంతమైన సిబ్బందిని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మెచ్చుకున్నారు.

రక్తం మరిగిన తోడేళ్లు

కేవలం ఒకే ఒక్క అడవి జంతువు దాడి చేయడం వల్లే గ్రామస్థుడు చనిపోయాడని స్థానికులంతా తొలుత భావించారు. కానీ ఆ మరణాలు అక్కడితో ఆగలేదు. గత 47 రోజుల్లో వరసబెట్టి జంతువుల దాడుల్లో అమాయక గ్రామస్తులు చనిపోతుండటంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. ఇప్పటిదాకా తోడేళ్ల దాడుల్లో ఏడుగురు చనిపోయారు. 22 మంది గాయపడ్డారు.



రంగంలోకి 16 బృందాలు, డ్రోన్లు, నిఘా కెమెరాలు

మనుషులపై దాడి చేస్తున్న తోడేళ్ల బారిన పడి ఇప్పటికే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆరుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి తాజా మరణం నమోదవడంతో పెద్ద సంఖ్యలో అటవీ సిబ్బంది గ్రామాల్లో రంగంలోకి దిగారు. వలలు, మత్తుమందు తుపాకులు, ఎరలతో పనిలో నిమగ్నమయ్యారు. 25 బృందాలతోపాటు 12 మంది జిల్లా స్థాయి అధికారులు ఈ వేటలో పాల్గొంటున్నారు. నిఘా కెమెరాలు బిగించి, చిమ్మ చీకట్లో ఏముందో స్పష్టంగా చూపించే థర్మల్ ఇమేజింగ్ డ్రోన్లతో 35 గ్రామాలను జల్లెడ పడుతున్నారు. రాత్రిళ్లు ఆరుబయట నిద్రించొద్దని గ్రామస్తులకు హెచ్చరికలు చేశారు. ఒంటరిగా పొలం పనులకు వెళ్లొద్దని సూచించారు. పెద్ద జంతువులకు తోడేళ్లు భయపడతాయి. అందుకే ఏనుగు ఉందని భయపెట్టేందుకు ఏనుగు మూత్రాన్ని జనావాసాల వద్ద చల్లించారు. వాసన చూసి పెద్ద జంతువు భయంతో తోడేళ్లు పారిపోతాయని అటవీ అధికారులు చెప్పారు. ఏనుగు ఎండినపేడను కాల్చి వాసన అంతటా వ్యాపింపజేశారు. ఇంటిముందు తలుపుల్లేని ఇళ్లకు తలుపులు బిగించామని జిల్లా మేజిస్ట్రేట్ మోనికా రాణి చెప్పారు. భయపడకుండా ఆశా కార్యకర్తలతో గ్రామస్థులకు ధైర్యం నూరిపోశారు. ''నిద్రిస్తున్న చిన్నపిల్లలనే తోడేలు ఎక్కువగా లక్ష్యంగా చేసుకుంటుంది. దాడి చేసి చంపేశాక నిర్మానుష్య ప్రాంతానికి లాక్కెళ్లి తాపీగా తినేస్తుంది'అని డివిజినల్ అటవీశాఖ అధికారి అజిత్ ప్రతాప్ సింగ్ చెప్పారు.

రష్యా ఆయుధ, ఆయిల్ డిపోలపై దాడులు

కీవ్: సరిహద్దుల్లోని రష్యాకు చెందిన కర్స్క్ ప్రాంతంలో వేలాది మైళ్ల నియంత్రణలోకి తెచ్చుకున్న ఉక్రెయిన్.. గురువారం రష్యాలోని ఆయుధ డిపోతోపాటు రెండు చమురు నిల్వల కేంద్రాలపై దాడులకు దిగింది. కిరోవ్ రీజియన్‌లోని వొరెనెజ్ ఆర్టిలరీ డిపో, జెనిత్ ఆయిల్ డిపోలపై డ్రోన్లతో చేపట్టిన దాడుల్లో భారీగా మంటలు చెలరేగాయని తెలిపింది. బుధవారం రోస్టోవ్ రీజియన్‌లోని అట్లాస్ చమురు నిల్వ కేంద్రంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. తమపై యుద్ధం సాగిస్తున్న రష్యాను దెబ్బతీసే తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పేర్కొంది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి, డ్రోన్ దాడులను కొనసాగించింది. నాలుగు రోజుల్లో మూడో విడత చేపట్టిన ఈ దాడుల్లో 5 క్షిపణులను, 74 షహీద్ డ్రోన్లను ప్రయోగించింది. ఈ డ్రోన్లలో చాలా వరకు ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. శకలాలు పడి కొన్ని మౌలిక వ్యవస్థలు దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. అదేవిధంగా, క్రిమియా పైకి ఉక్రెయిన్ ప్రయోగించిన నాలుగు ఏరియల్ డ్రోన్లు, మూడు సీ డ్రోన్లను ముందుగానే ధ్వంసం చేసినట్లు సెవస్టపోల్ గవర్నర్ రజ్వోఝయెవ్ తెలిపారు.

చొరబాటు యత్నాలు భగ్నం.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి(ఎల్‌వోసీ)వెంబడి రెండు ప్రాంతాల్లో జరిగిన చొరబాటుయత్నాలను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. ఈ సందర్భంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తంగధర్ వద్ద జరిగిన ఘటనలో ఒకరు, మచ్చల్ వద్ద జరిగిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారని శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ తెలిపింది. ఘటనా ప్రాంతాల నుంచి రెండు ఏకే రైఫిళ్లు, ఒక పిస్టల్, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లు, భారీ మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది. కుప్వారా పోలీసులు అందించిన సమాచారం మేరకు బుధవారం రాత్రి 7.30, 9 గంటల ప్రాంతంలో ఆపరేషన్‌ను చేపట్టినట్లు గురువారం 'ఎక్స్'లో వివరించింది.

కార్మిక సంస్కరణలపై నేడు సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కార్మిక సంస్కరణలు, ఉపాధి కల్పనపై శుక్రవారం బెంగళూరులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ వెల్లడించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ ప్రతినిధులు హాజరవుతారని తెలిపింది. కార్మిక సంస్కరణలు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలపై చర్చించనున్నారు. కార్మికులకు సంక్షేమ పథకాల కవరేజీని విస్తరించడం, ఉపాధి కోసం విద్యా సంస్థలతో అనుసంధానం వంటి విషయాలపైనా చర్చ ఉంటుందని శాఖ వివరించింది.



గురువారం వెస్ట్‌బ్యాంక్‌లో సైనిక ఆపరేషన్‌కు సిద్ధమవుతున్న సిబ్బంది

కొనసాగిన దాడులు

వెస్ట్‌బ్యాంక్‌లో 16 మంది మృతి

- వీరిలో ఎక్కువ మంది మిలిటెంట్లేనన్న ఇజ్రాయెల్ ఆర్మీ
- మృతుల్లో ఇస్లామిక్ జిహాద్ స్థానిక కమాండర్ ఉన్నట్లు వెల్లడి

టుల్కారెమ్(వెస్ట్‌బ్యాంక్): ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంపై మంగళవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జరిపిన దాడుల్లో 16 మంది మృతి చెందారని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. మృతుల్లో అత్యధికులు మిలిటెంట్లేనని పేర్కొంది. దాడులను నివారించే లక్ష్యంగా టుల్కారెమ్ నగరంపై చేపట్టిన ముందస్తు ఆపరేషన్‌లో మృతి చెందిన వారిలో ఇస్లామిక్ జిహాద్‌కు చెందిన స్థానిక కమాండర్ మహ్మద్ జబెర్ అలియాస్ అబూ షుజా కూడా ఉన్నాడని తెలిపింది. ఈ ఏడాది ఆరంభంలో చేపట్టిన ఒక దాడిలో షుజా చనిపోయినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. అయితే, ఆ దాడిలో మరణించిన ఇతర మిలిటెంట్ల అంత్యక్రియల్లో ఇతడు పాల్గొనడం, అక్కడికి వచ్చిన వారు ఇతడిని భుజాలపైకి ఎత్తుకోవడం అప్పట్లో కలకలం రేపింది. అప్పటి నుంచి పాలస్తీనియన్ల దృష్టిలో షుజా హీరో అయిపోయాడు. జూన్‌లో జరిగిన భీకర కాల్పుల ఘటనకు ఇతడే సూత్రధారి అని ఇజ్రాయెల్ తెలిపింది. టుల్కారెమ్‌లోనే చేపట్టిన మరో ఆపరేషన్‌లో ఓ మిలిటెంట్ పట్టుబడ్డాడని, ఈ సందర్భంగా తమ బోర్డర్ పారామిలటరీ సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారని పేర్కొంది. వెస్ట్‌బ్యాంక్‌లో బుధవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీతో వేర్వేరు ప్రాంతంలో చోటుచేసుకున్న హోరాహోరీ పోరులో తాము పది మంది సభ్యులను కోల్పోయామని హమాస్ తెలిపింది. అయితే, 11 మంది చనిపోయినట్లు పాలస్తీనా ఆరోగ్య విభాగం తెలిపింది. 11వ వ్యక్తి మిలిటెంటా, పౌరుడా అనేది వివరించలేదు.

హమాస్ చెరలోని సైనికుడు హతం

గతేడాది అక్టోబర్ 7వ తేదీన హమాస్ మిలిటెంట్లకు బందీగా చిక్కిన ఇజ్రాయెల్ సైనికుడొకరు విగత జీవిగా కనిపించారు. గాజాలో చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో తమ షిన్‌బెట్ భద్రతా విభాగానికి చెందిన ఈ జవాను మృతదేహం లభించిందని ఆర్మీ తెలిపింది. కుటుంబసభ్యుల వినతి మేరకు అతడి వివరాలు వెల్లడించడం లేదని వివరించింది. ఇలా ఉండగా, పాలస్తీనియన్లపై విద్వేష పూరిత ప్రసంగాలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్న ఇజ్రాయెల్ మంత్రులపై ఆంక్షలు విధించేందుకు యోచిస్తున్నట్లు యూరోపియన్ యూనియన్ (ఈయూ) తెలిపింది. ఇజ్రాయెల్ కేబినెట్ మంత్రుల ప్రకటనలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది.

ఆధార్ ప్రామాణికంగా అభ్యర్థుల ధ్రువీకరణ

పూజా ఖేడ్కర్ ఉదంతం నేపథ్యంలో యూపీఎస్సీకి కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ: ఆధార్ ప్రాతిపదికన అభ్యర్థుల ధ్రువీకరణ చేపట్టేందుకు కేంద్రం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కి మొదటిసారిగా అనుమతినిచ్చింది. రిజిస్ట్రేషన్‌తోపాటు ఎంపిక పరీక్షల సమయంలో అభ్యర్థులు స్వచ్ఛందంగా ధ్రువీకరించేందుకు దీంతో వీలుకలగనుంది. వన్ టైమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌తోపాటు పరీక్ష వేర్వేరు దశల్లో అభ్యర్థులు అవును/కాదు/ ఈ-కేవైసీ అనే ధ్రువీకరణ వెసులుబాటును ఉపయోగించుకుని తమ ఆధార్‌ను స్వచ్ఛందంగా ధ్రువీకరించుకోవచ్చని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఒక నోటిఫికేషన్‌లో వివరించింది. ఆధార్ చట్టం -2016 నిబంధనలకు, విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) నిర్దేశాలకు లోబడి ఆధార్ నంబర్‌ను ఉపయోగించుకోనున్నట్లు వెల్లడించింది. 2023 బ్యాచ్, మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారి పూజా ఖేడ్కర్ ఉదంతం నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. సివిల్స్ పరీక్షను ఎక్కువసార్లు రాసేందుకు పలు తప్పుడు ధ్రువీకరణలను ఆమె సమర్పించినట్లు నిర్ధారణయింది. దీంతో ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు, భవిష్యత్తులో జరిగే ఏ ఇతర పరీక్షల్లోనూ పాల్గొనరాదంటూ యూపీఎస్సీ నిషేధం విధించడం తెలిసిందే. పూజా ఖేడ్కర్ వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్రమాలను అరికట్టేందుకు యూపీఎస్సీ.. ఆధార్ ఆధారిత ఫింగర్‌ప్రింట్ ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేసియల్ రికగ్నిషన్, ఈ-అడ్మిట్ కార్డులకు క్యూఆర్ కోడ్, లైవ్-ఏఐ ఆధారిత సీసీటీవీ సర్వైలెన్స్ సర్వీస్ వంటి వాటిని పరీక్ష ప్రక్రియలో వినియోగంలోకి తీసుకువచ్చింది. ప్రతిష్టాత్మక సివిల్స్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్ ఏ, బీ పోస్టుల భర్తీ కోసం యూపీఎస్సీ ఏటా నిర్వహించే 14 ప్రధాన పరీక్షలకు లక్షలాదిగా విద్యార్థులు హాజరవుతుంటారు.

గాడ్‌ఫాదర్ సీన్

కళ్లు తెరిచిచూస్తే పక్కనే విగతజీవిగా ఫ్రెండ్

- రాత్రి పడుకుని ఉదయంకల్లా హత్యకు గురైన బాల్యస్నేహితురాలు
- హతురాలి భర్త అరెస్ట్

బెంగళూరు: హిట్ హాలీవుడ్ సినిమా 'ది గాడ్‌ఫాదర్ -2'లో సెనేటర్ ప్యాట్రీ గేరీ ఉదయం లేచిచూసేసరికి పక్కన ఒక అమ్మాయి రక్తపుమడుగులో శవమై కనిపిస్తుంది. సినిమాలాగే అచ్చం అలాంటి సంఘటన బుధవారం బెంగళూరులో జరిగింది. భర్త పెడుతున్న కష్టాలు చెప్పుకుంటూ పక్కనే నిద్రించిన బాల్య స్నేహితురాలు ఉదయం లేచేసరికి రక్తపుమడుగులో ఉండటం చూసి ఆ అమ్మాయి హుతాశురాలైంది. ఈ హత్యోదంతంలో హతురాలి భర్తను బెంగళూరు పోలీసులు అరెస్ట్‌చేశారు. బుధవారం ఉదయం బెంగళూరులోని కెంగెరి విశ్వేశ్వరయ్య లేఅవుట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివమొగ్గ జిల్లా భద్రావతి పట్టణానికి చెందిన 31 ఏళ్ల కిరణ్, 28 ఏళ్ల బి. నవ్యశ్రీలు కొంతకాలం ప్రేమించుకుని మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇరువైపులా పెద్దలు అంగీకరించకపోయినా పెళ్లాడి బెంగళూరు కొచ్చి కాపురం మొదలెట్టారు. అయితే ఏడాదికే కలహాలు మొదలయ్యాయి. క్యాబ్ డ్రైవర్‌గా చేసే తన కంటే కొరియోగ్రాఫర్‌గా చేసే తన భార్యగా సమాజంలో ఎక్కువ పేరుప్రతిష్టలు దక్కుతున్నాయని కిరణ్‌లో ఉక్రోషం ఎక్కువైంది. డ్యాన్స్ వృత్తి వదిలేయాలని భార్యను హెచ్చరించినా ఆమె ససేమిరా అంది. దీంతో ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ భార్య మొబైల్‌ను చెక్‌చేసేవాడు. దీంతో గొడవలు మరింత పెరిగాయి. మంగళవారం నవ్యశ్రీ తన బాల్యస్నేహితురాలు ఐశ్వర్యకు ఫోన్ చేసి పిలిపించుకుని తన కష్టాలు చెప్పుకుని బాధపడింది. ఇద్దరూ కలిసి మరో స్నేహితుడు సునీల్‌ను సాయంత్రం ఆర్‌ఆర్‌నగర్‌కు వెళ్లి కలిసి చర్చించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడమే ఉత్తమమని నిర్ణయానికొచ్చారు. తర్వాత మంగళవారం రాత్రి నవ్యశ్రీ ఇంట్లో ఐశ్వర్య ఉండిపోయింది. కిరణ్ వేరే గదిలో నిద్రించాడు. అయితే రెండో తాళంచెవితో గది తలుపు తీసిన కిరణ్.. భార్య గొంతు కోసి హత్యచేసి పారిపోయాడని పోలీసులు చెప్పారు. ''బాధలు చెప్పుకుంటుంటే ఓదార్చేందుకు వచ్చా. ఇలా నా పక్కనే ప్రాణాలు కోల్పోతుందని ఊహించలేదు'' అని స్నేహితురాలు ఐశ్వర్య బోరున విలపించారు. స్నేహితురాలి భర్తపై ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదుతో అతడిని పోలీసులు అరెస్ట్‌చేశారు.

రాజ్యాంగ నిపుణుడు ఏ.జి.నూరానీ కన్నుమూత

ముంబై/శ్రీనగర్: రాజ్యాంగ నిపుణుడు, ప్రముఖ న్యాయ కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ఏ.జి.నూరానీ (94) గురువారం ముంబైలోని తన నివాసంలో కన్నుమూశారు. ముంబైలో 1930 సెప్టెంబరు 16న జన్మించిన అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ స్థానిక గవర్నమెంట్ లా కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. రాజ్యాంగం, న్యాయశాస్త్రం, కశ్మీర్, ఆర్‌ఎస్‌ఎస్ అంశాలపై సాధికారత సాధించారు. 'ది కశ్మీర్ డిస్ప్యూట్ 1947-2012, ఆర్టికల్ 370: ఎ కాన్‌స్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ జమ్మూ అండ్ కశ్మీర్, ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్'తో సహా పలు పుస్తకాలను రచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్, బద్రుద్దీన్ త్యాబ్జీల ఆత్మకథలను గ్రంథస్థం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకుడు షేక్ అబ్దుల్లా సుదీర్ఘకాలం కారాగారంలో ఉన్నప్పుడు ఆయన తరఫున నూరానీ వాదించారు. జయలలితకు వ్యతిరేకంగా కరుణానిధి తరఫున బాంబే హైకోర్టులో వాదించారు.

పాన్ కార్డు దరఖాస్తుకు ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ సరిపోతుంది

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే ట్రాన్స్‌జెండర్లు జిల్లా మేజిస్ట్రేట్ పేరుతో జారీ చేసిన 'సర్టిఫికెట్ ఆఫ్ ఐడెంటిటీ'జత చేస్తే సరిపోతుందని కేంద్రం తెలిపింది. అయితే, ఈ సర్టిఫికెట్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్(ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్)చట్టం-2019ప్రకారం జారీ అయినదై ఉండాలని స్పష్టం చేసింది. ఆధార్‌లో మాదిరిగా పాన్ కార్డులో థర్డ్ జెండర్ ఆప్షన్ లేనందున తన పాన్‌ను ఆధార్‌తో అనుసంధానించేందుకు వీలు కావడం లేదంటూ 2018లో ట్రాన్స్‌జెండర్ ఒకరు పిటిషన్ వేశారు. పాన్ కార్డుల్లో కూడా వేరుగా థర్డ్ జెండర్ కేటగిరీ ఆప్షన్‌ను జత చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం..పిటిషనర్ అభ్యంతరాలపై కేంద్రప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపింది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ చట్టం-2019లోని 6,7 సెక్షన్ల ప్రకారం జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేసిన సర్టిఫికెట్ జత చేస్తే సరిపోతుందని పేర్కొంది.

'వక్ఫ్' బిల్లుపై నేడు జేపీసీ రెండో భేటీ

మత, పౌర సమాజ ప్రతినిధులతో చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు-2024 ప్రతిపాదనలపై చర్చించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) శుక్రవారం రెండోసారి భేటీ కానుంది. ఈనెల 22న జరిగిన తొలి భేటీలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో మత, పౌర సమాజ ప్రతినిధులతో సమావేశం కానుంది. ఉదయం ముంబైకి చెందిన ఆల్ ఇండియా సున్నీ జమియతుల్ ఉలెమా, ఢిల్లీకి చెందిన ఇండియన్ ముస్లిం ఫర్ సివిల్ రైట్స్‌తో, మధ్యాహ్నం ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు, రాజస్తాన్ బోర్డ్ ఆఫ్ ముస్లిం వక్ఫ్‌లతో కమిటీ భేటీలు నిర్వహించనుంది. సవరణ బిల్లులోని ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా వీలు కల్పించడం, జిల్లా కలెక్టర్లకు అదనపు అధికారాలు కల్పించడం వంటి ప్రతిపాదనలను ప్రతిపక్షాలు సహా, ముస్లిం సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.



బుజ్జాయీ.. బజ్జోరా..

భార్య పరీక్ష రాయడానికి వెళ్తే.. చిన్నారిని చూసుకునే పరీక్షలో పాసయ్యేందుకు ఈ వ్యక్తి ఆపసోపాలు పడుతున్నాడు. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం జీఎన్ఎం పరీక్ష రాసేందుకు వెళ్లిన భార్య చిన్నారిని భర్తకు అప్పగించింది. ఆ సిసింద్రీని బుజ్జగించేందుకు ఆపసోపాలు పడ్డ తండ్రి చివరకు కాలేజీ ఆవరణలోని ఓ చెట్టుకు ఊయల కట్టి ఇలా నిద్రపుచ్చాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఈ బువ్వ తినలేం 'బాబో'య్

మధ్యాహ్న భోజన పథకం కింద బడిపిల్లలకు రుచికరమైన భోజనం అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. అయితే చాలాచోట్ల రుచీపచీలేని భోజనం పెడుతుండటంతో పిల్లలు తినేందుకు ఇష్టపడటంలేదు. గుంటూరు రాజాగారి తోటలోని నగరపాలక సంస్థ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం వడ్డించిన సాంబార్ బాత్ నీళ్లలా ఉండి చప్పగా ఉండటంతో తినలేక ఓ చిన్నారి పారబోస్తున్న దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అన్నం తింటే రోగం ఫ్రీ



ఆర్భాటంగా అన్న క్యాంటీన్ ప్రారంభించిన నేతలు పరిసరాలెలా ఉన్నాయనేది పట్టించుకోలేదు. దీంతో గుంటూరు చుట్టుగుంట కూడలిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో ముక్కు మూసుకుంటే కానీ ముద్ద దిగని పరిస్థితి. ప్రధాన డ్రైనేజీ కాలువ చెంతనే ఉండటం, పక్కనే మురికినీరు, చెత్త చెదారం పేరుకుపోయి ఉండటంతో అన్నం తినేందుకు వచ్చిన వారు అక్కడి దుర్వాసన భరించలేకపోతున్నారు. కడుపు నిండటం సంగతేమో కానీ ఇక్కడ తింటే రోగాలు తప్పవని భయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఆయిల్ పామ్ రైతులకు బాబు సర్కారు దెబ్బ

ఓఈఆర్‌ను ప్రకటించని కూటమి ప్రభుత్వం

- రూ.13,500కే అమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులు
- గత ఐదేళ్లు ఏటా ఓఈఆర్ ప్రకటించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- రైతులకు రూ. 1,000 కోట్ల మేర లబ్ధి
- ఉద్యాన శాఖ ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని ప్రస్తుత సర్కారు
- ఇప్పటికే ఓఈఆర్ ప్రకటించిన తెలంగాణ రాష్ట్రం



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బకు పామాయిల్ రైతులు విలవిల్లాడుతున్నారు. పామాయిల్ రైతులకు ఆర్థికంగా మేలు చేసే ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ఇంతవరకు ప్రకటించలేదు. దీంతో రైతులు పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లు క్రమం తప్పకుండా ఓఈఆర్‌ను ప్రకటించి రైతులకు అండగా నిలిచింది. ఏటా ఓఈఆర్ ప్రకటనతో గత ఐదేళ్లలో రైతులు రూ.1,000 కోట్లకు పైగా లబ్ధి పొందగలిగారు. ఈ ఏడాది కూడా ఓఈఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఎన్నికల కోడ్ కారణంగా ప్రకటన నిలిచిపోయింది. కొత్తగా వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పట్టించుకోవడంలేదు. దీంతో సీజన్ పీక్ దశకు చేరుకున్నప్పటికీ ధర ఆశించిన స్థాయిలో పెరగక రైతులు నష్టాల పాలవుతున్నారు.

రైతులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

గత ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి, వారికి అండగా నిలవడంతో ఆయిల్ పామ్ సాగులోనే కాదు.. ఉత్పత్తి, ఉత్పాదకతలోనూ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్రానికి బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ ఇన్ ఆయిల్ పామ్ స్టేట్ అవార్డు కూడా దక్కింది. రాష్ట్రంలో 2014–19 మధ్య 3.71 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవగా, 2023–24కు వచ్చే సరికి 5.66 లక్షల ఎకరాలకు పెరిగింది. దిగుబడి సగటున హెక్టార్‌కు 15 టన్నుల నుంచి 19.81 టన్నులకు పెరిగింది. 2014–19 మధ్య అప్పటి చంద్రబాబు ప్రభుత్వం తొలి మూడేళ్లు ఓఈఆర్ ప్రకటించనే లేదు. 2017–18లో 1 శాతం ప్రకటించినా పైసా విదల్చలేదు. 2018–19లో 1.72 అదనపు ఓఈఆర్‌ను ప్రకటించినా, ఆ మేరకు చెల్లించాల్సిన రూ.80.32 కోట్లనూ ఎగ్గొట్టేసింది. ఆ మొత్తాన్ని కూడా వైఎస్ జగన్ ప్రభుత్వమే చెల్లించింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు తెలంగాణకంటే మెరుగ్గా, రికార్డు స్థాయిలో ఓఈఆర్ ప్రకటించి రైతులకు అండగా నిలిచింది. 2018–19లో గరిష్టంగా 16.08 శాతం ఉన్న ఓఈఆర్‌ను తొలి ఏడాదిలోనే 18.62 శాతం, ఆ తర్వాత 19.22 శాతం, 19.32 శాతం ప్రకటించి రైతులకు లాభదాయకమైన ధర వచ్చేలా చేసింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రతిపాదించిన వయబిలిటీ గ్యాప్ పేమెంట్ (వీజీపీ)ను పక్కన పెట్టింది. రైతుల డిమాండ్ మేరకు రాష్ట్ర ఫార్ములా మేరకే ఫ్రెష్ ఫ్రూట్ బెంచ్ (ఎఫ్ఎఫ్‌బీ) ధరలను నిర్ణయించింది. ఆయిల్ పామ్‌కు 2014 – 19 మధ్య సగటున టన్నుకు రూ.7,492 ధర లభిస్తే, 2019 – 24 మధ్య గరిష్ఠంగా రూ.23,365 (2022 మేలో), కెర్నిల్ నట్స్‌కు రూ.29,250 రైతులకు దక్కింది. రాష్ట్రంలో కొత్తగా సాగు విస్తరణకు అనువైన 11.92 లక్షల ఎకరాలు గుర్తించారు. ప్రస్తుతం 236 మండలాల్లో ఆయిల్ పామ్ సాగవుతుండగా, కొత్తగా మరో 124 మండలాలను నోటిఫై చేశారు. మిషన్ ఆయిల్‌పామ్ కింద వచ్చే ఐదేళ్లలో రూ.622 కోట్లతో 3 లక్షల ఎకరాలకు విస్తరించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. 2023–24లో 60 వేల ఎకరాలు కొత్తగా సాగులోకి తేవాలని నిర్దేశించగా, ఇప్పటికే 50 వేల ఎకరాలు సాగులోకి వచ్చాయి. సబ్సిడీల రూపంలో 2014–19 మధ్య 26,239 మంది రైతులకు రూ.162.46 కోట్లు సాయం అందిస్తే, 2019–24 మధ్యలో వైఎస్ జగన్ ప్రభుత్వం 52,848 మందికి రూ.248.17 కోట్ల మేర చేయూతనందించింది.

పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం

దేశీయంగా నూనె ధరల క్రమబద్ధీకరణకు క్రూడ్ పామాయిల్ (సీపీవో)పై దిగుమతి సుంకాన్ని గతేడాది కేంద్రం ఎత్తివేసింది. ఫలితంగా ఎఫ్ఎఫ్‌బీ ధరలు పతనమయ్యాయి. దీంతో ఆయిల్ పామ్ రైతులకు నష్టం కలిగింది. ఈ దశలో రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసింది. విదేశీ పోటీ నుండి ఆయిల్‌పామ్ రంగం, రైతుల జీవనోపాధిని రక్షించడానికి «డైనమిక్ ఇంపోర్ట్ డ్యూటీ మెకానిజాన్ని» రూపొందించాలని, దిగుమతి సుంకాలను పునరుద్ధరించాలని ఒత్తిడి తెచ్చింది. కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో గరిష్ఠంగా టన్ను రూ.23,635 పలికిన ఎఫ్ఎఫ్‌బీ ధర ఒక దశలో రూ.12 వేలకు పడిపోయింది. ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగు పడినప్పటికీ అడ్‌హాక్ కమిటీ నిర్ణయించిన రూ.13,500 ధరకే రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓఈఆర్ ప్రకటించి ఉంటే మరింత మెరుగైన ధర పొందే అవకాశం ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఓఈఆర్‌ను ప్రకటించినా, రాష్ట్ర ప్రభుత్వంలో కదలికే లేదు. గతేడాది కంటే మెరుగైన ఓఈఆర్ ఇవ్వాలన్న సంకల్పంతో ఉద్యానశాఖ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపింది. వీటిని చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. 2014–19 మధ్య కూడా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఇదే రీతిలో తమకు నష్టం కలిగించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటకెక్కిన ఉద్యోగుల సంక్షేమం

ఉద్యోగ సంఘాల నేతలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా కరువే

- ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి జంకుతున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేకుండా ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే



కర్నూలు (అగ్రికల్చర్): ఎన్నికలకు ముందు అన్ని వర్గాలతో పాటు ఉద్యోగులకు కూడా చంద్రబాబు హామీలిచ్చి అరచేతిలో స్వర్గం చూపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర నెలలైనా ఉద్యోగులకు చెల్లించాల్సినవి ఏవైనా చెల్లించారా అంటే ఒక్కటీ లేదని స్పష్టమవుతోంది. అయితే దీనిపై అడగడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని కోరుతున్నా స్పందించే వారు కరువయ్యారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెండింగ్ అంశాల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నిస్తున్నా కనీసం ఆయన అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి నెలకొనడం గమనార్హం. మరోపక్క ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగులను బెదిరిస్తున్నారు. తనలో మళ్లీ 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారంటూ బహిరంగంగా బెదిరిస్తుండటంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. పలు కార్యక్రమాల్లో ఉద్యోగులను అవమాన పరిచే విధంగా మాట్లాడటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్థిక ప్రయోజనాలు

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపుగా చెల్లించింది. 2019లో జరిగిన ఎన్నికల నాటికి చంద్రబాబు పెండింగ్‌లో పెట్టిన డీఏలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇక 2024 ఎన్నికల సమయానికి ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదు. 2023 మార్చి నాటికి జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు పూర్తయ్యాయి. 2023 వరకు సరెండర్ లీవ్‌లు కూడా మంజూరు చేసింది. సీపీఎస్ స్థానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా జీపీఎస్‌ను తీసుకొచ్చింది. అప్పట్లో జీపీఎస్‌ను టీడీపీ, జనసేనతో పాటు ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

సచివాలయ వ్యవస్థతో ఆడుకుంటున్న ప్రభుత్వం

జాబు రావాలంటే బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం అంటూ టీడీపీ 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు 34 వేలలోపే. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షన్నరకుపైగా ఉద్యోగాలు కల్పించింది. మిగిలిన శాఖల్లో మరో లక్ష వరకు ఉద్యోగాలు భర్తీ చేయడం విశేషం. సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థల ఏర్పాటుతో అధికారులపై పని ఒత్తిడి గణనీయంగా తగ్గింది. అవినీతికి అవకాశం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయి. తాజాగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థతోనూ ఆడుకుంటోంది. రానున్న రోజుల్లో తమ భవితవ్యం ఏమిటో తెలియక సచివాలయ ఉద్యోగుల ఆందోళన అంతా ఇంతా కాదు.

పెండింగ్‌లోనే అన్ని ప్రయోజనాలు

- 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతల నుంచి చంద్రబాబు దిగిపోయే సమయానికి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఎన్నికల కోడ్ వచ్చే సమయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క డీఏ కూడా పెండింగ్ లేకుండా చెల్లించింది.
- 2024 జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డీఏ మాత్రమే ఇప్పుడు పెండింగ్‌లో ఉంది.
- 2014–15 నుంచి 2018–19 వరకు డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయి.
- రెండు సరెండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనివే.
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఏపీజీఎల్ఐ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీపీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఒక్కో ఉద్యోగికి సగటున రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- పెన్షన్ చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. పెన్షనర్ల ప్రయోజనాలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. కానీ ఉద్యోగ సంఘాల నేతలు ఎవ్వరూ వీటిపై స్పందించని పరిస్థితి.




రాష్ట్రంలో 25.41 లక్షల మహిళలకు 'స్వయం ఉపాధి'

- గత నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈల ద్వారా విస్తృత అవకాశాలు
- ఎంఎస్ఎంఈల్లో మహిళలకు ఉపాధిపై రాజ్యసభలో కేంద్రం ప్రకటన
- చేయూత, ఆసరా పథకాలతో మహిళల ఆర్థిక స్వావలంబనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి

మహిళలకు ఉపాధి కల్పనలో దేశంలో ఏపీకి 7వ స్థానం

మహిళాభ్యుదయం

సాక్షి, అమరావతి: మహిళల ఆర్థిక వృద్ధితోనే కుటుంబం, తద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా స్వావలంబనకు పూనుకున్నాయి. అందుకు అనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) పథకాన్ని తీసుకొచ్చాయి. ఈ పథకానికి రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. చేయూత, ఆసరా వంటి సరికొత్త పథకాల ద్వారా మహిళలకు విస్తృత స్వయం ఉపాధి అవకాశాలను మెరుపరిచింది. తద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు విశేష కృషి చేసింది. ఫలితంగా గత నాలుగేళ్లలో 25.41 లక్షల మంది మహిళలు ఉపాధి అవకాశాలు పొందినట్లు రాజ్యసభలో కేంద్ర సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



వ్యవసాయేతర రంగాల్లో అవకాశాలు..

ఆంధ్రప్రదేశ్‌లో 2020 జూలై 7వ తేదీ నుంచి 2024 జూలై వరకు ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈల్లో మహిళలకు ఉపాధి అవకాశాలను పెద్ద ఎత్తున కల్పించారు. దేశంలో ఎంఎస్ఎంఈల ద్వారా నాలుగేళ్లలో అత్యధికంగా మహిళలకు ఉపాధి కల్పించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఏడవ స్థానంలో నిలిచింది. మహిళలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానంగా వ్యవసాయేతర రంగాల్లో అవకాశాలను పెంపొందించే చర్యలను చేపట్టాయి. సంప్రదాయ కళాకారులు, గ్రామీణ, పట్టణ నిరుద్యోగ యువత ఇంటి వద్దనే చిన్న చిన్న సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు వివిధ పథకాల ద్వారా సహాయం అందించాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ కేటగిరి వారికి ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం మార్జిన్ మనీ సబ్సిడీ, పట్టణ ప్రాంతాల్లో 15 శాతం సబ్సిడీ అందించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు, మహిళలు, దివ్యాంగులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్జిన్ మనీ సబ్సిడీ 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం ఇచ్చారు. చేతి వృత్తుల వారి కోసం ప్రత్యేకంగా ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం అమలు చేశారు. మహిళా కోయిర్ యోజన ద్వారా మహిళా ఆధారిత స్వయం ఉపాధి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంది. చేయూత, ఆసరా వంటి పథకాలు ప్రవేశపెట్టి మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వెన్నుతట్టి ప్రోత్సహించింది. మహిళాభ్యుదయానికి విశేషంగా కృషి చేసింది. ఈ వివరాలనే కేంద్ర సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ రాజ్యసభలో వివరించింది.

1న 'చలో విజయవాడ' ఉపసంహరణ

ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వెల్లడి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): సెప్టెంబర్ 1న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉపసంహరించుకున్నామని, అదే రోజున అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులను కలిసి సీపీఎస్ ఉద్యోగుల ఆకాంక్షలను తెలుపుతామని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులపై అక్రమ కేసులన్నీ రద్దు చేస్తామని సీఎం ప్రకటించడం, ఏడాదిలోపు సీపీఎస్ సమస్యకు పరిష్కారం చూపుతామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటన చేసిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కేంద్రం యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) పేరుతో కొత్త పెన్షన్ స్కీంను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, కేంద్రం ప్రతిపాదించిన ఈ స్కీంను రాష్ట్రంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయవద్దని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవికుమార్, జాయింట్ సెక్రెటరీ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3న విజయవాడ జాగరణ సభ

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలు, క్రైస్తవ మైనార్టీలు పూర్తి అభద్రతాభావంతో ఉన్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మైనారిటీ సెల్ జాతీయ అధ్యక్షుడు జాన్ మస్కీ అన్నారు. కనీసం తాము క్రైస్తవులం అని చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ గవర్నర్‌పేటలోని ఒక హోటల్‌లో పార్టీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీల నియామకం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో తమ పార్టీలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో అక్టోబర్ 3న విజయవాడలో జాగరణ సభ జరుగుతుందని, ఈ సభకు కేంద్రమంత్రి రాందాస్ అథవాలే హాజరవుతారన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డి సలహాలు, సూచనలతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. మైనార్టీ సెల్ సభ్యులు బి.నవీన్ కుమార్, డేవిడ్ మార్క్, పీటర్, బి.డేనియల్, వీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జిలాని



కృష్ణలంక (విజయవాడ తూర్పు): విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పోరాడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జిలాని పిలుపునిచ్చారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వ విద్యను నాశనం చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న కారణంగానే కోచింగ్ సెంటర్లు, ప్రభుత్వ అధికారులు, మాఫియా కలిసి పేపర్ లీకేజీలకు, స్కాంలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.భాస్కర్, ఎ.సురేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


దులీప్ ట్రోఫీకి సర్వం సిద్ధం

- సెప్టెంబర్ 5 నుంచి అనంతపురంలో క్రికెట్ సందడి

అనంతపురం కార్పొరేషన్: అనంతలో క్రికెట్ సందడి నెలకొంది. సెప్టెంబర్ 5 నుంచి 22వ తేదీ వరకు బీసీసీఐ, ఏసీఏ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం వేదికగా దులీప్ ట్రోఫీ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, రిషబ్‌పంత్, మయాంక్ అగర్వాల్, శ్రేయస్ అయ్యర్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్ సింగ్, తదితర క్రీడాకారులను కలుపుకుని దేశంలోని టాప్ 45 మంది క్రీడాకారులు, భారత సెలెక్టర్లు అనంతపురం రానున్నారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లోని రెండు మైదానాల్లో ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు(టెస్ట్ మ్యాచ్) ఉంటుంది. సెప్టెంబర్ 5న బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో భారత్ ఏ, బీల మధ్య, అదే రోజున అనంతపురంలో టీం-సీ, టీం-డీ జట్ల మధ్య మ్యాచ్‌తో దులీఫ్ ట్రోఫీ ప్రారంభం కానుంది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ క్రికెటర్లు వస్తుండడంతో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులందరికీ త్రీస్టార్ హోటళ్లలో బస ఏర్పాటుచేశారు. మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్ -18, జియోలో లైవ్‌లో ప్రసారం కానున్నాయి. గురువారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్(ఏసీజీ) ఆడిటోరియంలో దులీప్ ట్రోఫి ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్టీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మాట్లాడారు. క్రికెట్ మ్యాచ్‌లకు అనంతపురం ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో తొలిసారి ఓ పెద్ద టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించినందుకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి, షాబుద్దీన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాడు అవమానించి.. నేడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారు

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుల్లయ్య మండిపాటు



భవానీపురం (విజయవాడ పశ్చిమ): సమస్యలను విన్నవించుకునేందుకు వస్తే తోకలు కత్తిరిస్తా.. మిమ్మల్ని దేవాలయాల్లో అడుగు పెట్టనివ్వను అంటూ నాడు నాయీబ్రాహ్మణులను ఘోరంగా అవమానించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు నేడు వారికి అగ్రతాంబూలం ఇస్తున్నట్లు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ టి.పుల్లయ్య గురువారం ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు ఇప్పుడిస్తున్న రూ.20 వేల జీతాన్ని రూ.25 వేలకు పెంచుతున్నట్లు, దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించటం విడ్డూరంగా ఉందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఆలయాల్లో సేవకులైన నాయీబ్రాహ్మణులను పాలకులుగా చేశారన్న సంగతిని చంద్రబాబు మరిచిపోయినట్లున్నారని గుర్తు చేశారు.

భవిరి రవికి గిడుగు పురస్కారం



భవిరి రవికి గిడుగు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జొన్నవిత్తుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్వన్యనుకరణ కళాకారుడు భవిరి రవికి గిడుగు పురస్కారాన్ని ప్రముఖ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రదానం చేశారు. బీజేపీ రాష్ట్ర టీచర్స్ సెల్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో నిర్వహించిన వేడుకల్లో వ్యవహారిక భాషా ఉద్యమ మూలపురుషుడు గిడుగు రామమూర్తి పంతులు పురస్కారాన్ని ఆయనకు అందచేశారు. ఉపాధ్యాయుడు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకుపైగా మిమిక్రీ కళలో దేశవిదేశాల్లో వేల ప్రదర్శనలు ఇవ్వడంతోపాటు దృశ్య ప్రసార మాధ్యమాల ద్వారా ప్రేక్షకులను మెప్పించిన భవిరి రవి అభినందనీయుడని కొనియాడారు. భవిరి రవిని అభినందించినవారిలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వామరాజు సత్యమూర్తి, పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో విధ్వంసక పాలన

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పాలసముద్రం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలను పోలీస్ యంత్రాంగం గాలికి వదిలేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి విమర్శించారు. గురువారం చిత్తూరు జిల్లా పాలసముద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊదర గొట్టి ప్రజల ఓట్లను పొందిన చంద్రబాబు ఇప్పుడేమో వాటి ఊసే ఎత్తకుండా నిస్సిగ్గుగా జారుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తుంటే చంద్రబాబు రాక్షస పాలన సాగిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు.

చర్చల తర్వాతే కౌలు చట్టం తీసుకురావాలి

ఏపీ కౌలు రైతుల సంఘం

సాక్షి, అమరావతి: భూ యజమానులతో పాటు కౌలు రైతులతో చర్చించిన తర్వాతనే కౌలు చట్టం-2024ను తీసుకురావాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాగుదారుల్లో సింహభాగం కౌలు రైతులేనని, వారికి సకాలంలో పంట రుణాలతో పాటు ఇతర సంక్షేమ ఫలాలు ఏమీ అందడం లేదన్నారు. కౌలు రైతులకు అందాల్సిన రాయితీలన్నీ భూ యజమానులకే దక్కుతున్నాయన్నారు. సీసీఆర్సీ కార్డులు జారీలో భూ యజమాని అనుమతి తప్పనిసరి అనే నిబంధన కౌలు రైతుల పాలిట శాపంగా మారిందని చెప్పారు. మెజారిటీ భూ యజమానులు అంగీకార పత్రాలు ఇవ్వక, కౌలు రైతులకు కార్డులు జారీ కావడం లేదని తెలిపారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా ప్రతీ కౌలు రైతుకు కార్డులివ్వాలని, గుర్తింపు కార్డు ఆధారంగా రూ.1.60 లక్షల వరకు వ్యక్తిగత పూచీకత్తు మీద వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరారు. సీసీఆర్సీలతో సంబంధం లేకుండా ఈ-పంట నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు చట్టం తయారీలో కౌలు రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

భూగర్భాన్ని పేల్చేస్తున్నారు!



- మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- నిబంధనలకు విరుద్ధంగా భారీ రిగ్ బ్లాస్టింగ్‌లు
- 10 కిలోమీటర్ల మేర కంపిస్తున్న భూమి
- పలు చోట్ల ఇళ్లకు పగుళ్లు

భూమాతా...మన్నించు తల్లీ!

నేలను మనం భూమాతగా కొలుస్తాం. తల్లి బిడ్డకు స్తన్యం ఇచ్చి పెంచినట్టే భూమాత మనకు అవసరమైన మేరకు వ్యవసాయం ద్వారా పంటలను ఇవ్వడంతో పాటు తన గర్భంలో నిక్షిప్తం చేసుకున్న ఇంధన వనరులను కూడా ఇస్తోంది. అయితే మానవుడు అత్యాశతో భూగర్భంలో లోతులకు పోయి భారీ రిగ్‌లతో పేల్చేస్తున్నాడు. దీంతో భూమిపై మానవుల భద్రతకే ప్రమాదం ఏర్పడుతోంది. ఎన్టీఆర్ జిల్లాలోని పలు క్వారీల్లో భారీ పేలుళ్లతో పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి.

జి.కొండూరు: ఎన్టీఆర్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా క్వారీల నిర్వహణ సాగుతోంది. నిత్యం వేల టన్నుల రాతి సంపద రవాణా జరుగుతోంది. క్వారీ ప్రమాదాలలో కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరి కొందరు గాయాలపాలవుతున్నారు. క్వారీ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా బాధిత కుటుంబాలకు ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. అధికారులకు అందవలసిన ముడుపులు అందుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగే భారీ రిగ్ బ్లాస్టింగ్‌ల వలన సమీప గ్రామాల్లో భూమి దద్దరిల్లిపోయి ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి.



భారీ పేలుళ్ల ధాటికి పగుళ్లిచ్చిన ఓ ఇంటిగోడ

వంద అడుగుల లోతు వరకు బ్లాస్టింగ్‌లు

మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాలు, నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండల పరిధిలో నిర్వహిస్తున్న క్వారీలలో నిబంధనల ప్రకారం 8 అడుగుల లోతు వరకే డ్రిల్లింగ్ వేసి పేలుళ్లు జరిపి కొండ నుంచి రా మెటీరియల్ తీయాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేసే యంత్రాలతో కొండలకు 50 నుంచి 100 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ వేసి వీటిలో అమోనియా, పవర్‌లెట్, పెద్దసైజు బూస్టర్లు, జిలిటెన్ స్టిక్‌లను అమర్చి డీఎఫ్ వైరుతో కలిపి విద్యుత్ ద్వారా ఒకేసారి 100 వరకు బాంబులు పేలేలా బ్లాస్టింగ్‌లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ పేలుళ్ల వలన ఇబ్రహీంపట్నం మండలం దొనబండ, కేతనకొండ, మూలపాడు, కీలేశపురం, కొండపల్లి, జి.కొండూరు మండలం జి.కొండూరు, కొత్తూరు, చెవుటూరు, కట్టుబడిపాలెం, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, కంచికచర్ల మండలం పరిటాల, దొనబండ వంటి ప్రాంతాల్లో పలు ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి.



కంచికచర్ల మండలం దొనబండ క్వారీలో బండరాళ్లు పడి మృతి చెందిన కార్మికుడు(ఫైల్)

ఏడాదికి రూ.300 కోట్ల వ్యాపారం

మైలవరం, నందిగామ నియోజకవర్గాలలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల మండలాల్లో గతంలో 154 క్వారీల వరకు ఉండగా, ప్రస్తుతం 69 క్వారీల వరకు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్వారీలలో బ్లాస్టింగ్‌ల ద్వారా పెద్ద పెద్ద బండరాళ్లను క్రషర్లకు తరలించి 40ఎంఎం, 20ఎంఎం, 12ఎంఎం, బేబీ చిప్స్, డస్ట్, వెట్ మిక్స్ ఇలా రకరకాలుగా విభజించి స్థానికంగా నిర్మిస్తున్న కట్టడాలు, రహదారులకు సరఫరా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ క్వారీల నుంచి రోజుకి 500కి పైగా భారీ వాహనాలతో 20వేల టన్నులకు పైగా రాతి సంపదను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా ఈ రెండు నియోజకవర్గాల్లోని క్వారీల నుంచి ఏడాదికి రూ.300 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది.



జి.కొండూరు మండలం లోయ ప్రాంత క్వారీలో బాంబులు అమర్చేందుకు రిగ్ వేస్తున్న యంత్రం

ఇళ్లు అదిరిపోతున్నాయి



క్వారీలలో భారీ బ్లాస్టింగ్ వలన ఇళ్లు అదిరిపోతున్నాయి. గోడలు పగుళ్లు వస్తున్నాయి. పెద్ద వయస్సు వారికి గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి భారీ పేలుళ్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–హేమా నాయక్, గడ్డమణుగు, జి.కొండూరు మండలం

రక్షణ చర్యలు పాటించడం లేదు



క్వారీలలో బ్లాస్టింగ్‌లు చేస్తున్న సమయంలో నిబంధనలు పాటించడం లేదు. భారీ పేలుళ్ల వల్లన అంచనా తెలియక రాళ్లు తొలగిస్తున్న కార్మికులు మృత్యువాత పడుతున్నారు. నిబంధనలు పాటించని క్వారీలపై చర్యలు తీసుకోవాలి.

–ఎం.మహేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

అనుభవం లేని వ్యక్తులతో బ్లాస్టింగ్‌లు

అనుభవంలేని వ్యక్తులతో బ్లాస్టింగ్‌లు చేయించడం వలనే క్వారీలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ పేలుళ్లకు కొండ ఎంతమేర కదిలిందో తెలియక ఆ రాళ్లను తొలగించేందుకు వెళ్లిన కార్మికులు బండరాళ్లు మీదపడి మరణిస్తున్నారు. ఇటీవల కంచికచర్ల మండలం దొనబండ క్వారీలో ఇటువంటి ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ క్వారీలలో ఎక్కువగా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వచ్చిన మైనర్‌లు కూడా పాల్గొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



జి.కొండూరు మండలం లోయ ప్రాంతంలోని ఓ క్వారీలో బాంబులు అమర్చుతున్న కార్మికులు(ఫైల్)

'కోట'కు కట్టడి!

ఇరుకుగా ఉండే గదిలో ఏడు బంకర్ బెడ్లు. ఇద్దరు ఉండాల్సిన గదిలో 14 మంది విద్యార్థులు. వారందరికీ ఒక్కటే టాయిలెట్. ఉదయం 5.30 నుంచి 8.30 వరకు స్టడీ అవర్స్. తింటున్నది ఏంటో కూడా తెలియని అల్పాహారం. తర్వాత రెగ్యులర్ తరగతులు. మధ్యాహ్నం 12.30 తర్వాత భోజనం. అరగంటలో పూర్తి కాగానే మళ్లీ రాత్రి 7 గంటల వరకు క్లాసులు. డిన్నర్ బ్రేక్ తర్వాత మళ్లీ రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్స్. రోజుకో పరీక్ష.. వారానికో గ్రాండ్ టెస్ట్.. మార్కులు తక్కువ వస్తే శిక్షలు. రాజస్థాన్ 'కోట'లోని చదువుల ఫ్యాక్టరీలను తలపించే ఈ 'శిక్ష'ణ విజయవాడ శివారులోని ఓ కార్పొరేట్ జూనియర్ కాలేజీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. చదువుల్లో తీవ్రమైన ఒత్తిడితో విద్యార్థులు మానసిక సమస్యలకు గురవుతున్నారు. ఈ ఒక్క కాలేజీలోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు, ఐఐటీ, నీట్ శిక్షణ సంస్థల్లో ఇదే తరహా శిక్షణ కొనసాగుతోంది. రాజస్థాన్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్ల నియంత్రణకు ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన నేపథ్యంలో అలాంటి వ్యవస్థ మన రాష్ట్రంలో కూడా అవసరమంటున్నారు విద్యారంగ నిపుణులు.

- చదువుల ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థుల బలవన్మరణాలు
- ఐఐటీ, నీట్‌లో ర్యాంకుల కోసం కాలేజీలు, శిక్షణ సెంటర్ల ఒత్తిడి
- కనీస సదుపాయాలు లేకుండానే రెసిడెన్షియల్ తరగతుల నిర్వహణ



- వీటి నియంత్రణకు రాజస్థాన్ ప్రభుత్వం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు
- అలాంటి తరహా చట్టాలు తెలుగు రాష్ట్రాల్లోనూ అవసరమంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: రాజస్థాన్‌లోని కోట పట్టణం ఐఐటీ, నీట్ వంటి శిక్షణ సంస్థలకు పెట్టింది పేరు. ఇక్కడి ఇన్‌స్టిట్యూట్స్‌లో శిక్షణ తీసుకుంటే ర్యాంక్ గ్యారంటీ అన్న నమ్మకంతో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఇక్కడకి వస్తుంటారు. అయితే, అక్కడి శిక్షణను తట్టుకోలేక, ఒత్తిడిని భరించలేక గతేడాది (2023)లో 26 మంది.. ఈ ఏడాది ఇప్పటి వరకు 13 మంది బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. వీరంతా 17–19 ఏళ్ల మధ్య వయసువారే కావడం విచారకరం. ఇక సివిల్స్ శిక్షణకు బ్రాండ్ సిటీ ఢిల్లీలో ఇటీవల ఓ పేరొందిన స్టడీ సర్కిల్‌ను వరద ముంచెత్తడంతో ముగ్గురు సివిల్ సర్వీసెస్ శిక్షణ అభ్యర్థులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శిక్షణ సంస్థల నియంత్రణ ముసాయిదా బిల్లును తెరపైకి తెచ్చారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా రాజస్థాన్ కోచింగ్ సెంటర్ (కంట్రోల్ అండ్ రెగ్యులేషన్) బిల్లు-2024 దేశంలో పెద్ద ముందడుగుగా భావిస్తున్నారు. ఈ బిల్లు ఆధారంగా ప్రత్యేక చట్టాన్ని రాజస్థాన్ ప్రభుత్వం తీసుకురానుంది. దీని ద్వారా ఆ రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్లను సాధారణ పాఠశాలలతో సమానంగా పరిగణించడంతోపాటు విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కఠినమైన మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు.

16 ఏళ్ల లోపు వారికి శిక్షణపై నిషేధం

కోటలో విద్యార్థుల ఆత్మహత్యలకు గల కారణాలపై అధ్యయనం చేసిన అక్కడి ప్రభుత్వం.. కోచింగ్ సెంటర్లలో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని గుర్తించింది. పోటీ పరీక్షలను క్లియర్ చేయడంలో ఒత్తిడి, స్టడీ లోడ్ పెరగడం, తగినంత కౌన్సెలింగ్ గాని, ఓదార్పుగాని లేకపోవడం కూడా కారణంగా భావించింది. శిక్షణ సంస్థలు ఫీజు వసూళ్లపై పెట్టిన దృష్టి విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వడంపై పెట్టలేదని గమనించింది. దీంతో ఐఐటీ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ పేరుతో 16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవడం, సాధారణ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంపైనా నిషేధం విధించింది. విద్యార్థుల వసతి గృహాలు అత్యంత రద్దీగా ఉండటాన్ని గుర్తించిన రాజస్థాన్ సర్కారు.. సరైన ప్రమాణాలతో సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.

రాష్ట్రంలోనూ ఒత్తిడే

విశాఖపట్నం పీఎం పాలెంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిపై పదో తరగతికి సంబంధించి సిలబస్‌పై ఒత్తిడి పెంచడంతో తట్టుకోలేక ఆ విద్యార్థి ఈ ఏడాది జనవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గతేడాది ఫిబ్రవరిలో తిరుపతి జిల్లా గూడూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థి కాలేజీ హాస్టల్ భవనంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ బలవన్మరణాలు ఏపీలోని కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో జరుగుతున్న దారుణాల్లో మచ్చుకు కొన్ని మాత్రమే. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం గతేడాది ఏపీలో 523 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడగా, వారిలో సగం మందికి పైగా 17–19 ఏళ్ల వయసువారే.

ముసాయిదా బిల్లులో ఏముంది..

- శిక్షణ సంస్థలపై పర్యవేక్షణకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో పాఠశాల, వైద్య, సాంకేతిక విద్య కార్యదర్శులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సభ్యులుగా ఉండే మొత్తం 12 మంది అధికారులతో ప్రత్యేక పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు సివిల్ కోర్టు అధికారాలతో జిల్లా స్థాయి అధికారులను నియమించనున్నారు.
- కోచింగ్ సెంటర్లు వివరాలను జిల్లా అధికారుల వద్ద నమోదు చేసుకోవడాన్ని తప్పనిసరి చేశారు.
- ఇన్‌స్టిట్యూట్ ఏదైనా తప్పు చేస్తే మొదటి నేరానికి రూ. 25 వేలు, రెండో నేరానికి రూ.లక్ష జరిమానా విధించవచ్చు. ఆపై తప్పు జరిగితే సంస్థ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు.
- శిక్షణ కేంద్రాలు కౌన్సెలింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. పోటీ పరీక్షల శిక్షణ తీసుకోవడంలో వారి సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యార్థులను పరీక్షించాలి.
- విద్యార్థి శిక్షణ మధ్యలోనే మానేయాలనుకుంటే దామాషా ప్రకారం ఫీజు రీఫండ్ చేయాలన్న నిబంధన కూడా విధించింది.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 76,772 మంది స్వామివారిని దర్శించుకోగా 30,293 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.82 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం స్వర్ణపుష్పార్చన వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా విశాఖలోని బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు గురువారం 25వ రోజుకు చేరాయి. అమ్మవారికి విశేష పూజలు, త్రికాల పంచామృతాభిషేక సేవ, విశేష హోమాలు నిర్వహించారు. విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

కిర్లంపూడి: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని జగతినగరంలో వేంచేసిన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయం వద్ద నాట్య ప్రదర్శన, కోలాటం వంటి సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటితో ముగియనున్న వరలక్ష్మీ వ్రతాలు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోటలోని బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ సామూహిక వ్రతాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు ఉదయం 9 గంటలకు ఆలయానికి హాజరుకావాలన్నారు.

ఘనంగా సామూహిక సత్య దత్త వ్రతాలు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రావణ బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం సామూహిక సత్య దత్త వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక సత్య దత్త వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. .

నిత్యార్జిత కల్యాణం సేవా టికెట్ పెంపు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని శ్రీవారి నిత్యార్జిత కల్యాణం సేవా టికెట్ రుసుము సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి పెరగనుంది. ప్రస్తుతం రూ.1,500గా ఉన్న ఈ టికెట్ ధరను రూ.2 వేలకు పెంచుతున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు గురువారం వెల్లడించారు. స్వామివారికి జరిగే నిత్య కల్యాణానికి ఎంతో విశిష్టత ఉంది. కోరిన కోర్కెలు తీరిన భక్తులు, కోర్కెలు తీరాలని మొక్కుకున్నవారు ఈ సేవలో ఎక్కువగా పాల్గొంటారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో 70 నుంచి 100 మంది, ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో 230 నుంచి 250 మంది వరకు దంపతులు ఈ సేవలో పాల్గొంటున్నారు.



ఎస్వీయూలో పెన్షనర్లకు ప్రత్యేక పోర్టల్

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని పెన్షనర్ల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వీసీ ఛాంబర్‌లో రిజిస్ట్రార్ భూపతినాయుడు, వర్సిటీ అధికారులతో కలసి ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొత్త పోర్టల్ టీచింగ్, నాన్ టీచింగ్ పెన్షనర్లకు ఎంతో ఉపయోగకరమని, పెన్షన్ త్వరితగతిన అందించడానికి, సమస్యల పరిష్కారానికి, వారి ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు ఇంటి నుంచే తెలుసుకునే వీలుంటుందన్నారు. అలాగే వర్సిటీ పూర్వ, ప్రస్తుత ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా త్వరలో డిజిటల్ సొల్యూషన్‌లను తీసుకురానున్నట్లు తెలిపారు.

గ్రామీణ స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని నెల్లూరు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీస్ సెంటర్ వరకు క్రీడాకారులు, విద్యార్థులతో ర్యాలీని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న స్టేడియాలను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గురువారం గిడుగు సాహితీసేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు టీడీ జనార్దన్, సినీ రచయిత బిక్కి కృష్ణ తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని సుధీర్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

వెంకటాచలం: యువత క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. వర్సిటీలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తన ప్రతిభతో ధ్యాన్‌చంద్ హాకీ క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారన్నారు.

ట్రిపుల్‌ఐటీలో డ్రగ్స్ నిషేధంపై అవగాహన

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులకు జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల వారి జీవితాల్లో ఎంత నష్టం వాటిల్లుతుందో జీవనశైలి ఎంత దెబ్బతింటుందో వివరించారు. విద్యార్థి దశలో తప్పు చేస్తే దాని యొక్క పరిణామం విద్యార్థులపై వారి తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథరెడ్డి, రెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మధుసూదన విద్యార్థులకు డ్రగ్స్ నిషేధం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఏయూలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏయూ ఉన్నతాధికారులు పటిష్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏయూ ప్రాంగణంలో వేల సంఖ్యలో మొక్కలు నాటి, సంరక్షించే చర్యలు చేపడుతున్నారు. నాలుగు సంవత్సరాలకు పైగా వయస్సున్న వేప, మామిడి, రావి, నేరేడు, బాదం, మర్రి కదంబరి తదితర జాతుల మొక్కలు నాటడానికి సిద్ధం చేశారు. ఇప్పటికే వెయ్యికిపైగా మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మొక్కలకు అవసరమైన నీటిని నిరంతరాయంగా సరఫరా చేయడానికి ప్రత్యేకంగా నీటి ట్యాంకులను సైతం సిద్ధం చేశారు. గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు పనుల ప్రగతిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

నల్లమలలో అతివేగం.. వన్యప్రాణులకు శాపం

హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై నిత్యం వేలసంఖ్యలో వాహనాల రద్దీ

వాహనాల అతివేగంతో రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న అరుదైన జంతువులు

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఐదేళ్లలో 800కు పైగా వన్యప్రాణులు బలి



సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీప్రాంతంలో వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలు..వన్యప్రాణుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధి నుంచి హైదరాబాద్–శ్రీశైలం రహదారి వెళుతోంది. దట్టమైన అడవిలో స్వేచ్ఛగా విహరిస్తూ ఉండే వన్యప్రాణులు రహదారి దాటుతుండగానే వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి.


నిషేధం ఉన్నా.. తగ్గని వేగం

హైదరాబాద్–శ్రీశైలం హదారిపై మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు సుమారు 70 కి.మీ. నల్లమల అటవీ ప్రాంతం గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోకి రాగానే నిబంధనల మేరకు వాహనాలు గంటకు కేవలం 30 కి.మీ. వేగంతోనే ప్రయాణించాలి. ఇక్కడి వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అడవిలోని రహదారి గుండా ప్రయాణించేందుకు అనుమతి ఉంటుంది. అయితే అడవిలో గరిష్ట వేగం 30 కి.మీ. కాగా, వాహనదారులు మితిమీరిన వేగంతో వెళుతున్నారు. అడవిలో ఏదైనా వన్యప్రాణి అడ్డుగా వచ్చినప్పుడు అదుపు చేయలేకపోవడంతో వాహనాల కింద పడి అవి మరణిస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటివరకు ఐదేళ్లలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో సుమారు 800కు పైగా వన్యప్రాణులు వాహనాల కిందపడి మరణించాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. రిపోర్టు కాని వన్యప్రాణుల మరణాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది.

సూచిక బోర్డులకే పరిమితం

హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి నిత్యం వేలసంఖ్యలో వాహనాలు వెళుతున్నాయి. శని, ఆదివారాలతో పాటు ఇతర సెలవురోజుల్లో వాహనాల రద్దీ రెట్టింపు స్థాయిలో ఉంటుంది. నల్లమలలో ప్రయాణించే వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అటవీమార్గంలో సూచిక బోర్డులతో పాటు 35 చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే అక్కడక్కడా సూచిక బోర్డులు ఉన్నా వాహనాల వేగానికి బ్రేక్ పడటం లేదు. నిర్ణీత వేగానికి మించి వాహనాలు దూసుకెళ్తుండటం నల్లమలలోని పులులు, చిరుతలు, జింకలు, అరుదైన మూషికజింకలు, మనుబోతులు, సరీసృపాలు తదితర అమూల్యమైన జంతుసంపదకు ముప్పుగా పరిణమిస్తోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, వేగానికి కళ్లెం వేసేందుకు స్పీడ్‌గన్‌లను ఏర్పాటుచేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని పులులు


వాహనాల వేగానికి బలైన సరీసృపాలు, ఉడుము



వాహనాల వేగం తగ్గించేందుకు చర్యలు

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ప్రయాణించే వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వన్యప్రాణులు తరచుగా రహదారులు దాటే ప్రాంతాల్లో 35 చోట్ల సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేశాం. వాహనాలు అటవీమార్గం గుండా ప్రయాణిస్తున్నప్పుడు నెమ్మదిగా ప్రయాణించేలా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ

రండి.. ఐటీ బిజినెస్ చేసుకోండి!

మళ్లీ ఊపందుకుంటున్న కరీంనగర్ ఐటీ టవర్స్

కంపెనీల స్థాపనకు వస్తున్న దరఖాస్తులు	అందుబాటులో 81000 చదరపు అడుగుల స్పేస్	240 మంది ఐటీ ఉద్యోగులకు ఉపాధి	ద్వితీయ శ్రేణి నగరాల్లో విస్తరణకు మార్గం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లాల్లో కరోనా తరువాత కుదేలైన ఐటీ రంగం క్రమంగా పుంజుకుంటోంది. ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో నిర్మించిన ఐటీ టవర్లలో నడుస్తున్న సెంటర్లు నాడు కరోనా దెబ్బకు కళ కోల్పోయాయి. కొన్ని కంపెనీలు తిరిగి హైదరాబాద్‌కు తరలిపోగా, మిగిలిన సంస్థలు ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం అమలు చేస్తున్నాయి. ఫలితంగా ఐటీ టవర్లు మునుపటిలా కిటకిటలాడటం లేదు. కానీ, కొన్నినెలలుగా కొత్త కంపెనీలు కరీంనగర్ ఐటీ టవర్‌లో పెట్టేందుకు దరఖాస్తు చేసుకుంటున్నాయి. సొంత కంపెనీ స్థాపించాలన్న యువ ఎంటర్ ప్రెన్యూర్లకు ఈ పరిణామం తిరిగి ఉత్సాహాన్నిస్తోంది.

రూ.42 కోట్లతో ఐటీ టవర్స్

ఉజ్వలపార్క్ సమీపంలో ఎల్ఎండీ రిజర్వాయర్ పక్కనే ఆహ్లాద వాతావరణంలో కరీంనగర్ ఐటీ టవర్స్ నిర్మించారు. మొత్తం ఏడు అంతస్తుల్లో రూ.42 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో మొత్తంగా 81,000 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉంది. ఇక్కడ గరిష్టంగా 12 కంపెనీలు ఒకేసారి నిర్వహించుకునేలా ఈ భవనాన్ని విశాలంగా నిర్మించారు. భవిష్యత్తులో కంపెనీలను విస్తరించినా.. ఉద్యోగుల సంఖ్య పెరిగినా..షిఫ్టుల్లో ఉద్యోగులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆఫీసు ప్లాన్ డిజైన్ చేశారు.

దరఖాస్తు ఎలా చేయాలంటే!

జిల్లాల్లో ఐటీ సేవలు విస్తరించేలా ప్రభుత్వం తరఫు నుంచి మంచి ప్రోత్సాహమే ఉంది. సొంత ఐటీ సంస్థను ప్రారంభించాలనుకునే వారు తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ – ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీని ఆశ్రయించాలి. అక్కడ నిబంధనల ప్రకారం.. కంపెనీ రిజిస్ట్రేషన్, వివిధ కంపెనీలతో చేసుకున్న ఎంవోయూలు, బ్యాంక్ లావాదేవీలు, జీఎస్టీ నెంబర్లు, ఉద్యోగుల వివరాలతో సహా డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)తో దరఖాస్తు చేసుకోవాలి. ఐటీ మంత్రిత్వశాఖ ఈ దరఖాస్తును పరిశీలించి కార్యాలయం ప్రారంభానికి అనుమతిస్తుంది. ఆ అనుమతి పత్రం రాగానే.. టీజీ ఐఐసీ సాయంతో ఐటీ టవర్స్‌లో కావాల్సిన స్పేస్‌ను ప్రభుత్వం కేటాయిస్తుంది.

ఐటీ టవర్‌లో అందుబాటులో ఉన్న ఆఫీస్‌స్పేస్

ఫ్లోర్	మీటర్లు	ఫీట్లు
బేస్‌మెంట్ ఫ్లోర్	1160	12,482
గ్రౌండ్ ఫ్లోర్	822	8823
ఫస్ట్ ఫ్లోర్	841	9050
సెకండ్ ఫ్లోర్	1071	11524
థర్డ్ ఫ్లోర్	1085	11675
ఫోర్త్ ఫ్లోర్	1085	11675
ఫిఫ్త్ ఫ్లోర్	1100	11836

12 కంపెనీలు విజయవంతంగా..!

ఐటీ టవర్‌లో మొత్తం 18 కంపెనీలను నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఇక్కడ 12 కంపెనీలు (టాస్క్‌తో కలిపి) విజయవంతంగా నడుస్తున్నాయి. ఇక్కడ మొత్తంగా 240 మంది ఉద్యోగులు వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్నారు.

సీట్ల వివరాలు ఇలా..!

కంపెనీ	సీట్లు
1. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్):	80 సీట్లు
2. విటా:	12 సీట్లు
3. టీమ్ అప్:	12 సీట్లు
4. సజన్ కన్సల్టెన్సీ:	15 సీట్లు
5. సంస్కృతి:	25 సీట్లు
6. క్లస్టర్:	10 సీట్లు
7. ట్రెసీస్:	8 సీట్లు
8. యాస్పెక్ట్‌సైట్స్:	24 సీట్లు
9. ఎస్ఆర్‌కే టెక్నాలజీ:	
10. అనెక్సాక్:	10 సీట్లు
11. ఈ ఎగ్జెమ్:	10 సీట్లు
12. టెక్ జెన్‌సర్వైవ్స్:	13 సీట్లు

ఖర్గేతో ఎమ్మెల్యే 'వాకిటి' భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో గురువారం ఆయనను శ్రీహరి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలతోపాటు.. తన నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో శ్రీహరికి చోటు దక్కనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సులు, మెట్రో బోగీలను పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన సీఎంకు గురువారం లేఖ రాశారు. ప్రయాణికుల సంఖ్య రోజుకు 30 లక్షల నుండి 60 లక్షలకు పెరిగినప్పటికీ, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగలేదని గుర్తు చేశారు. మెట్రో రైళ్ల బోగీల సంఖ్య పెంపు, ఎంఎంటీఎస్ రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.


ఉప్పల్ మెట్రో వద్ద డివైడర్‌పై ఏర్పాటు చేసిన కంచెలో నుంచి రోడ్డు దాటుతున్న మహిళ

కంగనా వ్యాఖ్యలపై వీహెచ్ ఆగ్రహం

రాహుల్‌పై వ్యాఖ్యలకు అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీని కించపరిచే వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం గాంధీభవన్‌లో వీహెచ్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి డ్రగ్స్ అలవాటు ఉందని, చెత్త ప్రసంగాలు చేస్తారని కంగనా చేసిన వ్యాఖ్యలు తమను గాయపరిచినట్టు పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ అధికారి చెంపదెబ్బ కొట్టినప్పటికీ ఆమె మారడం లేదని, ఇలాంటి వారిని బీజేపీ ప్రోత్సహిస్తే, ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కంగనా రనౌత్‌ను నియంత్రించాల్సిన బాధ్యత నడ్డా మీద ఉందని చెప్పారు. రాహుల్‌పై వ్యాఖ్యలు చేసినందుకు ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పనితీరు బాగుందని ప్రశంసించారు. అంబర్‌పేట్‌లోని ముస్లిం శ్మశాన వాటికలో ఇళ్ల నిర్మాణంపై కూడా చర్యలు తీసుకోవాలని వీహెచ్ కోరారు.

ఊరంతా బావులే..!

- ఆదిలాబాద్ జిల్లా అడెగామ(బి)లో నీటిఎద్దడిని అధిగమించిన రైతులు
- బోర్ల నుంచి సరిపడా నీళ్లు రాకపోవడంతో. ప్రత్యామ్నాయంగా పెద్ద బావుల తవ్వకం



సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం అడెగామ(బి) గ్రామంలో పెద్దపెద్ద బావులే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆ బావుల్లో నీరు భూ ఉపరితలానికి సమాంతరంగా.. నిండుకుండలా కనిపిస్తున్నాయి. వర్షాధారంపైనే ఆధారపడినా, వర్షాకాలం ముగిసిన తర్వాత ఈ బావుల్లోని నీటిని మోటార్ల ద్వారా పంటలకు నీటితడులు అందిస్తామని ఆ గ్రామ రైతులు చెబుతున్నారు.


నీటిఎద్దడిని అధిగమించేందుకు..

అడెగామ(బి)లో 309 రైతు కుటుంబాలు ఉన్నాయి. 772 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దశాబ్దాలుగా వర్షాకాలం కాకుండా ఇతర కాలాల్లో పంటలకు బావుల ద్వారే నీటితడులు అందిస్తూ రక్షించుకుంటున్నారు. బోరు వేసుకోవడం తక్కువ ఖర్చు అయినా, దాని ద్వారా సరిపడా నీరు పంటలకు అందించని పరిస్థితి ఉండడంతో ఈ గ్రామ రైతులు ప్రత్యామ్నాయంగా బావుల వైపు దృష్టి సారించారు. తద్వారా వర్షాకాలంలో నిండుకుండలా, మిగతా కాలాల్లో నీటి ప్రదాయినిగా ఈ బావులు నిలుస్తున్నాయి.


బావిలో పై వరకు వచ్చిన జలాలను చేతితో తాకుతున్న రైతు

ఖర్చుతో కూడుకున్నదే..

బోరు 300 ఫీట్ల లోతులో వేయించినా అయ్యే ఖర్చు లక్ష రూపాయలపైనే.. అదే ఇలాంటి బావులు తవ్వించాలంటే రైతుకు సమయంతోపాటు పెద్ద మొత్తం వెచ్చించాల్సిందే. కనిష్టంగా రూ.6 లక్షల నుంచి గరిష్టంగా రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ప్రధానంగా పంటలకు నీరు అందించేందుకు రైతులు ఈ ఖర్చుకు వెనుకాడకపోవడం గమనార్హం. బావిని తవ్విన తర్వాత పైనుంచి సుమారు 25 ఫీట్ల వరకు సిమెంట్‌తో తయారు చేసిన రింగులు చుట్టూరా వేస్తున్నారు.



భూమిలో బండరాళ్ల మధ్య నుంచి కూడా పొరలను ఏర్పర్చుకుని ఊరుతున్నటువంటి జలాల చిత్రం

సమృద్ధిగా నీటితడులు అందించగలుగుతున్నాం



నాకు మూడెకరాల చేను ఉంది. వానాకాలంలో పత్తి, సోయా, కూరగాయలు, యాసంగిలో శనగ, కూరగాయలు సాగు చేస్తున్నా. అక్టోబర్, నవంబర్‌లలో పత్తి పూత, కాత దశకు వస్తుంది. ఆ సమయంలో రెండు, మూడు నీటితడులు అందిస్తే మంచి దిగుబడులు వస్తాయి. ఆ సమయంలో బోర్ల నుంచి సరిపడా నీళ్లలేని పరిస్థితి. బావుల నుంచి సమృద్ధిగా నీటితడులు అందించగలుగుతున్నాం. మిగతా పంటలకు సరిపడా నీళ్లు ఇవ్వగలుగుతున్నాం.

– శివ శంకర్, రైతు, అడెగామ(బి)

బావుల్లో అధికంగా నీటి ఊటలు



అడెగామ(బి) గ్రామ పరిస్థితుల దృష్ట్యా ఆ రైతులు బావులు తవ్వించుకున్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో బోర్లు లోతులో అధికంగా ఉన్నప్పటికీ వెడల్పు తక్కువ ఉంటుంది. కాబట్టి నీటి ఊటలు తక్కువ స్థాయిలో వస్తాయి. అదే బావుల వెడల్పు అధికంగా ఉండడంతో భూమి పొరల నుంచి జలాలు ఎక్కువగా బావుల్లోకి వస్తాయి. తద్వారా బావుల్లో అనేక పొరల నుంచి జలాలు ఊరుతాయి. తద్వారా ఆ రైతులకు ఉపయుక్తంగా మారుతుంది.

– పుల్లయ్య, భూగర్భ జలశాస్త్రవేత్త, ఆదిలాబాద్

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

1857 సిపాయిల తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి 90 ఏళ్ల ముందే సిపాయిల తిరుగుబాటు మీరట్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో లార్డ్ కానింగ్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించారు. సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీ సైనికులు మొగల్ చక్రవర్తి రెండో బహదూర్‌షాను పాదుషాగా ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో ఆంగ్లేయులు సాగించిన దారుణ హింసాకాండను గాలిబ్ అనే ఉర్దూ కవి వర్ణించాడు.

సిపాయిల తిరుగుబాటుకు అయోధ్యలో హజ్రత్ బేగం నేతృత్వం వహించగా, ఝాన్సీలో లక్ష్మీబాయి, మధ్య భారతదేశంలో తాంతియా తోపే నాయకత్వం వహించారు.

ఈ తిరుగుబాటును అణచి వేయడంలో ప్రముఖపాత్ర వహించిన బ్రిటిష్ సేనానులు సర్ జేమ్స్, అవుట్రామ్, హూవ్‌లాక్, నికల్‌సన్, నెయిల్ లారెన్స్, కాంప్‌బెల్, సర్ రోజ్‌వుడ్.

తిరుగుబాటుకు కారణాలు

డల్హౌసీ అనుసరించిన దురాక్రమణ విధానం రాజకీయ కారణం కాగా, బ్రిటిషర్ల నూతన ఆర్థిక విధానం ఆర్థిక కారణమైంది. హైందవ సాంఘిక వ్యవస్థను ఖండించటం సాంఘిక కారణమైతే భారత్, ఐరోపా సైనికుల మధ్య ఉన్న తారతమ్యం సైనిక కారణమైంది.

రాజకీయ కారణాలు

తిరుగుబాటుకు ప్రధాన కారకుడు గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ. ఈయన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, జైపూర్, సంబాల్‌పూర్, ఝాన్సీ తదితర రాజ్యాలు ఆక్రమించుకున్నాడు. అస్తవ్యస్త పాలన సాకుతో అవధ్ (యూపీ)ను కూడా ఆక్రమించాడు.

పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు నానా సాహెబ్ (దొండు పంత్). డల్హౌసీ ఇతడి పెన్షన్‌ను నిలిపివేశాడు. నానాసాహెబ్‌కు మద్దతుగా అతడి సోదరుడు రావు సాహెబ్ పోరాడాడు.

బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు చేశారు. చక్రవర్తి కుటుంబీకులు ఎర్రకోటను వదలి వెళ్లాలన్న బ్రిటిష్ కంపెనీ ఆజ్ఞలు భారతీయ ముస్లింలకు బాధ కలిగించాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడంతో అనేక మంది ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులయ్యారు. బ్రిటిషర్లు వారికి ఉపాధి కల్పించలేదు. జమీందార్లు, తాలుక్‌దార్ల భూములను బ్రిటిషర్లు ఆక్రమించారు. ఇది అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అసంతృప్తి కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి బ్రిటిషర్లు సైనికులను తొలగించారు. దీంతో వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే అవకాశం కోసం ఎదురు చూశారు.

ఆర్థిక కారణాలు

ప్రజల్లో బ్రిటిష్ పరిపాలన పట్ల వ్యతిరేకతకు వారు అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానమే ప్రధాన కారణం. బ్రిటిషర్లు తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి భారతదేశ సంపదలను కొల్లగొట్టారు. మనదేశం నుంచి ముడి సరకులను ఇంగ్లండ్‌కు చేరవేశారు. ఇక్కడ తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకున్నారు. వాటిపై సుంకాలు విధించారు. దీంతో స్వదేశీ పరిశ్రమలు మూతపడ్డాయి. పేదరికం ప్రబలి, దేశం కరవు కాటకాలకు నిలయమైంది. సాధారణ ప్రజలు తమ పరిస్థితులను మెరుగుపర్చుకొనే ఉద్దేశంతో తిరుగుబాటుదారులతో చేతులు కలిపారు. సంస్థానాలను బ్రిటిషర్లు ఆక్రమించడం అనేక అనర్థాలకు దారితీసింది. రాజుల అధికారం చేజారింది. వారి సైన్యాలు రద్దయ్యాయి. దీంతో సైనికులు జీవనాధారం కోల్పోయారు. బ్రిటిషర్లు మాత్రం ఉన్నత పదవుల్లో నియమితులయ్యారు. విద్యావంతులైన భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలకు అర్హులుగా భావించలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని బహిరంగంగా బ్రిటిషర్లు చాటి చెప్పారు. వారి ఆర్థిక విధానం భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను.. అందరినీ కుంగదీసింది.

సాంఘిక కారణాలు

బ్రిటిషర్లు భారతీయులను తక్కువ జాతివారిగా పరిగణించేవారు. సాంఘికంగా భారతీయులంటే వారికి చిన్నచూపు. భారతీయ స్త్రీలను అగౌరవపర్చడం, భౌతిక హింసలకు గురి చేయడం, అవి కొన్నిసార్లు మరణాలకు దారి తీయడం లాంటి సంఘటనలు సర్వసాధారణం. మొదటి తరగతి రైల్వే బోగీల్లో భారతీయులు ప్రయాణించడానికి అనుమతించేవారు కాదు. సాంఘిక సమావేశాల్లో ఆంగ్లేయులతో కలవకుండా భారతీయులను దూరంగా ఉంచేవారు. యూరోపియన్లు నడిపే హోటళ్లు, క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశం లేదు. ఆగ్రాలో మెజిస్ట్రేట్ ప్రకటించిన రెగ్యులేషన్ భారతీయుల పట్ల బ్రిటిషర్ల వైఖరికి అద్దం పట్టింది. ఈ రెగ్యులేషన్ పాటించనందుకు గొప్ప సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ కూడా అవమానానికి గురయ్యాడు. ఈ రకమైన వేధింపులకు గురైన భారతీయులకు చాలా సందర్భాల్లో బ్రిటిష్ న్యాయమూర్తులు న్యాయం చేయలేదు.

మత కారణాలు

బ్రిటిషర్లకు హిందూమతం పట్ల ఉన్న అభిప్రాయం భారతీయుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. భారతీయులను క్రైస్తవంలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారని భయాందోళనలకు గురయ్యారు. 1813 చార్టర్ చట్టానికి ముందు క్రైస్తవ మిషనరీలను దేశంలోకి అనుమతించేవారు కాదు. 1813 చార్టర్ చట్టంతో ఈ నిబంధన ఎత్తివేశారు. దీంతో అనేక మిషనరీలు భారతదేశానికి రావడం ప్రారంభమైంది. మిషనరీలు దేశంలో, ముఖ్యంగా అనేక వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలను స్థాపించి, విద్యాబోధన చేసేవి. విద్యార్థులను క్రైస్తవ మతంలోకి మార్చడమే వీటి ధ్యేయం. మిషనరీలు స్థాపించిన పాఠశాలల్లో బైబిల్ పఠనం తప్పనిసరి. జైళ్లలో ఉన్న ఖైదీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా అనేక విధాలుగా ప్రలోభాలకు గురి చేసేవారు.వారికి క్రైస్తవ గ్రంథాలను బోధించేవారు. క్రైస్తవులుగా మారిన వారిని జైలు నుంచి విడుదల చేసేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రకారం..

1837 కరవు కాటకాల సమయంలో మిషనరీలు అనేక మంది అనాథలను క్రైస్తవ మతంలోకి మార్చాయి. మిషనరీలు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ధనాన్ని ఆశగా చూపేవి. ఆ మతంలోకి మారిన వారికి ఉద్యోగాలు ఇచ్చి, గౌరవ మర్యాదలు కల్పించారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించేలా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉపయోగపడే సాంఘిక చట్టాలనూ ప్రజలు అపార్థం చేసుకున్నారు. విలియం బెంటింగ్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించాడు. దీన్ని హిందూ ఉదారవాదులు సమర్థించారు. కానీ సాధారణ ప్రజలు ప్రభుత్వ ఉద్దేశాలను అనుమానించారు. 1832–50 మధ్య కాలంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన చట్టాలను కంపెనీ ప్రవేశపెట్టింది. 1856లో రిలిజియస్ డిజేబిలిటీస్ యాక్ట్, వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాలతో ప్రభుత్వం తమ సాంఘిక, మత విషయాల్లో జోక్యం చేసుకుంటుందని ప్రజలు భావించారు.

సైనిక కారణాలు

భారతీయ సైనికుల్లో అసంతృప్తికి హిదాయత్ అలీ కింది కారణాలను పేర్కొన్నారు.

బెంగాల్ సైన్యంలో ఎక్కువ మంది సైనికులు అయోధ్య ప్రాంతానికి చెందినవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో అయోధ్యను కలపడంతో వీరు కోపోద్రిక్తులయ్యారు.

పంజాబ్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపాక, సైన్యంలో చేరే సిక్కు, ముస్లిం సైనికులకు గడ్డం లేదా జుట్టు తీసివేసే షరతు పెట్టబోమన్నారు. కానీ తర్వాతి కాలంలో జుట్టు తొలగించాలని ఆజ్ఞాపించారు. ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. బ్రిటిషర్లు 1856 సెప్టెంబర్‌లో ఒక ఆజ్ఞ జారీ చేశారు. దీని ప్రకారం కొత్తగా నియమితులయ్యే సైనికులు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. సముద్ర యానం చేస్తే కులభ్రష్టులవుతారనే నమ్మకం హిందువుల్లో ఉండేది. ఇది బ్రిటిషర్ల పట్ల సైనికుల అనుమానాలు బలపడేలా చేసింది.

తక్షణ కారణం

కొవ్వు పూసిన తూటాల వదంతి వ్యాపించింది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మనోభావాలను దెబ్బ తీసింది. దాంతో సైనిక కవాతులో పాల్గొనరాదని 1857 ఫిబ్రవరి 20న బరంపూర్‌లోని పదాతిదళం నిర్ణయించింది. 1857 మార్చి 29న 34వ దేశీయ పటాలానికి చెందిన మంగళ్‌పాండే ఆంగ్లేయాధికారిపై కాల్పులు జరిపి తిరుగుబాటుకు అంకురార్పణ చేశాడు. తర్వాత అతడిపై విచారణ జరిపి ఏప్రిల్ 8న బహిరంగంగా ఉరితీశారు. దాన్ని తిరుగుబాటుగా భావించని కంపెనీ పాలకులు అదొక చిన్న సంఘటనగా, కేవలం హైందవ మేధావి వర్గ ఉద్యమమని భావించారు. త్వరలోనే సమసిపోతుందనుకున్నారు.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు

సిపాయిలు తిరుగుబాటు చేసే సమయానికి కంపెనీ సైన్యంలో ఏడుగురు సిపాయిలకు ఒక ఆంగ్ల సైనికుడు మాత్రమే ఉన్నాడు. ప్రజలు కూడా సిపాయిలకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటుదారులు విప్లవ ప్రారంభ దశలో ఢిల్లీని వశపర్చుకున్నారు. తర్వాత ఆగ్రా, కలకత్తాల మధ్య ఉన్న ప్రసార సాధనాలను ధ్వంసం చేశారు. తొలి దశలో వారు బ్రిటిషర్లను ఇబ్బందులకు గురి చేసినా, తర్వాత ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను ప్రతిఘటించారు.

విప్లవం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. తిరుగుబాటు కొద్ది ప్రాంతానికే పరిమితం కావడం, యావత్తు దక్షిణ భారతదేశం, పంజాబ్ ఉత్తర ప్రాంతం, పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, మధ్యభారతం, బెంగాల్‌లో తిరుగుబాటు ప్రభావం లేదు. ఢిల్లీ, అయోధ్య, బిహార్, రోహిల్‌ఖండ్, దాని పరిసర ప్రాంతాలకే తిరుగుబాటు పరిమితమైంది. అందువల్ల విప్లవాన్ని అణచివేయడం ఆంగ్లేయులకు తేలికైంది.

తిరుగుబాటుదారుల కంటే బ్రిటిషర్లకు మెరుగైన వనరులున్నాయి. క్రమేణా బ్రిటిషర్ల సైన్యం పెరిగింది. సుమారు 1.12 లక్షల బ్రిటిష్ సైన్యాన్ని ఇండియాకు తరలించారు. సుమారు 3.10 లక్షల మంది భారతీయులను కొత్తగా సైన్యంలో చేర్చుకున్నారు. తిరుగుబాటుదారులు సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే, బ్రిటిష్ సైన్యం కొత్తగా ప్రవేశపెట్టిన రైఫిల్స్‌ను ఉపయోగించింది. టెలిగ్రాఫ్ సదుపాయం ఆంగ్లేయులకు చాలా ఉపయోగకరంగా మారింది. దీని వల్ల సిపాయిల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలైంది.

అనేక మంది స్వదేశీ రాజులు బ్రిటిషర్లకు సహాయపడ్డారు. పాటియాల, సింధ్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాధీశులు ఆంగ్లేయులకు సహాయం చేశారు. నేపాల్ రాజు తన సైన్యాన్ని బ్రిటిషర్ల ఆధీనంలో ఉంచాడు.

తిరుగుబాటుదారుల్లో సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. బహదూర్‌షా వృద్ధుడు, అతడి కుమారులు నిష్ప్రయోజకులు. లక్ష్మీబాయి వీరవనిత అయినప్పటికీ, ఆంగ్లేయులతో పోరాడే శక్తియుక్తులు ఆమెకు లేవు. లారెన్స్, హ్యూరోస్, హేవ్‌లాక్, నికల్సన్ వంటి సుప్రసిద్ధ సేనానుల సేవలు లభించడంతో ఆంగ్లేయుల విజయం సులభమైంది. తిరుగుబాటుకు ఒక నిర్ణీత పథకం గానీ, నిర్దిష్ట కార్యక్రమం గానీ లేవు. తిరుగుబాటుదారుల ఆశయాలు వేరు, వారిలో ఐకమత్యం లేదు. పీష్వా పదవి కోసం నానాసాహెబ్, దత్తత అంగీకరించకపోవడం వల్ల లక్ష్మీబాయి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల్లో జాతీయాభిమానం, దేశాభిమానం ఉన్నా వారికి సరైన మార్గదర్శకత్వం లేదు. తిరుగుబాటుదారులంతా ఒకేసారి తిరుగుబాటు చేయలేదు. ఎవరికి వారు ఒంటరిగా పోరాడి ఓడిపోయారు. తిరుగుబాటు ఎక్కువ భాగం కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు. కాబట్టి ఇది ప్రజల ఉద్యమంగా రూపాంతరం చెందలేదు.బెంగాల్ సైనికులు పౌరుల పట్ల దూకుడు ప్రదర్శించేవారు. వారి ప్రవర్తన సరిగా ఉండేది కాదు. ప్రజలు వారిని ద్వేషించారు. అనేక ప్రాంతాల్లో ప్రజలే వారిని అణచివేశారు.

1857లో ఇంగ్లండ్‌కు అంతర్జాతీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. క్రిమియా యుద్ధంలో గెలుపొందడంతో బ్రిటిషర్లకు రష్యా బెడద తొలగిపోయింది. పర్షియాతో యుద్ధం కూడా ముగిసింది. దీంతో బ్రిటన్ తన సైన్యాన్ని భారతదేశానికి మళ్లించగలిగింది. తిరుగుబాటుదారుల్లో వ్యక్తిగత అసూయలు చోటు చేసుకున్నాయి. ఈ అసూయలే తిరుగుబాటు విఫలమయ్యేందుకు దోహదం చేశాయి.

1857 తిరుగుబాటు స్వభావం

సిపాయిల తిరుగుబాటు స్వభావం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొంత మంది దీన్ని సిపాయిల పితూరీ అని, మరికొందరు క్రైస్తవుల మీద జరిగిన మత యుద్ధమని లేదా తెల్ల వారికి, నల్లవారికి మధ్య జరిగిన యుద్ధమని, హిందూ, ముస్లింలు కలిసి బ్రిటిషర్ల మీద పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. చాలా మంది ఆధునిక భారత చరిత్రకారులు దీన్ని 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు.

సిపాయిల పితూరీ

సిపాయిలు తరచూ సొంత కారణాలతో తిరుగుబాటు చేయడం వల్ల సర్‌జాన్ లారెన్స్, సర్‌సీలే, స్మిత్, మార్ష్‌మన్ మొదలైన చరిత్రకారులు ఇది కేవలం సైనికుల తిరుగుబాటుగా భావించారు. అందుకే దీన్ని సిపాయిల పితూరీ లేదా సిపాయిల తిరుగుబాటుగా పిలిచారు. కానీ ఇది వాస్తవదూరం. అనేక మంది పౌరశాఖ ఉద్యోగులు, ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. తిరుగుబాటుకు కేవలం సైనిక కారణాలే కాకుండా అనేక మత, సాంఘిక, ఆర్థిక కారణాలు కూడా దోహదం చేశాయి.

జాతి సంఘర్షణ

కొందరు చరిత్రకారులు ఈ తిరుగుబాటును తెల్ల వారికి, నల్లవారికి మధ్య జరిగిన సంఘర్షణ అని అభిప్రాయపడ్డారు. ఈ దృక్పథం సరైంది కాదు. జె.బి.మోల్డీ ప్రకారం ప్రతి తెల్ల జాతీయుడికి 20 మంది నల్ల జాతి సైనికులు ఉన్నారు. అనేక మంది భారతీయులు ఆంగ్లేయుల తరఫున పోరాడారు. భారతీయులంతా తిరుగుబాటులో పాల్గొనలేదు.

టి.ఆర్.హోల్‌మస్ అనే చరిత్రకారుడు సిపాయిల తిరుగుబాటును 'నాగరికతకు, అనాగరికతకు మధ్య జరిగిన సంఘర్షణ' అని పేర్కొన్నాడు. కానీ ఈ ధోరణి సరికాదని, భారత సంస్కృతి మహోన్నతమైందని విమర్శకులు దీటుగా సమాధానమిచ్చారు.

తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు విఫలం కావడంతో భారతదేశ దాస్య శృంఖలాలు మరింత బిగిసిపోయాయి. తిరుగుబాటు ఒక శకాన్ని ముగించి, మరొక శకారంభానికి పునాది వేసిందని చెప్పొచ్చు. సామ్రాజ్య విస్తరణ స్థానంలో ఆర్థిక దోపిడీకి నాంది పలికింది. జాతీయ తత్వాన్ని అలవర్చుకున్న ప్రగతిశీల శక్తుల స్వభావాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సవాల్‌గా ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరుగుబాటు ఫలితంగా కంపెనీ పాలన రద్దయింది. దాని స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పాలన ఆరంభమైంది. బ్రిటన్ రాణి విక్టోరియాను భారత సామ్రాజ్ఞిగా ప్రకటించారు. 1858 నవంబర్ 1న వెలువడిన ఈ ప్రకటనను లార్డ్ కానింగ్ అలహాబాద్‌లో చదివారు.

విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?



టెట్/డీఎస్సీ
పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్

ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసే అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర వహించే అంశం విద్యాదృక్పథాలు. ఈ విభాగంలో విద్య చరిత్రాత్మక అంశాలు, సమకాలిన అంశాలు, విద్యా విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యా దృక్పథాలు అనే అంశాన్ని సరళంగా ఎడ్యుకేషనల్ జి.కె.గా పేర్కొంటారు. ఈ విభాగంలో అధిక భారత్వం కలిగి, లోతైన అధ్యయనానికి అవకాశం ఉన్న అంశం విద్యా చరిత్ర. విద్యా చరిత్రలో ఒక కీలక అంశం బ్రిటిష్ విద్యావిధానంలో ముఖ్య అంశాలు, మాదిరి ప్రశ్నలు గురించి తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) విద్య అనేది భారతీయులను మేధావులుగా తీర్చిదిద్దేలా ఉండాలి – మెకాలే ప్రతిపాదన
   బి) విద్య అనేది భారతీయులను గుమాస్తాలుగా తయారు చేసేదిగా ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన.
   1) ఎ, బి రెండూ సరైనవే
   2) ఎ సరైంది, బి సరికాదు
   3) ఎ సరికాదు, బి సరైంది
   4) ఎ, బి రెండూ సరికావు
2. జతపరచండి.
   జాబితా – I
   i) అబ్జర్వేషన్స్
   ii) స్కూల్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ
   iii) పుణె సంస్కృత కళాశాల
   iv) సెయింట్ ఆన్స్ పాఠశాల
   జాబితా – II
   a) కెప్టెన్ కెండీ
   b) ఫ్రాన్సిస్ జేవియర్
   c) ఎల్ఫిన్‌స్టన్
   d) చార్లెస్ గ్రాంట్
   1) i-b, ii-c, iii-d, iv-a
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-d, ii-c, iii-a, iv-b
   4) i-d, ii-a, iii-c, iv-b
3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) మనదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడానికి కారణం – మెకాలే మినట్స్
   2) యుద్ధానంతర విద్యా పథకం – శార్జెంట్ కమిషన్
   3) భారతీయ విద్యకు మాగ్నాకార్టా – వుడ్స్ నివేదిక
   4) తొలి భారతీయ కమిషన్ – హంటర్ కమిషన్
4. కింది వాటిలో వుడ్స్ నివేదికలోని అంశం కానిది ఏది?
   1) ప్రతి రాష్ట్రానికి ప్రజా విద్యా నిర్దేశక శాఖ ఏర్పాటు చేయాలి
   2) కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలి
   3) అధోముఖ వడపోత సిద్ధాంతం ద్వారా ఆంగ్ల విద్యను అందించాలి
   4) గ్రాంట్ – ఇన్- ఎయిడ్ విధానాన్ని రూపొందించాలి
5. జతపరచండి.
   జాబితా – I
   i) హలక్ బంధీ పాఠశాలలు
   ii) గాంధీజీ ప్రాతిపదిక విద్య
   iii) తొలి ఉపాధ్యాయ కళాశాల
   జాబితా – II
   a) వార్ధా
   b) ఆగ్రా
   c) ట్రిపంక్వీ బార్
   1) i-a, ii-b, iii-c
   2) i-b, ii-a, iii-c
   3) i-b, ii-c, iii-a
   4) i-c, ii-b, iii-a
6. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రాథమిక విద్యావ్యాప్తిని స్థానిక సంస్థలకు అప్పగించాలి – హంటర్ కమిషన్ సూచన
   బి) ప్రజ్ఞ, నైతికత అభివృద్ధి చెందేదిగా విద్య ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన
   సి) భారతీయ భాషల మాధ్యమంలోనే విద్యను అందించాలి – మెకాలే మినట్స్‌లో అంశం
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మూడూ సరైనవే
   3) ఎ, బి, సి మూడూ సరికావు
   4) ఎ, సి మాత్రమే
7. జతపరచండి.
   జాబితా – I
   i) వుడ్స్ నివేదిక
   ii) మెకాలే మినట్స్
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా – II
   a) 1902 b) 1854
   c) 1835 d) 1882
   1) i-b, ii-c, iii-a, iv-d
   2) i-b, ii-c, iii-d, iv-a
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-b, ii-d, iii-c, iv-a
8. నియామక సంవత్సరాలకు అనుగుణంగా కింది వాటిని అవరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) శార్జెంట్ కమిషన్ బి) సార్జంట్ కమిటీ
   సి) ఎబాట్‌వుడ్ కమిటీ
   డి) హర్టాగ్ కమిటీ
   1) బి, డి, సి, ఎ 2) బి, డి, ఎ, సి
   3) డి, బి, సి, ఎ 4) బి, సి, డి, ఎ
9. కింది వాటిలో మెకాలే మినట్స్‌తో ఏకీభవించని భావన ఏది?
   1) భారతీయులు రక్తంలో, వర్ణంలో భారతీయులైౖ, ఆలోచనలు, అభిరుచులు, అభిప్రాయాల్లో బ్రిటిషర్లుగా ఉండే విద్యను వారికి అందించాలి
   2) ఇండియా, అరేబియా, ఆసియా దేశాల సాహిత్యం మొత్తం ఇంగ్లిష్ గ్రంథాలయంలో ఒక సొరుగు పుస్తకాలతో కూడా సరితూగదు
   3) చౌక వేతనంతో గుమస్తాలను తయారు చేసేదిగా విద్య ఉండాలి
   4) ఏదీకాదు
10. జతపరచండి.
    జాబితా – I
    i) మెకాలే మినట్స్ ii) వుడ్స్ నివేదిక
    iii) హంటర్ కమిషన్
    iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
    జాబితా – II
    a) డల్హౌసి b) లార్డ్ రిప్పన్
    c) లార్డ్ కర్జన్ d) విలియం బెంటింక్
    1) i-d, ii-a, iii-b, iv-c
    2) i-d, ii-a, iii-c, iv-b
    3) i-d, ii-b, iii-a, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
11. కింది అంశాలకు సంబంధించిన సంవత్సరాలకు అనుగుణంగా ఆరోహణ క్రమంలో అమర్చండి.
    ఎ) బేసిక్ విద్యావిధానం
    బి) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
    సి) ప్రాథమిక విద్యకు గోఖలే తీర్మానం
    డి) స్వదేశీ విద్యా ఉద్యమం ప్రారంభం
    1) ఎ, బి, సి, డి 2) డి, సి, బి, ఎ
    3) సి, డి, బి, ఎ 4) బి, డి, సి, ఎ
12. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
    1) 1921 2) 1917
    3) 1927 4) 1937
13. జతపరచండి.
    జాబితా – I
    i) శార్జెంట్ కమిషన్
    ii) సార్జెంట్ కమిటీ
    iii) హర్టాగ్ కమిటీ
    iv) ఎబాట్‌వుడ్ కమిటీ
    జాబితా – II
    a) 1929 b) 1937
    c) 1917 d) 1944
    1) i-c, ii-d, iii-b, iv-a
    2) i-c, ii-d, iii-a, iv-b
    3) i-c, ii-b, iii-d, iv-a
    4) i-c, ii-a, iii-d, iv-b
14. జాకిర్ హుస్సేన్ కమిటీ దేనికి సంబంధించింది?
    1) వృథా, స్తబ్దతల నివారణ
    2) ప్రాతిపదిక విద్య 3) బాలికా విద్య
    4) వయోజన విద్య
15. కింది వాటిలో సరైన జత ఏది?
    i) భారతీయ విద్యా విధానానికి వుడ్స్ నివేదికను 'మాగ్నాకార్టా'గా అభిప్రాయ పడిన విద్యావేత్త – హెచ్.ఆర్. జేమ్స్
    ii) 6–10 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్న వారు – గోఖలే
    iii) భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు – చార్లెస్ గ్రాంట్
    iv) ఆంగ్ల విద్య మాత్రమే నవీన విజ్ఞానానికి తాళంచెవి లాంటిది అని భావించిన వారు – మెకాలే
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
16. కింది వాటిలో సరైన అంశం ఏది?
    ఎ) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యల పరిష్కారానికి నియమించింది – హర్టాగ్ కమిటీ
    బి) స్వయం పోషకంగా పాఠశాలల అభివృద్ధి చెందాలన్నదే ప్రాతిపదిక విద్య ప్రధాన ఉద్దేశం
    సి) వృథా, స్తబ్దతల నివారణకు నియమించింది – శార్జెంట్ కమిషన్
    డి) వయోజన విద్యా వ్యాప్తికి బ్రిటిషర్లు నియమించింది – ఎబాట్‌వుడ్ కమిటీ
    1) ఎ, బి మాత్రమే
    2) ఎ, బి, సి మాత్రమే
    3) సి మాత్రమే 4) బి మాత్రమే
17. జతపరచండి.
    జాబితా – I
    i) బేసిక్ విద్యావిధానం
    ii) గోఖలే విద్యాతీర్మానం
    iii) విశ్వవిద్యాలయాల చట్టం
    iv) జాతీయ విద్యావిధానం
    జాబితా – II
    a) 1913 b) 1904
    c) 1911 d) 1937
    1) i-d, ii-c, iii-b, iv-a
    2) i-d, ii-c, iii-a, iv-b
    3) i-d, ii-b, iii-c, iv-a
    4) i-d, ii-a, iii-b, iv-c
18. '6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. దానిని 40 ఏళ్లలో అంటే 1984లోగా సాధించాలి' అని సూచించింది?
    1) హర్టాగ్ కమిటీ 2) శార్జెంట్ కమిషన్
    3) సార్జెంట్ ప్లాన్ 4) ఎబాట్‌వుడ్ కమిటీ
19. జతపరచండి.
    జాబితా – I
    i) సార్జెంట్ కమిటీ ii) ఎబాట్‌వుడ్ కమిటీ
    iii) హర్టాగ్ కమిటీ iv) శాడ్లర్ కమిషన్
    జాబితా – II
    a) ఉప కమిటీ
    b) వృత్తి విద్యా కమిటీ
    c) యుద్ధానంతర విద్యా పథకం
    d) విశ్వవిద్యాలయాల సంస్కరణలను సూచించింది
    1) i-c, ii-b, iii-d, iv-a
    2) i-c, ii-d, iii-b, iv-a
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-c, ii-b, iii-a, iv-d
20. 'ప్రాక్-పశ్చిమ వివాదం' అంటే?
    1) పాశ్చాత్య విజ్ఞానానికి, భారతీయ విజ్ఞానానికి మధ్య వివాదం
    2) భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు మధ్య వివాదం
    3) భారతీయ సంప్రదాయాలకు, యురోపియన్ సంప్రదాయానికి మధ్య వివాదం
    4) యురోపియన్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య వివాదం
21. వివిధ అంశాలు, వాటి సంవత్సరాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) రాష్ట్ర విద్యా నిర్దేశక శాఖలు ఏర్పాటు – 1871
    బి) విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకు ప్రవేశం – 1877
    సి) మద్రాస్, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల స్థాపన – 1857
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే
22. కింది వాటిలో సార్జెంట్ కమిటీ సూచన కానిది ఏది?
    1) ఎంప్లాయిమెంట్ బ్యూరోను స్థాపించాలి
    2) విశ్వవిద్యాలయాల విరాళాల కమిటీని ఏర్పాటు చేయాలి
    3) 6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి
    4) ఇంటర్మీడియట్‌ను రెండు సంవత్సరాలుగా నిర్వహించాలి
23. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) రాజా రామ్మోహన్‌రాయ్ హిందూ కాలేజ్‌ని స్థాపించారు – 1817
    బి) భారతీయుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఈస్టిండియా కంపెనీ ఏటా రూ. ఒక లక్ష కేటాయించాలని తీర్మానం – 1813
    సి) లార్డ్ హార్డింగ్.. ఉద్యోగావకాశాలను కేవలం ఆంగ్ల భాషను అభ్యసించిన భారతీయులకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించాడు – 1844
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే
24. కింది వారిలో విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?
    ఎ) మెకాలే బి) చార్లెస్ వుడ్స్,
    సి) హంటర్
    1) బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ మాత్రమే 4) ఎ, బి, సి
25. కింది వాటిలో హంటర్ కమిషన్ సూచన ఏది?
    1) నిత్యజీవితానికి పనికి వచ్చే భౌతికశాస్త్రం, వ్యవసాయం, క్షేత్ర గణితం లాంటి అంశాలను ప్రాథమిక విద్యాప్రణాళికలో చేర్చాలి
    2) విద్యాలయాల్లో ప్రవేశానికి అన్ని వర్గాల నుంచి ఫీజు వసూలు చేయాలి
    3) ప్రాథమిక పాఠశాలల స్థాపన బాధ్యతను ప్రజలే చేపట్టాలి
    4) ప్రాథమిక విద్యావ్యాప్తిని విశ్వవిద్యాలయాలు చేపట్టాలి
26. 'నిరక్షరాస్యులు, అమాయకులు ఉన్న జాతి సంపూర్ణమైన అభివృద్ధి సాధించ లేదు, పోటీ పడలేదు' అని వ్యాఖ్యానించిన వారు?
    1) హెచ్.ఆర్. జేమ్స్ 2) గోఖలే
    3) హాలెండ్ 4) సార్జెంట్
27. 10 + 2 + 3 విద్యా నమూనాను మొదటిసారిగా సూచించింది?
    1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
    3) ఎబాట్‌వుడ్ కమిటీ
    4) శాడ్లర్ కమిషన్
28. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్ పునరుద్ధరణను సూచించిన కమిటీ ఏది?
    1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
    3) ఎబాట్‌వుడ్ కమిటీ
    4) జాకీర్ హుస్సేన్ కమిటీ
29. నిర్బంధ ప్రాథమిక విద్య సిద్ధాంతాన్ని ఆమోదించిన తొలి చట్టం ఏది?
    1) పటేల్ చట్టం – 1918
    2) భారత ప్రభుత్వ చట్టం – 1919
    3) భారత ప్రభుత్వ చట్టం – 1921
    4) భారత ప్రభుత్వ చట్టం – 1935
30. స్వదేశీ విద్యా ఉద్యమ కాలంలో మన దేశంలో ఏ విద్యా విధానాన్ని అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది?
    1) చైనీస్ విద్యావిధానం
    2) అమెరికన్ విద్యావిధానం
    3) జర్మన్ విద్యావిధానం
    4) జపనీస్ విద్యావిధానం

సమాధానాలు

1) 4	2) 3	3) 2	4) 3	5) 2
6) 1	7) 2	8) 4	9) 4	10) 1
11) 4	12) 1	13) 2	14) 2	15) 3
16) 4	17) 1	18) 3	19) 4	20) 1
21) 3	22) 4	23) 3	24) 4	25) 1
26) 2	27) 4	28) 1	29) 1	30) 4

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

లాలాజలంలో ఉండే ఎంజైములు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీర్ణవ్యవస్థ

జీవుల పెరుగుదల, వివిధ కణాల విధుల నిర్వహణ, శక్తి కోసం ఆహారం అవసరం. ఎంజైముల చర్యలతో సంక్లిష్ట ఆహార పదార్థాలు సరళ పదార్థాలుగా మారతాయి. దీన్ని జీర్ణక్రియ అంటారు. జీర్ణక్రియలో పాల్గొనే అవయవాలన్నింటిని కలిపి జీర్ణ వ్యవస్థగా పేర్కొంటారు. మానవుడి జీర్ణ వ్యవస్థను మూడు భాగాలుగా విభజించొచ్చు. అవి..

1) ఆహారనాళం లేదా జీర్ణనాళం
2) జీర్ణగ్రంథులు
3) జీర్ణక్రియా విధానం

ఆహారనాళం

ఆహారనాళం పొడవు 9 మీటర్లు. ఇది నోటితో ప్రారంభమై, పాయువుతో అంతమవుతుంది. ఆహార నాళంలోని భాగాలు వరుసగా..

1) నోరు 2) ఆస్యకుహరం
3) గ్రసని 4) ఆహార వాహిక
5) జీర్ణాశయం 6) చిన్న పేగు
7) పెద్ద పేగు 8) పురీషనాళం
9) పాయువు

నోరు

ఇది ఆహారనాళం మొదటి భాగం. నోటి ద్వారా ఆహారం తీసుకునే ప్రక్రియను అంతఃగ్రహణం అంటారు. నోటిలో ఆహారం 15 నుంచి 30 సెకన్ల వరకు ఉంటుంది.

ఆస్యకుహరం

రెండు దవడల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఆస్యకుహరం అంటారు. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి..

1) దంతాలు
2) లాలాజల గ్రంథులు
3) నాలుక

దంతాలు

దంతాల అధ్యయనాన్ని ఒడొంటాలజీ అంటారు. ఎక్కువ సంఖ్యలో దంతాలున్న జీవులు..

అపోజం - 50
గుర్రం, పంది - 44

దంతాలు డెంటిన్‌తో ఏర్పడతాయి. దంతాల్లోని సజీవ కణాలు ఒడంటోబ్లాస్టులు. ఈ కణాలు డెంటిన్‌ను స్రవిస్తాయి. దంతం కిరీట భాగాన్ని కప్పుతూ ఉండే మెరిసే పొరను ఎనామిల్ లేదా పింగాణి పొర అంటారు. ఈ ఎనామిల్ దంతాలకు దృఢత్వాన్నిస్తుంది. పింగాణి పొర ఏర్పడటానికి ఫ్లోరిన్ (తక్కువ మోతాదులో) అవసరం. మానవ శరీరంలో అతి దృఢమైన పదార్థం ఎనామిల్ (పింగాణి).

దంత నిర్మాణం

దంత నిర్మాణంలో 3 భాగాలుంటాయి.

1) కిరీటం 2) మెడ 3) మూలం

కిరీటం (క్రౌన్): పైకి కనిపించే దంతభాగం.

మెడ: చిగురు వద్ద ఉండే దంత భాగం.

మూలం (రూట్): దవడ గుంతల్లో ఉండే దంత భాగం.

మానవ దంతాలు దవడ ఎముక గుంతల్లో అమరి ఉంటాయి. ఇలాంటి అమరికను థీకోడాంట్ దంత విన్యాసం అంటారు. మానవుడి జీవిత కాలంలో రెండుసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని ద్వివార దంత విన్యాసం అంటారు. చేపల జీవితకాలంలో అనేకసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని బహువార దంత విన్యాసం అంటారు. పక్షుల్లో దంతాలు ఉండవు.

దంతాలు - రకాలు

మానవుడిలో రెండు రకాల దంతాలు ఏర్పడతాయి.

1) పాలదంతాలు
2) శాశ్వత దంతాలు

పాల దంతాలు

ఇవి 6 నుంచి 7 నెలల వయసులో ఏర్పడి, 8 నుంచి 9 సంవత్సరాల వయసులో ఊడిపోతాయి. పాల దంతాల సంఖ్య - 20

పాలదంతాల ఫార్ములా:

$$I.C.P.M. = \frac{2102}{2102} or (2102 \times 4 = 20)$$

చిన్న పిల్లల పాలదంతాల్లో లోపించిన దంతాల సంఖ్య - 12

అవి.. అగ్ర చర్వణకాలు- 8, జ్ఞానదంతాలు- 4

శాశ్వత దంతాలు

పాలదంతాలు ఊడిపోయి వాటి స్థానంలో శాశ్వత దంతాలు వస్తాయి.

శాశ్వత దంతాల అర్ధ దవడ ఫార్ములా:

$$I.C.P.M. = \frac{2123}{2123} or (2123 \times 4) = 32$$

శాశ్వత దంతాలు వివిధ ఆకార, పరిమాణాల్లో ఉంటాయి. కాబట్టి వీటిని విషమ దంతాలు అంటారు.

- ఏనుగు పైదవడలోని కుంతకాలు, ఏనుగు దంతాలు(టస్క్)గా మార్పు చెందుతాయి.
- రదనికలు మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెంది ఉంటాయి. రదనికల అగ్రభాగం మొనదేలి ఎముకల నుంచి మాంసాన్ని చీల్చడానికి ఉపయోగపడుతుంది.
- కుందేలులాంటి శాకాహార జీవుల్లో రదనికలు లోపించి దవడలో ఏర్పడే ఖాళీ ప్రదేశాన్ని 'డయాస్టీమా' అంటారు. డయాస్టీమా లోపించిన జీవులు.. పులి, సింహం, కుక్క.
- సముద్ర క్షీరదాలైన సీల్, వాల్‌రస్‌లో ఏర్పడే రెండు పొడవైన దంతాలు.. రదనికల రూపాంతరాలు.
- పాములోని రెండు కోరలు కూడా రదనికల రూపాంతరాలే.
- చర్వణకాల్లోని చివరి దంతాన్ని జ్ఞానదంతం (విస్‌డమ్ టీత్) అంటారు. ఇది యుక్త వయసులో (21 ఏళ్ల తర్వాత) ఏర్పడుతుంది.

రూట్ కెనాల్ థెరపీ: శాశ్వత దంతాలు ఊడిపోయినప్పుడు దంతవైద్యులు కృత్రిమ దంతాలను దవడ గుంతల్లో అమర్చే ప్రక్రియ.

దంత వ్యాధులు

ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ (2 పీపీఎం కంటే ఎక్కువ) నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారుతాయి. ఎముకలు వికృత రూపం దాల్చుతాయి.

పయేరియా: దంతాలు, చిగుళ్ల నుంచి చీము వస్తుంది.

జిజివైటిస్: రెండు దంతాల మధ్యలోని చిగురులో వాపు.

దంతక్షయం: బ్యాక్టీరియా చర్యలతో దంతాలపై ఎనామిల్ క్షీణించడం.

లాలాజల గ్రంథులు

మానవుడిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. కుందేలులో నాలుగు జతలుంటాయి. పాములో లాలాజల గ్రంథులు విష గ్రంథులుగా రూపాంతరం చెందుతాయి. లాలా జల గ్రంథులు రోజుకు ఒక లీటరు లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. లాలాజలం ఆమ్లం స్వభావం (pH– 6.8) లో ఉంటుంది.

దీనిలో టయలిన్ (లాలాజల అమైలేజ్), లైసోజోమ్ అనే ఎంజైములు ఉంటాయి. టయలిన్ పిండి పదార్థాలను డెక్ట్రిన్, మాల్టోజ్ చక్కెరలుగా మారుస్తుంది. లైసోజైమ్ సూక్ష్మజీవ నాశినిగా పని చేసి నోటి దుర్వాసనను దూరం చేస్తుంది.

నాలుక

నాలుక రుచులను గుర్తించే జ్ఞానేంద్రియం. దీనిపై రుచులను గుర్తించే నాలుగు రకాల రుచి మొగ్గలు ఉంటాయి. అవి..

- నాలుక కొన - తీపి రుచి మొగ్గలు
- నాలుక కొన వెనక భాగం - ఉప్పు
- నాలుక పక్క భాగాలు - పులుపు
- నాలుక లోపలి భాగం (గొంతులో)- చేదు రుచి మొగ్గలు ఉంటాయి.

గ్రసని

ఆహార, వాయు నాళ మార్గాల కూడలిని గ్రసని అంటారు. గ్రసనిలో ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

ఆహార వాహిక

ఇది గ్రసనితో ప్రారంభమై జీర్ణాశయంలోకి తెరుచుకుంటుంది. ఆహార వాహికలోనూ ఎలాంటి జీర్ణక్రియ జరగదు. ఆహారం మింగినప్పుడు అది ఆహార వాహికలోకి చేరుతుంది.

- ఆహారాన్ని మింగడం నియంత్రిత చర్య.
- ఆహార వాహికలో ఆహారం 10 నుంచి 15 సెకన్లు ఉంటుంది.
- ఆహార వాహికలోని పెరిస్టాలిటిక్ చలనాలతో ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

జీర్ణాశయం

జీర్ణాశయం సంచి లాంటి కండర నిర్మిత భాగం. ఇది ఉదరంలో ఎడమ వైపు ఉంటుంది. జీర్ణాశయం గోడల్లోని జఠర గ్రంథులు జఠర రసాన్ని స్రవిస్తాయి. జఠర రసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), పెప్సిన్, రెనిన్ అనే ఎంజైములు, మ్యూసిన్ ఉంటాయి.

- జీర్ణాశయంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారంలోని సూక్ష్మజీవులను చంపుతుంది. ఆహారానికి ఆమ్ల స్వభావాన్ని కలిగిస్తుంది.
- జీర్ణాశయంలో ఆమ్లం అధికంగా ఉత్పత్తి అయితే పెప్టిక్ అల్సర్ వస్తుంది.
- పెప్టిక్ అల్సర్ నివారణకు మిల్క్ ఆఫ్ మెగ్నీషియాన్ని ఔషధంగా వాడుతారు. దీనిలో మెగ్నీషియం హైడ్రాక్సైడ్ ఉంటుంది.
- హెలికో బ్యాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా వల్ల జీర్ణాశయ అల్సర్ వస్తుందని రోబిన్ వారెన్, బెరిమార్షల్ కనుగొన్నారు. వీరి పరిశోధనకు 2005లో నోబెల్ బహుమతి లభించింది.

విధులు

- ఆహారాన్ని తాత్కాలికంగా నిల్వ చేయడం (2 నుంచి 4 గంటలు)
- ఆహారంలోని పదార్థాలను కలపడం.
- ఆహారంలో భౌతిక రసాయన మార్పులను కలిగించడం.
- జీర్ణాశయ గోడల్లోని వర్తుల కండరాలు ఆహారాన్ని మెత్తగా చేస్తాయి.
- జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమై ద్రవరూపంలోకి మారిన ఆహారాన్ని కైమ్ అంటారు. (కైమ్ ఆమ్ల స్థితిలో ఉంటుంది).

మానవుడి జీర్ణాశయంలో మూడు గదులుంటాయి. కానీ, నెమరువేసే జంతువుల్లో నాలుగు గదులుంటాయి. అవి.. 1) ప్రథమ ఆమాశయం 2) జాలకం 3) తృతీయ ఆమాశయం 4) చతుర్థ ఆమాశయం.

వీటిలో ప్రథమ ఆమాశయం పెద్దది. ఈ గదిలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులుంటాయి. ఈ గది మానవుడిలో లోపించి ఉంటుంది.

గ్యాస్ట్రో ఎంటరాలజీ: జీర్ణాశయం, ఉదరంలోని భాగాల అధ్యయనాన్ని గ్యాస్ట్రో ఎంటరాలజీ అంటారు.

అన్నవాహికను ఎక్స్‌రే తీసే ముందు రోగికి బేరియం ద్రావణాన్ని తాగిస్తారు. బేరియం ఎక్స్ కిరణాలను బాగా గ్రహిస్తుంది.

బేరియాట్రిక్ సర్జరీ

ఊబకాయుల్లో బరువును తగ్గించడానికి బేరియాట్రిక్ సర్జరీ చేస్తారు. ఉదరంలోని అన్నకోశం (జీర్ణాశయం)సైజు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. లైపోసక్షన్ ఇందుకు పూర్తి భిన్నం. దీనిలో వివిధ శరీర భాగాల్లో అదనంగా పేరుకున్న కొవ్వును తొలగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గ్యాస్ట్రో ఎంటరాలజీ దేని అధ్యయనం?
 1) మెదడు అధ్యయనం
 2) కిడ్నీ అధ్యయనం
 3) ఉదరం లోపలి భాగాల అధ్యయనం
 4) పైవన్నీ
2. మానవుడిలో దంతాల సంఖ్య?
 1) 23 2) 43 3) 28 4) 32
3. ఎనామిల్ దేన్ని కప్పి ఉంచుతుంది?
 1) దంతం
 2) దంత కిరీటంపైనా, లోపల
 3) డెంటిన్ ఉన్న భాగం 4) పైవన్నీ
4. పిల్లల పాల దంతాల్లో లోపించినవి?
 1) ఇన్‌సిజర్స్ 2) కైనైన్స్
 3) ప్రిమోలార్స్ 4) మోలార్స్
5. లాలాజలం స్వభావం?
 1) తటస్థ 2) ఆమ్ల
 3) క్షార 4) పైవన్నీ
6. రూట్ కెనాల్ థెరపీ అనేది?
 1) పాడైన పళ్లు 2) పాడైన కిడ్నీ
 3) పాడైన గుండె 4) పాడైన గోళ్లు
7. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి?
 1) గుండె బైపాస్ సర్జరీ
 2) ఉదరం బైపాస్ సర్జరీ
 3) మెదడు సర్జరీ
 4) గుండె ఓపెన్ హార్ట్ సర్జరీ
8. కింది వాటిలో ఎంజైమ్?
 1) గ్లూకగాన్ 2) ఇన్సులిన్
 3) ట్రిప్సిన్ 4) సొమాటోట్రోపిన్
9. మానవుడి జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం?
 1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
 3) పార్మిక్ ఆమ్లం 4) నైట్రికామ్లం
10. పయేరియా వ్యాధి దేనికి సంబంధించింది?
 1) చిగుళ్లు 2) ముక్కు
 3) గుండె 4) ఊపిరితిత్తులు
11. మానవ శరీరంలో ఆహారనాళం సగటు పొడవెంత?
 1) 2 మీటర్లు 2) 4 మీటర్లు
 3) 6 మీటర్లు 4) 9 మీటర్లు
12. నీటిలో ఏ పదార్థం ఎక్కువగా ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
 1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
 3) లెడ్ 4) ఏదీకాదు
13. నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో వచ్చే వ్యాధి?
 1) క్షయ 2) కాలేయ జబ్బు
 3) ఎముకల్లో బలహీనమైన కీళ్లు
 4) ఏదీకాదు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2; 6) 1; 7) 2; 8) 3; 9) 2; 10) 1; 11) 4; 12)1; 13) 3.

Farmers used the constellations in the night..



Model Questions

Directions (Q.No. 1- 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. I enjoy (1)/ playing (2)/ musical instruments like (3)/ piano and violin. (4)/ No error (5)

2. Having read the book, (1)/ there is no question (2)/ the book is better (3)/ than the film. (4)/ No error (5)

3. I don't know if I am ready (1)/ to take the test now and whether (2)/ I will ever be ready (3)/ in the future. (4)/ No error (5)

4. A flock of birds, (1)/ flying south (2)/ for the winter, (3)/ was above us. (4)/ No error (5)

5. He cooked the salmon (1)/ well because (2)/ he attended (3)/ culinary school. (4)/ No error (5)

Directions: (Q.No.6-10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Once almost covered under centuries of debris, skilled artisans have now restored some original famous paintings during the Italian Renaissance.
 1) Some original famous paintings during the Italian Renaissance now have been by skillful artisans restored.
 2) The restoration of some original famous paintings during the Italian Renaissance has been done by skilled artisans.
 3) Skilled artisans during the Italian Renaissance have now restored some original famous paintings.
 4) Some original famous paintings during the Italian Renaissance have now been restored by skilled artisans.
 5) No correction required

7. I asked him to quickly clean the table.
 1) I asked him to clean the table quickly.
 2) I asked quickly him to clean the table.
 3) I quickly asked him to clean the table.
 4) I asked him to clean the quickly table.
 5) No correction required

8. I thought my plan would sure succeed
 1) I thought my plan would sure succeeding.
 2) I thought my plan would surely succeeds.
 3) I thought my plan would certain succeed
 4) I thought my plan would certainly succeed
 5) No correction required

9. As soon as I hear the dog bark, I knew you were at the door.
 1) As soon as I hear the dog bark, I know you are at the door.
 2) As soon as I hear the dog bark, I had known you are at the door.
 3) As soon as I hear the dog bark, I will know you are at the door.
 4) As soon as I hear the dog bark, I will be knowing you will be at the door.
 5) No correction required

10. It seemed like he liked me.
 1) It seemed like he liked me.
 2) It seemed like he liking me.
 3) It seemed as if he liked me.
 4) It seemed like he like me.
 5) No correction required

Directions (Q. No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The good news is that both Smartphone operating systems are excellent.

B) Microsoft has thrown in the towel with Windows Phone, BlackBerry makes Android devices now, and there are very few other options worth considering.

C) Ultimately, the best platform for you depends on you. Pick the things that matter most to you, count the wins in those categories, and you have a recommendation.

D) If you're buying a new smartphone today, chances are very good that it will run Google's Android or Apple's iOS mobile operating systems.

E) These two platforms accounted for more than 99 percent of all new smartphones shipped in 2016, and that rose to 99.7 percent last year, according to IDC.

F) They have far more in common than what divides them, but there are some important differences that you'll want to consider.

11. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) D 5) E

12. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) F 5) E

13. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) D
 4) E 5) F

14. What is the FIRST sentence after rearrangement?
 1) B 2) A 3) C
 4) D 5) E

15. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) D 5) F

Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Security is freedom from, or ____ against, potential harm ____ external forces.
 1) rigidity, for
 2) resilience, from
 3) firmness, to
 4) stiffness, towards
 5) spirit, with

17. A firewall typically establishes a barrier ____ a trusted internal network and ____ external network, such as the Internet.
 1) below, trusted
 2) amid , believed
 3) among, untrusted
 4) between, untrusted
 5) linking, conviction

18. The restaurant has a ____ buffet with authentic Indian dishes, if you do not like it, you can go for an equally ____ a-la-carte menu of exquisite continental dishes.
 1) lavish, exciting
 2) generous, boring
 3) unstinted, dreary
 4) copious, uninspiring
 5) fulsome, electrify

19. Farmers used the constellations in the night sky for ____ the seasons.
 1) seeing 2) observing
 3) practicing 4) predicting
 5) monitoring

20. It is a story of two men and a batch of ____ armoured cars.
 1) deceased 2) diseased
 3) decrepit 4) defeated
 5) vigorous

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

According to a new study by the School of Medicine of the University of Pittsburgh, spending hours every day on social media sites lead to body image issues and a higher risk of eating disorders. For someone with an eating disorder, comparisons with others are common, with a tendency to compare with those perceived to be thinner or fit. Eating disorder sufferers may **berate** themselves for not being as thin or sick as others they know with eating disorders, those they have met in treatment or online communities, or even friends or acquaintances. Social media can **warp reality** if you surround yourself with individuals struggling with the same condition as your sense of what is normal can be swallowed up. Sufferers of eating disorders may also measure their own achievements and accomplishments against their peers and as a result may feel they are lagging behind. A constant stream of acquaintances that constantly share news of their work advances, family and relationship statuses can lead to an **influx** of self-hate and the thought that any personal successes are lacking. This may be especially relevant if someone has missed out on chances to pursue milestones due to illness and/or treatment. Focusing on your own endeavors, however small they may seem is crucial.

21. What is the suitable tile for the passage?
 1) reality check
 2) what should you be eating?
 3) Research on eating disorders.
 4) Social Media and eating disorders.
 5) trends in eating

22. What is the reason for self hate?
 1) Comparisons with others
 2) Measuring their own achievements and accomplishments against their peers
 3) Associates constantly sharing news of their work advances, family and relationship statuses
 4) Focusing on your own endeavors
 5) Spending hours every day on social media sites

23. What does warp reality mean?
 1) a rare and powerful phenomenon
 2) power to change the properties
 3) a popular culture
 4) reality distortion
 5) ability to manipulate reality

24. The synonym of berate is
 1) rebuke 2) praise
 3) extol 4) eulogize
 5) tribute

25. The antonym of influx is
 1) invasion 2) flood
 3) deluge 4) torrent
 5) dearth

Directions (Q.No. 26-28): Identify the word which is closest in meaning to the word provided and mark it as your answer.

26. Nabob
 1) bigwig 2) doubter 3) frolic
 4) converse 5) adverse

27. Pall
 1) light 2) satiate 3) carry
 4) horror 5) disgust

28. Sacrosanct
 1) prayer 2) sanctuary 3) pious
 4) sacred 5) worship

Directions (Q.No. 29-30): Identify the word which is opposite in meaning to the word provided and mark it as your answer.

29. Placid
 1) gauche 2) fine 3) brilliant
 4) indecent 5) roaring

30. Stentorian
 1) violent 2) muffled 3) loud
 4) stealthy 5) tranquil

KEY

1) 3	2) 2	3) 1	4) 5	5) 3
6) 4	7) 1	8) 4	9) 3	10) 3
11) 1	12) 2	13) 4	14) 4	15) 3
16) 2	17) 4	18) 1	19) 4	20) 3
21) 4	22) 3	23) 5	24) 1	25) 5
26) 1	27) 2	28) 4	29) 1	30) 2